# అన్నమయ్య - ఆళ్వారులు
# తులనాత్మక పరిశీలన

ప్రథమ భాగము

డా॥ జె. మునిరత్నం
ఎం.ఎ., పిహెచ్.డి.

కల్పనా పబ్లికేషన్స్
తిరుపతి
1996

# కీర్తిశేషులు ఆచార్య శ్రీ జి. ఎన్.

నన్ను మనిషిగా నడయాడునట్లు చేసి
క్షోణి నాదరమును చవిచూపె నట్టి
గోళ్ళ నారాయణస్వామి గురువరునకు
చిన్ని పొత్తము నర్పణ చేసికొందు

# అన్నమయ్య ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన

## ప్రథమ భాగము

డా॥ జె. మునిరత్నం
ఎమ్.ఏ. పిహెచ్.డి.

కల్పనా పబ్లికేషన్స్
తిరుపతి
1992

# ANNAMAYYA AND ALVARS-A COMPARATIVE STUDY

I VOLUME

By

Dr. J. MUNIRATHNAM, *M.A., Ph.D.,*

1000 Copies

Published on 1992

Price Rs. 30/-

---

This book is published with the financial assistance of Tirumala Tirupati Devasthanams under their Scheme "Aid to Publish Religious Books".

---

For Copies

Kalpana Publications
15, "MADHU PRABHASA"
Shantinagar
Mutyalareddipalli Road
Tirupati - 517 502

Printed at
Sarada Printers
132, Prakasam Road
Tirupati

# ప్రవేశిక

వసుధైక కుటుంబాన్ని గురించి, విశ్వాత్మ కతను గురించి విశ్వశాంతిని గురించి చరిత్రకందని కాలం నుంచే విస్తృతంగా భారతం ఉపన్యసించింది. ఆదికాలం నుంచి ప్రచారంలో ఉన్న ఈ క్రింది ఆర్షమంత్రాలే ఇందుకుసాక్ష్యం

'లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు
'అధనాస్సధనాస్సన్తు జీవన్తు శరదాం శతమ్'
'సర్వేత్ర సుఖినస్సన్తు సర్వేసన్తు నిరామయాః
సర్వేభద్రాణి పశ్యన్తు మాకశ్చిద్దుఃఖమాప్నుయాత్

ఈ విశ్వవ్యాప్త విశాల దృష్టే భారతీయతకు గల ప్రధాన లక్షణాలలో ఒకటి. భారతీయులకు గల గర్వకారణాలలో ఒకటి. ఇటువంటి భారత దేశంలోనే విచ్ఛిన్నకర పోకడలు తలెత్తాయి. అస్సాం, పంజాబులో, జమ్మూకాశ్మీరులో వేర్పాటువాదం వెర్రితలలు వేసింది. వికటాట్టహాసం చేస్తూ రక్తపానంతో వృద్ధి చెందుతూఉంది. మందిర్, మసీదువంటి సమస్యలలో మతవైషమ్యాలు మరణ హోమాలకు దారితీస్తున్నాయి. కులాల కుమ్ములాటలు, జాతుల రోత సంఘర్షణలు వర్గవైరాల కార్చిచ్చులు ప్రతిరోజునూ పలకరించే వార్తలు.

దేశస్థాయిలోనే గాక ప్రపంచ స్థాయిలో కూడా విచ్ఛిన్నకర పోకడలు బలం పుంజుకుంటున్నాయి. ముక్కలైన జర్మనీ ఒకటైనమాట నిజమే కాని దానికి దోహదం చేసిన సోవియెట్ యూనియన్ పదిహేడు ముక్కలైంది. యుగోస్లేవియా, సెర్బియా

బార్స్నియా హెర్జ్‌గోవినాగా విడిపోయి సెర్బులకు, బార్సీనియన్ ముస్లింలకు తీరవిపోరు జోరుగా సాగడం రోజూ వింటున్నదే. జెకొస్లోవియా చెక్‌గా స్లోవేకియాగా విడిపోతూవుంది. సోమాలియాలో ఆకలి చావులను లక్ష్యపెట్టకుండా అధికార పోరాటం సాకొతూనే ఉంది.

ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతూ ఉంది? ఎందుకు కొనసాగుతూ ఉంది? మూలకారణం ఏమిటి? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకటే సమాధానం. తాముతక్కిన వారికంటే వేరని, తక్కిన సంస్కృతి కన్నా తమ సంస్కృతి భిన్నమని ప్రతి వారూ తలపోయడమే దీనికి కారణం. విభేధాలకు దోహదం చేసే వైవిధ్యాల మధ్య మౌలికమైన ఏకత్వాన్ని అన్వేషిస్తూ అంతా ఒక్కటేనన్న ఆత్మీయత ఏర్పడుతుంది. తామందరూ ఒకే మానవజాతికి చెందిన వారనే సత్యం బోధ పడుతుంది. ఏకత్వాన్ని గ్రహించి జీర్ణించుకునేందుకు సారూప్యతను గుర్తించడం అవసరం. భిన్న చరిత్రలను, భిన్న సంస్కృతులను, భిన్న సాహిత్యాలను, భిన్న భాషలను, భిన్న భావాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే మౌలిక సారూప్యత కొట్టుచిన్నట్లు గోచరిస్తుంది. ఈ కారణం వల్లనే తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యత పెరిగింది. సాహిత్య రంగంలో నేడు తులనాత్మక అధ్యయనం విరివిగా సాగుతుంది. ప్రపంచ స్థాయిలో దీనికి గుర్తింపు లభించింది ఎన్నో విశ్వవిద్యాలయాలు ఈ అధ్యయనాన్ని ప్రోత్సహించి కొనసాగిస్తున్నాయి

ఒక రచయిత రచనలను మరొక రచయిత రచనలను సరిపోల్చిచూచి సారాంశాన్ని వెల్లడించడమే తులనాత్మక పరిశీలనా పద్ధతి ప్రధాన లక్షణంగా పేర్కొనబడుతూఉంది. ఆచార్య జి. నాగయ్య గారు తమ "తెలుగు సాహిత్య సమీక్ష"లో తులనాత్మక అధ్యయన పద్ధతి గురించి ఈ విధంగా తెలియ చేశారు" సమానేతివృత్తములు గల కావ్యములను సమాన ధర్మము గల కవులను సమకాలికులయిన కవులను పరస్పరము పోల్చి — కవితా తారతమ్య నిరూపణము చేయుట తులనాత్మక పద్ధతిలోని ముఖ్యాంశము" తులనాత్మక పద్ధతిని గురించి ఆచార్య జి, యస్. రెడ్డిగారు తెలియచ్చిన అభిప్రాయము లివి!" ఇరుగు

పొరుగు భాషల్లో లేదా భిన్న దేశాల్లో వెలసిన సాహిత్యాలను పరిపోల్చి, వాటిలోని సామ్య పై షమ్యాలను పరస్పర ప్రభావాదులను ప్రత్యేకలక్షణాలను పరిశీలించ డమే.తులనాత్మక పద్ధతి. ఈపద్ధతి అర్వాచీనం. పాశ్చాత్య దేశాల్లో పాతికేళ్ల నుండి ప్రాముఖ్యానికి వచ్చింది. భారతీయ సాహిత్య విషయంలో తులనాత్మక పరిశీలనకు సాటిలేని ప్రధాన్యం ఉంది........తులనాత్మక పద్ధతిలో భారతీయ సాహిత్యాలను అధ్యయనం చేయడం జాతి సమైక్యతకూ భావ సమైక్యతకూ లోహదమవుతుంది.''

ఈ తులనాత్మక పరిశీలనను ప్రప్రథమంగా ప్రారంభించినవారు జర్మనీ దేశానికి చెందిన ఫెవరిక్ సెలగల్. ఎ. వబ్ల్యు సెంగల్ అని విజ్ఞుల విశ్వాసం కాబట్టి తులనాత్మక పరిశీలనాపద్ధతికి జర్మనీ దేశమే జన్మస్థానమని చెప్పుకోవచ్చు. ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లాండు దేశాలలో కూడ ఈ పద్ధతి విరివిగా వాడుకలోకి వచ్చింది. భారతీయ భాషా సాహిత్యాలలోనూ తులనాత్మక పరిశీలనా పద్ధతి విరివిగా సాగుతుంది.

తులనాత్మక పరిశీలన వల్ల ప్రయోజనాలనేకం కనిపిస్తాయి. ప్రస్తుతం వాటిలో కొన్నిటినైనా ఊహింపడం నబబు తులనాత్మక పరిశీలన ఇద్దరి లేక పలువురి అభిప్రాయాలు కొన్ని ఒకేవిధంగా ఉండటం వెల్లడవుతుంది. ఒకరు వెలిబుచ్చ అభిప్రాయం కన్నా పలువురు వెలిబుచ్చే అభిప్రాయానికి పట్టింపు పాటింపు ఎక్కువ. ఒక అభిప్రాయాన్ని ఎంత ఎక్కువమంది ఆదరిస్తే దాని కంత ప్రాముఖ్యం పెరుగుతుంది. అలాంటు మంచి అభిప్రాయం పట్ల సముచిత గౌరవాదారాలు ఏర్పరుచుకొని మనసులో దానికి స్థానాన్ని కల్పించి ఆచరణద్వారా కొత్తవిలువను ఆపాదించ బద్ధవుతుంది. తద్వారా సత్ఫల ప్రాప్తిసిద్ధిస్తుంది.

భాషాంతరాలపట్ల గాని; భాషాతరుల పట్లగాని, వారి సాహిత్యంపట్లగాని జన సామాన్యానికి అంతగా సాదర భావం ఉదక పోవచ్చు. భాషాంతర రచనలకు సంబంధించిన తులనాత్మక పరిశీలనా సిద్ధాంత వ్యాసాలు చదివి ప్పుడు వేర్వేరు భాషలలోని రచన సామ్యాలు, తెలుసుకొనే అవకాశం కలుగుతుంది

తద్వారా భాషాంతరాల పట్ల, భాషాంతరుల పట్ల, వారి సాహిత్యం పట్ల ఉండిన సంకుచిత దృష్టి స్థాన సమైక్యతతా దృష్టి ఏర్పడుతుంది. ఆచార్య' జి. అప్పారావుగారు "వేమన—సర్వజ్ఞుల తులనాత్మక పరిశీలన" అనే సిద్ధాంత వ్యాసంలో తులనాత్మక పరిశీలన ఉపయోగాన్ని గురించి ప్రస్తావిస్తూ "భాషా బేధములతో, ప్రాంతీయ దురభిమానములలో సతమత మగుచున్న ఈరోజులలో ఇట్టి తులనాత్మక పరిశీలన వల్ల భిన్న భాషలకు, కలాలకు చెందిన రచనల గురించి తెలుసుకొనే అవకాశం ఏర్పడుతుంది. అరచనలో కొన్ని ఓకే విధ మయిన భావాలుండటం కూడా తెలియ వస్తుంది. అవి ఒక దానికి కొకటి అనువాదమోదక అనుసరణో అన్నంతగా సామ్యం కలిగి ఉంటాయి.

ఉదాహరణ:— "ఎప్పొరుళ్ యార్ యార్ వాయ్‌క్కేప్పినుం
అప్పొరుళ్ మెయ్ ప్పొరుళ్ కాణ్బదరివు"
(తిరుక్కురళ్)

కం॥ వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిపిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ.
(సుమతీ శతకము)

ఆ భావాలను వ్యక్తం చేసిన రచయితలు భిన్న భాషలకు, కాలాలకు చెందినవారు కావటం వల్ల తమవి వంటి భావాలను వ్యక్తం చేసిన ఇతరుల గురించి కాని వారి రచనల గురించి గాని తెలుసుకొనే వీలుండటం చాలా అరుదు. అలాం టప్పుడుకూడా వారిబావాలు ఇంచుమించు ఒకే విధంగా ఉండటం గమనించినప్పుడు అవ్యార్యానందాలకు అవధులుండవు. తులనాత్మకంగా పరిశీలించేటప్పుడు వేర్వేరు రచనలలోని భావాలు సేకరించి ఒకేచోట పొందు పరచటం జరుగుతుంది అందు వల్ల వాటిని గ్రహించేందుకు పాఠకులకు సులభంగా వీలవుతుంది

ఇలాంటి ప్రయోజనాలెన్నిటినో తనలో ఇముడ్చు కొన్న తులనాత్మక పరిశీలనా పద్ధతిలో అన్నమయ్య ఆళ్వారుల రచనలను అధ్యయనం చేయడం నా పురాకృత సుకృతంగా భావిస్తావు.

అన్నమయ్య ఆళ్వారులు ఆస్తికులు వైష్ణవులు భాగవత సంప్రదాయాన్ని ఆదరించినవారు తమ అనుభవాలతో సందేశాత్మకంగా రచనలు సాగించినవారు. వేర్వేరుగా ఉన్న వీరి రచనలను చదివి అర్థంచేసుకొని ఆనందించడం అందరికీ అందుబాటులో ఉండే పనికాదు. కాబట్టి వీరి రచనలలోని పఠనీయాంశాలను క్రోడీకరించి ఒకే చోట పొందు పరచడం వల్ల పాఠకుల విషయగ్రహణా సౌలభ్యానికి దోహదమవుతుంది. తద్వారా సద్భావ వ్యాప్తికి అవకాశం ఉంది.

విభిన్న భాగాలకు, ప్రాంతాలకు, కాలాలకు చెందినా అన్నమయ్య, ఆళ్వారులు, ఒక విధమయిన మనస్తత్వం, సంస్కారం, అభిరుచులు, భావాలు కలవాళ్లు, రచనల్లోని సాదృశ్యాలను ఆధారంగా చేసికొని వీరంతా ఒకకోవకు చెందినవారని, అభేద ప్రతిపత్తి కలవారని నిరూపించడానికి ఈ సిద్ధాంత వ్యాసంలో ప్రయత్నించడం జరిగింది.

పరిశోధనా పరిధి :

ఆళ్వారుల రచలన్నింటిని శ్రీ మన్నాధమునులు, సంకలనం చేసి 'నాలాయిర దివ్యప్రబంధం' అనే పేరుతో వ్యాప్తిలోకి తెచ్చారు. ఇందులో ఆళ్వారులు రచించిన నాలుగువేల పాశురాలు (పద్యాలు) ఉన్నాయి. వీటినన్నిటిని పరిశీలించి నా సిద్ధాంత వ్యాసరచనకు కావలసిన అంశాలను తీసుకోవడం జరిగింది. తాళ్లపాక అన్నమాచార్యుడు రచించినవన్నీ ప్రస్తుతం లభించడం లేదు. పన్నెండు శతకాలు, ద్విపద రామాయణం, వేంకటాచలం మహాత్మ్యం సంకీర్తన, లక్షణం, నానా భాషల్లో ప్రబంధాలు, శృంగార మంజరి ముప్పై రెండువేల అధ్యాత్మ శృంగార కీర్తనలను ఈయన రచించినట్లు ప్రతీతి. అయితే

అలిమేలు మంగకు అంకితంగా చెప్పబడిన వేంకటేశ్వర శతకం. శృంగార మంజరి దాదాపు పన్నెండువేల సంకీర్తనలు మాత్రమే ఇప్పుడు లభ్యమవుతున్నాయి. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానంవారు సంపుటాలుగా ప్రకటించి వెలువరిస్తున్నారు.

అన్నమయ్య సమకాలీన అంశాలను ఊహించడానికి శృంగార మంజరి వేంకటేశ్వర శతకం, 16,21,23 సంపుటాలు మినహా 29వ సంపుటం వరకు పరిశోధించడం జరిగింది. సామాన్య సామ్యాలు, విష్ణుతత్వం, ఆధ్యాత్మ తత్త్వం ఈ మూడు అధ్యాయాలకు అన్నమయ్యకు సంబంధించి కావలసిన విషయాన్ని కొత్తగా వెలువడిన 1.2. సంపుటాలు, 8 9 10.11 సంపుటాల నుంచి గ్రహించడం జరిగింది మధురభక్తి అధ్యాయానికి సంబంధించి అన్నమయ్య శృంగారమంజరి శ్రీ వేంకటేశ్వరశతకం, 16,21,23 మినహా 12 నుంచి 29 వరకు అన్ని సంపుటాలు పరిశోధించడం జరిగింది.

కొన్ని విశేషాలు :

నా పరిశోధనా శీర్షిక "అన్నమయ్య ఆళ్వారులు తులనాత్మక పరిశీలన" అయితే ఆళ్వారులు అన్నమయ్యకు పూర్వులు కావడం చేతను, వాళ్ళు అధిక సంఖ్యలో ఉండడం చేతను ముందట వారిని గురించి రాయడం, వారి రచనలను ఉదహరించడం జరిగింది. అన్నమయ్య ఆళ్వార్లకు సంబంధించి సాదృశ్యాలు మెండుగా ఉన్నాయి వాటినన్నిటిని యథాతథంగా చెప్పడం తలకుమించిన పనే అవుతుంది. అప్రస్తుతంగా కూడా ఉంటుంది. ఒక ప్రణాళిక నేర్పరచుకొని వాటినన్నిటిని వర్గీకరించుకొని పరిశీలించడం జరిగింది. అన్నమయ్య ఆళ్వారుల రచనల్లో సమకాలీన పరిస్థితులకు సంబంధించి కనిపించే అంశాల్లో వాస్తవానికి దగ్గరగా ఉన్నవాటిని తీసికొని దూరంగా ఉన్నాయనిపించిన వాటిని పరిహరించడం జరిగింది.

ఉదా: ....... ..... .... .... .... .... .... ...

.... .... .... ... .... .... .... .......

నేట్రుత్తామరై నెన్నిటాఫమలర్ సిరీవరమంగలనగర్

వీట్రిరుంద వెందామ్... ......,,

(నమ్మాళ్వార్ - తిరువామ్మొళి, అయిందాంపత్తు, ఏళాం తిరువాయ్మొళి, పద్యం - 1)

(మంచి వరిపోలాల మధ్య అడుసులో వికసించిన తామరలు గల సిరీవరమంగళ నగరమున (వానమామలైలో) వెలసిన తండ్రి!)

ఆళ్వారుల రచనలన్నీ లభిస్తుండడంవల్ల వాళ్ళు ఏయే విషయాల్ని ఏన్ని పద్యాల్లో చెప్పారో నిష్కర్షంగా చెప్పుకోవడానికి వీలవుతుంది కాబట్టి మూడో అధ్యాయం నుంచి ఆరో అధ్యాయం వరకు గల ఉప శీర్షికలలో ఏయే విషయాల్ని గురించి ఎన్నిపద్యాలు చెప్పారో రాయడం జరిగింది. అన్నమయ్య రచనలన్నీ లభ్యం కావడంలేదు. లభించిన వన్నీ కూడా వెలుగు చూపలేదు అందువల్ల అన్నమయ్య ఏయే విషయాలకి సంబంధించి ఎన్నెన్ని రచనలు చేశాడో నిర్ధారించి చెప్పలేము అది కారణంగా పై ఉపశీర్షికలలో అన్నమయ్య రచనల సంఖ్యను ఉదహరించ లేదు.

వ్యాసరచనా ప్రణాళిక;

మొదటి అధ్యాయం (అన్నమయ్య ఆళ్వారుల జీవితవిశేషాలు)లో అన్నమయ్య ఆళ్వారుల జీవిత కథలు వాటిలోని సామ్యాలను గురించి చర్చించడం జరిగింది. రెండో అధ్యాయం (సమకాలీన పరిస్థితులు)లో అన్నమయ్య ఆళ్వారుల కాలాల్లో నెలకొన్న సాంఘిక రాజకీయ- మత పరిస్థితులను వేరు వేరుగా ఊహించి తులనాత్మకంగా పరిశీలించడం జరిగింది. మూడో అధ్యాయం (సామాన్య సామ్యాలు)లో అన్నమయ్య ఆళ్వారుల రచనల్లో సామాన్యాలుగా కనిపించి అంశాలను తులనాత్మకంగా పరిశీలించడం జరిగంది, నాలుగో

అధ్యాయం (విప్లతత్త్వం)లో గోచరించ విప్లతత్త్వాన్ని తులనాత్మకంగా సమీక్షించడమయింది. అయిదో అధ్యాయం (మధురభక్తి)లో అన్నమయ్య ఆళ్వారుల మధురభక్తికి సంబంధించిన అంశాలను సరిపోల్చి చూడడం జరిగింది. ఆరో అధ్యాయం (అధ్యాత్మ తత్త్వం)లో వీరుఅధ్యాత్మతత్త్వానికి సంబంధించి ప్రతిపాదించిన అంశాలు వీటిలోని పోలికలు చర్చించబడ్డాయి.

అన్నమయ్య ఆళ్వార్ల రచనలు అనుపమాలు అమృతప్రాయాలు అనితర సాధ్యాలు. సాహితీరస పరిపుష్టాలు, వీటిని పరిశీలించడానికి పూనుకోవడం నావంటి సామాన్యునికి తలకు మించిన పని అవుతుంది. పెద్దల అండ, ఆదరణ సన్మార్గ దర్శకత్వం నన్నీ సాహసానికి పురికొల్పాయి. నాపరిమిత జ్ఞానం వల్ల ఈ సిద్ధాంత వ్యాసంలో పోనగే దొసగులు పరిహరించి సారభూత సదంశాలను సహృదయులు స్వీకరిస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు

తిరుపతి
-10-9152

జె. మునిరత్నం

# హితులు - స్మృతులు

నా పరిశోధనకు ఉపకారవేతనం మంజూరు చేసిన ఆ నాటి తి.తి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఎ.ఎస్. గారికి అన్నమాచార్య ప్రాజెక్టు వారికి సర్వదా కృతజ్ఞుణ్ణి.

సర్వాత్మనా నా అభివృద్ధికి తోడ్పడిన పితృతుల్యులు గురువు గారు ఆచార్య జి.యన్. రెడ్డి గారికి, నా పరిశోధనా పర్యవేక్షించిన. గురువు గారు ఆచార్య జె. సూర్యనారాయణ గారికి, ప్రోత్సాహకులు శ్రీమాన్ కె. శ్రీనివాస వరదాచార్యుల వారికి, ఆచార్య డి. చిన్నిక్రిష్ణయ్య గారికి, ఆచార్య పి. వి. అరుణాచలం గారికి, ఆచార్య పి. శౌరిరాజన్ గారికి, ఆచార్య కె. సర్వోత్తమ రావు గారికి. డా. పి. నరసింహారెడ్డి గారికి,

నా ఉన్నతినే ధ్యేయంగా పెట్టుకొన్న ఆత్మీయ గురుద్వయం శ్రీ కె. శ్రీనివాసులు శెట్టి గారికి, డా. ఎమ్. భాస్కర నాయుడు గారికి,

చిన్నప్పటి నుంచి అనేక గ్రంథాలు చదివి వినిపించి, నాలో సాహితీ రసపిపాస, సద్విషయచింతన కలిగించి ఉన్నతస్థాయికి ఎదగడానికి దోహదం చేయడమే కాక నా పరిశోధనా వ్యాసంగంలో అవిరామంగా పరిశ్రమించి తోడ్పడిన తండ్రి గారు శ్రీ మునస్వామి నాయుడు గారికి కృతజ్ఞతాభి వందనాలు.

నా పరిశోధనలో సర్వవిధాలా తోడ్పడిన శ్రేయోభిలాషులు శ్రీ బి చెంగా రెడ్డి గారికి, మిత్రులు డా. ఎమ్ గోవిందస్వామి నాయుడు గారికి, శ్రీ. కె రామకృష్ణ గారికి, శ్రీ వి జలేంద్రుడు గారికి, శ్రీ వి పురుషోత్తం గారికి చి॥సౌ॥ కన్నియమ్మ గారికి

నా పరిశోధన విజయవంతం కావడానికి సర్వ విధాల సహకరించిన సహృదయురాలు, చిరస్మరణీయురాలు శ్రీమతి వి. వసంత గారికి, పరిశోధనలో తోడ్పడిన శ్రీమతి యస్. శాంత గారికి, మిత్రులు శ్రీ యస్. మునిరత్నంగారికి

గ్రంథసేకరణలో తోడ్పడిన శ్రీ వి. షణ్ముగం గారికి, శ్రీ యం. ప్రభాకరుల గారికి

ప్రూపులు దిద్దిన శ్రీ బి. శ్రీరాములు, శ్రీ బి శ్రీధర్‌లకు అతి స్వల్పకాలం లోనే ముద్రించి యిచ్చిన శారదా ప్రింటర్స్ వారికి

నా పరిశోధనకు, చదవడంలోనూ, మరెన్నో ఇతర విధాలుగా తోడ్పడి మరెందరో మాన్యులకు నా హార్దిక ధన్యవాదాలు.

— జె. మునిరత్నం

# విషయసూచిక


| | | |
|---|---|---|
| I. | అన్నమయ్య, ఆళ్వారుల జీవిత విశేషాలు | 1_56 |
| 1.1. | ఆళ్వారులు | 2 |
| 1,2. | అన్నమయ్య | 42 |
| 1.3. | అన్నమయ్య, ఆళ్వారుల జీవితాలలో కనిపించే కొన్నిసామ్యాలు | 48 |
| II. | సమకాలీన పరిస్థితులు | 57_94 |
| 2.1.1 | ఆళ్వారుల నాటి సాంఘిక పరిస్థితులు | 58 |
| 2.1.2 | ఆళ్వారుల నాటి రాజకీయ పరిస్థితులు | 66 |
| 2,1 3 | ఆళ్వారుల నాటి మత పరిస్థితులు | 68 |
| 2,1.1 | అన్నమయ్య నాటి సాంఘిక పరిస్థితులు | 73 |
| 2 2.2 | అన్నమయ్య నాటి రాజకీయ పరిస్థితులు | 85 |
| 2.2.3 | అన్నమయ్య నాటి మత పరిస్థితులు | 87 |
| 2.3 | సామ్యాలు | 92 |
| III. | సామాన్య సామ్యాలు | 95_16 |

# 1. అన్నమయ్య, ఆళ్వారులు జీవిత విశేషాలు

1.0 సాధారణంగా రచయితల మనోగతాభిప్రాయాలు, అభిరుచులు, అనుభూతులు వాళ్ల రచనల్లో ప్రతిబింబిస్తాయి. వాళ్ల కాలం నాటి పరిస్థితులు, కూడా రేఖామాత్రంగానైనా గోచరిస్తాయి. రచయితల జీవితాల ప్రభావంగాని, జీవిత ఘట్టాల ప్రభావంగాని, వాళ్ల కృతుల్లో కనిపించే అవకాశం ఉంది, కాబట్టి కొన్ని రచనల్ని చదివినప్పుడు వాటి రచయితల గురించి, వాళ్ల జీవిత విశేషాల గురించి తెలుసుకోవాలనిపిస్తుంది.

ఒక గ్రంథ పరిశోధన సమగ్రం కావాలంటే ఆ గ్రంథ రచయితను గురించి తెలుసుకోవడం తప్పనిసరి అవుతుంది. రచనల్ని తులనాత్మకంగా పరిశీలించేటప్పుడు వాటి రచయితల జీవిత విశేషాలను కూడా పరిశీలించడం ఆసక్తిదాయకంగా ఉంటుంది. రచనల్లో కనిపిస్తున్నట్టే రచయితల జీవితాల్లో కూడా కొన్ని సామ్యాలు కనిపించే అవకాశం ఉంది. రచయితలు తమ పూర్వ రచయితల ననుకరించడానికి ప్రయత్నించడం వల్లను, యాదృచ్ఛికంగాను, ఇలాంటి సామ్యాలు ఏర్పడే వీలుంది.

ఆళ్వారులను, అన్నమయ్యను తులనాత్మకంగా పరిశీలించేటప్పుడు వాళ్ల జీవితాలను కూడా తులనాత్మకంగా పరిశీలించడం అత్యావశ్యకమవుతుంది. ముందుగా అన్నమయ్యకు పూర్వులయిన ఆళ్వారుల జీవితవిశేషాలను పరిశీలిద్దాం.

1. 1 ఆళ్వారులు :

తమిళ దేశంలో శైవవ్యాప్తికి నాయన్మార్లు ఎంతో కృషిచేశారు. అలాగే వైష్ణవ వ్యాప్తికి ఆళ్వార్లు ఎంతగానో దోహదం చేశారు. ఈ ఆళ్వార్లు విష్ణు తత్త్వాన్ని, విష్ణులీలల్ని, విశిష్ట కల్యాణ గుణాల్ని, విభూతుల్ని గానంచేసి వినేవాళ్ల మనసుల్ని విష్ణువువైపుకు మళ్లించే ప్రయత్నంచేసి విజయాన్ని సాధించారు. వైష్ణవ మత వ్యాప్తికి విష్ణు సంకల్పం వల్ల ఆయన వస్తువాహనాలే ఆళ్వారులుగా ఆవిర్భవించాయని వైష్ణవుల అచంచల విశ్వాసం. ఆళ్వారులు రచించిన ప్రబంధాలు 'శ్రీమన్నాథమునులు' అనే పేరుగల వైష్ణవాచార్య పురుషుని వల్ల సంకలనం చేయబడ్డాయి. ఈ సంకలనానికి 'నాలాయిర దివ్య ప్రబంధమని' పేరు. ఇది వైష్ణవులకు పారాయణ గ్రంథం.

కొందరు పండితులు ఆళ్వారు శబ్దవాచ్యానికి సంబంధించి అనేకాభిప్రాయాలు వెలిబుచ్చారు. ఆచార్య టి. కోదండరామయ్య గారు తమ ప్రసంగ వ్యాసంలో, ఇలా పేర్కొన్నారు, "తమిళంలో అల్వార్ అనగా రక్షకుడు అని అర్థం"[1] అయితే ఈ అర్థం సరికాదనిపిస్తూ ఉంది. ఆళ్వార్ శబ్దంలోని Zha ను 'ళ' గా భ్రమించి అర్థ నిర్ణయంలో వారిలా పొరబడి వుండవచ్చు. ఆచార్య చల్లా రాధా కృష్ణశర్మగారు ఈ విధంగా నిర్వచించారు "ఆళ్వారు అనే మాటకు జ్ఞానసంపన్నుడని అర్థం". అతని హృదయం ప్రేమకు నెలవు. అతడు ధ్యాన నిష్ఠుడు శ్రీమన్నారాయణుడే పరమదైవమని అతని ప్రగాఢ విశ్వాసం".[2] పులవర్ కా. రా. గోవిందరాజ మొదలియార్ గారు ఆళ్వారు శబ్దానికి అర్థాన్ని ఇలా ఊహించారు. ఆ Zha వార్‌గళ్ ఇరైవనిడత్తిల్ ఆ Zhada అన్బు ఉడై యవర్‌గళాయ్ ఇరుందమైయాల్ ఇవర్‌గళుక్కు ఆ Zha వార్‌గళ్ ఎన్నుదుపిరవ్వు

పేయరాయ్ అమైందు విశంగు గిరదు''[3] ఆళ్వార్లు భగవంతుని పట్ల ప్రగాఢమైన ప్రేమ కలిగి వున్నందువల్ల వీళ్లకు 'ఆళ్వార్లు' అనే సార్థక నామధేయం కలిగింది.

"భగవద్గుణంగళిల్ ఆళంగార్ పట్టవరగళ్ ఆళ్వార్గళ్" అని వైష్ణ వాచార్య గురుపరంపర నిర్వచనం. భగవత్ కల్యాణగుణామృతంతో నిరంతరం తన్మయం చెందేవారు ఆళ్వార్లు అని పై నిర్వచనానికి తాత్పర్యం. ఆళ్వారుల విషయకంగా నిర్వచింపబడిన పై అంశాల్ని దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే ఆళ్వారుల సామాన్య లక్షణాల్ని ఈ క్రింది విధంగా ఊహించవచ్చు.

ఆళ్వారులు విష్ణు భక్తులు. విష్ణు కళ్యాణగుణాల్నే గానం చేసినవాళ్లు. విష్ణువునే పరదైవంగా భావించినవాళ్లు అన్యదేవతల్ని స్మరించనివాళ్లు. నిరంతరం విష్ణువునే ధ్యానిస్తూ విశ్వాన్నే విస్మరించిన వాళ్లు.

వైష్ణవులు తమ మతంలో విష్ణువుకు తరువాతి స్థానం ఆళ్వారులకే ఇచ్చి గౌరవించారు. విష్ణు సంబంధమైన, ఆళ్వారుల సంబంధమైన ఇతరులను కూడా ఆళ్వారులుగానే పేర్కొని వాళ్లపట్ల తమకున్న భక్తి ప్రపత్తులను ప్రకటించుకున్నారు. గరుడాళ్వార్, విభీషణాళ్వార్ తిరువాళి ఆళ్వార్, తిరుపుళి ఆళ్వార్ తిరువవందాళ్వార్, ఇలాగే ఎన్నో ఉదాహరణలు వైష్ణవ వాఙ్మయంలో కనిపిస్తాయి.

1.1.1. సంఖ్య :

అయితే సిసలైన ఆళ్వారు లెందరన్న సందేహం వస్తుంది. వైష్ణవ వాఙ్మయ చరిత్రలో కొంతకాలం వరకు పదిమంది ఆళ్వారులే పరిగణనలో ఉన్నట్టు తెలుస్తూవుంది.

'భూతం సరశ్చ మహదాహ్వాయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగి వాహాన్,
భక్తాంఘ్రి రేణు పరకాల యతీంద్ర మిశ్రాన్
శ్రీమత్పరాఙ్కుశమునిం ప్రణతోస్మి నిత్యమ్'[4]

పై శ్లోకంలో 'యతీంద్ర మిశ్రాన్' అని ప్రయోగింపబడిన పదబంధం శ్రీమద్రా మానుజుల వారిని, కూరేశ మిశ్రుల వారిని సూచిస్తుంది. కాబట్టి భూతయోగి (భూదత్తాళ్వార్) సరోయోగి (పొయ్‌గై ఆళ్వార్) మహాయోగి (పేయాళ్వార్) భట్టనాథుడు (పెరియాళ్వార్), భక్తిసారుడు (తిరుమళిశై ఆళ్వార్), కులశేఖర యోగి (కులశేఖర ఆళ్వార్, యోగవాహనుడు (తిరుప్పాణ్ ఆళ్వార్) భక్తాంఘ్రి రేణు(తొండరడిప్పొడి ఆళ్వార్),పరకాలుడు (తిరుమంగై ఆళ్వార్), పరాఙ్కుశ ముని (నమ్మాళ్వార్) అని పదిమంది ఆళ్వారులనే పేర్కొనడం జరిగింది.

"పొయ్‌గైయార్ పూదత్తా పేయార్
పుగళ్మళిశై అయ్యనరుళ్ మాఱన్ చేరలర్ కోన్
తుయ్యపట్టనాదన్ అన్బర్‌దాళ్‌తూళినర్పాణన్
నల్‌కలియన్ ఈదివర్‌తోఱ్ఱత్తడైవా మిఙ్గు [5]

అని ఉపదేశ రత్నమాలలో ఉంది. గోదాదేవి (ఆండాళ్)మధురకవి తప్ప తక్కిన పదిమంది ఆళ్వారుల ప్రస్తావన మాత్రమే పై తమిళ పద్యంలో కవిపిస్తుంది.

గోదాదేవి మధురకవి కూడా దివ్యాంశ సంభూతులు, పరమ వైష్ణవులు. వైష్ణవ వ్యాప్తికి తోడ్పడిన వాళ్లు. వైష్ణవులందరికి ఆరాధ్య స్థానాన్ని సంపాదించు కొన్నవాళ్లు. గోదాదేవి మధుర భక్తి మార్గంతో శ్రీరంగనాథునిలో ఐక్యంకాగా మధురకవి గురుభక్తి మార్గంతో గురుతమ స్థానాన్ని పొంది పరమపదం చేరు కున్నారు. కాబట్టి వైష్ణవులు వీళ్లిద్దర్ని కూడా ఆళ్వారులలో చేర్చారు. వీళ్లతో కలిపి ఆళ్వారులు పన్నెండు మంది అని ధృవీకరించడం జరిగింది. వైష్ణవాచార్య పరంపర ఈ విషయాన్ని అంగీకరించి ఆళ్వారులు పన్నిద్దరనే అంశాన్ని వాప్తి లోకి తెచ్చింది. ఈ అభిప్రాయాన్ని బలపరచే శ్రీకృష్ణదేవరాయల పద్యం గమనించవలసి ఉంది.

మ॥ అలపన్నిద్దఱు సూరులందును సముద్యల్లీల గా పున్నవె
గ్గలపుందాపకు దాప నా నిజమనఃకంజాత సంజాత పు

ష్కల మాద్వీకరయీ రిన్మురారి సొగియంగా జొక్కధన్యాత్ములౌ
విలపన్నిద్దఱు సూరులం దలతు మోక్షేచ్ఛా మతిందివ్యులన్.

శ్రీకృష్ణ దేవరాయలు కావ్యారంభం చేస్తూ ప్రథమాశ్వాసంలో ఇష్ట దేవతా స్తుతి చేశారు. వీరవైష్ణవుడుగా పేర్కొనబడే ఆయన ఆ పట్టంలో పన్నిద్దరు ఆళ్వారులను స్మరించారు. ఈయన ఆళ్వారు శబ్దానికి బదులుగా సూరి శబ్దాన్ని వాడినట్లు తెలుస్తూ వుంది.

'ఇల పన్నిద్దరు సూరులను పన్నిద్దరాళ్వారులను స్తోత్రము
చేసి కావ్యావతారమును చెప్పందొడంగెను'[7]

అన్న నేలటూరి రామదాసుగారి వాక్యాన్నికూడా ఇక్కడ అనుసంధించుకోవచ్చు పై సమాలోచన ఫలితంగా పదుగురుగా పరిగణింపబడిన ఆళ్వారులు తరువాత పన్నిద్దరుగా పరిగణింపబడినారని, ఆళ్వారులు పన్నెండుమంది అన్న అభిప్రాయం సర్వజనామో దాన్ని పొంది సర్వత్ర వ్యవహారంలో ఉందని తేటతూ వుంది.

1.1.2 కాలం :

ఆళ్వారుల కాలానికి సంబంధించి పండితుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. వాళ్లను మానవాతీత వ్యక్తులుగా పరిగణించే వైష్ణవులు ద్వాపరయుగాంతం, కలియుగప్రారంభం ఈ సంధికాలానికి చెందిన వాళ్లగా భావించారు.[8]

| | యుగం | సంవత్సరం | శక.సంవత్సరం |
|---|---|---|---|
| 1. పొయ్‌గై అల్వార్ | ద్వాపరయుగం | 8,62,901 | క్రీ.పూ.4202 |
| 2. భూదత్తాళ్వార్ | " | " | " |
| 3. పేయాళ్వార్ | " | " | " |
| 4. తిరుమళిశై ఆళ్వార్ | " | " | " |
| 5. మధుర కవి | " | 8,63,879 | క్రీ.పూ. 3224 |

| | | | |
|---|---|---|---|
| 6. నమ్మాళ్వార్ | కలియుగం | | |
| (పుట్టిన 43వ రోజు) | " | | క్రీ.పూ. 3102 |
| 7. కులశేఖరాళ్వార్ | కలియుగం | 28 | క్రీ.పూ. 3075 |
| 8. పెరియాళ్వార్ | " | 47 | క్రీ.పూ. 3056 |
| 9. ఆండాళ్ | " | 98 | క్రీ.పూ. 3005 |
| 10. తొండరడిప్పొడియాళ్వార్ | " | 289 | క్రీ. పూ. 2814 |
| 11. తిరుప్పాణాళ్వార్ | " | 343 | క్రీ.పూ. 2760 |
| 12. తిరుమంగై ఆళ్వార్ | " | 398 | క్రీ పూ 2714 |

'అయితే ఆధునిక పరిశోధక పండితుల అభిప్రాయం ఇందుకు భిన్నంగా ఉంది. ఆళ్వారుల రచనల్లో కనిపించే సమకాలీనాంశాలను బట్టి వాళ్ల ప్రయోగించిన పద జాలాన్ని బట్టి, ఇతరాంశాలను బట్టి ఆళ్వారులు క్రీ శ.8,9 శతాబ్దాలలో జీవించి నట్టు పరిశోధకులు భావించారు"

| ఆళ్వారుల పేర్లు | కాలం |
|---|---|
| 1. పొయ్‌గై ఆళ్వార్ | క్రీ.శ. 719 |
| 2. భూదత్తాళ్వార్ | " |
| 3. పేయాళ్వార్ | " |
| 4. తిరుమళిశై ఆళ్వార్ | క్రీ.శ. 720 |
| 5. తొండరడిప్పొడియాళ్వార్ | క్రీ.శ. 727 |
| 6. కులశేఖరాళ్వార్ | క్రీ.శ, 767 |
| 7. తిరుమంగై ఆళ్వార్ | క్రీ.శ. 776 |
| 8. తిరుమంగై ఆళ్వార్ | క్రీ.శ: 781 |
| 9. పెరియాళ్వార్ | క్రీ.శ, 785 |
| 10. మధురకవిఆళ్వార్ | క్రీ.శ. 787 |
| 11. నమ్మాళ్వార్ | క్రీ,శ. 796 |
| 12. ఆండాళ్ | క్రీ శ. 836 |

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే ఆళ్వారుల కాలానికి సంబంధించి ఆధునిక పరిశోధకులు వ్యక్తపరచిన అభిప్రాయమే వాస్తవానికి దగ్గరగా ఉన్నట్టనిపిస్తుంది.

**1.1.3 తొలి ఆళ్వారులు :**

తొలి ఆళ్వారులు ముగ్గురు. వీళ్ల పొయ్‌గై ఆళ్వార్, భూదత్ ఆళ్వార్, పేయాళ్వార్. ఆళ్వారులలో తొలుత ఆవిర్భవించడం వల్ల వీళ్లను తొలి ఆళ్వారు లని వ్యవహరిస్తారు. వీళ్లందరూ ఒకే సంవత్సరంలో పుట్టినవాళ్లు. వీళ్లంతా కూడా అయోనిజులే. వైష్ణవ వాఙ్మయం వీళ్లతోనే ప్రారంభ మవుతుందని చెప్పుకోవచ్చు.

పొయ్‌గై ఆళ్వార్ :

తులాయాం శ్రవణే జాతం
కాంచ్యాం కాంచన వారిజాత్
ద్వాపరే పాంచ జన్యాంశం
సరోయోగిన మాశ్రయే'[10]

కాసార యోగి, సరోమునీంద్రుడు అని కూడా ఈయనను పిలుస్తారు

'తమిళనాడు, చెంగల్పట్టు జిల్లాకు చెందిన కాంచీపురంలో కణ్ణన్ తిరువెగ్గా అనే ప్రదేశం వుంది. దానికి ఉత్తరంగా ఉన్న గుంటలో ఒక తామర పూవులో పొయ్‌గై ఆళ్వార్ జన్మించారని వైష్ణవాచార్య సంప్రదాయం చెబుతుంది. జన్మ స్థలాన్ని బట్టి ఈయనకు ఈ పేరువచ్చి ఉండవచ్చు'.[11]

క్రీ. శ. 719 అక్టోబరు 15 నుంచి నవంబరు 15 మధ్య కాలంలో సిద్ధార్థి నామ సంవత్సరం ఆశ్వయుజమాసం (తమిళమాసం ఐప్పసి) శుద్ధాష్టమి శ్రవణ నక్షత్రం, మంగళవారం మహావిష్ణు పాంచజన్య (శంఖం) అంశంలో పొయ్‌గై ఆళ్వార్ ప్రభవించినట్లు ప్రాజ్ఞులు చెబుతారు

భూదాత్తాళ్వార్ :

'తులాశ్రవిష్ఠా సంభూతం
భూతం కల్లోల మాలినః

తీరే పుల్లోత్పలే మల్లాం
పుర్యామీదేగదాంశకమ్'[13]

భూదత్తాళ్వార్‌ను 'భూతయోగి' అని కూడా అంటారు. ఈయన మద్రాసు సమీపంలో ఉన్న మహాబలిపురంలో ఒక మాధవీకుసుమంలో జన్మించారని ప్రతీతి.

క్రీ. శ. 719 అక్టోబరు 15 నుంచి నవంబరు 15 మధ్యకాలంలో సిద్ధార్థి నామ సంవత్సరం ఆశ్వయుజమాసం తమిళమాసం ఐప్పసి శుద్ధనవమి బుధవారం ధనిష్ఠా నక్షత్రంనాడు మహావిష్ణు కౌమోదక్యాంశంలో భూదత్తాళ్వార్ పుట్టాడని సంప్రదాయ కథనం.

పేయాళ్వార్ :

'తులాశతభిషగ్జాతం
మయూర పురికైరవాత్
మహాంతం మహదాఖ్యాతం
వందేశ్రీనందకాంశకమ్'[13]

పేయాళ్వార్‌ను 'మహాయోగి'అని కూడా పిలుస్తారు. మద్రాసులోని మైలాపూర్‌లో శెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని మణికైరవ తీర్థం అనే బావిలో ఎెంగలువ పూవులో పేయాళ్వార్ పుట్టినట్లు చెబుతారు.

క్రీ. శ. 719 అక్టోబరు 15 నవంబరు 15, మధ్యకాలంలో సిద్ధార్థినామ సంవత్సరం ఆశ్వయుజమానం తమిళమాసం ఐప్పసి శుద్ధ దశమి గురువారం శతభిష నక్షత్రంలో విష్ణునందకాంశంలో పేయాళ్వార్ అవిర్భవించినట్లు ఐతిహ్యం.

ఈ ముగ్గురు ఆళ్వారులను ఎవరు పెంచారో వీళ్లు ఎలా పెరిగారో వీళ్ల బాల్య విశేషాలేమిటో, విద్యాబుద్ధులు, విష్ణుభక్తి ఎలా అలవడ్డాయో తెలుసుకునేందుకు ఆధారాలు, అవకాశాలు లేవు. వాళ్ల జీవితంలో ముఖ్యమైన ఒక సంఘటన మినహా తక్కిన సంగతులేవీ తెలుసుకోనే అవకాశం కలుగలేదు.

ఆళ్వారులు ముగ్గురు హరి భక్తులై ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా వైష్ణవ క్షేత్రాలుసేవిస్తూ దేశ సంచారం మొదలు పెట్టారు. భగవత్సంకల్పం వల్ల ఒకరోజు వాళ్ళందరు ఒకేసారి తిరుక్కోవిలూరు చేరుకున్నారు.

రాత్రి వచ్చింది. కారుచీకట్లు కమ్ముకున్నాయి. ఆకాశమంతా హఠాత్తుగా మేఘావృత్తమయింది. పెనుగాలి వీచడం ప్రారంభమయింది. ఉరుములు మెరుపులతో భారీవర్షం మొదలైంది. ఎక్కడా తలదాచుకునేందుకు స్థలం లేదు.

ఆ దుర్భర వర్షంలో పొయ్‌గై ఆళ్వార్ ఒక చిన్న దేహళి చేరుకున్నాడు. తరువాత కొంత సేపటికి భూదత్తాళ్వార్ అక్కడికి వచ్చి తలదాచుకునేంధుకు స్థలం కోరాడు. 'ఈ స్థలంలో ఒక్కరు పడుకోవచ్చు, ఇద్దరు కూర్చోవచ్చు. ఇద్దరము కూర్చుందాము రమ్మ' న్నాడు పొయ్‌గై ఆళ్వార్. మరికొంత సేపటికి పేయాళ్వార్ కూడా అక్కడికి వచ్చి 'ఉండటానికి కొంత చోటు కావాల'న్నాడు. 'ఒకరు పడుకో వచ్చు, ఇద్దరు కూర్చోవచ్చు, ముగ్గురు నిలబడవచ్చు అందరము నిలబడవాము రమ్మ' ని పొయ్‌గై ఆళ్వార్ పేయాళ్వార్‌ను కూడా ఆహ్వానించాడు.

తొలి ఆళ్వార్లు ముగ్గురు తొలిసారిగా ఒకచోట చేరి పరిచయం చేసుకొని విష్ణులీలలు కొనియాడుతూ సద్గోష్టి సాగించారు. ఆళ్వార్లను అనుగ్రహించే ఉద్దేశ్యంతో విష్ణువు వాళ్ల మధ్యకు వచ్చాడు. కనబడకుండా వాళ్ల మధ్య నిలబడి ఒత్తిడి ఎక్కువ చేశాడు. ఆళ్వార్లకు తమ మధ్య ఎవరో ఉన్నట్టనిపించింది. జ్ఞాన దృష్టితో పరిశీలించారు, మహా విష్ణువు సాక్షాత్కరించాడు. ఆ దేవదేవుని దివ్య మంగళ విగ్రహాన్ని తిలకించి పులకించారు. అనేక విధాలుగా స్తోత్రం చేసి ఆనంద పరవశులయ్యారు. ఆశువుగా 'ఇయర్పా' ఛందస్సులో అంతాది ప్రణాళికతో మనిషికో నూరు తమిళ పద్యాలు హృద్యంగా చెప్పారు. విష్ణువు వాళ్లను అనుగ్రహించి ఆశీర్వదించి అంతర్గమించాడు.

'పొయ్‌గై ఆళ్వార్' 'వైయ్యంతగళియా' అని ప్రారంభించి దేవుణ్ణి ఉద్దేశించి, లోకుల్ని ఉద్దేశించి, తన మనసునుద్దేశించి క్షేత్ర ప్రశంసాత్మకంగా నూరు పద్యాలుగల ఒక ప్రబంధాన్ని చెప్పాడు'.[14] అంతాది ప్రణాళికతో మొదట

చెప్పడం వల్ల దీనికి 'ముదల్ తిరువందాది' అని పేరు వచ్చింది. ఇదే విధంగానే 'అన్పేతగళియాయ్' అని ప్రారంభించి మూరు పద్యాల ప్రబంధాన్ని భూదత్తాళ్వారూ, 'తిరుకండేన్' 'పొన్ మేనికండేన్' అని ప్రారంభించి మూరు పద్యాల ప్రబంధాన్ని పేయాళ్వారూ చెప్పారు. భూదాత్తాళ్వార్ రెండోసారి చెప్పడం వల్ల అతని ప్రబంధానికి 'ఇరండాం తిరువందాది' అని పేయాళ్వార్ మూడోసారి చెప్పడం వల్ల అతని ప్రబంధానికి 'మూండ్రాం తిరువందాది' అని పేర్లు వచ్చాయి.

'తొలి ఆళ్వారుల తరువాతి జీవితానికి సంబంధించిన సమాచారం సమగ్రంగా దొరకడం లేదు. తిరుమళిశై ఆళ్వారు జీవితంలో వీళ్ల విషయం ప్రస్తావ నామాత్రంగా కనిపిస్తూ వుంది. ఈ ఆళ్వారుల నిర్యాణం గురించి పెరియ తిరుముడియడైవు' మాత్రం ప్రస్తావించింది. దొరికిన తక్కిన పుస్తకాలు వేటి లోనూ నిర్యాణ విషయం కనిపించలేదు. తొలి ఆళ్వారులు ముగ్గురు తిరుక్కో వలూరులో పరమపదించినట్టు పెరియతిరుముడి యిడైవులో వ్రాయబడి ఉంది'[15]

ఏది ఏమైనా తొలి ఆళ్వారులు వైష్ణవ వాఙ్మయ ప్రారంభకులుగా ఆళ్వార్ ఆచార్యులలో ఆద్యులుగా వైష్ణవులకు, తమిళ భాషకు చెందిన వారికే గాక ఆస్తిక ప్రపంచానికంతటికి ఆరాధ్యులు, చిరస్మరణీయులు అని చెప్పుకోవచ్చు.

1. 1. 4. తిరుమళిశై ఆళ్వార్ :

'మఖాయాం మకరే మాసే
చక్రాంశం భార్గవోద్భవమ్
మహీసారపురాధీశం
భక్తిసార మహం భజే'[16]

తిరుమళిశై ఆళ్వార్‌ను తిరుమళిశై పిరాన్, భక్తిసారుడు అని కూడా పిలుస్తారు.

మద్రాసు సమీపంలో పూనమల్లి ప్రక్కన తిరుమళిశై అనే గ్రామం ఉంది. దీన్ని మహీసారక్షేత్రం అనికూడా అంటారు. పూర్వమొకప్పుడు ఇక్కడ భార్గవ మహర్షి దీర్ఘ సత్రమనే యాగం చేస్తుండగా అతని భార్య ఒక మగ బిడ్డను

ప్రసవించింది. క్రీ. శ. 720 జనవరి 15, ఫిబ్రవరి 15ల మధ్య కాలంలో సిద్ధార్థినామ సంవత్సరం, పుష్యమాసం (తమిళమాసం తై) పాడ్యమి శుక్రవారం నాడు మఖా నక్షత్రంలో మహావిష్ణువు సుదర్శనాంశంతో (చక్రం) ఈ శిశువు జన్మించినట్టు విజ్ఞుల అభిప్రాయ పడ్డారు.

కాళ్లు చేతులు లేకుండా పిండాకారంగా వున్న బిడ్డను ఒక వేము పొదలో సురక్షితంగా ఉంచి మహర్షి దంపతులు వెళ్ళిపోయారు. సతీ సమేతంగా శ్రీపతి అక్కడికి వచ్చారు. ఆ దంపతుల కటాక్షం వల్ల ఆ బిడ్డ సజీవుడు, పరిపూర్ణావయవుడు అయ్యాడు. విష్ణువు అతణ్ణి అనుగ్రహించి వెళ్లిపోయాడు. విష్ణు విరహాన్ని సహించలేక బిడ్డ ఏడ్వడం మొదలు పెట్టాడు. వేముల్ని కోసుకపోవడానికి వచ్చిన మేదరి తిరువాళన్ సంతాన హీనుడు కావటం వల్ల ఆ బిడ్డను తీసుకెళ్లి తన భార్య 'పంగయచెల్వి' కిచ్చాడు. కాని ఆ బాలుడు పాలు తాగలేదు. మలమూత్రాలు విసర్జించలేదు. అయినా పెరుగుదల ఆగలేదు. కళాకాంతులు తరగలేదు. అందరూ ఆశ్చర్యపడ్డారు. చూడాలనే కుతూహలంతో ఎందరో వచ్చారు.

ఆ వూళ్లోనే ఉన్న దృఢవ్రతుడనే వృద్ధ కర్షకుడు, అతని భార్య కూడా వచ్చారు. ఆ దంపతులు తాము తెచ్చిన పాలను ఆళ్వార్‌కు సమర్పించి త్రాగమని ప్రార్థించారు. ఆయన సంతోషంతో త్రాగాడు. అప్పటి నుంచి ఆ వృద్ధదంపతులు రోజూ పాలు తెచ్చి యిచ్చేవాళ్లు. ఆళ్వార్ ఎంతో ప్రీతితో త్రాగేవాడు. వృద్ధ దంపతుల మనోగత కాంక్ష తెలుసుకున్న ఆళ్వార్ ఒకరోజు తాను తాగిన పాలలో కొంచెం మిగిల్చి వాళ్లకిచ్చాడు. వాళ్లు దాన్ని మహాప్రసాదంగా భావించి అత్యంత ప్రీతితో స్వీకరించారు. వాళ్ల వార్ధక్యం పోయింది. యౌవనం వచ్చింది. ఆ కర్షకుని భార్య కొన్నాళ్లకు గర్భందాల్చి కణికణ్ణన్ అనే కుమారుణ్ణి ప్రసవించింది.

తిరుమళిశై ఆళ్వార్‌కు ఎనిమిదేండ్లు నిండాయి. ధ్యేయవస్తువైన పరతత్త్వాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస త్వర పెట్టింది. యోగాసక్తి హెచ్చింది. ఇంటి నుండి నిష్క్రమించాడు.

వేద బాహ్యమతాలైన జైన, బౌద్ధ చార్వాకాదుల్ని వేద సమ్మతాలైన శైవాదుల్ని సాంగోపాంగంగా సంశోధించాడు. శైవాలంబనమే కర్తవ్యంగా భావించాడు. ఒక సముచిత ప్రదేశంలో యోగసాధన ప్రారంభించాడు.

పేయాళ్వార్ తిరుమళిశై ఆళ్వార్‌ను గురించి విన్నాడు. శైవుడుగా వున్న అతన్ని వైష్ణవుడుగా మార్చాలనుకున్నాడు. అతడు సాధనచేస్తున్న ప్రదేశానికి వచ్చాడు. అతని కనుచూపు కందే ప్రదేశంలో తలక్రిందుగా ఉండేలా ఒక చెట్టు పాతాడు. చిల్లుల కుండతో నీళ్లతెచ్చి చెట్టుకు పోయసాగాడు. తిరుమళిశై ఆళ్వార్ అతనిని వారించి ఆ పని సరిగాదన్నాడు. పేయాళ్వార్ వెర్రివాడని అపహసించాడు. పేయాళ్వార్ తిరుమళిశై ఆళ్వార్ చేస్తున్న శివారాధన సరియైన పనికాదని వారించాడు. శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని వాదించాడు. ఇద్దరికీ వాదోపవాదాలు చెలరేగాయి. పేయాళ్వార్ వాదంలో నెగ్గాడు. తిరుమళిశై ఆళ్వార్ నిరుత్తరుడయ్యాడు. వైష్ణవుడు కావటానికి అంగీకరించాడు. పేయాళ్వార్ అతనికి తిరుమంత్రోపదేశం చేశాడు.

అది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు ఆకాశంలో వెళ్తూ తిరుమళిశై ఆళ్వార్‌ను చూశారు. అతన్ని సమీపించి అనుగ్రహించి వెళదాం రమ్మంది పార్వతి. శంకరుడంగీకరించాడు. వాళ్లిద్దరూ ఆళ్వార్‌ను సమీపించారు. ఏదైనా వరం కోరుకోమన్నాడు ఈశ్వరుడు. తిరుమళిశై ఆళ్వార్ మోక్షాన్ని అపేక్షించాడు. 'దాన్నివ్వగలవాడు శ్రీమన్నారాయణుడొక్కడే కాని నావల్ల కాద' న్నాడు ఉమాపతి. అయితే మోక్షాన్ని పొందేందుకు కావలసిన సదనుష్ఠాన కర్మ చేసుకోడానికి దీర్ఘాయువును ప్రసాదించమని ఆళ్వార్ కోరాడు. అదికూడా నా చేతకాదు ఆయువు మొదలైనవి కర్మానుగుణంగా ఉంటాయి. మరేదైనా కోరుకో' అన్నాడు. అభవుడు 'బొంత కుట్టుకుంటున్న వాడల్లా ఒక్కసారి తలెత్తిచూసి ఈ సూది వెంట దారం వచ్చేలా కటాక్షించండి' అని ఆళ్వార్ అపహసించాడు. రుద్రుడు క్రుద్ధుడయ్యాడు. ఫాలనేత్రం తెరుచుకుంది. ప్రళ

యాగ్ని వెలువడింది. ఆళ్వార్ కూడా తన కుడికాలి బొటనవ్రేలిలో నేత్రమ్ము తెరిచాడు. ప్రళయాగ్నిని మించిన భీకర జ్వాల వెలువడింది. అందరూ భయపడ్డారు. శివునికి కూడా దుస్సహమైంది. ఈశ్వరుడు ఆ మంట చల్లారేందుకు మేఘాలన్నిటిని పిలిచి కుంభవృష్టి కురిపించమని ఆజ్ఞాపించాడు. ప్రళయవృష్టిని తలపించే వర్షం కురిసింది. విష్ణు పాదాసక్త మనస్కుడైన ఆళ్వార్ ఏమాత్రం చలించ లేదు. ఆశ్చర్యంతో ఆళ్వార్‌ను శ్లాఘించి భక్తిసారుడనే బిరుదాన్ని ప్రదానం చేసి సొంబుడై వెళ్ళిపోయాడు శంభుడు

శక్తిహారుడనే ఖేచరుడొకడు తన శక్తి సామర్థ్యంతో ఒక పులిని వాహనంగా చేసికొని గగనంయానం చేయసాగాడు. తిరుమళిశై ఆళ్వార్ యోగ సమాధి స్థితుడై యున్న ప్రదేశానికి రాగానే ఆయన తేజస్సు చూసి పులి ముందుకు సాగలేదు. యోగి ప్రభావానికి ఆశ్చర్యపడి క్రిందికి దిగివచ్చి తన ప్రభావాన్ని కూడ చూపదలచాడు శక్తిహారుడు. ఆళ్వార్ ధరించిన గంతయున్న బొంతకు బదులుగా తానిచ్చే విలువగల ఉడుపు ధరించమన్నాడు. ఆళ్వార్ సంకల్పమాత్రంగానే ఒక మణిమయ కవచాన్ని సృజించి చూపాడు. తులసి పేరుకు బదులుగా తానిచ్చే అమూల్యహారాన్ని ధరించమని శక్తిహారుడు కోరగా ఆళ్వార్ నిరాకరించి కళ్లకు మిరుమిట్లు గొలిపే రత్నహారాన్ని సృష్టించాడు. ఖేచరుడు విస్మితుడై సిగ్గుపడి ఆళ్వార్‌ను క్షమాపణ కోరుకొని వెళ్ళిపోయాడు.

కొంకణ సిద్ధుడనే రసవాది ఒకడు వచ్చి తనదగ్గరున్న రసగుళిక నొకదానిని ఆళ్వార్‌కు చూపి 'దీనిని పరిగ్రహించి బంగారం పొందండి' అన్నాడు. ఆళ్వార్ తన మేనిమీది దుమ్ముతీసి ఒక చిన్న గుళికగా చేసి 'ఇదికూడా నీ రసగుళిక కన్న ఎక్కువగా ప్రభావం కలిగింది. కావలిస్తే పరీక్షించుకో' మన్నాడు. రసవాది దానిని పరీక్షించి ఆళ్వార్ మాట నిజమని తెలుసుకొని సాష్టాంగ ప్రణామం చేసి వెళ్లి పోయాడు.

తరువాత తిరుమళిశై ఆళ్వార్ ఒక గుహలో ప్రవేశించి తపశ్చర్య ఉపక్రమించారు.[17] తొలి ఆళ్వారులు ముగ్గురు ఆయన తేజస్సువల్ల ఆకర్షింపబడి గుహలోకి వెళ్లి కలుసుకొన్నారు. నలుగురు కొంతకాలం అక్కడే యోగ సమాధిలో ఉండి తరువాత మైలాపూరు చేరుకొన్నారు. కొన్నాళ్లుండి తొలి ఆళ్వార్లు ముగ్గురు దేశ సంచారం వెళ్లిపోయారు.

తిరుమళిశై ఆళ్వార్ తిరుమళిశైకి వచ్చారు. అక్కడ తిరుమణి లభించక పోవడంతో ఖిన్నుడై ధ్యాన సమాధిస్థితుడై ఉండగా శ్రీవేంకటేశ్వరుడు స్వప్నంలో కనిపించి తిరుమణ ఉండే చోటు సూచించారు. ఆళ్వార్ దాన్ని తీసుకొని ద్వాదశ పుండ్రాలు ధరించి అక్కడ కొన్నాళ్లుండి కాంచీనగరం చేరుకున్నారు. ఆళ్వార్ అనుగ్రహం వల్ల పుట్టిన కణికణ్ణన్ ఆయన్ను సేవించి తరించేందుకు వచ్చారు.

తిరుమళిశై ఆళ్వార్ కాంచీపురంలో తిరువెగ్గాలో ధ్యానవిమగ్నుడై ఉండగా ఒక వృద్ధాంగన ఆ ప్రదేశాన్ని శుభ్రంగా ఊడ్చి గోమయంతో అలికి రంగ వల్లులు తీరుస్తూ రోజూ భక్తి సారుణ్ణి సేవించింది. ఒకరోజు యోగికళ్లు తెరిచారు. ఆమె సేవను గురించి తెలిసికొన్నారు. ఏం వరం కావాలో కోరుకోమన్నారు. వృద్ధాంగన యౌవన సౌందర్యాన్ని కోరింది. అనుగ్రహింప బడింది.

యువతి, సౌందర్యవతి అయిన ఆమెను ఆ పూరి రాజు పల్లవరాయడు వరించాడు. దంపతులయ్యారు. ఆమె యౌవనం పెరుగుతూరాగా ఆయన యౌవనం తరిగి పోసాగింది. రాజు కారణమడిగాడు. ఆమె తన సౌందర్యానికి తిరుమళిశై ఆళ్వార్ అనుగ్రహమే కారణమని చెప్పింది. తనుకూడా అలాంటి యౌవనాన్ని పొందాలని భార్యసలహా ప్రకారం రాజు కణికణ్ణన్‌ను రప్పించాడు. వాళ్ల గురువు గారిని తీసుక రమ్మన్నాడు. ఆయనెక్కడికీ రాడని కణికణ్ణన్ ప్రత్యుత్తరమిచ్చారు. మంత్రులు ఇచ్చిన సలహామీద తన్నుగురించి

పాడమని కవికణ్ణన్‌ను నిర్బంధించాడు. నరులను గురించి పాడనని కాంచీపుర ప్రశస్తి కొనియాడుతూ ఒక పద్యం చెప్పాడు కవికణ్ణన్. రాజు మండి పడ్డాడు. కవికణ్ణన్‌ను తన నగరం నుంచి వెళ్లి పొమ్మన్నాడు. కవికణ్ణన్ అంగీకరించాడు.

కవికణ్ణన్ తిరుమళిశై ఆళ్వార్‌ను సమీపించి, జరిగింది విన్నవించి, వెళ్లేందుకు అనుమతి కోరాడు. 'నీవు లేనిచోట నేనెలా ఉంటాను? స్వామిని కూడా పిలుచుకొని వస్తానన్నాడు' ఆళ్వార్

క్షేత్రాధీశ్వరుడైన విష్ణువును సమీపించాడు ఆళ్వార్. కవికణ్ణన్, తానూ వెళుతుండటం వల్ల స్వామిని వెంబడించమనే భావంతో ఒక పద్యం చెప్పాడు.

'కనికణ్ణన్ పోగిం్రాన్ కాముకపూంగచ్చి
మణివణ్ణానీకిడక్క వేండామ్
చెన్నాపుడయ పులవన్ పోగిం్రేన్ నీయుముందన్
పైయిన్నాగ పాయ్ సురిట్టిక్కాళ్'[18]

స్వామి అర్చకముఖంగా ఆదేశించాడు తమ్మకూడా ఆళ్వార్ వెంట తీసుకెళ్లమని ఆలయ పరిచారకులనాదేశించాడు. కనికణ్ణన్, తిరుమళిశై ఆళ్వార్, స్వామి ఒకరి వెనుక ఒకరు బయలుదేరారు. క్షేత్రంలో ఉన్న దేవతలు, ప్రజలు వాళ్ల వెన్నంటి వెళ్ళారు. కాంచీనగర సమీపంలో ఉన్న ఓరిరవిరుక్కై అనే ప్రదేశాన్ని చేరుకొని రాత్రి విశ్రమించారు.

నగరం కళాకాంతులు కోల్పోయింది. పల్లవరాయడు మంత్రుల వల్ల జరిగిందాన్ని తెలుసుకున్నాడు. పశ్చాత్తాప హృదయుడై, సపరివారంగా ఓరిర మిరుక్కై చేరుకున్నాడు. కనికణ్ణన్‌ను, తిరుమళిశై ఆళ్వార్‌ను క్షమాపణ వేడు కొన్నాడు. నగరానికి తిరిగి రమ్మని ప్రార్థించాడు. గురుశిష్యులందుకు అంగీక రించారు. కనికణ్ణన్ తాను వెళ్లడం విరమించినందువల్ల యథాపూర్వంగా పండుకోమని స్వామిని ఆళ్వార్ కోరాడు. అందరూ పూర్వస్థానాలకు వచ్చారు. ఆళ్వార్ అక్కడ కొంత కాలం గడిపాడు. తిరుకుడంతై (కుంభకోణం) వెళ్ల డానికి బయలుదేరి దారిలో పెరుంబులియూర్ చేరుకున్నాడు.

పెరుంబులియూర్‌లో ఒక ఇంటి అరుగుమీద వేదాధ్యయనం సాగుతున్నప్పుడు తిరుమళిశై ఆళ్వార్ ఆ దారిన వచ్చారు. అతడు వేదపాఠం వినే అర్హత లేని శూద్రుడుగా భావించి విప్రులు అధ్యయనాన్ని ఆపుచేశారు. మరో దారిని వెళ్లమని సంజ్ఞ చేశారు. ఆళ్వార్ అలాగే చేశాడు. విప్రులు అధ్యయనం నిలిపిన చోట వేదం విస్మృతమయ్యింది. ఎంత ప్రయత్నించినా స్మృతి గోచరం కాలేదు. ఇది ఆళ్వార్ మహిమగా గుర్తించి బ్రాహ్మణులు ఆళ్వార్‌ను వెతికి కలుసుకొని క్షమాపణ వేడుకున్నారు. ఆళ్వార్ నల్లని వడ్లగింజను చేతిలోకి తీసికొని పొట్టువొలిచి చూపారు. ఆ సంజ్ఞతో విస్మృతమైన 'కృష్ణానాం వ్రీహీనాం నఖనిర్భిన్నమ్'[19] అనే వేదవాక్యం స్మృతి గోచరమైంది. విప్రులు నమస్కరించి వెళ్లిపోయారు.

తిరుమళిశై ఆళ్వార్ పెరుంబులియూర్ వీథులలో తిరుగుతూ భిక్ష గ్రహించడం మొదలు పెట్టారు. పెరుంబులియూర్ క్షేత్రాధీశ్వరుడు ఆళ్వార్ వెళ్లుతున్న దిక్కుగా ముఖం త్రిప్పి ఆలయం నుంచి తన భక్తుణ్ణి చూడసాగాడు. అక్కడి వాళ్లందరూ ఆశ్చర్యపడ్డారు. ఆలయార్చకులు ఈ వృత్తాంతాన్ని యాగశాలలో వున్న పెరుంబులియూర్ అడిగళ్‌కు నివేదించారు.

పెరుంబులియూర్ అడిగళ్ స్వయంగా వచ్చి ఆళ్వార్‌ను తన యాగశాలకు తీసుకవెళాడు. హవిర్భాగాన్ని అందుకోమని అర్థించాడు. ఆళ్వార్ అంగీకరించాడు. అడిగళ్ ఆళ్వార్‌కు అగ్రాసనాన్ని సమర్పించి అగ్రపూజకు సిద్ధమయ్యాడు. కానీ దీనిని ఋత్విక్కులధిక్షేపించారు. శూద్రుడు అగ్రపూజకు హవిర్భాగానికి అర్హుడు కాడని విమర్శించారు. ఆళ్వార్‌ను అడిగళ్‌ను అనేక విధాలుగా నిందించారు. అడిగళ్ వీళ్ల నోరు మూతపడేట్టు తమ ప్రభావాన్ని ప్రదర్శించమని ఆళ్వార్‌ను ప్రార్థించాడు. ఆళ్వార్ విష్ణువును ప్రార్థించాడు. ఆయన పంచాయుధ దివ్య మంగళ విగ్రహంతో ఆళ్వార్ శరీరంలో సాక్షాత్కరించాడు, అందరూ ఆశ్చర్య పడ్డారు ఆళ్వార్ మహిమను కొనియాడారు. యాగ ఋత్విక్కులు ఆళ్వార్ కాళ్లమీద పడి క్షమాపణ కోరుకున్నారు. అందరూ కోరగా ఆళ్వార్ తన పూర్వ రూపాన్ని పొందాడు. పెరుంబులియూర్‌తో అందరి ఆదరాభిమా

నాలవ పాత్రుడైన తిరుమళిశై ఆళ్వార్ అక్కడ నుంచి తిరుకుడందై (కుంభ కోణం) చేర్తుకున్నాడు.

తిరుకుడందైలో శేషశాయిని సేవించి మాట్లాడమని కోరాడు. 'కుడందయు టిక్కిడంద వారెళుందిరుందుపేసు'[20] స్వామి మాట్లాడాడు. ఆయన సౌంభ్య గుణానికి ముగ్ధుడై స్వామికి దృష్టి దోషం కలగ కూడదని 'వాళికేశనే' అని ఆళ్వార్ మంగాళా శాసనం చేశాడు. ఆయనను ధ్యానిస్తూ కొంతకాలం గడిపి 'తిరుచ్ఛందవిరుత్తమ్' 'నాన్ముగన్ తిరువన్దాది' అనే ప్రబంధాలను రచించి తిరుమళిశై ఆళ్వార్ పరమపదించాడు. తొలి ఆళ్వారుల తర్వాత వైష్ణవానికి అంతటి విశిష్టమైన సేవ చేసిన వాడుగా తిరుమళిశై ఆళ్వార్ వైష్ణవుల మనస్సుల్లో నిల్చిపోయాడు.

### 1.1.5 తొండరడిప్పొడి ఆళ్వార్ :

'కోదండే జ్యేష్ఠ నక్షత్రే మండంగుడి పురోద్భవమ్
చోళవ్యాం వనమాలాంశం భక్తపద్రేణు మాశ్రయే'[21]

సదసద్వివేకంతో ఇంద్రియాలను నిగ్రహించిన ఈ ఆళ్వార్ భోగిగా, యోగిగా ఆళ్వార్లలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందాడు. శృంగార రస పరిపుష్టమైన ఈయన ఉదంతం తమిళంలోనేగాక తెలుగులో కూడా ఎందరో కవుల నాకర్షించింది. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లోనూ చోటు చేసుకుంది.

తొండరడిప్పొడి యాళ్వార్ తొలిపేరు విప్రనారాయణుడు. తల్లిదండ్రులు నారాయణుడని పేరుపెట్టగా బ్రాహ్మణుడు (విప్రుడు) కావటం వల్ల విప్రనారా యణుడయ్యాడో ఊహించవలసి వుంది.

తంజావూరుజిల్లా మండంగుడి బ్రాహ్మణాగ్రహారంలో ఒక వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో విప్రనారాయణుడు జన్మించాడు. క్రీ.శ. 727 జనవరి

1-15 దేడీ౨ మధ్యకాలంలో ప్రభవ మార్గశిర (తమిళమాసం మార్గళి) కృష్ణ చతుర్దశిజ్యేష్ఠా నక్షత్రం మంగళవారం నాడు మహావిష్ణు వనమాలాంశంలో విప్రనారాయణుడు ప్రభ వించినట్టు ప్రాజ్ఞులు చెబుతారు. ఇతడు వేదశాస్త్ర పురాణాదుల్ని చక్కగా అధ్యయనం చేశాడు.

ప్రాపంచిక విషయ విరక్తి, విష్ణు పదసేవాసక్తి విప్రనారాయణునిలో పెంపొందాయి. శ్రీరంగం చేరు కున్నాడు. రంగని సేవించాడు, అందమైన నందవనం నిర్మించి రోజూ పుష్పమాలాకైంకర్యం చేయాలను కున్నాడు. సంకల్పం కార్యరూపం దాల్చింది. ఉపవనంలో పనిచేసుకుంటూ రోజుకో మాల కూర్చి రంగనికి సమర్పిస్తూ భిక్షతో ఆకలిని నింపుకుంటూ కాలం గడప సాగాడు.

కరంబనూరులో వేశ్యకులానికి చెందిన దేవి, దేవదేవి అనే సోదరీ మణులుండేవాళ్లు. ఒకనాడు వాళిద్దరు ఉఱయూరు (చోళదేశపు రాజధాని) వెళ్లి చోళరాజును దర్శించి కానుకలు పొంది గృహోన్ముఖులయ్యారు, దారిలో విప్రనారాయణుని నందవనం కన్పించింది. వాళ్లు వెళ్లి ఒక చెట్టు నీడన విశ్రమించారు. చెట్లకు నీళ్లుపోస్తూ విప్రనారాయణుడు వాళ్లకు కన్పించాడు.

తమ వైపు కన్నెత్తి చూడకుండా తన పనిలో తాను నిమగ్నుడై ఉన్న ఆయన వైఖరి దేవదేవికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన కఠోర బ్రహ్మ చారియని రంగవద్దై కామరక్తుడని అక్క వల్ల తెలుసుకొంది. తన అసమాన సౌందర్య విలాసాలతో ఎవరినైనా పాదాక్రాంతం చేసుకోగలనంది. ఈ వైష్ణవ యోగి తనకొక లెక్కకాదంది దేవి అధిక్షేపించింది, దేవదేవి విప్రనారాయణుణ్ణి తన వశవర్తిగా చేసుకోగలిగితే ఆరునెలలు ఆమెకు దాసిగా ఉంటానని దేవదేవి ప్రతిశపథం చేసింది. దేవదేవి ఆడంబర వస్త్రాభరణాలు విసర్జించింది. వాటిని దేవికిచ్చి ఆమెను, చెలికత్తెలను పంపివేసింది.

దేవదేవి నిరాడంబర వేషంతో విప్రనారాయణుణ్ణి సమీపించి తన్నొక వేశ్యకులాంగనగా పరిచయం చేసుకొంది. తన తల్లి ధనాపేక్షకు రోసి పాప పరిహారార్థం ఇలా వచ్చానని విన్నవించింది. విప్రనారాయణునికి పరిచర్య చేస్తూ అతని విష్ణుకైంకర్యంలో తోడ్పడుతూ, పవిత్ర జీవితాన్ని గడిపేందుకు నిశ్చయించుకున్నట్టు చెప్పింది. తన్ను పరిచారికగా స్వీకరించమని ప్రాధేయపడింది. విప్రనారాయణుడామె కోరిక నంగీకరించాడు

ఆరు నెలలు గడిచాయి. యోగిలో మార్పులేదు. దేవదేవిలో విసుగు తలెత్తింది. అయినా ఉత్సాహాన్ని పుంజుకుని మొక్కలకు పాదులు కట్టడం, నీళ్లు పోయడం, కలుపు తీయడం, పూలమాలలు కట్టివ్వడం లాంటి పనులు చేస్తూ దేవదేవి విప్రనారాయణునికి మరింత చేరువ కావడానికి ప్రయత్నించింది.

ఒక రోజు వర్షం వచ్చింది. దేవదేవి బాగా తడిసి ముద్దయింది. విప్ర నారాయణుని కుటీరపుమొగసాలలో తలదాచుకోవడానికి వచ్చింది. నారాయణు డామె అవస్థకు జాలిపడ్డాడు, లోపలికి రమ్మన్నాడు. తన అంగవస్త్రాన్ని ఆమె కిచ్చి బట్టలు పిండి ఆరబెట్టుకోమన్నాడు. దేవదేవి సంతోషించింది, సవినయంగా అతన్ని సమీపించింది, అతని అనుమతితో పాదాలొత్తడం మొదలు పెట్టింది. ఆమె స్పర్శ శరీరానికి తగలడంతో రాగస్పర్శ మనసుకు కలిగింది. నారాయణుడు చలించాడు. నాలుగు కండ్లు కలిశాయి. రెండు మనసులు మాట్లాడుకున్నాయి. యోగాసక్తి రాగాసక్తిగా మారింది. నానాటికి అనుష్ఠానాలన్నీ అడుగంటాయి. దేవునికి బదులుగా దేవ దేవే అతని మనసంతా ఆక్రమించిది. కొన్ని రోజులా ఉపవనంలోనే విప్రనారాయణునితో గడిపి దేవదేవి అతన్ని వెంటబెట్టుకొని కరంబనూరు చేరుకుంది.

కొన్నాళ్లకు విప్రనారాయణుడు నిర్ధనుడు కావటం వల్లను, అతని ఉనికి విటులరాకకు ప్రతిబంధకం కావటంవల్లను దేవదేవి తల్లి అతనిని ఇల్లు వెడల గొట్టింది.

రాత్రి వచ్చింది. విప్రనారాయణుడు చింతాక్రాంతుడై ఒక ఇంటి అరుగు మీద పడుకున్నాడు. అతని చింతాగ్ని శ్రీమన్నారాయణుని హృన్నవనీతాన్ని కరగించింది. భక్తుణ్ణి ఉద్ధరించాలనుకున్నాడు భగవంతుడు. ఆలయానికి చెందిన ఒక స్వర్ణపాత్రను తీసుకొని రంగశాయి బయలుదేరాడు. దేవదేవి ఇంటికి వెళ్లి తనపేరు అళగియ మణవాళదాసన్ అని, తాను విప్రనారాయణుని శిష్యుడని పరిచయం చేసుకున్నాడు. తాను తెచ్చిన పైడిగిన్నెను దేవదేవి తల్లికిచ్చి విప్రనారాయణుడు పంపినట్లు చెప్పాడు. వృద్ధవేశ్య సంతోషించింది. విప్రనారాయణుని రమ్మని ఆగంతుకుని ద్వారానే కబురు పంపింది. విప్రనారాయణుడు వచ్చాడు. దేవదేవీ విప్రనారాయణుల పునస్సంయోగం జరిగింది. మరునాడు తెల్లవారింది ఆలయంలో బంగారు గిన్నె కనిపించలేదన్న వార్త ధర్మకర్త చెవికి వచ్చింది. అతను ఆలయ పరిచారకులనడిగాడు. అయినా లాభం లేకపోయింది. అందరినీ ఒకచోట చేర్చి నిర్బంధించడం మొదలు పెట్టాడు. ఇంతలో దేవదేవి పరిచారిక అక్కడికి వచ్చింది. నిర్బంధితులలో తన ప్రియుడు కూడా ఉండటంవల్ల అతన్ని సమీపించింది. సంగతి తెలుసుకొని తమ యజమానురాలు దేవదేవికి అంతకు ముందు రాత్రే విప్రనారాయణుడు ఆ బంగారు గిన్నె ఇచ్చాడని, అది శయనాగారంలో తలగడక్రింద ఉందని చెప్పింది. భటులు వెళ్లారు. బంగారుగిన్నెతో సహా దేవదేవిని, విప్రనారాయణుణ్ణి వెంటబెట్టుక వచ్చారు.

విచారణ మొదలైంది. విప్రనారాయణుడే తనకాగిన్నెను శిష్యుని ద్వారా పంపాడని దేవదేవి ఆరోపించింది. తనకాలాంటి శిష్యుడెవడూ లేడనీ బంగారు గిన్నెను గురించి తనకేమీ తెలియదని, తను నిర్దోషినని, విప్రనారాయణుడు చెప్పాడు. అవి ఎలాంటివైనా విటులిచ్చే వస్తువులు తీసుకోవడం వేశ్యలకు పరిపాటి కాబట్టి దేవదేవి నిర్దోషిగా నిర్ధారణ చేయబడి విడిచి పెట్టబడింది. విప్రనారాయణుడు దోషిగా నిర్ణయింపబడి శిక్షాస్మృతిని పరిశీలించి మరునాడు శిక్ష విధించేందుకు బంధింపబడ్డాడు.

ఆరోజు రాత్రి ధర్మకర్తకు శ్రీరంగనాథుడు కలలో కనిపించారు విప్రనారాయణుడు నిర్దోషని చెప్పారు. అతన్ని కర్మబంధవిముక్తుణ్ణి చేసేందుకు తనే ఇలా నిందితుణ్ణి చేశానన్నాడు. విప్రనారాయణునికి బంగారు గిన్నె గురించి నిజంగా తెలియదని, తానే స్వయంగా తీసుకవెళ్లి దేవదేవి తల్లికిచ్చానని, దేవదేవి చెప్పిన విప్రనారాయణుని శిష్యుడు తానేనని స్పష్టం చేశాడు. యోగిని బంధ విముక్తుణ్ణి చేయమన్నాడు. యథాపూర్వంగా నందనకైంకర్యంలో నియోగించ మన్నాడు.

ధర్మకర్తకు మెలకువ వచ్చింది. స్వప్నవృత్తాంతం అతనికాశ్చర్యం కలిగించింది. మర్నాడు యోగి బంధాలు సడలించారు. స్వప్నవృత్తాంతాన్ని నివేదించారు. సాష్టాంగంగా నమస్కరించారు. క్షమాపణ కోరుకున్నారు, విప్రనారాయణుడు నమ్మలేకపోయాడు. రంగని అవ్యాజ కృపకు ఆశ్చర్యపడ్డాడు, భగవంతుని కారుణ్యం భక్తుని మనసును ద్రవింప జేసింది. రంగపరాఙ్ముఖుడై రంగసాని సన్నిహితుడైనందుకు పశ్చాత్తప్తుడయ్యాడు. పాపప్రక్షాళనార్థం భక్తుల పాదధూళి తలదాల్చి వాళ్ల పాదోదకాన్ని తీర్థప్రాయంగా సేవించాడు. తొండరడిప్పొడిఆళ్వార్‌గా భక్తాంఘ్రిరేణువుగా ప్రసిద్ధి కెక్కాడు.

ఈ ఆళ్వార్ రంగ పదైకధ్యానసక్తుడు. నలభై అయిదు పాశురాలతో 'తిరుమాలై' అనే ప్రబంధం చెప్పారు. ఈయన మరో ప్రబంధం పదిపాశురాలతో ఉన్న 'తిరుప్పళ్లి ఎళుచ్చి' ఇది రంగని మేలుకొలుపు. ప్రాబోధకీర్తనమని కూడా పండితులు దీన్ని వ్యవహరిస్తారు

శ్రీరంగనాథస్వామి తమ యింటికి వచ్చిన సౌలభ్యగుణానికి ముగ్ధురాలై దేవదేవి కూడా వృత్తికి స్వస్తి చెప్పి తన యావదాస్తిని రంగనికే సమర్పించింది. శ్రీరంగాలయాన్ని గోమయంతో అలికి శుభ్రం చేయడం, రంగవల్లులతో అలంకరించడం వంటి కైంకర్యాలు చేస్తూ నిరాడంబరంగా శేష జీవితం గడిపింది

'తొండరడిప్పొడి ఆళ్వార్' క్రీ. శ. 767లో జన్మించి 105 సంవత్సరాలు జీవించి, 872వ సంవత్సరం వైకుంఠగతుడయ్యాడని విజ్ఞుల విశ్వాసం [22] ఇతడు వైష్ణవులంకేగాక అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు.

**1. 1. 6. కులశేఖరాళ్వార్ :**

'కుంభేపునర్వసౌ జాతం కేరళే కోల్లపట్టణే,
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే'.[23]

'కులశేఖర యోగి, కొల్లికావలన్, చేరలర్కోన్ అనేవి కులశేఖర ఆళ్వార్ నామాంతరాలు. ఈ ఆళ్వార్ 'కొంగు చేర' పరంపరకు చెందినవాడని పండితుల అభిప్రాయం'. [24]

కేరళ రాష్ట్రంలో పూర్వపు చేరదేశపు రాజధానిగా వైభవాన్ని సంతరించు కొన్న 'వంజిక్కళం' ఉంది దీనిని కుక్కుట నగరమని, కొల్లినగరమని కూడా వ్యవహరించినట్లు తెలుస్తూ వుంది. ఇది ఇప్పటి తిరువాన్కూరని కొందరి అభిప్రాయం [25]. ఈ నగరంలో దృఢవ్రతుడనే చేరరాజు కుమారుడుగా కులశేఖరాళ్వార్ జన్మించాడు.

క్రీ. శ. 767 ఫిబ్రవరి 15, మార్చి 15 ల మధ్యకాలంలో పరాభవ సంవత్సరం, మాఘ మాసం (తమిళంలో మాశివెల) శుద్ధ ద్వాదశి పునర్వసు నక్షత్రం గురువారం నాడు ఈ ఆళ్వార్ అవతరించినట్లు ఆర్యుల అభిప్రాయం. 'ఈ ఆళ్వార్ జననం శుక్రవారంనాడు జరిగిందని కూడా కొన్ని గ్రంథాలు చెబుతాయి' [26]. 'తేది విషయంలోనూ పెరియతిరుమొదిఅడైవు కొంత విభేదిస్తుంది' .

కులశేఖరాళ్వార్ ఇతర విద్యలతోపాటు వీరోచిత విద్యలెన్నో నేర్చాడు. యువరాజయ్యాడు, రాజకీయ పరిజ్ఞానాన్ని పొందాడు. రాజయ్యాడు.

'ప్రాచీన తమిళనాడులోని చోళ పాండ్య దేశాలను జయించి కులశేఖరుడు పాండ్యరాజు పుత్రికను పరిణయమాడినట్లు 'ఆళ్వారుగళ్ వరలారు' చెబుతుంది'[28] ఎదురులేని పరాక్రమ వంతుడుగా ఎప్పుడూ యుద్ధాలతోనే సతమతమయ్యే

కులశేఖరుణ్ణి సముద్ధరించాలనే సంకల్పం మహావిష్ణువుకు కలిగింది. ప్రత్యక్షమై ప్రసన్న దృక్కులు ప్రసరించారు. ఆయన అవ్యాజమైనకృప ఆళ్వార్ జీవితంలో అమాంతంగా మార్పుతెచ్చింది. వైష్ణవు దయ్యాడు. యుద్ధాలమీది ప్రీతిని భగవత్ భాగవతుల మీదికి మళ్లించాడు. విష్ణుదశావతారాల్లో రామ, కృష్ణావతారాలు అయన్నెక్కువగా ఆకట్టుకున్నాయి. విష్ణు ఉపాసన నిరంతర వైష్ణవగోష్ఠి, రామాయణ, భాగవతాది సద్గ్రంథ శ్రవణం నిత్య కృత్యాలయ్యాయి.

ఒకరోజు కులశేఖరుడు రామాయణం వింటుండగా అరణ్యకాండలో ఖరదూషణ వధ ఘట్టం వచ్చింది. ఆ సందర్భములో

'చతుర్దశ సహస్రాణి
రక్షసాం భీమ కర్మణాం
నిరశ్చరామో ధర్మాత్మా
కథం యుద్ధం భవిష్యతి'. [29]

అనే శ్లోకాన్ని పౌరాణికుడు పఠించి పద్నాలుగు వేల మంది రాక్షస వీరులతో వచ్చిన ఖరుణ్ణి రాముడు ఒంటరిగానే ఎదుర్కొన్నాడు అన్నాడు. రామాయణ కథాశ్రవణ పారవశ్యంతో విశ్వాన్నే విస్మరించిన రాజు గాబరా పడ్డాడు. రామునికి తోడ్పడాలనుకున్నాడు. సైన్యాన్ని సమీకరించి యుద్ధానికి సిద్ధం కమ్మని సేనా పతులకు ఉత్తరువు జారీ చేశాడు. ఆ హఠాత్ సంఘటనకు అందరూ ఆశ్చర్య పడ్డారు. అయినా ఎందుకని రాజును ప్రశ్నించలేక పోయారు.

సైన్యం సంగ్రామానికి సంసిద్ధమయింది. రామాయణ శ్రవణ పారవశ్యం వల్ల రాజు గారికి కలిగిన ఉన్మాదావస్థను మంత్రులు గుర్తించగలిగారు. పౌరాణికుణ్ణి సమీపించి తక్షణ కర్తవ్యాన్ని సూచించారు. అతను హుటాహుటి సమరోత్సాహంలోఉన్న రాజుగారిని సమీపించి ఆయన చెవిలో పదేలా

'తందృష్ట్వాశత్రుహంతారం
మహర్షీణాం సుఖావహం

ఋభూవహృష్టా వైదేహీ
భర్తారం పరిషస్వజే' 30

అని ఒక శ్లోకాన్ని బిగ్గరగా చదివి సపరివారంగా ఖరుణ్ణి సంహరించి వచ్చిన రాముణ్ణి సంతోషముతో వైదేహి కౌగలించుకొంది. రాముడు ఒంటరిగానే పద్నాలుగు వేలమంది రాక్షసుల్ని మట్టుబెట్టగలిగిన మహా బలశాలి మహావీరుడు అని కొనియాడారు. అది విన్న రాజు తన యుద్ధ ప్రయత్నాన్ని విరమించాడు.

వైష్ణవ సహవాసం వల్లనే రాజు కిలాంటి మనో వైపరీత్యం సంభవించింది అని ఇది ఇలాగే కొనసాగితే హానికరం కాగలదని మంత్రులు భావించారు. రాజుకు వైష్ణవులకు మధ్య విభేదాలు కలిగించాలనుకున్నారు. ఒకరోజు కులశేఖరుడర్చించే అర్చావిగ్రహం తాలూకు రత్నహారాన్ని ఆభరణ పేటికలోనుంచి అపహరించి దాచారు. ఆ నేరాన్ని వైష్ణవుల మీదికి నెట్టి వేశారు. రాజు ఒక సర్పసంస్థిత ఘటాన్ని తెప్పించి అందులో చేయి ఉంచినప్పుడు సర్పం కరిస్తే వైష్ణవులు దోషులని కరవకుంటే నిర్దోషులని' శపథం చేసి చేయి ఉంచాడు. పాము కరవలేదు. వైష్ణవుల నిర్దోషిత్వం నిరూపణమయ్యింది అందరూ ఆశ్చర్యచకితులయ్యారు,

ఈ సంఘటనతో కులశేఖరుడికి ఆత్మీయులంటే అసహ్యం కలిగింది. విశ్వంమీద విరక్తి పుట్టింది. ప్రాపంచిక బంధాలన్నిటిని తెంచుకొని శ్రీరంగం చేరుకున్నాడు. రంగనాథుణ్ణి సేవించాడు ఆలయ భాగాలు కొన్నిటిని నిర్మించాడు. శ్రీరంగనాథుని కోరిక మీద 'ఇళై' అనే తన కుమార్తెను ఆయనకిచ్చి వివాహం చేసినట్టు కూడా ఒక ఐతిహ్యం ఉంది. శ్రీరంగంలో కొంతకాలం గడిపి వివిధ క్షేత్రాలు పర్యటించి తిరుక్కురుగూరు సమీపంలోవున్న దివ్యదేశమనే పవిత్ర ప్రదేశంలో కులశేఖరాళ్వార్ పరమపదించారు.

ఈ ఆళ్వార్ 67 సంవత్సరాలు జీవించినట్టు ఆళ్వార్గళ్ చరిత్రం చెబుతుంది[31]. తక్కిన ఆళ్వార్లందరు తమిళంలోనే ప్రబంధాలు ప్రవచించగా

ఈయన పెరుమాళ్ తిరుమొళి అనే తమిళ ప్రబంధంతోబాటు సంస్కృతంలో కూడ 'ముకుందమాల' అనే ప్రబంధాన్ని రచించి ఆళ్వార్లలో విశిష్ట స్థానాన్ని పొందారు.

1. 1. 7 తిరుప్పాణాళ్వార్ :

'కార్తికే రోహిణీ జాతం
శ్రీపాణిం నిచుళా పురే
శ్రీవత్సాంశంగాయకేంద్రం
మునివాహన మాశ్రయే.[32]

ఈ ఆళ్వార్ నందనారును తలపించే మహాభక్తుడు. పవిత్రుడు, విష్ణుకులానికి చెందినవాడైనా మహోన్నత స్థితికి చేరుకొన్న మహామహుడు. అస్పృశ్యుడుగా పరిగణింపబడినా అనుపమ వర్తనతో శ్రీరంగనాథుని హృదయాన్నే స్పృశించ గలిగిన మహానుభావుడు. ఈయనను తిరుప్పాణాళ్వార్ అనే గాక మునివాహనుడు, కవియోగి అని కూడా అంటారు.

శ్రీరంగం సమీపంలో ఉన్న ఉరయూరులో తిరుప్పాణాళ్వార్ జన్మించాడు. క్రీ.శ. 781 నవంబరు 15, డిశంబరు 15 తేదీల మధ్యకాలంలో దుర్మతినామ సంవత్సరం, కార్తికమాసం, కృష్ణపక్షమి విదియ తిథి రోహిణీ నక్షత్రం బుధవారం నాడు మహావిష్ణు శ్రీ వత్సాంశంలో ఈ ఆళ్వార్ పుట్టి నట్టు చెబుతారు.

'ఒక బ్రాహ్మణుని పరిపొలంలో కనిపించిన ఈ శిశువును పాణర్ కులానికి చెందిన దంపతులు తీసుకువెళ్ళి ఆవుపాలు పోసి పెంచినట్లు చెబుతారు[33] తల్లిదండ్రులెవరో తెలియక పోవడం వల్ల ఈయన కూడా అయోనిజుడుగానే భావింపబడునట్లు తెలుస్తుంది. పాణర్ కులానికి చెందినవాళ్ళు పెంచడం వల్ల పాణుడుగా తిరుప్పాణర్ గా ప్రసిద్ధికెక్కి ఉండవచ్చు.

భగవత్కటాక్షం వల్ల సత్త్వగుణప్రధానుడై బాల్యం నుంచి కూడా భగవద్ధ్యానం చేస్తూ గడిపేవారు. దక్షిణ కావేరి దక్షిణ తీరంలో తిరు మగత్తురై (శ్రీముఖపట్టం)కి ఎదురుగా రంగనికి అభిముఖంగా నిలబడి వీణ మీటుతుంటూ ఆయన కళ్యాణ గుణాలను గానం చేస్తుండేవారు. భగవదనుభవం పొందినవారు కాబట్టి భక్తిపారవశ్యంతో గానం చేసేటప్పుడు మైమరచి మధుర జగత్తులో విహరించేవారు.

లోకసారంగముని అనే నైష్ఠిక బ్రాహ్మణోత్తముడు రంగ కైంకర్యం చేస్తుండేవాడు. ఒకనాడాయన కావేరిలో స్నానం చేసి అభిషేక జలపూర్ణ ఘటాన్ని తీసుకొని రంగాలయానికి వెళ్తుండగా తిరుప్పాణాళ్వార్ దారిలో కన్పించారు. ముని పైదొలగమన్నాడు. ఆళ్వార్లో చలనం లేదు. ముని ఆయన మీదికి రాయి విసిరాడు, గాయపడిన ఫాలం నుంచి రక్తం వచ్చింది. ఈ దురాత్మంఘటనతో విశ్వాన్నే విస్మరించి బ్రహ్మానందమనుభవిస్తున్న ఆళ్వార్లో చలనం వచ్చింది. భయకంపితుడై అక్కడినుండి వడివడిగా వెళ్ళిపోయాడు.

అభిషేక జలఘటాన్ని స్వామి సన్నిధిలో దించిన లోకసారంగముని ఆశ్చర్యచకితుడయ్యాడు. స్వామి ఫాలభాగం నుండి రక్తం స్రవిస్తూ ఉంది. కారణం తెలియక కలత చెందాడు. రాత్రి స్వప్నంలో రంగడు కనిపించారు. తన భక్తుణ్ని గాయపరచినందువల్ల తనకూడా గాయపడ్డట్లు చెప్పారు. తిరుప్పాణాళ్వార్‌ను తన భుజాల మీద ఎక్కించుకొని తెచ్చి తన సన్నిధిలో దించమన్నారు. లోకసారంగముని తన తప్పు తెలుసుకున్నారు.

మర్నాడు ప్రాతఃకాలాన్నే స్నాన సంధ్యాది విధులు పూర్తిచేసుకొని లోకసారంగముని కావేరీతీరంలో తిరుప్పాణాళ్వార్‌ను సమీపించాడు. ఆళ్వార్ భయంతో అవతలికి జరిగాడు. ముని ఆళ్వార్‌ను నమస్కరించి, స్వప్న

స్వప్నాంతాన్ని నివేదించి, రంగని ఆజ్ఞ విన్నవించారు. తను అంత్యజుణ్ణి కావటం వల్ల రంగక్షేత్రాన్ని పాదంతో స్పృశించ లేనన్నారు. ముని ప్రాధేయ పడగా అతని భుజాలమీద కూర్చొని రంగని సన్నిధి చేరుకున్నాడు.

రంగని సాక్షాత్కారంతో పులకిత గాత్రుడయ్యాడు. పాదాది కేశాంతంగా ఆదివ్య మంగళ విగ్రహాని దివ్య సౌందర్యాన్ని కళ్లతో త్రాగాడు. ఆ భగవద్దర్శనానుభవంతో, అమలనాదిపిరాన్, అని ప్రారంభమయ్యే పదిపాశురాల గల ప్రబంధమొకదాన్ని చెప్పారు. అందరూ ఆశ్చర్యంతో చూస్తుండగా రంగని దివ్య మంగళ విగ్రహంలో ఐక్యమయ్యారు.

ఈ ఆళ్వార్ 50 సంవత్సరాలు జీవించినట్లు సాంప్రదాయక కథనం. కాని సుప్రసిద్ధ పరిశోధక పండితులు ఆచార్య యన్. సుబ్బురెడ్డియార్ మాత్రం 75 సంవత్సరాలు జీవించి నట్లు అభిప్రాయపడ్డారు. "He is stated to have taken his birth in the Year Durmathi wnich corresponds to 781 A.D. and to have lived for seventy five years. [34]

తిరుప్పాణాళ్వార్ వైష్ణవం కారాధ్యుడే గాక విశ్వజనులందరికీ సన్మార్గ దర్శకుడని చెప్పుకోవచ్చు.

1. 1. 8 తిరుమంగై ఆళ్వార్ :

'కార్తికేకృత్తికా జాతం చతుష్కవి శిఖామణిమ్'
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలియ మాశ్రయే' [35]

తిరుమంగై ఆళ్వార్ మహా పండితుడు, మహాకవి. 'నార్కవి పెరుమాళ్' అనే బిరుదం కూడా ఇతనికి ఉండేది. కలియన్, కలికన్రి, నీలన్, పరకాలన్, అరుళ్మారి, అరట్టముకి అని ఈయనకు అనేక నామాలుండేవి.

ప్రాచీన చోళదేశంలో (ప్రస్తుత తంజావూరుజిల్లాలో) తిరువాలి ప్రాంతం తిరుక్కురైయలూర్‌లో కళ్లర్ కులంలో ఆలినాడర్, వల్లిత్తిరు దంపతులకు ఈ ఆళ్వార్ జన్మించినారు. క్రీ.శ. 778 నవంబరు 15, డిసెంబరు 15 తారీఖుల

మధ్య కాలంలో నలసంవత్సరం, కార్తీకమాసం, శుక్లపక్షమి, పూర్ణిమతిథి కృత్తికా నక్షత్రం గురువారంనాడు మహావిష్ణు కార్ముకాంశంలో ఆయన ప్రభవించినట్టు ప్రాజ్ఞులు చెబుతారు.

తల్లిదండ్రులు ఇతనికి నీలన్ అని పేరు పెట్టారు. బాల్యంలోనే బుద్ధి వికాసకర విద్యలతోబాటు, యుద్ధవిద్యలన్నిటినీ క్షుణ్ణంగా అభ్యసించాడు. ఆశు మధుర, చిత్ర విస్తార కవిత్వాలలో సాటిలేని మేటిగా ప్రసిద్ధిపొందాడు.

ఈయన యుద్ధ ప్రావీణ్యతను, వైదుష్యాన్ని విని చోళరాజు అతనిని రప్పించి తన సేనానులలో ఒకడుగా నియమించాడు. నీలన్ తన భుజబలంతోనూ బుద్ధిబలంతోను శత్రుబలాన్ని నిగ్రహించి చోళ సామ్రాజ్యాన్ని, చోళుల కీర్తి విస్తరింప జేశాడు. రాజు అతనిని ప్రధాన సేనాపతిగా నియమించి, పురస్కరించాడు. తిరుమంగై నగర్ రాజధానిగా తిరువాలినాడు అనే సామంత రాజ్యానికి ప్రభువుగా చేశాడు.

తిరువాంగూరులోని ఒక గుంటలో కుముద పుష్పంలో కనిపించిన ఒక ఆడ శిశువును ఆ ఊరిలోని వైష్ణవ వైద్యుడొకడు చూశాడు. తెచ్చి తన భార్య కిచ్చాడు. ఆ దంపతులు ఆ బిడ్డను ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేశారు. కుముద పుష్పంలో దొరికినందువల్ల కుముదవల్లి అనిపేరు పెట్టారు. ఆమెకు యుక్త వయస్సు వచ్చింది. వరాన్వేషణ చింత వాళ్ళకు వచ్చింది.

నీలన్ ఆమె అందచందాలు, గుణగణాలను గురించి విన్నారు. మరులు గొన్నాడు. నాంగూర్ చేరుకున్నాడు. వైష్ణవ వైద్యుణ్ణి సమీపించి తనకా కన్నె నిమ్మని కోరాడు. వైష్ణవ వైద్యుడు నీలన్ ఆమెకు తగిన వరుడని నిశ్చయించి సంతోషించాడు. ఆమె అభిప్రాయాన్ని అడిగాడు. రెండు షరతులమీద ఆమె అంగీకరించింది. నీలన్ పంచసంస్కారాలు చేయించుకొని వైష్ణవుడు కావడం మొదటిది. ప్రతిరోజూ 1,008 మంది వైష్ణవ భాగవతులకు అన్నదానం చేయడం రెండోది. ఆ షరతుల రెంటికి ఆళ్వార్ అంగీకరించాడు.

తిరునరయూర్ వెళ్లి, తిరునరయూర్ నంబి సన్నిధిలో పంచ సంస్కారాలు చేయించుకొని వైష్ణవుడై నాంగూరు తిరిగి వచ్చారు. కుముదవల్లిని వివాహం చేసుకొని తిరుమంగై నగర్ చేరుకున్నాడు.

రోజూ వైష్ణవ భాగవతులు 1,008 మందికి అన్నదానము మొదలు పెట్టాడు. ఖజానా ఖాళీ అయింది. రాజుకు వర్తమానం వెళ్లింది. కప్పం చెల్లించమని రాజు కబురు పంపాడు. ఆళ్వార్ సరియైన సమాధానం చెప్పలేదు. వార్తాహరుడు విసిగించి పీడించాడు. తిరుమంగై ఆళ్వార్‌కు కోపం వచ్చింది, అతన్ని అవమానపరచి పంపివేశాడు

సంగతి విని రాజు క్రుద్ధుడయ్యాడు. పరకాలుణ్ణి సజీవంగా పట్టితెమ్మని చతురంగ సైన్యసమేతంగా సేనాపతిని పంపాడు. సైన్యం నశించి పోయింది. సైన్యాధిపతి కాలికి బుద్ధి చెప్పాడు. రాజుకు జరిగింది నివేదించాడు. అగ్నిలో ఆజ్యంలో పోసినట్టయింది. ఇతోధిక సైన్యాన్ని ఆయుధ సామాగ్రినీ సమకూర్చుకొని రాజే స్వయంగా బయలుదేరాడు. పరకాలుడు జంకలేదు. యుద్ధంభయంకరంగా సాగింది. సేనలు ఛిన్నాభిన్నం కాగా రాజుకు చావు తప్పి కన్నులొట్టబోయినంత పనైంది. పరకాలుని పరాక్రమానికి మెచ్చినట్టు, అతన్ని క్షమించినట్టు రాజు ప్రకటించాడు. కలుసుకోవలసిందిగా కబురు పంపాడు. తనను నమ్మి కలుసుకొన్న నీలన్‌ను ఒక ఆలయంలో నిర్బంధించి కప్పం వసూలు చేయవలసిందిగా మంత్రుల కప్పగించి రాజు రాజధానికి వెళ్లిపోయ్యాడు.

ఇక్కడ నీలన్ త్రిరాత్రోపవాసం చేశాడు. ఒక రాత్రి కాంచీవరదుడు కలలో కనిపించి తన స్వస్థానానికి వస్తే కప్పపు బాకీ ధనాన్ని సమకూరుస్తానన్నాడు. ఆళ్వార్ స్వప్న వృత్తాంతాన్ని మంత్రులకు తెలిపాడు వాళ్లు రాజానుమతితో కొంత సైన్య బలాన్ని తీసుకొని వెంటరాగా ఆళ్వార్ కాంచీనగరం చేరుకున్నాడు. వరదరాజాలయంలో ధనం కనిపించక ఖిన్నుడయ్యాడు. స్వామి స్వప్నంలో కనిపించి వేగవతి నదీతీరంలో ధన నిక్షేపమున్న ప్రదేశాన్ని సూచించాడు. ఆళ్వార్ అనుచరులతో అక్కడికి వెళ్లి ధనాన్ని త్రవ్వితీసి మంత్రుల కిచ్చాడు.

మంత్రుల వల్ల జరిగింది విని చోళరాజు ఆశ్చర్యచకితుడయ్యాడు. తిరుమంగై ఆళ్వార్‌ను రావించి పలుకానుకలిచ్చి, సత్కరించి, సగౌరవంగా సాగనంపారు. ఆళ్వార్ తన నిర్బంధంలో నిరాహారుడై మూడు రోజులున్నందున ప్రాయశ్చిత్తంగా ఆళ్వారిచ్చిన ధనాన్ని దేవద్విజకార్యార్థం వినియోగించాడు.

తిరుమంగై ఆళ్వార్ యథాపూర్వంగా భాగవత సమారాధన కొనసాగించాడు. తన దగ్గరున్న ద్రవ్యం క్షీణించగా, దారి దోపిడీ చేసైనా వ్రతాన్ని యథావిధిగా కొనసాగించాలను కున్నాడు. నీర్ మేల్ నడప్పాన్, నిళల్ మిదిప్పాన్, తాళూదువాన్, తోళావళక్కన్ అనే మంత్రులు నలుగురు అతనికీ కార్యంలో బాగా తోడ్పడ్డారు. తిరుమణంకొల్లై అనే ప్రదేశంలో ఒక రాగిచెట్టు క్రింద దాగుకొని బాటసారులను దోచి ఆ ద్రవ్యంతో ఆళ్వార్ భాగవత సమారాధన కొనసాగించాడు.

ఒకనాడు దారిన వెళ్లే బ్రాహ్మణ వధూవరులు, వాళ్ల పరివారమూ ఆళ్వార్ కంట పడ్డారు. ఆయన వాళ్లనడ్డగించి వాళ్ల దగ్గరున్న అమూల్యవస్త్రాభరణాలను తీసి క్రింద పెట్టమని గద్దించాడు. అందరూ అలాగే చేశారు. వరుని వ్రేలి ఉంగరం మాత్రం మిగిలి పోయింది. ఎవరికీ ఊడిరాని ఆ ఉంగరాన్ని ఆళ్వార్ నోటితో కొరికి బలవంతంగా తీశాడు. వస్త్రాభరణాలన్నిటినీ పోగుచేసి, ఒక పెట్టెలో ఉంచి పైకెత్తడానికి ప్రయత్నించాడు. అది ఏ మాత్రం కదల్లేదు. వరుడేదో మాయ మంత్రం వేసినందువల్ల ఆ పెట్టె కదల్లేదని ఆళ్వార్ భావించాడు. ఆ మంత్రమేదో తనకు చెప్పమని యువకుని ఒత్తిడి చేశాడు. అతడంగీకరించి తిరుమంగై ఆళ్వార్ కుడి చెవిలో తిరుమంత్రోపదేశం (అష్టాక్షరి) చేశాడు. ఆళ్వార్ ఆనందించాడు. ఆ యువకుడు విష్ణువుగా బ్రాహ్మణయువతి లక్ష్మిగా, పరివారమంతా దేవగణంగా సాక్షాత్కరించారు. ఆళ్వార్ తదేకంగా చూస్తూ తన్మయుడయ్యాడు. విష్ణువతన్ని అనుగ్రహించి, అంతర్హితుడయ్యాడు.

తరువాత తిరుమంగై ఆళ్వార్ ఆసేతు శీతాచలమూ పర్యటించి నూట ఎనిమిది దివ్యదేశాలలోనివిగా పరిగణింపబడే ఎనభై ఆరు దివ్యదేశాలను సందర్శించాడు. అక్కడి అర్చామూర్తులను కీర్తించాడు. వాళ్ల వైభవాలను వేరు

వేరుగా గానం చేశాడు. ఈ తీర్థాటనంలో శీర్కాళి శ్రీరామకృష్ణనగరం వెళ్ళినపుడు ఆళ్వార్ శిష్యులు చతుష్కవి శిఖామణి వచ్చారని చాటుతూ ముందుగా వెళ్లారు. సంబంధమూర్తి అనే ఒక స్థానిక పండితుని శిష్యులు ఆ బిరుదాన్ని అధిక్షేపించారు. తమ గురువును గెలిస్తేగాని అలా బిరుదు చాటుకొంటూ వెళ్ళ కూడదని అటకాయించారు. తిరుమంగై ఆళ్వార్ ఆ సంబంధమూర్తిని ఓడించి మెప్పుపొంది వెళ్లారు.

సుప్రసిద్ధ శైవాచార్యుడు తిరుజ్ఞాన సంబంధర్ సమకాలికుడు కాకపోవటం వల్లను. తమిళ సాహిత్య చరిత్రలో సంబంధర్లు అనేకులు కన్పించటం వల్లను శీర్కాళి సంబంధర్ జన్మస్థలం కాబట్టి అక్కడ జన్మించిన వాళ్ళ పలువురికి సంబంధర్ అనే పేరుండటం సహజం కావడం వల్లను. శైవాచార్యుడైన సంబంధర్ను తిరుమంగై ఆళ్వార్ కలుసుకొని ఉండేందుకు వీలులేదు ఎ. సుధాకర్‌గారు కూడా తమ లఘుసిద్ధాంత వ్యాసంలో ఇలాంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు '-ళాం మూట్రాండిన ఞాన సంబ ధరై యివర్ సందిత్తురుక్క ముడియాదు'.

ఈయన నాగపట్నం లోని బంగారు బుద్ధ విగ్రహాన్ని తెప్పించి, కరిగించి తద్వారా వచ్చిన ధనంతో శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో కొన్ని గోపుర ప్రాకార మండపాలు నిర్మించాడు. నాలుగవ ప్రాకార కుడ్యాన్ని నిర్మిస్తుండగా తొండరప్పొడి ఆళ్వార్ నందవనానికి రక్షణ కలిగించి ఆయన పట్ల తనకున్న భక్తి ప్రపత్తులను ప్రకటించు కున్నాడు. పరకాలుని ఈ సుహృద్భావానికి ప్రతిగా విప్రనారాయణుడు తనపూలు కోసే పరికరానికి 'అరుళ్‌మారి' అని పేరు పెట్టాడు. ఈయన రంగాలయంలో కట్టించిన ప్రాకార కుడ్య మిప్పటికీ తిరుమంగై మన్నన్ మదిల్ (తిరుమంగై రాజుగోడ) అని వ్యవహరింపబడుతూ ఉంది. ఈ ఆళ్వార్ తన చరమకాలాన్ని తిరుక్కురుంగుడిలో గడిపి అక్కడే పరమ పదించినట్టు ఐతిహ్యం.

ఈయన నూటయాభై సంవత్సరాలు జీవించి నట్టు సాంప్రదాయ ప్రభావిత గ్రంథాలు కొన్ని భావించగా డా॥ యన్. సుబ్బురెడ్డియార్ నూట అయిదు సంవత్సరాలు జీవించినట్టు అభిప్రాయపడ్డారు. 'This Alwa is said to have lived for 105 years' [37]

భగవద్దర్శనానుభవంతో వివిధ పుణ్యక్షేత్రాలలోని అర్చామూర్తుల్ని, వారి వైభవాలను కొనియాడుతూ తిరుమంగై ఆళ్వార్ ఆరు ప్రబంధాలు చెప్పాడు. అవి పెరియ తిరుమొళి, తిరుక్కురుందాండకమ్, తిరునెడుందాండకమ్, తిరువెళుక్కూర్రిరుక్కై, శిరియ తిరుమడల్, పెరియతిరుమడల్ మధురభక్తికి సంబంధించి నైన అంశాలు కూడా ఈయన రచనల్లో కన్పిస్తాయి

1. 1. 9 పెరిఆళ్వార్

'జ్యేష్ఠాస్వాతీభవం విష్ణు
రథాంశం ధన్వినఃపురే।
ప్రపద్యేశ్వశురం విష్ణోః
విష్ణుచిత్తం పురశ్శిఖమ్'॥38

తమిళ సాహిత్యంలో పిళ్ళై తమిళ్ అనే శాఖ కూడా ఉంది. ఈ శాఖను వెలుగులోకి తెచ్చినవాడు పెరియాళ్వార్. శ్రీకృష్ణుని బాల్యక్రీడను కళ్లకు కట్టినట్టు వర్ణించి పాఠకుల హృదయాలను కదిలించి కరిగించిన ఘనుడీయన. పెరియాళ్వార్‌కు విష్ణుచిత్తుడు, వట్టర్‌పిరాన్ అనే నామాంతరాలుకూడా ఉన్నాయి

శ్రీవిల్లి పుత్తూరులో ముకుంద భట్టర్ పద్మవల్లి అనే బ్రాహ్మణ దంపతుల కీయన జన్మించాడు. క్రీ.శ. 785 జూన్ 15, జూలై 15 తేదీల మధ్య క్రోధన సంవత్సరం జ్యేష్ఠ మాసం (తమిళమాసం ఆణి) శుక్లపక్షమి ఏకాదశి తిథి స్వాతీ నక్షత్రం ఆదివారం నాడు గరుత్మంతుని అంశంలో పెరియాళ్వార్ ప్రభవించినట్టు చెబుతారు. వేదశాస్త్ర విశారదుడైన విష్ణువే

పరదైవమని గుర్తించాడు. స్థానిక వేల్పువటపత్రశాయికి పుష్పమాలా కైంకర్యం చేయాలను కున్నాడు. ఒక పుష్పవనాన్ని నిర్మించాడు. పువ్వుల కోసి మాల కూర్చి రోజూ వటపత్రశాయికి సమర్పిస్తుండేవాడు.

ఒక రాత్రి మధురా నగరంలో మారువేషంలో పర్యటిస్తున్న పాండ్య రాజు వల్లభదేవుడు ఒక ఇంటి అరుగుమీద ఒకవ్యక్తి పడుకొని ఉండటం చూశాడు. ఆయనను సమీపించి, లేపి, కాశీయాత్రనుండి తిరిగి వస్తున్న ఒక బ్రాహ్మణుడని ఆయన తెలుసుకున్నాడు. యాత్రాసమయంలో సజ్జన గోష్ఠిలో తెలుసుకున్న పద్యమేదైనా ఉంటే చెప్పమని బ్రాహ్మణుని కోరాడు. వర్షాకాలంకోసం తక్కిన ఎనిమిది నెలల్లోను, రాత్రికోసం పగటికాలంలోను, వార్ధక్యంకోసం యవ్వనంలోను. పరం కోసం ఇహంలోను ఆర్జించాలనే తాత్పర్యం కలిగిన శ్లోకాన్ని బ్రాహ్మణుడు చెప్పాడు ఆ శ్లోకం ఇది.

'వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్
నిశార్థమర్ధం దివసం యతేత
వార్ధక్యహేతోర్వయసా నవేన
పరత్రహేతోరిహజన్మనా చ '[19]

తనకు ఇహానికి సంబంధించినవన్నీ ఉండటం వల్ల రాజు పరానికి సంబంధించిన ప్రయత్నం చేయాలనుకున్నాడు. పరతత్త్వాన్ని తెలుసుకోవాలను కున్నాడు. వల్లభదేవుడు ఆస్థానపురోహితుడు శెల్వనంబిని రప్పించి, జరిగింది చెప్పి పరతత్త్వాన్ని గురించి తెలుసు కోవాలనే తన కోరిక వెల్లడించాడు. శెల్వనంబి పండితుల గోష్ఠిలో ఈ విషయాన్ని చర్చించి నిర్ధారించవలసి ఉందన్నాడు:

రాజు సభా మంటప మధ్యంలో ఒక బంగారు నాణాల సంచిని వ్రేలాడ దీశాడు. పండిత పరిషత్తులో వాదించి సహేతుకంగా పరతత్త్వాన్ని నిర్ధారించిన వాళ్లకు ఆ సంచిని బహూకరిస్తానని ప్రకటించాడు.

విల్లిపుత్తూరు వటపత్రశాయి విష్ణుచిత్తుని కలలో కనిపించి, పాండ్యుని కొలువుకు వెళ్లి పరతత్త్వ నిర్ణయం చేసి, నాణాల సంచిని పట్టుక రమ్మని ఆదేశించాడు. ఆళ్వార్ మొదట తన అశక్తత వెలిబుచ్చాడు. స్వామి నేనున్నాలే పదమన్నాడు. పాండ్యుని కొలువులో ప్రవేశించిన పెరియాళ్వార్‌కు ఘన సత్కారం లభించింది తక్కిన పండితులకిది అసూయ కలిగించింది. వేదవ్వదాంగవిదుడు కాని ఈయన వాదించేందుకనర్హుడని వాళ్లు వాదించారు. రాజు, పురోహితుడు కోరగా వేదశాస్త్రాల్ని ప్రమాణాలుగా చూపుతూ వాదించి నారాయణుడే పరతత్త్వమని ఆళ్వార్ నిర్ణయించారు. బంగారు నాణాల సంచి ఊడి క్రింద పడింది. ఆళ్వార్ దాన్ని తీసుకొన్నాడు. సభ హర్షించింది.

రాజు ఆళ్వార్ శిష్యుడయ్యాడు. పట్టర్‌పిరాన్ అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆయనను తన పట్టపేనుగు మీద ఎక్కించి ఊరేగించాడు. ఆళ్వార్ మధురానగర వీధుల్లో ఊరేగుతుండగా ఆయన వైభవాన్ని చూసేందుకు లక్ష్మీ నారాయణులు సపరివారంగా వచ్చారు. ఆళ్వారుకు సాక్షాత్కరించారు. ఆయన ఆనందానికి అవధులు లేక పోయాయి. స్వామికి దృష్టి దోషం తగులుతుందన్న భయంతో 'పల్లాండు' పాడి మంగళాశాసనం చేశాడు. రాజు దగ్గర సెలవు తీసుకొని శ్రీవిల్లిపుత్తూరు చేరుకొని మధుర నుండి తెచ్చిన బంగారు నాణాలను వటపత్రశాయికి సమర్పించాడు. యథాపూర్వంగానే మాలాకైంకర్యం చేస్తూ కాలం గడిపాడు.

పెరియాళ్వార్ క్రీ. శ. 785 వ సంవత్సరంలో పుట్టి 85 సంవత్సరాలు జీవించి క్రీ శ. 870వ సంవత్సరం పరమపదించినట్లు తెలుస్తూ ఉంది. ఈ ఆళ్వార్ తిరుప్పల్లాండు, పెరియాళ్వార్ తిరుమొళి అనే రెండు ప్రబంధాలు వెలయించాడు, తన పెంపుడు పుత్రిక ఆండాళ్ ఆళ్వార్ల స్థాయికి చేరుకొనేందుకు దోహదం చేశాడు,

1. 1. 10 ఆండాళ్

'ఆషాఢే పూర్వ ఫల్గుణ్యాం
తులసీ కాననోద్భవామ్
పాండ్యేవిశ్వంభరాం గోదాం
వందే శ్రీరంగనాయకమ్

ఆండాళ్‌గా ప్రసిద్ధికెక్కిన ఈమెను కోదై. సూడికొడుత్త నాచ్చియార్, రంగ నాయకి. గోదాదేవి అనికూడా అంటారు. ఈమె పన్నిద్దరు ఆళ్వార్లలో చోటు చేసుకొన్న ఏకైక మహిళామణి. మధుర భక్తి సాంప్రదాయంలో మాధవు నారాధించింది మాన్యచరిత అయ్యింది. శ్రీ విల్లిపుత్తూరులో పెరి యాళ్వార్ నందవనంలో ఒక తులసిమొక్క క్రింద ఆండాళ్ అయోనిజగా అవతరించింది. తులసిమొక్కకు పాదు చేయడానికి పెరియాళ్వార్ త్రవ్వు తుండగా ఆయనకీ శిశువు కనిపించింది.

క్రీ.శ. 776 జూలై 15, అగస్టు 15 తారీఖుల మధ్యకాలంలో నల సంవత్సరం ఆషాఢమాసం (తమిళమాసం ఆడి) శుక్లపక్షం చతుర్థితిథి పుబ్బనక్షత్రం మంగళవారంనాడు భూదేవి అంశంలో ఆండాళ్ ఆవిర్భవించిందని అభిజ్ఞోక్తి.

పెరియాళ్వార్ ఈమెకు బాల్యంలోనే ఐహికాముష్మిక విద్యలు నేర్పి పెంపు చేశారు. ఈమెకు చిన్నప్పటినుండే విష్ణుభక్తి అలవడింది. ఆ దేవ దేవుణ్ణి వరించాలనే ఆశ లేత వయస్సులోనే అంకురించింది. వటపత్ర శాయికి సమర్పించేందుకు విష్ణుచిత్తుడు సిద్ధంచేసి ఉంచిన మాలను ఆయన లేనప్పుడు దొంగచాటుగా రోజూ ఆమె ధరించేది- విష్ణువుకు తగినట్టుగా తన అందం ఉన్నది లేనిది చూసుకొని లోలోన పులకించేది. స్వామికోసం కూర్చిన మాలను గోదాదేవి ధరించిన దృశ్యం ఒకరోజు విష్ణుచిత్తుని కంటబడింది

క్రుద్ధుడయ్యాడు. కూతురి తప్పును తీవ్రంగా ఖండించాడు. మళ్లీ ఆ తప్పు చేయవద్దని మందలించాడు. మరో మాల లేకపోవడంతో వటపత్రశాయికి ఆరోజు మాల సమర్పించలేక పోయాడు. నియమ భంగానికి ఖిన్నుడయ్యాడు.

వటపత్రశాయి రాత్రికలలో కన్పించాడు మాల సమర్పించని కారణ మడిగాడు. విష్ణుచిత్తుడు జరిగినదాన్ని వివరంగా చెప్పి క్షమాపణ కోరుకున్నాడు. గోదాదేవి ధరించిన మాలలే తనకు ప్రియమైనవి. అలాంటి మాలలే రోజూ తీసుకరమ్మని విష్ణువు విష్ణుచిత్తు నాదేశించాడు. ఆ రోజు నుండి కోదై అండాళుగా చూడి కొడుత్త నాచ్చియార్ (ఆముక్తమాల్యద) గా ప్రసిద్ధి కెక్కింది.

గోకులంలో గోపాంగనలు గోవిందుణ్ణి భర్తగా పొందేందుకు ఒక వ్రతం చేశారని విని గోదాదేవి కూడ చెలికత్తెలతో కలసి అలాంటి వ్రతాన్నే చేసింది.

గోదాదేవికి యుక్త వయసు వచ్చింది. విష్ణుచిత్తునికి వరాన్వేషణ చింత వచ్చింది. ఆండాళ్ మానవ మాత్రుని పెండ్లాడనంది. మాధవుడే తన మనోధవుడంది. ఏ ఊరి స్వామిని వివాహమాడుతావని విష్ణుచిత్తుడ గ్గా నూట ఎనిమిది దివ్యదేశాల్లోని స్వాముల గురించి, వాళ్ల వైభవాల గురించి విశదంగా చెప్పుమని కోరింది, విష్ణుచిత్తుడు వివరించాడు. శ్రీరంగంలోని రంగనాయక స్వామి ఆమెమనసును హరించాడు. ఆమె అతన్నే వరించింది. అతనిమీది విరహంతో వేగింది. అతడుతన్ను వివాహం చేసుకొన్నట్టు కలలు గన్నది.

రంగనాథస్వామి ఆలయ పరివారకులకు స్వప్నంలో కనిపించి 'శ్రీవిల్లి పుత్తూరు వెళ్లి పెరియాళ్వార్‌ను, గోదాదేవిని సపరివారంగా తీసుకరమ్మ'ని ఆదేశించాడు. వాళ్లు శ్రీవిల్లి పుత్తూరు వెళ్లి స్థానిక దైవమయిన వటపత్రశాయి అనుమతితో గోదాదేవిని, పెరియాళ్వార్‌ను వేర్వేరుగా పల్లకీలలో ఎక్కించుకొని సపరివారంగా శ్రీరంగం తీసుక వచ్చారు. ఆండాళ్ పల్లకి దిగి ఆలయం చేరి స్వామినిదర్శించి పులకితఅయ్యింది. నాగపర్యంకం మీదకెక్కి అదృశ్యురాలైంది గోదాదేవి తన దగ్గరే ఉన్నట్టు రంగని అశరీరవాణి పలికింది. పెరియాళ్వార్

రంగనాథస్వామి మామగా కీర్తింపబడి, తీర్థప్రసాదాలతో సత్కరింపబడి స్వామి ఆదేశానుసారం శ్రీవిల్లిపుత్తూరులో యథాపూర్వంగా వటపత్రశాయికి తన మాలా కైంకర్యాన్ని సాగించారు.

ఆండాళ్ మార్గశిర వ్రతవిశేషాలను తెలుపుతూ 'తిరుప్పావై' అనే ప్రబంధాన్నీ, స్వామిపట్ల తనకున్న తపన తెలుపుతూ 'నాచియార్ తిరుమొళి' అనే ప్రబంధాన్ని చెప్పింది.

తన రచనలతో తాను తరించడమేగాక తక్కిన వాళ్లను కూడ తరింప జేయడానికి ప్రయత్నించిన ఈమె విష్ణుచిత్తుని పెంపుడు కూతురై, విష్ణుదేవుని ఇల్లాలుగా విరాజిల్లడమేగాక, శ్రీమద్రామానుజులు, వేదాంతదేశికులు వంటి వైష్ణవోత్తములకు చిరస్మరణీయురాలైంది.

1. 1. 11 నమ్మాళ్వార్

'వైశాఖేతు విశాఖాయాం
కురుకాపురి కారిజమ్.
పాండ్యదేశే కలేరాదౌ
శఠారిం సైన్యపం భజే.

నమ్మాళ్వార్ ఆళ్వారులలో ప్రథముడు కాకపోయినా ప్రధానుడనే మాత్రం చెప్పుకోవచ్చు. ఈయన అవయవిసదృశ్యుడని, తక్కిన ఆళ్వారులందరు అవయవ ప్రాయులని వైష్ణవుల విశ్వాసం. ఆళ్వారులకు, ఆచార్యులకు, అనుసంధానకర్తగా, కేంద్ర ప్రాయుడుగా వైష్ణవ సాహిత్యంలో నమ్మాళ్వార్‌కు విశిష్ట స్థానముంది. ఇతన్ని నమ్మాళ్వార్ అనే గాక శఠగోపుడు, శఠారి, మారన్' కారిమారన్, వకుళాభరణుడు అని కూడా పిలుస్తారు.

తిరునల్వేలి జిల్లాలో ఆళ్వార్ తిరునగరి అని వ్యవహరింపబడి తిరుక్కురుగూరులో కారి, ఉడయనంగై అనే శూద్రదంపతులకు ఈ ఆళ్వారు జన్మించారు. క్రీ.శ. 798 మే 15, జూన్ 15 తారీఖుల మధ్య కాలంలో బహుధాన్య

సంవత్సరం వైశాఖమాసం (తమిళమాసం వైగాసి) పౌర్ణమి తిథి విశాఖ నక్షత్రం శుక్రవారంనాడు విష్ణుదేవుని సైన్యాధిపతి విష్వక్సేనుని అంశంతో నమ్మాళ్వార్ జన్మించినట్లు చెబుతారు. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు కూడా ఉన్నాయి.

కారి, ఉదయ నంగై దంపతులు 'తిరువణ్‌పరిసారం' నుంచి తిరస్తుండగా దారిలో తిరుక్కురుంగుడి వేలుపును సేవించి పుత్రుని ప్రసాదించమని కోరారని, నేనే స్వయంగా మీకు పుత్రుడుగా ప్రభవిస్తానని అర్చక ముఖంగా స్వామి సెలవిచ్చాడని ఐతిహ్యం ఒకటుంది. దీన్ని ఆధారంగా చేసుకొని నమ్మాళ్వార్ తిరుక్కురుంగుడి దేవుని వరం వల్ల పుట్టినట్టు చెబుతారు.

ఆ శిశువు పుట్టినప్పటినుంచి పాలు తాగలేదు. ఏడవలేదు. కనీసం కన్నెత్తైనా చూడలేదు. ఆ దరికి ఆశ్చర్యం కలిగింది. ఆందోళన హెచ్చింది. కారిదంపతులు ఆ బిడ్డను తీసుకొని వెళ్ళి తామ్రపర్ణినది దక్షిణ తీరంలో కురుకాపురాధీశుడుగా వెలసిన విష్ణువు కోవెల ప్రాంగణంలో ఒక చింత చెట్టుకింద ఊయలలో పడుకోబెట్టారు. ఆ బిడ్డకు అన్నీ రక్షణ ఆ దేవుడేనని వాళ్లు విశ్వసించారు. (నమ్మాళ్వారు అవతరించకముందే ఆదిశేషుడే చింతచెట్టుగా పుట్టాడని ఒక ఐతిహ్యం కూడా ఉంది.)[42]

విష్ణువు పంపగా విష్వక్సేనుడు వచ్చి నమ్మాళ్వారుకు పరతత్వాన్ని రహస్యంగా బోధించి వెళ్ళాడు. అప్పటినుంచి ఆయన అలాగే యోగ సమాధి స్థితిలోనే పదహారేళ్ళు గడిపాడు. తీర్థాటనం వెళ్ళిన మధురకవి అయోధ్యలో దక్షిణంగా ఒక వెలుగును చూసి, వెంబడించి వచ్చి నమ్మాళ్వారున్న చింతచెట్టు చేరుకున్నాడు.

ఆ మహానుభావుని తేజస్సే ఆ వెలుగని తెలుసుకొన్నాడు ఆనంద పడ్డాడు. ఆయనలో చైతన్యం ఉందా లేదా అని తెలుసుకొనేందుకు ఒక రాయి విసిరాడు. ఆళ్వారు కళ్లువిప్పి చూసారు. అయన మాట్లాడగలడో లేదో

తెలుసుకొనేందుకు 'చచిపోయిన దాని కడుపులో చిన్నది పుడితే దేన్నితిని ఎక్కడ ఉంటుందని' ప్రశ్నించాడు. ఆళ్వార్ 'దాన్నే తిని అక్కడే ఉంటుందని' సమాధాన మిచ్చారు. 'చత్తదిన్ పైట్రిల్ సిరియదు పిరందాల్ ఎత్తైత్తింద్రు ఎంగే కిడక్కుం?' 'అత్తైతింద్రు అంగేకిడక్కుం'[43] పారమార్థికమైన ఈ సంభాషణ వల్ల ఆయన మహాత్ముడని, మాన్యుడని మధురకవి తెలుసుకొన్నాడు. ఆయనను తన గురువుగా భావించుకొని నమస్కరించాడు.

సపరివారంగా గరుడవాహనుడు ప్రత్యక్షమయ్యాడు. ఆళ్వారును నమ్మాళ్వారు (మన ఆళ్వారు) అని కొనియాడారు. భగవద్దర్శనానుభవంతో నమ్మాళ్వారు తిరువిరుత్తమ్, తిరువాసిరియం, పెరియతిరువందాది, తిరువాయి మొళి అనే ప్రబంధాలు రచించాడు. వీటిని చతుర్వేద తుల్యాలని, చతుర్వేద సారసంక్షిప్తాలని వైష్ణవులు చెబుతారు.

నమ్మాళ్వార్ నివసిస్తున్న చింతచెట్టు మీదికి నూట ఎనిమిది దివ్యదేశాల వేలుపులందరు వచ్చి నిలిచి తమ తమ ప్రదేశ వైభవాలు చెప్పుకొని తమను కీర్తిస్తూ పాటలు పాడమని పోటీ పడ్డారు. ఆళ్వారు పేరుపేరున వాళ్లను కీర్తించి వినోదింప జేసి సంతృప్తి పరచాడు. ఈయన 35 సంవత్సరాలు జీవించిన తర్వాత పరమపదించాడని చెబుతారు.

నమ్మాళ్వారు 35 సంవత్సరాలు జీవించినా, శాశ్వత ప్రయోజనకరమైన రచనల నందించి చిరకీర్తినార్జించుకొన్నాడు. మధురభక్తి సంప్రదాయానికి అలంకార ప్రాయాలైన రచనలు చేసి 'వకుళ భూషణనాయిక' అని పలువురిచేత కొనియాడబడ్డాడు. నాదమునులకు ప్రత్యక్షమై నాలాయిర దివ్యప్రబంధాన్ని బోధించి వైష్ణవాన్ని ఉజ్జీవింప జేశాడని వైష్ణవులు ఇప్పటికీ భావిస్తారు. 'నాదమునిక్కు నాలాయిర మొళైత్తాన్ వాళి'[44] (నాథునికి నాలుగువేలు చెప్పిన వారికీ స్వస్తియగుగాక) అని నమ్మాళ్వారు స్వస్తి వాచకస్తవంలో పేర్కొనడం

గమనించదగి వుంది. నమ్మాళ్వారు ఆళ్వార్యల్లోను ఆచార్యుల్లోను అగ్రస్థానం వహించడమేగాక వైష్ణవులందరికీ ఆదర్శప్రాయుడుగా, విష్ణు సదృశుడుగా వాళ్ళ మనసుల్లో నిలిచి పోయారు.

1. 1. 12 మధురకవి ఆళ్వార్ :

'చైత్రే చిత్రా సముద్భూతం
పాండ్యదేశే గణాంశకమ్
శ్రీపరాంకుశ సద్భక్తం
మధురం కవి మాశ్రయే' 45

ఆళ్వారులలో చివరివాడు తిరుమంగై ఆళ్వారని సాంప్రదాయ కథనం. కానీ జీవించిన కాలం దృష్ట్యా పరిశీలిస్తే ఆళ్వారులలో కడపట జీవించినవాడు మధుర కవి ఆళ్వారని పండిత పరిశోధకుల అభిప్రాయం. తక్కిన ఆళ్వారులందరు విష్ణువే తమ ఆరాధ్య దైవంగా భావించి తరించారు. మధురకవి ఆళ్వారు మాత్రం దైవాన్ని చేరుకోవడానికి దారి చూపిన గురువునే దైవంగా ఆరాధించి తరించాడు. ఈయన నమ్మాళ్వారునే గురువుగా విష్ణువుగా భావించి సేవించి ధన్యుడయ్యాడు.

తిరునల్వేలిజిల్లా తిరుక్కోళూర్ గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో మధురకవి ఆళ్వార్ జన్మించాడు. క్రీ. శ. 797 ఏప్రిల్ 15, మే 15 తేదీల మధ్యకాలంలో ఈశ్వర సంవత్సరం చైత్రమాసం (తమిళమాసం చిత్రి) శుక్ల పక్షమి చతుర్ధితిథి చిత్రానక్షత్రం శుక్రవారంనాడు కుముదగణేశాంశలో మధురకవి ఆళ్వార్ జన్మించినట్టు చెబుతారు.

చిన్నతనంలోనే వేదవేదాంగ విద్యలన్నిటినీ అభ్యసించి మధురకవి విరక్తుడయ్యాడు. మోక్షదాయక సప్తక్షేత్ర సందర్శనార్థమై బయలుదేరి వెళ్లాడు. ఈయన అయోధ్యలో ఉండగా ఒకరోజు రాత్రి దక్షిణ దిక్కులో ఒక అలౌకిక తేజస్సు కనిపించింది. ఆ తేజస్సు ఎవరిదైనా ఒక మహాత్ముడిది కావచ్చనిపించింది

ఆ మహాత్ముని సందర్శించాలనే ఆకాంక్ష అంకురించింది. ఆళ్వార్ దక్షిణాభిముఖంగా పయనించాడు పగటిపూట విశ్రమిస్తూ రాత్రిపూట ఆ వెలుగును తదేకంగా చూస్తూ ప్రయాణంచేసి 'తిరుక్కురుగూర్' లో స్వామి ఆలయ ప్రాంగణంలో చింతచెట్టు క్రింద నమ్మాళ్వారును దర్శించి ఆయనదే ఆ తేజస్సని తెలుసుకొన్నాడు.

యోగ సమాధిస్థితిలో ఉన్న ఆయనకు చలనం ఉందా లేదా అని పరీక్షించి తెలుసుకొని, ప్రశ్నించి ప్రత్యుత్తరాన్ని పొందాడు. ఆయన మాహాత్మ్యానికి ఆశ్చర్యపడి ప్రణామాలు సమర్పించి, శిష్యుడయ్యాడు. భగవద్దర్శనానుభవంతో నమ్మాళ్వార్ చెప్పిన నాలుగు ప్రబంధాలను మధురకవి ఆళ్వార్ తాళపత్రాలలో రాసి ఉంచినట్టు చెబుతారు

మధురకవి ఆళ్వార్ నమ్మాళ్వార్ పరమపదించిన తర్వాత కూడ 50 సంవత్సరాలు జీవించినట్టు చెబుతారు. నమ్మాళ్వారు అర్చామూర్తిని ప్రతిష్ఠించి పూజా కైంకర్యాలు జరిపించాడు. నమ్మాళ్వారుకు ఆలయ, గోపుర, మంటపాలు ఈయన కాలంలోనే నిర్మించబడినట్టు చెబుతారు నమ్మాళ్వారుకు ఉత్సవాలు కూడా ఈయనే ఏర్పాటు చేశాడని అభిజ్ఞుల విశ్వాసం.

మధురకవి ఆళ్వార్ రాసిన ఒకే ఒక ప్రబంధం 'కణ్ణినుమ్ సిరుత్తాంబు. అనే పదబంధంతో ప్రారంభమవుతుంది. అందుకే దాన్ని ఆపేరుతోనే వ్యవహరిస్తారు. ఇది నమ్మాళ్వార్‌ను వినుతిస్తూ రచింపబడిన ప్రబంధం.

దైవాన్ని కూడా ఖాతరు చేయకుండా గురువునే దైవంగా భావించి ఆదర్శ శిష్యుడుగా ఆళ్వారులలో విశిష్టస్థానాన్ని సంపాదించు కొన్నాడు మధురకవి' తక్కిన ఆళ్వారులకున్న లక్షణాలన్నీ తనలో లేకపోయినా గురుభక్తి తీవ్రతతోనే ఆళ్వారు స్థానానికి ఎదిగిన మధురకవి ఉత్తమోత్తముడనడంలో అతిశయోక్తి లేదు.

వైష్ణవానికే గాక వైష్ణవ వాఙ్మయానికి కూడ ప్రారంభకులుగా వన్నె కెక్కిన ఆళ్వారులు తమిళజాతికి, తమిళ సాహిత్యానికి చేసిన సేవ పరమోత్కృష్టమైందని చెప్పుకోవచ్చు. తమిళజాతి, వైష్ణవ సమూహాలేగాక ఆస్తిక ప్రపంచమంతా కూడా సన్మార్గదర్శకులైన ఆళ్వారులకు ఎంతైనా ఋణపడి ఉందనటంలో విప్రతిపత్తి లేదు. ఆళ్వారుల జీవితాలను స్థూలంగా పరిశీలించిన తర్వాత వాళ్ల కోవకే చెందిన అన్నమయ్య జీవిత విశేషాలను కూడా సంగ్రహంగా నైనా సమాలోచింపడం సమంజసంగా ఉంటుంది

## 1. 2 అన్నమయ్య :

అన్నమాచార్యుడుగా ప్రసిద్ధికెక్కిన అన్నమయ్య ఆంధ్రకూట అనుగు సంతానంలో అగ్రశ్రేణికి చెందినవాడు. అన్నమయ్య భక్తి, సంగీత సారస్వత త్రివేణీసంగమం అంటే అతిశయోక్తి కాదు. ఈయనే తొలి తెలుగు వాగ్గేయకారుడు. పదకవితాపితామహుడు

పల్లవి, అనుపల్లవి, చరణాలతో కూడిన కీర్తనలను తెలుగులో మొట్ట మొదటిసారిగా రచించి, వ్యాప్తిలోకి తెచ్చినవాడు కూడా అన్నమయ్యే అని అభిజ్ఞుల విశ్వాసం. జానపద బాణీలను కూడా సంకీర్తనల్లో మేళవించి, అపూర్వ సాహిత్య సృష్టికి నాంది పలికినవాడు అన్నమయ్య. జనసామాన్య వ్యవహారంలో ఉన్న పలుకుబళ్లను కూడా తన కీర్తనల్లో ప్రయోగించి, తేట తెలుగు మాటల కూర్పుతో పండిత పామర జనరంజకంగా సాహిత్యాన్ని తీర్చిదిద్దటానికి ప్రయత్నించినదిట్ట ఈయన. వేంకటేశ్వర భక్తుడై వీనులవిందు గొలిపే మధుర గీతాలతో విష్ణు భక్తితత్వాన్ని విశ్వ వ్యాప్తం చేయడానికి పరిశ్రమించిన వాగ్గేయకారుడు అన్నమయ్య.

### 1. 2. 1 కాలం :

అన్నమయ్య జీవించిన కాలానికి సంబంధించి రెండు వాదాలున్నాయి, అన్నమయ్య క్రీ. శ. 1424వ సంవత్సరం జన్మించి క్రీ శ. 1503వ సంవత్సరం పరమ పదించాడని మొదటి వాదం. క్రీ. శ. 1408వ సంవత్సరం జన్మించి

క్రీ.శ. 1503లో పరమపదించాడని రెండవ వాదం. అన్నమయ్య మరణ సంవత్సరానికి సంబంధించి ఎటువంటి విప్రతిపత్తి లేదు. జన్మ సంవత్సరానికి సంబంధించి మాత్రమే భిన్నాభిప్రాయాలున్నట్లు తెలుస్తూ వుంది. అన్నమయ్య సంకీర్తనలు చెక్కబడిఉన్న రాగిరేకులో కన్పించే ఒక వాక్యమే పై ఉభయ వాదాలకు ప్రమాణం. ఆ వాక్యమిది 'స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 ఈ సరియగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు 1424 అగునేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళ నాథుని మీదను అంకితము గాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనములు'.[46]

పై వాక్యంలో విరామ చిహ్నాలు లేకపోవడం వల్ల ఎవరి వాదానికి తగ్గట్టు వాళ్లు ఆ వాక్యాన్ని విరిచి అన్వయం చేసికొని అర్థాన్ని చెప్పుకొన్నారు. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అన్నమయ్య జీవన కాలాన్ని గురించి ఇలా అభిప్రాయ పడ్డారు 'అన్నమయ్య శాలివాహన శకము 1346 క్రీ. శ. 1424 క్రోధి వైశాఖ మాసమున విశాఖ నక్షత్రమున జన్మించినాడు. శాలివాహన శకము 1424 క్రీ. శ. 1503 దుందుభిఫాల్గుణ బహుళ ద్వాదశినాడాతడు దివ్య ధామమందినాడు. ఇతని జీవిత పరిమాణము 79 ఏండ్లు'.[47] డా॥ వేటూరి ఆనందమూర్తిగారు కూడా 'తాళ్లపాక కవుల కృతులు వివిధ సాహితీ ప్రక్రియలు' అనే తమ గ్రంథంలో (పు. 60—65), శాస్త్రిగారి అభిప్రాయాన్ని బలపరిచారు. సాధు సుబ్రమహ్మణ్యశాస్త్రిగారు, వాగంటి శేషయ్యగారు, శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బ శర్మగారు, అన్నమయ్య జన్మ సంవత్సరం క్రీ. శ. 1408 అని పేర్కొన్నారు. అన్నమయ్య శృంగార సంకీర్తనలు 12వ సంపుటం పీఠికలో అన్నమయ్య కాల చర్చలో శాస్త్రి ప్రభృతుల వాదాన్ని పూర్వపక్షం చేస్తూ శ్రీ శర్మగారిలా రాశారు. 'నాయభిప్రాయమిది — ఈ వాక్యము జన్మ నిర్యాణములను తెలుపుట కేర్పడినదికాదు. ఆతని జీవితకాలంలో ఏది సారభూత

మైన సమయమో దానిని తెలుపుటకే ఏర్పడినది, జన్మ ప్రభృతి పదహారేండ్ల వరకు గడచిన కాలము సారహీనమైనదనియు పదహారవయేట తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైన తరువాత అతనిపై దినమునకు ఒక్క కీర్తనమునకు తక్కువ గాకుండా స్వామిని కొనియాడిన కాలమే సారభూతమైనదనియు ఆ పని నిర్వాణ దినము వరకు సాగినందున నిర్వాణదినము మాత్రము (దుందుభి—ఫాల్గుణ—బహుళ 12) లెక్కకు వచ్చినదనియు తెలుపుటే ఈ వాక్య పరమార్థము. కావున రేకులపై గనపడు 79 సంవత్సరములతో పాటు సారహీనముగ గడిచిన 16 సంవత్సరములు అతని జీవిత కాలమని తేలినది. 1408 విరోధి వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖ నక్షత్రమున జన్మమనుట సరియు.[48] బహుజనాంగీకృతమైన ఈ అభిప్రాయాన్నే సమంజసమైనదిగా స్వీకరించడం సముచితంగా ఉంటుంది.

1. 2. 2 కడపజిల్లా, రాజంపేట తాలూకా, తాళ్లపాక గ్రామంలో నందవరీక వైదిక బ్రాహ్మణ కుటుంబంలో నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు అన్నమయ్య జన్మించాడు.

క్రీ. శ. 1408 మే 15, జూన్ 15 తారీఖుల మధ్య కాలంలో విరోధి సంవత్సరం వైశాఖమాసం (తమిళనెల వైగాసి) పూర్ణిమ తిథి విశాఖ నక్షత్రంనాడు విష్ణు నందకాంశంతో అన్నమయ్య అవతరించినట్లు అభిజ్ఞుల అభిప్రాయం.

అన్నమయ్య అయిదవ సంవత్సరం ఉపనీతుడై విద్యలభ్యసించాడు. పశువులకు పచ్చిగడ్డి కోసి తెమ్మని, ఇంట్లోవాళ్లు నిర్బంధించారు. అన్నమయ్య అడవికి వెళ్లి, గడ్డికోస్తూ అలవాటు లేక పోవడం వల్ల వ్రేలుకోసుకున్నాడు' రక్తాన్ని చూసి విరక్తుడయ్యాడు. కొడవలి విసిరివేశాడు. ఎనిమిదేళ్ల ప్రాయంలోనే తిరుమలకు వెళ్లే యాత్రికుల గుంపుతో కలిసి తిరుపతి చేరుకొన్నాడు

గ్రామదేవతను సేవించారు. కొండ ఎక్కుతూ బాగా అలసి పోవడం వల్ల, ఆకలితో బాధపడుతూ మోకాటి మెట్లదగ్గర ఒకవెదురు పొదలో విశ్రమించారు. అలమేలు మంగమ్మ పెద్ద ముత్తైదువ రూపంలో ఆతన్ని సమీపించింది. అన్నప్రసాదాలు తినిపించి ఆకలి పోగొట్టింది. అన్నమయ్య అమ్మ ఆదేశానుసారం కాళ్లకున్న చెప్పులు తొలగించారు. సాలగ్రామమయమయిన ఆ పర్వతంలో హరి దశావతారాలు దర్శించుకున్నారు. వేంకటేశ్వర మకుటంతో అలిమేలుమంగమీద ఆశువుగా ఒక శతకాన్ని చెప్పారు.

స్వామి పుష్కరిణిలో స్నానం చేసి, వరాహస్వామిని సేవించి, వేంకటేశ్వరుని దర్శించి, తరించాననుకున్నారు. కుమార ధారాది తీర్థాలలో స్నానం చేసి పునీతుడయ్యాననుకున్నారు. ఈయన స్నానం చేసి బట్టలు ఆర వేసి అవి ఆరే లోపుగా ఆశువుగా ఒక శతకం చెప్పేవాడని ప్రతీతి.

ఒకరోజు స్వామి సందర్శనార్థం వచ్చిన అన్నమయ్య ఆలయ కవాటాలు మూసి ఉండటం చూశారు. హతాశుడయ్యారు. ఆవేదనతో ఆర్ద్రంగా ఒక గీతం ఆలపించారు. ఆలయ కవాటాలు తెరుచుకున్నాయి ఆలయ ప్రాంగణంలోని విగ్రహాలన్నింటిని దర్శించుకుంటూ వెళ్ళి మూలస్థానంలోని మూలవిరాట్టును దర్శించారు. ఆ మనోహరాకారుణ్ణి చూస్తూ మైమరచి, ఆశువుగా ఒక శతకం చెప్పారు. దేవుని మెడలోని హారం ఊడి క్రింద పడింది. బాలుని మహిమకు అబ్బుర పడిన అర్చకులు భవిష్యత్తులో మహాత్ముడు కాగలడని భావించి ఆశీర్వదించి అన్నమయ్యకు తీర్థప్రసాదాలిచ్చి సగౌరవంగా సాగనంపారు

ఘనవిష్ణువనే వైష్ణవ యతి తన స్వప్నంలో కనిపించిన వేంకటేశుని ఆదేశానుసారం అన్నమయ్యకు పంచ సంస్కారాలు చేసి, వైష్ణవునిగా చేశారు. అన్నమయ్య అన్నమాచార్యుడై ఘన విష్ణువు దగ్గర వైష్ణవతత్త్వాన్ని కొంత వరకు తెలుసుకొన్నారు.

అన్నమయ్య హఠాత్తుగా కన్పించక పోవడంతో నారాయణసూరి దంపతులకు ఆందోళన మొదలైంది. అన్వేషణ సాగించారు. ఆఖరుకు

తిరుమల చేరుకొని అన్నమయ్యను కలుసుకొని ఆనందించారు. లక్కమాంబ అన్నమయ్యను ఇంటికి రమ్మని కోరింది. అన్నమయ్య మొదట అంగీకరించక పోయినా తర్వాత భగవత్సంకల్పంగా భావించి బయలు దేరాడు.

అన్నమయ్య భగవత్సంకల్పంవల్ల తిమ్మక్క, అక్కలమ్మ అనే ఇద్దరు యువతులను పెండ్లాడాడు. కొన్నాళ్లక్కడ గడిపి తన 16వ ఏట మళ్లీ తిరుమల చేరుకొన్నాడు. ఒకరాత్రి ఒక మండపంలో విశ్రమించి భగవద్ధ్యానైక చిత్తుడైన ఆయనకు ఏవో కొన్ని నాదాలు అస్పష్టంగా గోచరించాయి. వెంకటేశ్వరానుగ్రహంతో బాటు, ఆయన సాక్షాత్కారం కూడా లభించింది. 'ధన్యోస్మి' అనుకొన్నాడు, అన్నమయ్య భగవంతుని ఆదేశానుసారం క్రీ. శ. 1424 క్రోధి వైశాఖ విశాఖనాడు తన సంకీర్తన యజ్ఞాన్ని ప్రారంభించాడు. భగవంతుని కీర్తిని గానం చేస్తూ పరవశించాడు

1. 2. 3. అహోబల మఠస్థాపకులైన ఆదివన్ శఠగోప యతిని గురించి అన్నమయ్య విన్నాడు. ఆయన్ని సందర్శించాడు. ఆయన శిష్యుడై వైష్ణవాగమాలన్నిటినీ అభ్యసించాడు. ఆళ్వారుల పాశురాల అంతరార్థాన్ని బోధపరచుకొన్నాడు, తానెరిగినవన్నీ తేట తెలుగు మాటలతో కీర్తనల ద్వారా ప్రచారం చెయ్యడం మొదలు పెట్టాడు.

సాళువ నరసింగరాయలనేరాజు అన్నమయ్యను అర్థించి తన ఆస్థానానికి తీసుకెళ్లాడు. పెనుగొండలో తనతో ఉండమని ప్రాధేయపడ్డాడు. ఒకరోజు విందుకొలువులో రాజు కోరిక మీద 'ఏమొకో చిగురుటధరమున'[49] అనే శృంగార మధుర సంకీర్తనను అన్నమయ్య గానం చేశాడు అందరూ పరవశించారు, రాజు అలాంటిదే తన మీద ఒకటి పాడమని కోరాడు' అన్నమయ్య అసహ్యించు కొన్నాడు. నిరసిస్తూ నరాభిశ్రమణం చేశాడు, నరసింగరాయలు అతనికి సంకెళ్ళు వేయించాడు. అన్నమయ్య వెంకటేశ్వరుని వినుతించి బంధవిముక్తుడయ్యాడు. రాజు క్షమాపణ కోరుకున్నాడు. అన్నమయ్య రాజుకు హితోపదేశంచేసి శేషాద్రికి ప్రయాణం కట్టాడు.

1. 2. 4. అన్నమయ్య విగ్రహాలు ఒకప్పుడు కనిపించక పోగా ఇందిరా రమణు తెచ్చి యియ్యరో' [50] అనే కీర్తనపాడి వాటిని మళ్లీ పొందినట్లు చెబుతారు. 'కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవ చేసినవాడు, దాసవరిష్ఠుడు అయిన పురందరదాసు తిరుమలకు వచ్చి. అన్నమయ్యను సందర్శించి సంభాషించి సముత్తేజితుడైనట్లు చెబుతారు[51].

1. 2. 5 అన్నమయ్య మహిమలు తెలిపే అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. తీడిమామిడిపండు స్వామికి నివేదించి, తాను తిని పుల్లగా ఉన్నట్లు తెలిసికొని 'స్వామికి పుల్లగా ఉన్న పండ్లు నివెదించానుకదా' అని పశ్చాత్తాప పడ్డారు ఆ మామిడి పండ్లు తియ్యగా ఉండేటట్లు చెయ్యమని అన్నమయ్య శ్రీనివాసుని ప్రార్థించగా అప్పటి నుండి ఆ మావి పండ్లు తియ్యనివైన ఉదంతం విన్నవాళ్లకు ఆశ్చర్యం కలిగించక పోదు. ఇలాగే మరెన్నో ఉదంతాలు.

అన్నమయ్య శేషాద్రినాథుని అనుదిన సేవలన్నిటిలోను పాల్గొంటూ పరవశించేవాడు తన సంకీర్తనలతో శ్రోతలను మైమరపింపజేసేవాడు. ఉత్సవాలలోను ఊరేగింపులలోను పాల్గొని భక్తులకు నూతనోత్సాహం కలిగించే వాడు. స్వామికి మొట్టమొదటిసారి కల్యాణోత్సవము చేయించి కన్యాదాతగా అన్నమయ్యే వ్యవహరించినట్లు చెపుతారు'[52]

భగవంతుని భక్తితో కీర్తించి, దశదిశలా తన కీర్తి వ్యాపించేటట్టు చేసికొని, సంకీర్తన యజ్ఞాన్ని తన కుమారుడు పెద తిరుమలాచార్యునికి అప్పగించి క్రీ. శ 1503 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు అన్నమయ్య కీర్తికాయుడయ్యాడు.

1. 2. 6 అన్నమయ్య 32 వేల ఆధ్యాత్మ శృంగార, సంకీర్తనలు రచించి నట్లు తెలుస్తూవుంది. వాటిని రాగిరేకుల మీద చెక్కించి పెద తిరుమలాచార్యుడు కాబోలు తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయంలోని సంకీర్తన భండారంలో భద్రపరిచాడు. తరువాతి కాలంలో ఎవరో రాగి కరిగించి అమ్మివేయడంవల్ల

సుమారు 20 వేల సంకీర్తనలు ఈనాడు మనకు లభించడం లేదు అన్నమయ్య రచించినట్లు చెప్పబడే 12 శతకాలలో వేంకటేశ్వర మకుటంతో ఉన్న అలిమేలు మంగ శతకం మాత్రం లభించింది. మంజరీ ద్విపదలో వ్రాయబడిన శృంగార మంజరి కూడ లభించినవాటిలో ఉంది. అన్నమయ్య రచించినట్లు చెప్పబడే ద్విపద రామాయణం, వేంకటాచలమాహాత్మ్యం, సంస్కృతంలో వ్రాయబడిన సంకీర్తన లక్షణం పలభాషల్లోను వ్రాయబడిన నానా ప్రబంధాలు కాలగర్భంలో కలిసి పోయాయి.

1. 2. 7 క్షేత్రయ్య, త్యాగరాజు, రామదాసు లాంటి తర్వాతి వాగ్గేయకారుల మీదనే కాక భట్టుమూర్తి లాంటి మహాకవులెందరి మీదనో అన్నమయ్య రచనల ప్రభావం బాగా ఉన్నట్లు పండితులు చెబుతారు. అన్నమయ్య ప్రభావంవల్లనే పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్యలతోబాటు అయన సంతతి వాళ్ళెందరో కీర్తనలు కృతులు రచించి ఆలయ పునరుద్ధరణాది కైంకర్యాలు ఎన్నో నిర్వహించి, ఇటు సాహిత్యానికి, అటు భాగవత సంప్రదాయానికి ఎనలేని సేవ చేశారు. అన్నమయ్య తాను చేపట్టిన అన్ని రంగాలలోను విప్లవాత్మక చైతన్యాన్ని తెచ్చారు. ఆంధ్రసాహిత్య చరిత్రలో మరుపురాని మార్గదర్శక మణిదీపంగా అన్నమయ్య నిలిచి పోయారు. ఆంధ్రులకేగాక అందరికీ ఆరాధ్యుడయ్యాడు.

1. 3 అన్నమయ్య, ఆళ్వారుల జీవితాలలో కన్పించే సామ్యాలు :

మనుషుల్లాంటి మనుషులున్నట్లే, జీవితాల్లాంటి జీవితాలు, సంఘటన ల్లాంటి సంఘటనలూ ఉండటం సహజం. వీటిలో కొన్ని యాదృచ్ఛికాలు కాగా మరికొన్ని అనుకరణ వల్ల ఏర్పడ్డవి.

అన్నమయ్య—ఆళ్వారుల జీవితాలలో కన్పించే సామ్యాలు ఏ ఒక్క కోవకో మాత్రం చెందినవి కాక పై రెండు కోవలకూ చెందినవిగా గోచరిస్తాయి. ఆళ్వారులు అన్నమయ్యకు పూర్వులు కావటంవల్లను వైష్ణవుడైన అన్నమయ్యకు

ఆళ్వారుల రచనలను అధ్యయనం చేసే అవకాశం ఉండటంవల్లను, ఆళ్వారుల జీవితాలను గురించి తెలుసుకొని ఉండవచ్చు. వాటి వల్ల ప్రభావితుడై ఆళ్వారుల జీవిత విధానాలను అనుకరించడానికి ప్రయత్నించి ఉండవచ్చు. కాబట్టి అన్నమయ్య, ఆళ్వారుల జీవితాలలో అనుకరణ సామ్యాలు ఉండే అవకాశం లేకపోలేదు. ఆళ్వారులు, అన్నమయ్య భగవత్సంకల్పం వల్ల ప్రభవించి వైష్ణవ తత్త్వాన్ని భక్తితత్త్వాన్ని వ్యాప్తిలోకి తెచ్చి విష్ణువును పొందటమే ఏకైక లక్ష్యంగా పెట్టుకొని ఉండటంవల్ల, వాళ్లమధ్య యాదృచ్ఛిక సామ్యాలు కనిపించే అవకాశం కూడా ఎక్కువగానే ఉంది. వీళ్లమధ్య కనిపించే సామ్యాలను సాధారణ సామ్యాలని, ప్రత్యేక సామ్యాలని రెండు విధాలుగా వర్గీకరించు కోవచ్చు. సాధారణ సామ్యాలు అందరిలోను సమానంగా కన్పించేవి. ప్రత్యేక సామ్యాలు ఏ యిద్దరిలోనో ముగ్గురిలోనో గోచరించేవి.

1. 3. 1 సాధారణ సామ్యాలు

అన్నమయ్య ఆళ్వారులందరు విష్ణుదేవుని ఆత్మీయ, వస్తు, వాహన పరిజనులకు సంబంధించిన ఏదో ఒక దివ్యాంశతో జన్మించినవాళ్లే, అందరూ కారణజన్ములేనని వైష్ణవుల విశ్వాసం, అందరికీ విష్ణుభక్తి అలవడింది. ఏ ఒకరికో ఇద్దరికో మినహా అందరికీ విష్ణు సాక్షాత్కారం సిద్ధించింది. అందరూ విష్ణుకల్యాణ గుణాల్ని గానం చేసిన వారే. విష్ణు దేవుని అవతార విశేషాల్ని. లీలల్ని కొనియాడిన వాళ్లే. ఐహిక సుఖాల్ని తృణప్రాయంగా చూపినవాళ్లే. విష్ణుదేవుని చేరుకోవడమే ప్రతి జీవికి ప్రథమ కర్తవ్యమని ప్రబోధించినవాళ్లే. ఆత్మ పరిశీలన చేసుకొని, నిందించుకొని, మనసును ఉద్బోధించడం ద్వారా ప్రపంచాన్ని ఉద్బోధించినవాళ్లే. ఇద్దరు మినహా అందరూ వేంకటేశ్వరుణ్ణి వినుతించిన వాళ్లే.

1. 3. 2 ప్రత్యేక సామ్యాలు

పేయాళ్వార్ జన్మించిన నందకాంశంలోనే అన్నమయ్య కూడ అవతరించాడు. భగవత్ కల్యాణ గుణాలను కీర్తిస్తుండగా తొలి ఆళ్వారులకు

ప్రత్యక్షమైనట్టే విష్ణుకల్యాణ గుణ కీర్తనోద్దిష్ట సంకీర్తనారచన కుపక్రమించి నప్పుడే అన్నమయ్యకు కూడా విష్ణువు దృగ్గోచరు డయ్యాడు. అహంకార పూరితమైన రాజాజ్ఞ ధిక్కరించి తిరుమళిశై ఆళ్వారు. కనికణ్ణన్ కాంచీనగర విష్క్రమణ చేసినట్టే అన్నమయ్యకూడా సాళువ నరసింగరాయని ఆస్థానంనుండి నిష్క్రమించాడు. తిరుప్పులియూరులో తిరుమలిశై అళ్వార్ తన మహిమలు చూపగా అన్నమయ్య జీడిమామిడి పండ్లు తియ్యగా ఉండేటట్లు చెయ్యడం వంటి మహిమలెన్నో చూపాడు. తొండరడిప్పొడి ఆళ్వార్, కులశేఖరాళ్వార్ తిరుమంగై అళ్వార్ లాగే అన్నమయ్య కూడా భాగవతుల నెంతగానో అభిమానించాడు. తొండరడిప్పొడి ఆళ్వార్ రంగనికి మేలుకొలుపు (తిరుప్పళ్ళి ఎళుచ్చి) రచించి నట్టే అన్నమయ్య కూడా వేంకటేశ్వరునికి మేలుకొలుపు పాటలు రాశాడు. తొండరడిప్పొడి అళ్వార్ రంగని ఒకని మాత్రమే కొనియాడుతూ పాడగా అన్నమయ్య వేంకటేశ్వరాంకితంగానే కీర్తనలు విరచించి వినుతికెక్కాడు. కులశేఖర అళ్వారులాగా సంస్కృతంలో కూడా అన్నమయ్య రచనలు చేశాడు. ఆయిన లాగే రాముని పట్ల విశేష భక్తి ప్రపత్తులు కనబరిచాడు. తిరుమంగై ఆళ్వారులాగా అన్నమయ్య కూడ మహాకవి, మహా పండితుడు, ఆయనలాగే వైష్ణవ క్షేత్రాలనేకం సందర్శించి ఆయా క్షేత్రమూర్తులను కూడా వేంకటేశ్వర పరంగా కీర్తించి వచాడ్చు. తిరుప్పాణాళ్వార్ వీణమీటుతూ భగవత్ గుణగానం చేస్తే, అన్నమయ్య దండెమీటుకొంటూ కీర్తనలు గానం చేసేవాడు, తిరుమంగై ఆళ్వార్, ఆండాళ్, నమ్మాళ్వార్‌ల లాగానే మధుర భక్తి భరితాలైన రచనల నేకం చేసి తనకున్న భగవద్విరహాన్ని అన్నమయ్యకూడా ప్రకటించుకొన్నాడు.

అలిమేలు మంగను పుత్రికగా భావించి, కల్యాణోత్సవంలో కన్యాదాతగా వ్యవహరించి అన్నమయ్యకూడా కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్‌ల లాగా విష్ణు శ్వశురస్థానాన్ని పొందాడు. అన్నమయ్య నమ్మాళ్వారు వైశాఖ మాసం విశాఖ

నక్షత్రంలోనే జన్మించారు. 16వ ఏటనే వీళ్లిద్దరికీ విష్ణు సాక్షాత్కారం సిద్ధించింది భగవత్ సాక్షాత్కారానంతరమే నమ్మాళ్వార్ తమిళ ప్రబంధ సృష్టికి ఉపక్ర మించాడు. అలాగే అన్నమయ్య కూడా తన సంకీర్తనయజ్ఞాన్ని ప్రారంభించాడు మధురకవి ఆళ్వార్ తన గురువు నుద్దేశించి "కణ్ణినుమ్ సిరుత్తాంబు" అనే ప్రబంధాన్ని రచించగా "చూడు డిందరికి సులభుడు" [53] వంటి అనేక కీర్తనలు రచించి ఆదివన్ శఠగోపయతుల పట్ల తనకు గల గురుభక్తి ప్రపత్తు లను ప్రకటించు కొన్నాడు అన్నమయ్య.

ఈ పరిశీలనవల్ల అన్నమయ్య, ఆళ్వారుల రచనలలోనే కాక జీవితాల్లో కూడ కొన్ని పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని వాళ్ల మనస్తత్వాలు, ఆలోచనా ధోరణులు వైవిధ్యం కన్నా ఏకత్వానికే ఎక్కువ సన్నిహితంగా ఉన్నాయని తెలుస్తూ ఉంది. దీన్ని బట్టి భిన్నకాలాలకు చెందిన వాళ్లైనా, వీళ్ల కాలం నాటి పరిస్థితుల్లోను, రచనల్లోను సామ్యాలు గోచరించే అవకాశం ఉంది.

## సూచికలు

1. ఆచార్య కోదండరామయ్య, తిమ్మావజ్జల 'అన్నమాచార్యులపై ఆళ్వారుల ప్రభావం' అన్నమాచార్య జయంత్యుత్సవ సందర్భంలోని ప్రసంగ వ్యాసం. (అముద్రితం)

2. డా॥ రాధాకృష్ణశర్మ చల్లా. 'తమిళ సాహిత్య చరిత్ర' పు. 47.

3. పులవర్ గోవిందరాజ మొదలియార్ కె. ఆర్. 'ఆళ్వారగళ్ వరలారు' ప్రథమ భాగం, పు. 4.

4. విశ్యాను సంధానం. పు 1

5. ఉపదేశ రత్నమాల, పు. 4. విశ్యాను సంధానం. పు. 103

6. ఆముక్తమాల్యద 1-10. సంపాదయిత శ్రీమాన్ రామదాసయ్యగారు నేలటూరు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, హైదరాబాదు 4

7. ఆముక్తమాల్యద, పీఠిక. పు. 13

9. Religion ond Philosophy of Nalayira Divya prabandham with Speoial reference to Nammalvar. Vol. II, Thesis submitted to S. V, University for the awarded of Degree of Ph. D., by Subbureddiyar, N. Chapter - I. The age of Alwars Appendix VII - p. 1134.

10. అనంతాచార్యార్. కొమాండూరు. 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్' 'పోయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు 7.

11. శఠగోపరామానుజాచార్య. పైము, గోపాలకృష్ణమాచార్య, పైము. 'ఆళ్వార్‌గళ్ చరితమ్' పు 5.

12. అనంతాచార్యార్, కొమాండూరు. 'మువాయిరప్పడిగురు పరంపరా ప్రభావమ్ 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు. 7.

13. అనంతాచార్యార్, కొమాండూరు, 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం ''పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు 7.

14. అనంతాచార్యార్, కొమాండూరు, 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్' పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు. 8.

15. పెరియతిరుముడియడవు [పూర్వాచార్యులు సేకరించిన ఆచార్య పరంపరా వైభవ సంగ్రహము] పు. 11. పరిశోధన తిరుమలాచార్యులు, కందాడై 1968.

16. అనంతాచార్యార్, కొమాండూరు. 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్' 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు 9.

17. శటగోప రామానుజాచార్య, గోపాలకృష్ణమాచార్య. వైము, 'ఆళ్వార్‌గళ్ చరిత్రమ్' పు. 16. వైము గోపాలకృష్ణమాచార్యర్, కంపెని.

18. " " " " పు. 18

19. అనంతాచార్యార్, కొమాండూరు, 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్' పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు. 12.

20. " " "

21. " " " పు. 22

22. 'Religion and Philosophy of Nalayira Divya Prabhandham with special reference to Nammalvar' Vol. I-P. 223

23. అనంతాచార్యార్, కొమాండూరు. 'మువాయిరప్పడి గురుంపరంపరా ప్రభావమ్ ' 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు. 16.

24. Religion and philosophy of Nalayira Divya prabandham with special reference to Nammalvar, Vol. I, p. 223.

25. Varadachari, K. C. 'Alvars of South India' (Tradition reveals that kulasekhara was the ruler of Trivancore and it is also clear from references in his hymns).

26. అనంతాచార్యార్, కొమాండూరు 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు. 16.

27. పెరియతిరుముడి యడవు (పూర్వాచార్యులు సేకరించిన వైభవ సంగ్రహం) పు. 16. పరిశోధన - తిరుమలాచార్యులు, కంచై 1968.

28. పుల్లవర్ గోవిందరాజ మొదలియార్, కె. ఆర్. 'ఆళ్వారగళ్ వరలారు' ప్రథమభాగం పు 120

29. పిన్‌పళగియపెరుమాళ్ జీయ్యర్ 'ఆరాయిరప్పడి గురుప్రభావం' పు. 35

30. " " " "

31. అనంతాచార్యార్, కొమాండూరు. 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం' 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు. 33.

32. శఠగోప రామానుజాచార్య, వై ము. గోపాలకృష్ణమాచార్య, వై ము. 'ఆళ్వారగళ్ చరిత్రం' పు. 24.

33. అనంతాచార్యార్, కొమాండూరు, 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం పొయ్‌గగై ఆళ్వార్ వైభవం' పు. 24.

34. Religion and philosophy of Nalayira Divya prabandham with special reference to Nammalvar, Vol. I, p. 226.

35. అనంతాచార్యార్, కొమాండూరు 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం' 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు. 26.

36. సుధాకర్ ఎ. 'ఆళ్వార్‌గళ్ అన్నమాచార్యార్ పాడల్గళ్ కణ్ణిన్ పిళ్లై తిరువిళ యాదల్ గళ్ ఓర్ ఒప్పాయువు' శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి ఎం. ఫిల్., డిగ్రీ కోసం సమర్పించిన లఘుసిద్ధాంత వ్యాసం, 1983.

37. Religion and philosophy of Nalayira Divya Prabandham with special reference to Nammalvar, Vol. I, P. 234.

38. అనంతాచార్యార్, కొమాండూరు. 'ముఖాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్ ''పోయ్‌గయ్ ఆళ్వార్ వైభవమ్' పు. 18.

39. పిన్‌పళగియపెరుమాళ్ జియ్యర్, ఆరాయిరప్పడి గురుపరంపరా ప్రభావమ్ పు 38.

40. అనంతాచార్యార్. కొమాండూరు, 'మువాయిరప్పడిగురుపరంపరా ప్రభావం, 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు. 19.

41. ,, ,, పు 12.

42 శఠగోప రామానుజాచార్య వై॥ము., గోపాలకృష్ణమాచార్య వై॥ము., 'ఆళ్వార్ గళ్ చరిత్రం' పు. 22.

43. పుల్లవర్ గోవిందరాజ మొదలియార్ కె ఆర్. 'ఆళ్వారగళ్‌వరలారు' ద్వి విభాగం, పు. 130.

44. అప్పిళ్లై సాధించిన నమ్మాళ్వార్ వాళి తిరునామంలో ఆయిదో పంక్తి దీన్ని వైష్ణవులు పారంపర్యంగా అనుసంధిస్తారు. దీనికి సంబంధించిన ఇతివృత్తం పిన్‌బళగియరాం పెరుమాళ్ జీయర్ రచించిన ఆరాయిరప్పడి 'గురుపరం పరా ప్రభావం' పు 93 లో ఉంది.

45. అనంతాచార్యార్, కొమాండూరు, 'మువాయిరప్పడి గురుపరంపరా ప్రభావం' 'పొయ్‌గయ్ ఆళ్వార్ వైభవం' పు 14

46. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు, సం. 12.

47. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర పీఠిక పు. 2-3. వేటూరి ప్రభాకరశాస్త్రి, ముద్రణ - 1978, ప్రచురణ తి. తి. దేవస్థానములు,

48. శృంగార సంకీర్తనలు. సం. 12 పీఠిక పు. 7—8,

49. శృంగార సంకీర్తనలు, సం. 12 పు. 57 పాట నెం. 82 రేకు. 14.

50. అధ్యాత్మ సంకీర్తనలు, సం 11, పు. 91-92 పరిష్కర్త, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ.

51. అన్నమాచార్య చరిత్ర, శ్రీతాళ్లపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) పు. 45. మూడవ ముద్రణ.

52. అన్నమాచార్య చరిత్ర పీఠిక పు 116-117, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ముద్రణ 1978, ప్రచురణ తి. తి. దేవస్థానములు.

53. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు, సం. 1. పు 80-81 పాట నెం. 117 రేకు. 19 ముద్రణ 1980, ప్రచురణ తి. తి. దేవస్థానములు.

# 2. సమకాలీన పరిస్థితులు

2. 0 ఏ రచయితగాని తను జీవించిన కాల పరిస్థితుల ప్రభావానికి లోనుగాక తప్పదు. ఆధ్యాత్మిక రచయితలు కూడా దీనికి మినహాయింపుకారు. కాబట్టి ప్రతి రచయిత రచనలోను, ఆయా కాలంనాటి పరిస్థితులు ప్రతిబింబిస్తాయి. వాటిని తెలుసుకోవడం వల్ల ఒక మధురానుభూతి కలుగుతుంది. అవి రచయిత రచనకు ఎంత వరకు ప్రేరకాలో ఊహించుకొని ఆనందించే అవకాశం కలుగుతుంది. కాబట్టి ఆళ్వారుల రచనల్లోను, అన్నమయ్య రచనల్లోను గోచరించే సమకాలీన పరిస్థితులు తులనాత్మకంగా పరిశీలించి అవి వాళ్ల రచనలకెంతవరకు ప్రేరకాలయ్యాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

2, 1 ఆళ్వారులు క్రీ. శ. 8, 9 శతాబ్దాల్లో జీవించిన వాళ్లని పండిత పరిశోధకుల అభిప్రాయం. అన్నమయ్య క్రీ. శ. 15వ శతాబ్దానికి చెందినవాడు. ఆళ్వారులు తమిళ ప్రాంతీయులు. అన్నమయ్య ఆంధ్ర దేశస్థుడు వీళ్ల సమకాలీన పరిస్థితులు తులనాత్మకంగా పరిశీలించడం ఎంత వరకు సమంజసమనే సంకోచం ఉదయిస్తుంది వీళ్ల రచనల్లో సామాన్వేషణను ప్రయత్నిస్తున్నపుడు,

జీవితాల్లోని పోలికలు పరిశీలిస్తున్నపుడు సమకాలీన పరిస్థితుల్లో సాదృశ్యాలు వెదకడం సబబుకాకపోదు. అందుచేత ఆళ్వారుల కాలంలోను అన్నమయ్య కాలంలోను నెలకొని ఉన్న పరిస్థితులను వాళ్ల రచనల ద్వారా తెలుసుకొని తుల నాత్మకంగా పరిశీలించ వలసి ఉంది.

అన్నమయ్యకు పూర్వులయిన ఆళ్వారుల కాలంలో నెలకొన్న పరిస్థితులను మొదట పరిశీలించడం సమంజసం. ఆళ్వార్లు కొందరు పాండ్యదేశంలోను, కొందరు చోళదేశంలోను, కొందరు పల్లవదేశంలోను, ఒకరు చేరదేశంలోను జీవించారు. కాబట్టి ఆళ్వారులు తమిళ భూమి కంతటికి సంబంధించిన వాళ్లని వాళ్ల సమకాలీన పరిస్థితులు, నాటి తమిళ ప్రాంతంలో నెలకొని ఉన్న పరిస్థితు లని భావించవచ్చు. వీళ్లందరు 8, 9 శతాబ్దాల్లో జీవించి ఉండటంవల్ల ఆళ్వారుల సమకాలీన పరిస్థితులు 8, 9 శతాబ్దాల్లో నెలకొన్న పరిస్థితులని అభిప్రాయపడడం సమంజసం. సమకాలీన పరిస్థితులను సాంఘిక పరిస్థితులని, రాజకీయ పరిస్థితులని వర్గీకరించుకోవచ్చు.

### 2. 1. 1 ఆళ్వారులనాటి సాంఘిక పరిస్థితులు

పల్లెలు, పట్టణాలు, పర్వతాలు, వనాలు నేటిలాగే నాడుకూడా భౌగోళిక ముఖ్యాంశాలుగా ఉండేవి. తక్కిన వాళ్లలాగే రచయితలు కూడా పల్లెలనంతగా పట్టించుకొన్నట్టు లేదు. కాబట్టి గ్రామాల గురించిగాని, గ్రామీణ వాతావరణం గురించిగాని మనకు తెలుసుకొనే అవకాశం చాలా తక్కువ. అంటి తోపులతోను అలయమంటపాలతోను, అందమైన సరస్సులతోను ఆనాటి గ్రామాలు అమల సౌందర్యంతో అలరారేవని ఊహించుకొనేందుకు కొంత అవకాశం ఉంది. విశాలమైన వీధులు, శిల్పనైపుణ్యాత్మకమైన గోడలతో కూడిన ఎత్తైన సుందర భవనాలు, వాటి మీద ధ్వజాలు పట్టణ శోభకు ప్రతీకలు. పర్వదినాల్లోను ఉత్సవాది దినాల్లోను, పట్టణ వీధులు పతాకాలతోను, తోరణాలతోను అలంకరింప బడి కన్నుల పండువుగా కనిపించేవి.

2. 1. 1. 1 సాంఘిక వర్గాలు

ఆనాటి సంఘంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనబడే చతుర్వర్ణాలతో బాటు అంత్య కులజులుగాను, పంచమ వర్ణంగాను అస్పృశ్యులు గాను, పురబాహ్యులుగాను పరిగణింపబడే మరో వర్గం కూడా ఉన్నట్లు తెలుస్తూ ఉంది.

బ్రాహ్మణులకు సంఘంలో అత్యున్నత స్థానం ఉంది. ఉత్తములుగా వారు గౌరవింపబడేవారు. బ్రాహ్మణులు నిత్యాన్నదాన భగవదారాధన, వేదా ధ్యయన తత్పరులు. వేదోక్త ప్రకారంగా త్రేతాగ్ని హోమాలు చేసేవారు. వేదషడంగాలు చక్కగా చదివి పండితులుగా, వక్తలుగా సమాదరణ సంపాదించు కొన్నారు. అంత్యమ కులాలు అని, అధమాధమ వర్గాలని కొన్ని వర్గాలు సంఘంలో అట్టడుగు స్థానాన్నే, ఉంచబడేవి క్షత్రియ, వైశ్య, శూద్ర, మొదలయిన వర్గాల స్థితిగతులు తెలుసుకొనేందుకు ఆధారాలు ఆళ్వారుల సాహిత్యంలో కనిపించడం లేదు.

2. 1. 1. 2 గృహనిర్మాణం

భవననిర్మాణంలో సిమెంటుకు బదులుగా తేనె గలిపిన సున్నం వాడినట్లు తెలుస్తూవుంది. ఇంటి వెనుక భాగంలో పెరడు, బావి, తోట, సమీపంలోనే పశువుల కొట్టం ఉండేవి. ఇళ్లకు ద్వారాలు, తాళాలు ఉన్నప్పటికి, రాజుల సౌధాలలోను, ధనికుల సౌధాలలోను కాపలా వాళ్లున్నట్లు తెలుస్తూ ఉంది.

2. 1. 1. 3 స్నాన, వస్త్రధారణాది విశేషాలు

నూనె, చింతపండు రాసుకొని నాటి జనులు అభ్యంగన స్నానం చేసేవారు కల్పలతా పుష్పదళంలాంటి మెత్తని వస్త్రాలు, ఎర్రని నూలుతో నేసిన చిన్న వస్త్రాలు. పట్టు వస్త్రాలు, మంచి అంచుల వస్త్రాలు పలుచని బట్టలు వాడకం కనిపిస్తూ వుంది' స్త్రీలు 'కచ్చుపట్ట' లు (వక్షానికి ఆచ్ఛాదనగా వేసుకొనే బట్ట) వాడేవాళ్లు.

2. 1. 1. 4 ఆభరణాలు

ఆళ్వారుల కాలంనాటి స్త్రీలు ఎక్కువగా ఆభరణాలు ధరించేవారు శిరో భూషణాలు. కర్ణాభరణాలు (బంగారు కమ్మలు), ముత్యాలహారం, కంఠాభరణాలు మాణిక్యహారాలు, గొలుసులు, భుజకీర్తులు, వలయాలు, కాపులు, శంఖుగాజులు వెండి, బంగారుగాజులు, చూడగాలు అనే హస్తాభరణాలు, ఉంగరాలు, ఉదర బంధాలు, మేఖలలు, బంగారు పాదాభరణాలు, మంజీరాలు, పాటకాలు కండిగలు కంచునగలు, వెండి నగలు వాడుకలో ఉండేవి. పురుషులు కూడా మకర కుండలాలు, భుజకీర్తులు, వక్షోభూషణాలు, హస్తాభరణాలు ఉంగరాలు, 'వీరకళల్' అని వ్యవహరింపబడే పాదాభరణాలు ధరించేవారు. చేతులకు పగడాలు కట్టుకునే అలవాటు కూడా ఉంది, పగడం, మరకతాలు మొదలైన రత్నాలు, ముత్యాలు వాడకంలో ఉన్నట్టు తెలుస్తూవుంది. కఱ్ఱ చెప్పులు, గొడుగు, విసనకఱ్ఱలు కూడా ఆ కాలంవారు వాడినట్టు తెలుస్తూ ఉంది

2. 1. 1. 5 అలంకరణ

ఆ కాలపు ప్రజలు కేశాలంకరణలో మిక్కిలి శ్రద్ధ కలిగి ఉన్నట్టు తెలుస్తూ ఉంది. పొడుగాటి వెంట్రుకలు పెంచడం ఉంగరాల జుత్తు పెంచడం వీళ్ల కేశాలంకరణలో చెప్పుకోదగిన అంశాలు దంతపు దువ్వెన, 'తూవియ' మనే కేశాలంకరణ పరికరం వీళ్ల కేశాలంకరణలో బాగా ఉపయోగపడేవి. స్త్రీలు శిగలో పూలు ముడుచుకొనేవారు సంపెంగలు, మల్లెలు, మల్లెలు మరుకొళుందు: మరువము, దవనము, పొన్నపూవు కురుక్కత్తి పూవు (మాధవీ కుసుమం) మాలతిపూవు మొదలయినవెన్నో వాళ్ల ఎరుకలోను, వాడకంలోను ఉండేవి. స్త్రీలు నుదుట సిందూరపు బొట్టు, కళ్లకు కాటుక పెట్టుకొనేవారు. వక్షోజాలకు గంధము, కుంకుమ రాసుకునేవారు.

ఆ కాలపువారు నెమలి ఈకలతో కూడా అలంకరించుకొనే వారు తమ అలంకరణ సరిగ్గా ఉందో లేదో చూచుకొనేందుకు కాంతివంతమైన అద్దాలుపయో గించేవారు. కస్తూరి, పచ్చకర్పూరం, చందనం, సందూరిపొడి మొదలయిన సుగంధ ద్రవ్యాలు వాడేవారు.

2. 1. 1. 6 ఆహార విశేషాలు

అన్నము, నెయ్యి, కూరలు, పెరుగు, మాంసం' చేపలు, నాటిభోజన పదార్థాలలో ముఖ్యమైనవి. తాంబూల చర్వణం కూడా వారి కలవాటు. మద్య పానం కూడా వాడుకలో ఉన్నట్టు తెలుస్తూ వుంది. పాలు, బెల్లం, కలిపి కాల్చిన గారెలు, పెసరపప్పు, బెల్లం కలిపి తయారు చేయబడే తినుబండారం, బెల్లంపాకం పట్టినలడ్డు, 'చేదై' అని వ్యవహరింపబడే ఒకరకమైన తిను బండారం, నువ్వులఉంట. ముద్దగా ఉడకబెట్టిన పప్పు మొదలయినవి. వాళ్ళ కాలంనాటి ఇతర తినుబండారాలు, బియ్యపు నూక గంజి కూడా అపత్సహాయ కారిగా వాడబడేది.

మంచాలు వాడబడుతున్నట్లు తెలుస్తూ ఉంది. తనికులు దంతపు చెక్క-డంతో కూడిన కాళ్ళు కలిగిన మంచాలు వేసుకునేవారు. దూదిపాసుపు సుప్ప తల్పం వాడకంలో వుండేవి.

2. 1. 1. 7 ఆర్థిక విశేషాలు :

ఆనాటి ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. వరి ప్రధానమైన పంటగా ఉండేది. చెరకు ప్రత్తి. కందులు, నువ్వులు, కొర్రలు మొదలైనవి తక్కిన పంటలు. సారవంతమైన నేలలు విశాలమైన మళ్లు సేద్యానికనుకూలంగా ఉండేవి. వరి వంగడాలు నారుపోసి నీరు పారించి ఎరువువేసి అరకతో బాగా దున్ని నారు మొక్కలను వరి పొలాలలో నాటి కలుపు తీసి బాగా ఎదిగి వచ్చిన పంటను కోసుకొనేవారు. కొంత జాతివారు కొర్రలు పైరు చేసేవారు. చెరకు నుంచి గానుగ సహాయంతో బెల్లం తయారు చేసేవారు.

ఉన్నత ప్రదేశాలనుంచి ప్రవహించే నీళ్లను నిలువ చేసేందుకు నిర్మించిన చెరువులు, బావులు, సెలయేళ్లు, పంపానది, పొరుణైనది, కావేరి వంటి నదులు వ్యవసాయాభివృద్ధికి ముఖ్య జలాధారాలు. పైన పేర్కొన్న వనతులతో వ్యవసాయం అభివృద్ధిచెంది ముక్కారు పంటలతో తమిళనేల నిరంతర సస్య శ్యామలంగా ఉండినట్టు తెలుస్తూవుంది.

పిండ్లు మొదలైన యుద్ధపరికరాలు తయారుచేసి కొందరు, వేటకు వెళ్లి తెచ్చిన మాంసాన్ని విక్రయించుకొని మరి కొందరు జీవించేవారు. వలలతోను గాలంతోను, చేపలు పట్టి కొందరు జీవిస్తే. సముద్ర ప్రాంతీయులు కత్రపడవల సహాయంతో సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టి పొట్టపోసుకొనేవారు కొందరు ధనికుల ఇళ్లలో ఊడిగం చేసి వచ్చే ధనంతో జీవనయాత్ర సాగించేవారు. మరి కొందరు అన్నానికే తమ శ్రమనంతా వారపోసేవారు. యాచక వృత్తి కూడా సాగుతున్నట్టు తెలుస్తూవుంది. ఓడలు, పడవలు, దోనెలు, సరుకుల రవాణాకు, మనుష్యుల రాకపోకలకు బాగా తోడ్పడేవి. స్వదేశ విదేశ వాణిజ్యాలు బాగా సాగుతున్నట్టు తెలుస్తూవుంది. కాలాన్ని, దూరాన్ని కూడా పరిగణించకుండా ఆలుబిడ్డలను కూడా విడచి ధనార్జన కోసం వణిజులు దూర ప్రాంతాలకు వెళ్లేవారని కూడా తెలుస్తూవుంది. బంగారు రాసులు గజయూథాలు, తీసుకొని వచ్చే ఓడలతో మహాబలిపురం ఓడరేవు ఎప్పుడూ క్రిక్కిరిసి ఉండేదట. ఇది నాటి విదేశీ వాణిజ్య స్థితికి చక్కటి ప్రమాణం.

## 2. 1. 1. 8 సాంస్కృతికాంశాలు

బిడ్డపుట్టిన 12వ నాడు ఊయల కట్టి శిశువును అందులో పడుకోబెట్టి జోలపాడుతూ ఊపేవారు. తలకు చమురంటించి, నామకరణం చేసేవారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు కానుకలు తెచ్చి బిడ్డ తల్లిదండ్రులకు ఇచ్చేవారు బిడ్డ తల్లిదండ్రులు తాంబూలాదులతో వచ్చినవాళ్లను సత్కరించేవాళ్లు. వైష్ణవుల పిల్లల కాళ్లమీద శంఖచక్రాల ముద్రలు వేసేవాళ్లు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలలో ఉపనయనం సముచితకాలంలో నిర్వహించేవారు. అన్ని కులాలలోనూ 'చౌలం' ఆచారంలో ఉండేది.

ప్రేమికులు సంకేతాలేర్పరచుకొనేవారు. పరస్పరం కానుకలు పంపుకునేవారు. విరహం ప్రకోపించినపుడు యుక్తాయుక్తశూన్యులై తాపం తగ్గేందుకు కెందూళి కూడా తినేవారని విదితమవుతుంది. ప్రేమికులు తమ వాళ్లను విడిచి

పెళ్లి, అపవాదానికి గురయ్యే సంఘటనలు కూడా ఉన్నట్టు తెలుస్తూవుంది. వివాహ విషయంలో సార్వత్రిక విధానమేదీ అమల్లో ఉన్నట్టు తెలియడంలేదు. వేటగాళ్లలోను, కొండజాతుల్లోను స్త్రీ పురుషులు కలిసి జీవించటంతో దంపతు లయ్యేవారు. ప్రత్యేకించి పెండ్లి అక్కర ఉండేది కాదు. ఉన్నత కులస్థులు ఊరూ నాడూ ఎగిరేటట్లు పెండ్లి చేసుకొనేవారు. తక్కున వర్గాల పెళ్లి ఎలా ఉండేదో తెలుసుకొనే ఆధారం లభించలేదు. కానీ ఆండాళ్ తన 'నాచ్చియార్ తిరుమొళి' గ్రంథంలో ఒక పెళ్ళి విధానాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రించింది. అది బ్రాహ్మణుల ఆడపడుచు వర్ణించడం వల్ల బ్రాహ్మణుల ఇంటిపెళ్ళిగా భావించడం సమంజసమనిపిస్తూ ఉంది.

నిశ్చితార్థ కార్యక్రమంలో వధువుకు కొత్తచీర కట్టబెట్టి పుష్పమాలికలు ధరింపజేసేవారు. పెళ్లికి శుభలగ్నం నిర్ణయించేవారు. పాలై, కముగు(పోక) వృక్షాలతో పెళ్ళి పందిరి వేసేవారు. పురమంతా తోరణాలతో అలంకరించి పూర్ణకుంభాలతో పెళ్ళికై తరలి వచ్చిన పెళ్ళి కొడుక్కు, అతని బృందానికి స్వాగతం చెప్పేవారు. యువముత్తైదువలు మంగళ దీపాలతోను, పూర్ణకుంభా లతోను తరలిపెళ్ళి కొడుక్కు స్వాగతం పలికేవారు. సుస్నాతులై పెద్దల ఆశీర్వచనాలతో వధూవరులిద్దరు కంకణ ధారణ చేసేవారు. కన్యాదాత వధువు చేతిని వరుని చేతిలో ఉంచి బొరుగులు పంచే ఆచారం ఉన్నట్టు వ్యక్తమవుతుంది హారాలు వేలాడుతున్న పందిరి క్రింద, మంగళ వాద్యాల నడుమ పాణిగ్రహణం జరిగేది. వధూవరులిద్దరూ అగ్నిప్రదక్షిణం చేసి 'సన్నికల్లు' తొక్కేవారు. కుంకుమ, చల్లని చందనం మొదలైన సుగంధ ద్రవ్యాలు రాసుకొని మత్త గజాన్నెక్కి ఊరేగేవారు. తరువాత నూనె, పసుపు కలిపిన వసంతజలాన్ని వధూవరులు పరస్పరం పోసుకునేవారు.

పురుషులు బహుస్త్రీ సంపర్కం కలిగిఉన్నట్టు కూడా తెలుస్తూఉంది. దేవ దాసీవర్గం, తమ ఆట పాటలతో దేవునారాధించడంతోబాటు, హావభావాలతో తమ విలాస క్రీడలతో రసికుల నాహ్లాదపరచేవారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసి పైతృకాలను నిర్వహించే అలవాటు కూడా ఆ కాలం వారికుంది.

### 2. 1. 1. 9 స్త్రీల స్థితి

స్త్రీలు ప్రాతఃకాలాన్నే లేచి జలాశయాల్లో స్నానం చేసి ఇష్టంవచ్చిన వ్రతాన్ననుష్ఠించే స్వేచ్ఛ కలిగి ఉన్నట్లు తెలుస్తూఉంది. భర్త దుర్మార్గుడైనా అతని పట్ల అశేష భక్తి గలిగి ఇతరం తెలియని ఇల్లాలు ఉన్నత సంస్కారవతి, శీలవతి, గుణవతి అని కొనియాడబడేది.

### 2. 1. 1. 10 పిల్లల ఆటలు

బాలికలు బొమ్మరిల్లు కట్టుకొని, వండిలి మన్ను, చిన్నకుండ, చిన్నచేటలు ఆటబొమ్మలు, బంతి మొదలయిన వస్తువులతో ఆడుకునేవారు. 'కెంగిరై' ఆడటం, 'కరల్' అనే కాయలతో 'అమ్మానై' అనే ఆట ఆడటం వంటివి పిల్లల ఆటలలో మరికొన్ని.

### 2.1.1.11 కళలు :

ఆ కాలపు కళలలో సంగీతం, చిత్రలేఖనం, నాట్యం మాత్రమే ఆళ్వారుల రచనలలో చోటు చేసుకున్నాయి. తక్కిన వాటిని గురించి తెలుసుకునే అవకాశం కలుగలేదు. ఆలయాల ప్రసక్తి ఉండడంవల్లను, గొప్ప భవననిర్మాణం జరిగినట్టు తెలుస్తుండటం వల్లను శిల్పకళ కూడ మంచి స్థితిలోనే ఉండినట్టు ఊహించుకోవచ్చు. ఇంతకుమించి దాని స్వరూపస్వభావాలు గురించి తెలుసుకునే అవకాశం లేదు.

సంగీత కళ మంచి స్థితిలో ఉండి ఉండాలి. సంగీత శాస్త్రం అనాటికే రూపొందింపబడి ప్రచారంలో ఉంది. పాటలకు బాణీలు కట్టిపాడుకునే అలవాటు కూడా ఆ కాలపు వారికుండేది. 'కురుంజి' మొదలయిన రాగాలను కూడా ఆలపించేవారు. కామరం, మరుళ్, మొదలయిన 'పణ్'లు కూడా వాడుకలో ఉన్నట్టు తెలుస్తూఉంది. కింకిణి, పిల్లనగ్రోవి, వీణ, తప్పెట, మద్దెల మొద లయినవి నాటి వాద్యాలలో కొన్ని.

చిత్రకళ కూడా బాగా అభివృద్ధి చెందినట్లు తెలుస్తూవుంది. చిత్రకారులు చక్కటి బొమ్మలు చిత్రించేవారు.

బాలికలు నాట్యాన్ని అభ్యసించేవారు. దేవాలయాలలోను, రాజసభలలోను ధనికుల ఇండ్లలో జరిగే విశేష కార్యక్రమాలలోను దేవదాసీల నాట్యాలు జరిగేది. అన్నివర్గాలవారు ఆ నాట్యాన్ని తిలకించి ఆనందించేవారు.

2.1.1.12 కొన్ని నమ్మకాలు

నలతువ కలిగినప్పుడు ఇతరుల దృష్టిదోషం తగిలిఉంటుందని నమ్మి తన్నివారణచర్యలు తీసుకొనేవారు. వేదశాస్త్రాల ప్రమాణంగా మనిషినగటు వయసు నూరేండ్లని భావించేవారు. చుట్టూ ఒక పెద్దగీత గీచి అందులో వలయాలు గీసి అవి లెక్కపెట్టగా సరి సంఖ్యతో ముగిస్తే ప్రేమికులకు కార్యసిద్ధి బేసి సంఖ్యతో ముగిస్తే సిద్ధి కాదనే నమ్మకంతో 'గురి' చూసేవారు మానసికంగానో శారీరకంగానో అనారోగ్యవంతులయిన వాళ్లను ఆరోగ్యవంతులుగా చెయ్యడానికి తెలుకలసాని ఎరుక అడిగేవారు, వాళ్లు చెప్పినట్లు బొగ్గులతో కలిపిన నల్లటి అన్నము, నెత్తురు అన్నము చౌరస్తాలో పెట్టేవారు. 'పెంబోతు' (ఒకానొక పక్షి) ఎడమనుంచి కుడికివస్తే మంచి శకునమని నమ్మేవారు.

కాకి అరిస్తే ఎవరయినా వస్తారని విశ్వసించేవారు. అనబెట్టి తప్పితే హాని వాటిల్లుతుందనే అదృష్టం మీద నమ్మకం, పాపపుణ్యాల నమ్మకం, నుదుటి వ్రాతపై నమ్మకం, మొదలయినవి ఆ కాలం వాళ్ల ఇతర నమ్మకాల్లో కొన్ని.

2.1.1.13 ఇతర విశేషాలు

కల్లుచల్లి వాద్యాలు మ్రోగిస్తూ పూనకాలాడించేవారు. వాద్యాలు మ్రోగుతుండగా శివమెత్తి ఆడుతూ దుర్భాషలాడటం కూడా విశ్వాసాల్లో ఉండేది.

చక్కటి వైద్య విధానం అమల్లో ఉండినట్లు తెలుస్తూవుంది. ఆయా జబ్బులకు తగిన మందులప్పటికే వాడుకలో ఉండేవి. శస్త్రచికిత్స చేయడం, కాల్చడం వంటివి నాటి వైద్య పద్ధతులు.

నాటి వర్ణమాలలో 16 అచ్చులు, 33 హల్లులు ఉండేవి. గద్య, పద్య కథా సాహిత్యం, మనుస్మృతి, భగవద్గీత, ఆ కాలంనాటికే ప్రాముఖ్యాన్ని పొందినట్లు తెలుస్తూవుంది. వ్యాకరణానికి ప్రముఖ స్థానం ఉండేది. ఇంద్రజాలం వంటి విద్యలు కూడా వారికి తెలుసు. నక్షత్రాది భగోళ పరిజ్ఞానం కూడా వారికుండేది.

శత్రువుల నిందకు, పెద్దల నిందకు, భయపడేవారు. ధర్మాన్ని కొంచెం కూడా లక్ష్యపెట్టకుండా, ఇతరులందంతా తనకే వచ్చి చేరాలని, దానికై దుర్మార్గాలను అనుసరించే దురాశాపరులు కూడా నాటి సంఘంలో లేక పోలేదు. హత్యలు, దొంగతనాలు, జూదాలు వంటివి ఆనాటి నేరాలు.

'అడికలు' అనే తినుబండారంతోబాటు పాలుపోసి చిలకను గూటిలో ఉంచి పెంచేవారు. వేట కుక్కలు, పశువులు, గేదెలు, కోళ్లు వారి ఇతర పెంపుడు జంతువులు. కాసుకు పిడికెడు వరిధాన్యమమ్మిన కరువు కాలాలు కూడా నాటి ప్రజలు ఎదుర్కొన్నట్లు తెలుస్తూ ఉంది. అటువంటి క్లిష్టపరిస్థితుల్లో ప్రత్యుపకారం ఎదురుచూడని సహృదయులు ధర్మగారాలు తెరిచి అన్నదానం చేసేందుకు ముందు కొచ్చేవారు.

### 2. 1. 2 ఆళ్వారుల నాటి రాజకీయ పరిస్థితులు

ఆళ్వారుల నాటి రాజకీయ పరిస్థితుల సమగ్ర స్వరూపాన్ని తెలుసుకునేందుకు కావలసిన ఆధారాలు వాళ్ల రచనల్లో మనకు లభించటంలేదు. కానీ వాళ్ల రచనలను బట్టి నాటి రాజకీయ వ్యవస్థ కొన్ని అలవాట్లు, కొన్ని చారిత్రక విశేషాలు తెలుసుకొనే వీలుంది.

రాజే రాజ్యానికి సర్వాధికారి, సర్వోన్నతుడు. కుగ్రామ సముదాయ పాలకులకు సామంతులకు కూడా అతడే రాజు కావటంవల్ల రాజరాజని వ్యవహరింప బడేవాడు. రాచరిక ధర్మానికి సంబంధించిన కొన్ని అంశాలు 'దివ్య ప్రబంధం' లో మనకు గోచరిస్తాయి. రాజు సింహాసనాసీనుడై శ్వేతఛత్రం

క్రింద పాలన కొనసాగించేవారు. ఏనుగులవంటి వాహనాలతోను, పరిజనంతోను వచ్చే రాజుల రాకను భేరి వంటి వాద్య విశేషాలు సూచించేవి. రాజు ప్రజలకు కావలసిన సౌకర్యాలన్నీ చేయనప్పటికీ అతనిపట్ల చెక్కుచెదరని విధేయత, భక్తి విశ్వాసాలు కలిగి ఉండటం వారి లక్షణంగా భావించబడేది.

పరిపాలనా వ్యవహారాలలో రాజుకు సలహాలిస్తూ రాజాజ్ఞ అమలును పర్యవేక్షించే మంత్రిమండలికి సంబంధించిన విషయమేదీ ఆళ్వార్ల రచనల్లో ప్రస్తావనా మాత్రంగా కూడా కనిపించటం లేదు. వివిధ స్థాయిలకు చెందిన పాలనా వ్యవస్థను గురించి తెలుసుకొనేందుకు కూడా సుస్పష్టమైన ఆధారాలేవీ లేవు. ఒక రాజు క్రింద కొందరు సామంత రాజులు, ఒక సామంతరాజు క్రింద కొందరు గ్రామ సముదాయ పాలకులు పరిపాలనకొనసాగించినట్లు తెలుస్తూ ఉంది. గ్రామ పాలకులను చిన్న రాజులని వ్యవహరించేవారు.

రాజులు ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే వైనం బోధపడటం లేదు. కాని సామంతులు సార్వభౌములకు కప్పం చెల్లించే ఆనవాయితీ కనిపిస్తోంది. ఈ కప్పం నగదు రూపంగా ఉండేదో, వస్తు రూపేణా చెల్లించబడేదో తెలుసుకునే అవకాశం లేదు. ముఖ్యమైన నగరాల చుట్టూ ఎత్తయిన గోడలు, లోతైన అగడ్తలు నిర్మించటం వల్ల శత్రువులకు నగర ప్రవేశం దుస్సాధ్యంగా ఉండేది.

అణిగిమణిగి ఉండని రాజుల అధికారం అంతం చేసి తమసామ్రాజ్యాన్ని విస్తరింప జేసుకోవాలనే ఆకాంక్ష సామ్రాట్లకు సహజంగా ఉండేది. తత్ఫలితంగా తరచు యుద్ధాలు జరుగుతుండేవి. నిరంతర రణశంఖారావం శాంతికపోత స్థితికి సవాలుగాపరిణమించేది. రాజుల స్తోమతకు తగ్గట్టు సైన్యాలుపోషించబడేవి సైన్యంలో ప్రధానాంగాలైన రధ, గజ, తురగ, పదాతులతో బాటు అగ్నిదళం వంటి ఉపాంగాలు కూడా ఉండినట్లు తెలుస్తూఉంది. 'మఴు' [ఆయుధం] 'కుట్రుదైవాళ్' [ఆయుధం]. ఈటెలు, శూలాలు, వేలాయుధాలు, కత్తులు ఇనుప రోకళ్లు, విల్లంబులు మొదలైన ఆయుధాలు వాడుకలో ఉండేవి. ఆయుధాలు తయారుచేసి భద్రపరచుకునేందుకు ఆయుధశాలలు కూడా ఉండేవంటే ఆ కాలం వారి సమరోత్సాహం కొంత ఊహించుకోవచ్చు.

రాజులు శత్రువులందరు భయపడేవారు. యుద్ధంలో ఓడిపోయిన వారి సంపదలు దోచుకోవడమే గాక, వారి స్త్రీలను గూడా చెరబట్టి తెచ్చుకునేవారు. రాజుల క్రౌర్యానికి శత్రువులు వారికి చెందినవారు మాత్రమేగాక స్వీయప్రజలు కూడా అప్పుడప్పుడు గురి అవుతున్నట్లు తెలుస్తూఉంది.

చారిత్రకాంశాలు కూడా, ఛాయామాత్రంగా గోచరిస్తున్నాయి. మధుర రాజు కులశేఖరుడు అనే ప్రయోగం వల్ల! చేర రాజైన కులశేఖరుడు పాండ్యుల జయించినట్టు స్పష్టమవుతుంది. వైరమేఘుడనే పల్లవరాజు కంచిని రాజధాని చేసికొని పరిపాలించినట్టు తెలుస్తూఉంది. సర్వోత్కృష్టుడైన పల్లవరాజొకడు, పాండ్యులకు సింహస్వప్నంగా పరిపాలించినట్టు తెలుస్తూఉంది కానీ అతడెవరిని మాత్రం తెలియడం లేదు. కరూర్ అస్తవ్యస్తంకాగా, సైన్యం సమసిపోగా చోళుల పై పాండ్యులు విజయం సాధించారు అటువంటి పాండ్యులను పల్లవులు పరాజయంపాలు చేశారు నెన్‌మెలి నగర పాలకుడైన పిల్లవన్ అనే రాజును కూడా పల్లవ రాజులు భయపెట్టారు దీన్ని బట్టి పల్లవులు బలవంతులుగా వుండే వారని ఊహించుకోవచ్చు.

కోచెంగణాన్ అనే చోళరాజు కోవిల్ వెణ్ణి అనే ప్రదేశంలో తన శత్రువులను హతమార్చారు చోళసంతతికి చెందిన కొంకదేశపు రాజొకడు విళందై వేల్ అనే శత్రురాజును నిర్జించాడు తిరుమంగూరి యుద్ధంలో కూడా చోళులు విజయాన్ని సాధించినట్టు ద్యోతకమవుతూ ఉంది. పై అంశాలను బట్టి పల్లవుల, చోళుల, చేరుల ఆధిక్యత తేటపడుతూ ఉంది. అయితే పాండ్యుల పరిస్థితికి సంబంధించి ఆళ్వారులు ప్రస్తావించక పోవడం విడ్డూరంగా ఉంది.

### 2. 1. 3 ఆళ్వారులనాటి మత పరిస్థితులు

ప్రజల్లో నాస్తికులు, ఆస్తికులు ఆ కాలంలోనూ ఉండేవారు. నాస్తికులను పాషండులని కూడా వ్యవహరించేవారని వ్యక్తమవుతూవుంది. ఆనాడు హిందూ, బౌద్ధ, జైనాలు ముఖ్యమతాలు. ముస్లిముల దండయాత్రలప్పటికింకా జరగక పోవడంవల్ల ఇస్లాంమత ప్రభావం ఎక్కడా గోచరించదు.

హిందూమతంలో శైవం, వైష్ణవం, శాక్తము, గాణాపత్యం, కౌమారం సౌరం అనేవి శాఖలు. వీటివి షణ్మతాలు అని కూడా అంటారు. వీటిలో శైవ వైష్ణవాలు ప్రధానాలు. వీటికి చెందిన తీవ్రవాదులను వీరశైవులు అని అంటారు వీరిలో పరమత ద్వేషం ఎక్కువ.

2. 1. 3. 1 వైష్ణవం

ఇది విష్ణువే ప్రధాన దైవంగా కలిగిన మతం. బ్రహ్మాది దేవతలందరినీ, కూడా సృజించినవాడు విష్ణువేనని. అజ, హరులకు సైతమతడు అగోచరుడని వైష్ణవుల భావన. విష్ణువు తప్ప తక్కినవారెవరూ దేవతలు కారని వారిలో కొందరి భావం.

మంత్రపూర్వకంగా ప్రేల్చబడిన హోమాగ్నిలో కాచి, శరీరంమీద శంఖ చక్రముద్రలు వేసుకోవడంవంటి పంచ సంస్కారాలతో ప్రజలు వైష్ణవ దీక్ష పొందేవారు. గురుముఖంగా మంత్రోపదేశం పొందేవారు. అష్టాక్షరి మంత్రం వారికి చాలా పవిత్రమయింది. అందుతో నామాలు వేసుకొనేవారు. భగవద్విగ్రహానికి సమర్పించిన వస్త్ర తులసీమాలికలు ధరించడం, ప్రసాదాన్ని స్వీకరించడం వైష్ణవులకు ప్రీతిపాత్రాలు వైష్ణవాలయాల నాశ్రయించి జీవించడం కొందరు కర్తవ్యంగాను, ఘనతగాను, భావించేవారు. విష్ణువునే గాక విష్ణుదాసులను కూడా ఆరాధ్యులుగా, విష్ణు సదృశులుగా వైష్ణవులు భావించే వారు, విష్ణుదాసుల ఎంగిలి తిన్నను పునీతులవుతారని వారి విశ్వాసం.

2. 1. 3. 2 సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలు

తిరుక్కోట్టియూర్, తిరుక్కుడందై (కుంభకోణం) తిరుమల తిరుపతి, మాలిరుంచోలై, శ్రీవిల్లిపుత్తూరు, తిరుక్కండత్తురై కండయంపది, తంజావూరు, తిరుత్తణ్ కాల్, తిరుప్పార్ కడల్, తిరుక్కడన్ మల్లయి (మహాబలిపురం), కణ్ణపురం, తిరువణ్ వండూర్, ఆళ్వై విల్లిమంగలం, కోటూర్, పులియంగుడి,

తిరుప్పాడం, తిరుచ్చిట్రూరు, తిరుకడిత్తానం, కుట్టనాట్టు తిరుపులియూర్, తిరుపులింగుడి, వరగుణమంగై, శ్రీవైకుంఠం, తిరుమూళిక్కళం, తిరునావాయ్, మాపీర్‌మంగై, బదరి, సాలగ్రామం, తిరుక్కురుంగుడి, అహోబిలం, తిరుమంగై, తిరువల్లూరు, తిరువళ్ళిక్కేణి, నరైయూర్, తిరువాలి, తిరుకోవలూర్, తిరుపీర్‌మలై, తిరువిడంపై, తిరుప్పుట్కుళి, కంచి, తిరువట్టబయకరం, తిరుమహేంద్రపురం, తిల్లయితిరుచిత్రకూటం, (చిదంబరం). శీర్‌కాళి, తిరునాంగూర్, తిరువిందళూర్, తిరువెళ్ళియంగుడి, తిరుప్పుల్లం, బూదంగుడి తిరువెళ్ళారై, తిరుత్తణ్‌కాలూరు, తిరుకరంబనూర్, తిరుకణ్ణమంగై, పిరుపుళియూర్, తిరుకణ్ణంగుడి, తిరుపుల్లాణి, తిరునాగై, తిరుచేరై, తిరుకండియూర్, తిరునీరగం, తిరువల్లవాళ్, శ్రీరంగం, తిరుక్కడిగై అనేవి ఆళ్వారులనాటి ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రాలుగా పేరు పొందాయి.

## 2. 1. 3. 3 బౌద్ధులు, జైనులు

బౌద్ధులు కావిబట్టలు కట్టుకొనేవారు. జైనులుకూడా కావిదుస్తులు వేసుకొనేవారు. నెమలి ఈకలతో చేసిన గొడుగు, చిన్న విసనకర్రను ఎప్పుడూ వారి దగ్గర ఉంచుకొనేవారు. వీరిని గూర్చి తెలుసుకొనేందుకు ఇంతకంటే ఎక్కువ ఆధారాలు ఆళ్వారుల రచనలలో కనిపించడం లేదు.

## 2. 1. 3. 4 మతస్పర్థలు

బౌద్ధ జైన, శైవ, వైష్ణవులు తమ తమ దేవతలే సర్వోత్కృష్టులని కొనియాడుతూ తక్కిన వారధములని విమర్శించేవారు. తద్వారా మతకలహాలు, ఆందోళనలు తరచు తలెత్తేవి. శైవ, బౌద్ధ, జైనులు అల్పులని వైష్ణవుల భావన. బౌద్ధ, జైన మతాలు నీచధర్మ సమన్వితాలని వైష్ణవుల అభిప్రాయం. జైన, బౌద్ధగ్రంథాలు కుటిలాత్మకాలని వైష్ణవులవాదన. జైనులు పరిశుద్ధులు కారని, భయం, సిగ్గు లేని వారని వైష్ణవులు తూలనాడేవారు.

హిందూమతంలోని శాఖల్లోనూ శైవ వైష్ణవాలకే ప్రధాన స్పర్థ. మత పరమైన వివాదాలు తలెత్తేవి. తమ తమ వాదాలు నెగ్గించుకోవడానికి అనేక పద్ధతుల నవలంబించేవారు. శివ, విష్ణువులకు సమానత్వాన్ని అంగీకరించక విష్ణువే శ్రేష్ఠుడని వైష్ణవులు భావించేవారు.

భగవంతునికి రూపం ఉందని, అతడు సగుణుడని శైవ వైష్ణవ వాదులు ప్రతిపాదిస్తే అతడు రూపంలేని వాడని నిర్గుణుడని అవన్నీ మన మాపాదించు కొంటున్నవేనని కొందరు వాదించేవారు. వీళ్ల అద్వైతులని భావిస్తే శంకరాచార్యులు స్థాపించిన అద్వైతమతం కూడా అప్పటికి తనస్థానాన్ని కోల్పోలేదని విదితమవుతూంది.

## 2. 1. 3. 5 కర్మకాండ

ఆళ్వారుల కాలంలో మతపరమైన కర్మకాండ పరిశీలనార్హం. ఈ కాలం లో ఆలయ నిర్మాణం బాగా సాగినట్టు తెలుస్తూ ఉంది. సుప్రసిద్ధ చరిత్రకారులైన నీలకంఠశాస్త్రిగారు 'History of South India' (P. 153) అనే తమ గ్రంథంలో ఈ అంశాన్ని 'It was marked by great activity in temple building' (733-744 A. D,) అని బలపరిచారు. పెద్ద పెద్ద భవనాలవంటి ఆలయాలు నిర్మింపబడ్డాయి, కుడ్యచిత్రాలు, చిత్రపటాలు, విగ్రహాలు ఆరాధ్య మూర్తులుగా కొనసాగేవి. విగ్రహాలు రాతితోకూడా చేయబడేవి. పుష్ప తీర్థ, ధూప దీప నైవేద్యాలతో అర్చనలు జరిగేవి. దేవతా మూర్తులకు ఉత్సవాలు ఊరేగింపులు కూడా జరిగేవి.

షణ్మతాలకు చెందిన దేవతలనేకాక చిల్లర దేవతలను ఉపాసించే ఆచారం కూడా ఉండేది. జంతు బలులతో బాటు నరబలి కూడా వాడుకలో ఉన్నట్టు తెలుస్తూఉంది. రావి మానుచుట్టడంలాంటి ఆచారాలు కూడా సామాన్యులలో కనిపిస్తాయి.

తక్కిన దేవతలతోపాటు మన్మధుణ్ణి కూడా ఉపాసించినట్లు తెలుస్తుంది. పుష్యమాసంలో (తైనెల) ఒక ప్రదేశాన్ని గోమయంతో అలికేవారు. మాఘ శుక్ల పక్షంలో (మాశినెల) వీధులంతా ఇసుకతో అలంకరించి మన్మథునికి, స్వాగతం చెప్పేవారు. ప్రాతః కాలంలోనే లేచి స్నానం చేసి జనులు ముళ్లు లేని పుల్లలతో ప్రేలుస్తూ ఉమ్మెత్త, మోదుగ పుష్పాలతో మన్మథపూజ చేసేవారు. ఫాల్గుణం (పంగుణినెల) లో కామతంత్రవిశారదులను ముందుంచుకొని మన్మథుని ఉద్దేశించి ఎదురు నోమునోచేవారు. పచ్చిబియ్యం, కాయగూరలు, చెరకు బెల్లం, అటుకలు మొదలయిన వాటిని పచనం చేసి, నివేదించేవారు. కామశాస్త్ర విశారదులై సుస్వరం కలిగినవారి మంత్ర పఠనంతో మన్మధుణ్ణి ఆరాధించేవారు. ముఖ్యంగా యువతులు ఈ మన్మధారాధనలో ఆసక్తి చూపేవారని తెలుస్తూఉంది.

రేపల్లెలో గోపికలు అనుష్ఠించినట్లు చెప్పబడే 'తిరుప్పావై'నోము నోచే వారు. ప్రాతః కాలాన్నే లేచి కన్యలెంతో శ్రద్ధతో ఈ వ్రతాన్ని ఆచరించే వారు. వ్రతసమయంలో కాటుక పెట్టుకోవటం, పూలు ముడుచుకోవటం వంటి అలంకరణను విసర్జించేవారు. అనుచిత సంభాషణ, అనుచిత కృత్యాచరణ మొదలయిన వాటికి దూరంగా ఉండేవారు. నెయ్యి, పాలు, మొదలయినవి స్వీకరించడం మాని వేసేవారు. కోరుకున్న కోడెగాడు కొంగుపట్టుక తిరగాలన్నదే ఈ కోమలాంగుల కోరిక. చిన్న చిన్న నోములు నోచే అలవాటు కూడా ఆకాలం వారిలో ఉంది.

ప్రజలు నిరాహారులై శరీరాన్ని కృశింపజేసి తపస్సు చేయడం, కూడా ఉండేది. తాపసులు కాషాయ వస్త్రధారులు నిరాడంబర వేషులు ఆ కాలం ప్రజలు తీర్థయాత్ర చేయటంలో మిక్కిలి మక్కువ చూపినట్లు తెలుస్తూ ఉంది.

ఆకాలంలో యజ్ఞాలు చేసే అలవాటు కూడా ఉండేది. యాగ భూమిని దున్ని చదునుచేసుకునేవారు. యూపస్తంభంనాటి బలిపశువుతోను యజ్ఞ ద్రవ్యంతోను, మంత్రపూర్వకంగా, యజ్ఞయాగాదులు చేసేవారు. యజ్ఞ

సమయాల్లో సామవేదాన్ని గానం చేసేవారనికూడా తెలుస్తూఉంది. యజ్ఞాంతంలో అవభృధస్నానం చేసే ఆచారం కూడా ఉంది. యజ్ఞం చివర దక్షిణ లిచ్చి వచ్చిన వారిని సత్కరించే వైనం కనిపిస్తుంది.

2. 1. 3. 6 కొన్నినమ్మకాలు

ఆళ్వారులనాటి సాంఘిక పరిస్థితులను పరిశీలిస్తూ సామాన్య విశ్వాసాలు కొన్ని తెలుసుకొన్నాం. అకాలం వారి మతపరమైన నమ్మకాలు కొన్నిటిని ప్రస్తుతం పరికిద్దాం. నరకం గురించి, అక్కడ జరిగే కార్యక్రమాల గురించి యమభటుల గురించి, రకరకాల ఊహలు, నమ్మకాలు వారి కుండేవి. పాపులు నరకం ప్రవేశిస్తారని భావించేవారు. స్వర్గాన్ని గురించిన ఊహలు కూడా వారి కుండేవి. స్వర్గంలో నందనవనం ఒకటుందని, అప్సరసలతో అక్కడివాళ్లు ఆ నందనవనంలో విహరిస్తారని వారి భావన. మోక్షానికో, పరమపదానికో ఊర్ధ్వలోకాలకో వెళ్లాలనుకునేవారు. సూర్యమండలాన్ని అధిగమించి వెళ్లవలసి ఉంటుందనకునేవారు. పునర్జన్మ సిద్ధాంతంలో కూడా వీరికి గట్టి నమ్మకం ఉంది. వైకుంఠాన్ని గురించిన నమ్మకం సైతం వీరికుండేది.

ఈవిధంగా ఆళ్వారుల నాటి సాంఘిక, రాజకీయ, మత పరిస్థితులు వాళ్ల రచనలద్వారా మనకు ద్యోతకమవుతున్నాయి.

2. 2. 1 అన్నమయ్య నాటి సాంఘిక పరిస్థితులు

అన్నమయ్య జీవించిన కాలంలోనూ పర్వతాలూ, నదులు, వనాలు, పట్టణాలు, పల్లెలు, భౌగోళిక ప్రధానాంగాలుగా ఉన్నట్టు తెలుస్తూఉంది. తోటలు కొలనులు, నాటి గ్రామ పట్టణాలకు మరింత శోభచేకూర్చేవి. పర్వదినాల్లోను, ఉత్సవ దినాల్లోను, తోరణాలతో అలంకరింపబడిన వీదులు నయనానందకరంగా కనిపించేవి. స్థానిక సమస్యలు చర్చించడానికి, తగాదాలు తీర్చడానికి స్థానికులు సమావేశమయ్యేందుకు వేదికలుండేవి. వీటిని రచ్చలు అని వ్యవహరించేవారు.

### 2. 2. 1. 1 సాంఘిక వర్గాలు

ఆనాటి సంఘం అన్నో జాతులతో కూడుకొని ఉండినట్లు తెలుస్తూ ఉంది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులతోబాటు అస్పృశ్యదళిత వర్గాలు కూడా ఉండేవి. బ్రాహ్మణులు సతతాధ్యయన నిష్ఠాపరులుగా ఉండేవారు. వారు బ్రహ్మతుల్యులుగా పరిగణింపబడేవారు. నాటి సంఘంలో ద్విజభక్తి అపారంగా ఉండేది.

అన్నమయ్య రచనల్లో నేను పరిశీలించినంతవరకు క్షత్రియ, వైశ్యులకు సంబంధించిన విశేషాలు తెలుసుకునేందుకు తగిన ఆధారాలు లభించలేదు. శూద్రులలో దొమ్మరులు, గొల్లవారు, చెంచువారు, ఎరుకవారు, మొదలయిన తరగతులు కూడా ఉండేవి. ఒకచోట నిలకడగానివసించక, తిరుగుతూ కాలం గడిపే దిమ్మరుల తెగలు కూడా ఉండేవి. హీనకులస్థులుగాను, అంత్యకులాలకు చెందినవారుగాను, అస్పృశ్యులుగాను పరిగణింపబడి కొన్ని దళిత వర్గాలవారు శోచనీయంగా జీవించేవారు. జాతి ధర్మాలకే ప్రాముఖ్యం ఇవ్వబడేది.

### 2. 2. 1. 2 గృహనిర్మాణం

నాటి గృహాలలో మేడలు, పెంకుటిళ్లు, గుడిశెలు, చెప్పుకోదగినవని అన్నమయ్య రచనవల్ల వ్యక్తమవుతూంది. ఎత్తైన గోడలతో సౌధాలు నిర్మింప బడేవి. డాబాలమీదికి, వెళ్లడానికి సోపానాలమర్చబడేవి ఇంటి గోడల మీద చిత్రాలు గీసేవారు, దంతపు తలుపులు కూడా ఉండినట్లు తెలుస్తూఉంది. "మాల యింటి తోలు కప్పు" [2] అనే ప్రయోగం వల్ల ఆ కాలపు హరిజనుల ఇండ్లకు తోలు కప్పులు కూడా ఉండినట్లు తెలుస్తూ ఉంది. గృహనిర్మాణంలో సిమెంటుకు బదులుగా సున్నం వాడడమేగాక ఇండ్లకు వెల్లవేయడానికి కూడా ఉపయోగించేవారు. సంపన్నుల గృహనిర్మాణంలో ఉకు వాడకం అప్పటికే విరివిగా ఉండేదని తెలుస్తూఉంది. సంపన్నుల భవంతుల ఆవరణలో ఆరామాలు పెంచుకొనే అలవాటు కూడా ఉన్నట్టు విదితమవుతూ ఉంది.

### 2. 2. 1. 3 స్నాన వస్త్రధారణాది విశేషాలు

అన్నమయ్య కాలంవారు తెలకపిండితో తలంటి స్నానం చేసేవారు, సంపన్నులయిన రసికులు పన్నీటితో కూడా స్నానం చేసేవారు,

పురుషులు వల్లెవాటు వస్త్రం, ఉత్తరీయం, తలపాగ ధరించేవారు. కొందరు కుళ్లాయిలు కూడా పెట్టుకునేవారు. బాలికలు పావడ ధరించేవారు. స్త్రీలు చీరలు కట్టుకోవడంతో బాటు అచ్ఛాదనకోసం 'కచ్చుపట్టు' ధరించేవారు. పట్టుచీర, అంచుల తొగరుచీర, చందనపు కావివన్నె చీర, చంద్రకావి చీరనాటి చీరలలో కొన్ని రకాలు. రంగు నూలుతో చీరలు నేసి గంజివేసి సరిచేసేవారు. పలుచటి బట్టలు, కంబళ్లు కూడా వాడుకలో ఉండేవి. చెప్పులు ధరించే అలవాటు ఉంది. విసనకర్ర, వింజామర ఆలవట్టం, గొడుగు వాడుకలో ఉండేవి.

### 2.2.1.4 ఆభరణాలు :

శిరోమణి, కొప్పుబిళ్ల, ముత్యాలకుప్పె సవరం, కుందనపు ముత్యాల కుచ్చులు ముక్కర, కుండలాలు, చెవిపోగులు ముత్యాల కంఠసరులు, నీలమణిహారాలు, పగిడాలదండలు, నల్లపూసలు, గురిగింజపేరు, వచ్చలపతకం కళాంజి పతకం, భుజకీర్తులు, కంకణాలు, బాహుపురి, గాజులు, ఉంగరాలు, మేఖల, గంటలమొలనూలు, మొలపూసలు, మణినూపురాలు, గజ్జెలు, మువ్వలు, అందెలు, బంగారు పెండరం, బొమ్మల పెండరం, మెట్టెలు, ముత్యాల సెమ్మాళిగలు, బొబ్బిలికాయలు, చంద్రాభరణాలు వంటివి నాటి ఆభరణాల్లో కొన్ని. కంచు, వెండి, బంగారు లోహంతో ఆభరణాలు చేసేవారు పురుషులు కూడా మకర కుండలాలు, భుజకీర్తులు, కంఠహారాలు, పతకాలు మొలనూలు ధరించేవారు. గురిగింజల పేరు వంటి ఆభరణాలను అటవిక జాతులవారు ధరించేవారు. జంధ్యాలవలె ఆడవాళ్లు ముత్యాలహారాలు వేసుకొనే

వారు. ముత్యాలు, కెంపులు. తళుకు వజ్రాలు మాణిక్యాలు, పచ్చలు, పగడాలు, వైడూర్యాలు, గోమేధికాలు, పుష్యరాగాలు, ఇంద్రనీలాలు, పద్మరాగాలు, వజ్రాలూ వాడుకలో ఉన్నట్టు తెలుస్తూ ఉంది.

2. 2. 1. 5 అలంకరణ

నాటి జనులు వెంట్రుకలను బాగా పెంచేవారు. ఆ కాలంవారు కేశాలంకరణలో కూడా చాలా ఆసక్తి కనబరచేవారు. వెంట్రుకలను చిక్కు తీసి పాపటి దువ్వి సిగముడిచి కొప్పువేసేవారు. సిగలో సుగంధ పుష్పాలుముడుచుకొనేవారు. సంపంగిపూలు, మల్లెమొగ్గలు, కలువలు, కమలాలు, జాజిపూలు, దొంతరపూలు, కేతకీపుష్పాలు, చేమంతిపూలు, బొండుమల్లెలు, మొదలయినవి వాళ్ల ఎరుకలో ఉన్న కొన్నిపూలు, స్త్రీలు కేశాలంకరణలో సవరాలు కూడా వాడేవారు. తిలకం దిద్దుకొనేవారు. పెదవులకు లత్తుక రాసుకునేవారు. మకరికాపత్రాలు వాడే అలవాటు కూడా ఉంది. వక్షోజాలమీద కస్తూరికుంకుమ చందనం. రాసుకునే అలవాటు కూడా ఉంది

పురుషులుకూడా కొప్పులు పెట్టుకొనేవారు మీసాలు పెంచుకొనేవారు. పువ్వులు ముడుచుకోవడం, పూలదండలు వేసుకోవడం స్త్రీ పురుషులు ఉభయులకు పరిపాటి. పన్నీరు, గొజ్జంగినీరు, చల్లుకోవడం వంటి సుగంధ ద్రవ్యాల వాడకం కూడా నాడు మంచిస్థితిలో ఉన్నట్టు తెలుస్తూ ఉంది. తమ అలంకరణ ఎలా ఉందో చూసుకునేందుకు అద్దాలు వాడేవారు. సంపన్నుల ఇండ్లలో నిలువుటద్దాలు కూడాఉండేవి. చెంచెతలు మొగలిరేకులు చెక్కుకునేవారు. చేగురు బొట్టుపెట్టుకునేవారు. గురిగింజలపేరు వేసుకునేవారు పారిటాకులు కప్పుకునేవారు

2.2.1.6 ఆహార విశేషాలు

అన్నం, కూరలు, పచ్చళ్లు. పెరుగు, పాలు, వెన్న, నెయ్యి, ఊరగాయ.., ఆ బలి ... ..నవి అనాటి వారి ఆహార పదార్థాలలో కొన్ని

దధ్యన్నం, క్షీరాన్నం కూడా తినే అలవాటు ఉంది. అవపచ్చడి, మిరియపు తాళింపు వంటి కారపు కూరలు వారికెంతో ఇష్టం.

అతిరసెలు, నూనెబూరియలు, చక్కెర మండిగలు, పాలమండిగలు, వడలు గారెలు, ఖర్జీకాయలు, పూర్ణపు కుడుములు, ఇడ్డెనకుడుములు, సుగినప్పాలు, ఇడ్డెనలు ఆ కాలంనాటి ఫలహారాల్లో కొన్ని. పొడిబెల్లం, నివ్వట్లు, నానినశెనగలు వారపప్పు, నానబియ్యాలు, చక్కిలాలు, అటుకలు, శెనిగపప్పులు, చెక్కిన మెత్తని తోట చెరకులు, చిమ్మిలి, నువ్వులు, ఇవి చిన్న పిల్లల చిరుతిండ్లు. చక్కెర, తేనె, వాడకంలో ఉండేవి. పేదవారు, రోగులు పత్యానికి అప్పుడప్పుడు కూటిగంజి సేవించేవారు.

స్త్రీపురుషులు పొత్తులారగించే అలవాటు కూడ ఉంది. భోజనానంతరం రసికులు కప్పురవిడెము వేసుకునే అలవాటు కూడా కన్పిస్తుంది. అప్పుడప్పుడు జట్లుజట్లుగా విహారార్థం వనాలకు వెళ్లి వనభోజనాలారగించే వాడుక కూడా ఉన్నట్లు తెలుస్తూఉంది. హరిజనులు పశుమాంసం తినే అలవాటు కూడా అప్పటికే ఉన్నట్లు బోధపడుతూ ఉంది.

2. 2. 1. 7 శయ్య

అన్నమయ్య కాలపు జనులు శయ్య విషయంలోనూ మిక్కిలి శ్రద్ధ వహించినట్లు తెలుస్తూఉంది. మంచాలు, దోమతెరలు అమర్చిన మంచాలు వాడుకలో ఉన్నాయి. మంచాలమీద మెత్తని దూదిపరుపులు వేసుకొని పవళించే వారు. పేదవారిండ్లలో కుక్కిమంచాలు కూడా ఉన్నట్లు తెలుస్తూఉంది. చాప దోమతెర, సాధారణంగా వాడుకలో ఉండేవి. కప్పురపుశయ్య, లేజిగురుపానుపు విరహిణులకు వేసేవారు. పూలపానుపులు సంపన్నులు, రసికులు వాడేవారు. తలగడలు, తలగడ బిళ్లలు కూడా వాడకంలో ఉన్నట్లు తెలుస్తూఉంది.

2. 2. 1. 8 ఆర్థిక విశేషాలు :

అన్నమయ్య నాటి ముఖ్య వృత్తి వ్యవసాయం, ముఖ్యమైన పంట వరి అని ఊహించుకోవచ్చు. నాగలితో దుక్కిదున్ని ఎరువు వేసి నాటి

కలుపు తీసి పంట పక్వానికి వచ్చిన తరువాత కోతకోసి కుప్పలు నూర్చి తూర్పారబట్టి ధాన్యమంత భండారలలో భద్రపరచేవారు. జొన్నలు, నువ్వులు, పెసలు, అనుములు, మినుములు, మిరియాలు. ఆవాలు, ప్రత్తి, ఆరికలు కొర్రలు, మొదలైనవి వారి ఇతర మైన పంటలు. పల్లపు పొలం కంటె మెరక పొలమే ఎక్కువగా సాగుతో ఉండినట్లు తెలుస్తూ ఉంది కాబట్టి వెలిధాన్యాలు విరివిగా పండేవి. మెరక పంట వర్షం పైననే ఆధారపడేది. చెరువులు కాలువలు, నదులు ఆకాలం నాటి ముఖ్య జలధారాలు. గోదావరి, కావేరి, యమున, తుంగభద్ర మొదలైనవి ముఖ్య నదులు. ఏతము నుపయోగించి పైరుకునీళ్లు తోడే అలవాటువుంది. కూలీలు, సేద్యగాళ్లు మొదలైనవాళ్లు వ్యవసాయ దార్లకు వ్యవసాయపనులలో తోడ్పడేవారు. పాడిపంటలతో నాటి గ్రామాలు లక్ష్మీనివాసాలుగా ఉండేవి.

వ్యవసాయమేగాక ప్రజలు పెక్కు వృత్తుల నాశ్రయించి జీవించేవారు వేట, చేపలు పట్టడం, వ్యవసాయానికి తరువాత చెప్పుకోదగినవి. వేటగాళ్లు అడవులలో వేటాడడమేగాక, చేనికి ఆకలితో వచ్చేమృగాలను వలలు, ఉరులు పోగులు వేసి కుక్కలను ఉసిగొలిపి, వాకట్టు గట్టి కింకరులను ఉపయోగించి పట్టేవారు. వేటకు వెళ్లేటప్పుడు గాలి అనుకూలంగా వస్తూవున్నదీ లేనిదీ చూసేవారు.

వలలు, గాలాలు, ఉపయోగించి చేపలు పట్టేవారు. తాపీవారు, మేదరి కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి మొదలైన ఇతర వృత్తులవారు కూడా సంఘంలో ఉండినట్లు తెలుస్తూవుంది. పొట్టకూటికి ఉద్యోగం చేసేవారు, వెట్టి చాకిరి చేసేవారు, యాచకులు కూడా నాటి సంఘంలో భాగస్వాములే, గనులలో నుండి ఖనిజసంపద వెలికితీసి ఉపయోగపడుచుకొనే అలవాటు కూడా ఉన్నట్టు తెలుస్తూ ఉంది, నవరత్నాలు స్వర్ణటంకాలు, బంగారు, వెండి కంచు, ఇనుము, ఉక్కు, ఇత్తడి, మొదలైన లోహాలు బాగా వాడకంలో ఉండేవి, కాసులు చెలామణిలో ఉండేవి.

వస్తువును కుదవ బెట్టి అప్పులు తీసుకోవడం, పత్రాన్ని రాసియిచ్చి వడ్డీంకు రుణాలు పుచ్చుకోవడం వంటి లావాదేవీలు కూడా అప్పుడు ఉండేవి.

సంతలు, అంగళ్లు, నాటి స్వదేశ వ్యాపారానికి పట్టుకొమ్మలు. పట్టణాలలో అంగడి వీధులు కూడా ఉండేవి. జీవనదులు ప్రయాణీకుల రాకపోకలకే గాక సరకుల రవాణాకు కూడా బాగా ఉపయోగపడేవి. విదేశీవాణిజ్యం కూడా ఉన్నత స్థితిలోనే ఉండినట్టు విదితమవుతూ ఉంది. స్వదేశ వర్తకానికి తెడ్డు పడవలు ఉపయోగ పడితే, విదేశ వాణిజ్యానికి తెరచాప ఓడలు తోడ్పడేవి.

2. 2. 1. 9. సాంస్కృతికాంశాలు :

శిశువు పుట్టిన 12వ రోజు ఊయలకట్టి, దానిలో పడుకోబెట్టి స్త్రీలు లాలి పాటలు పాడేవారు. పూన, నక్షత్రాలను అనుసరించి నామకరణం చేసేవారు, జాతకర్మాదులు నిర్వహించేవారు. గంధాక్షతలు, తాంబూలం, శిశువు తండ్రికివ్వడంలో పుత్రోత్సవం పూర్తి అయ్యేది. పురుడు వెళ్లిన తర్వాత పుణ్యాహవాచనం చేసుకునే ఆచారం ఉంది. బ్రాహ్మ, క్షత్రియ, వైశ్య వర్ణాలలోను, శూద్రులలో కొన్ని వర్గాలలోను ఉపనయనం. యజ్ఞోపవీతధారణ వాడుకలో ఉండేవి.

ఆ కాలపు తరుణవయస్కులు తమ వలపు ఆకులమీద రాసి పంపి సంబంధించిన వారికి తెలియజేసేవారు. ఈ విషయంలో దూతికల పాత్ర కూడా ప్రముఖంగానే ఉండేది. ప్రేమికులిద్దరు పరస్పరం కానుకలు పంపుకునేవారు. ఉంగరాలు, పూగుత్తులు, మౌక్తికాభరణాలు ఈలాంటివి కానుకల్లో కొన్ని. ప్రేమికులిద్దరు శక్తికొద్ది, విరహం కొద్ది పరస్పరం చిత్రాలు గీసుకునేవారు. పద్యాలు రాసుకొనేవారు. చంద్రకాంత వేదికమీద విరహిణిని పడుకోబెట్టి స్తనాల మీద పుష్పాలు చల్లేవారు. పచ్చకర్పూరం, గంధంపూసేవారు. పన్నీరు చల్లడం వంటి శైత్యోపచారాలుచేసేవారు. విరహిణికి

పూలపాముపు, వల్లవంపు పరుపు కూడా వేసేవారు. దూతిక నాయిక తరపున నాయకుని సమీపించి, నాయిక విరహావస్థను వివరించి ఆమె పంపిన కానుకలు అతనికి అందించి అంగీకారసూచకంగా అతడిచ్చే కానుకలను తిరిగి తెచ్చేది.

పెద్దలు వధూవరుల పొంతనాలు సరిచూసి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొని వివాహానికి లగ్నం నిర్ణయించుకొనేవారు. పెండ్లి ఉంగరం పెట్టడం, కంకణధారణ, బాసికాలు కట్టుకోవడం, అయిరేణి నిలపడం, వధువు కాళ్ళు తొక్కి వరుడామె మెడలో తాళి కట్టడం, తలంబ్రాలు, సేసబ్రాలు పోసుకోవడం, కొత్త దంపతులు కొంగులు ముడివేసి అగ్ని ప్రదక్షిణ చేయడం, ముహూర్తసమయంలో పురోహితుల మంత్రపఠనం, వధూవరులకు వచ్చినవారు చదివింపులు వధూవరులిద్దరు వాహనాల్లోనో, తేరుమీదనో ఊరేగి రావడం, నాల్గవనాడు నాగవల్లి జరగడం, వధూవరులు వసంతాలాడటం, నాటి వివాహ మహోత్సవాల్లో కొన్ని ముఖ్యాంశాలు. నలుగుపెట్టి పాటలు పాడడం, ప్రియురాలి పేరు చెప్పమని ప్రియునొత్తిడి చేసి, అతని ఇబ్బందిని అవలోకించి ఆనందించడం వివాహ సమయంలో ప్రౌఢాంగనల వేడుకలు. పొత్తుల విందులు పెట్టడం, సారెపెట్టడం, వియ్యాలవారు విందు పెట్టడం, పెండ్లిలోని కొన్ని ఇతరాంశాలు. వరుని తరపు వారు, వధువు తరపు వారికి ఓలి ఇవ్వడం, వధువు తరపువారు కట్నకానుకలతో యథోచితంగా యథాశక్తి వరుని సత్కరించడం సాధారణ సంగతులు. వర్ణ సంకర సంబంధాలు, వరుసవావులు లేని వివాహాలుకూడా నాటి సంఘంలో ఉండేవి. రసికులు, ఇల్లాండ్రకదనంగా మోహపు వనిపల సాంగత్యంలో ముద్దుచెల్లించుకునేవారు.

అనాడు కూడా మృతులకు పరలోక క్రియలు చేసే ఆచారం ఉంది. దివసాలు నిర్వహించేవారు. పర్వదినాల్లో తర్పణ జలం విడిచేవారు. కృష్ణ జయంతి, విజయదశమి, దీపావళి, పెనుపండుగ (సంక్రాంతి), ఉగాది నాటి పండుగల్లో ముఖ్యమైనవి.

2. 2. 1. 10 స్త్రీ స్థితి

నాటి సంఘంలో స్త్రీలపట్ల అనాదరణ సహజం. వరుని తరపువారిచ్చే ఓలికాశపడి అతడేలాంటి వాడైనా తమ కన్నెలనతనికివ్వడం లాంటి దుష్కృత్యానికి కూడా వెనుకాడేవారుకారు. తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా పాదాలొత్తడం వంటి సకల సపర్యలతో పతుల సంతోషపరచటం పతుల సహజధర్మంగా భావించబడేది. బహుభార్యత్వం అమల్లో ఉండేది. మగడు మెచ్చిన మగువ సవత్నులలో సమధికురాలుగా గుర్తింపబడేది. దేవదాసీలు, వారవనితలు రసికుల పోషణలో జీవితం వెళ్లబుచ్చేవారు.

2. 2. 1. 11. పిల్లల ఆటలు :

బాలురు వీధుల్లో ఆడుకునేవారు. రాతిబొమ్మలు, కొయ్య బొమ్మలు, తోలుబొమ్మలు. వారి ఆటవస్తులు. ఇసుకగూళ్లు. దాగిలిమూతలు. చిల్లపుచ్చెండ్లాట. సముద్రబిళ్ళ ఆట, కిరసింగన వత్తిఆట. ఉద్దగచ్చకాయ లాట. విరిచెండ్లాట. బొమ్మలాట. గుజ్జెన గూళ్లు. గొబ్బిళ్లు. కోలాటం. బిల్లదీపులు. ఓమన గుంటలు. కంపాలియాటలు. బొమ్మలపెళ్లి నాటి బాలబాలికల ఆటలలో పేర్కొనదగినవి.

2. 2. 1. 12. పెంపుడు జంతువులు

ఆవు. ఎద్దు. మేక. పొట్టేలు. పంది. గుర్రం. పిల్లి. జింక. నెమలి. పావురం. నాటి పెంపుడు జంతువుల్లో కొన్ని. చిలుకను పట్టి పంజరంలో బంధించి చదువులు చెప్పించే అలవాటు కూడా నాటి సంపన్న వర్గాల్లో కనిపిస్తుంది.

2. 2. 1. 13 కళలు

అన్నమయ్య రచనల వల్ల నాటి కళలలో కవిత్వం. సంగీతం. చిత్రలేఖనం. నాట్యం అనే వాటిని గురించి మాత్రమే తెలుసుకొనేందుకు వీలవుతుంది. ప్రేమికులు కూడా పద్యాలు రాసుకునేవారంటే ఆనాటి కవిత్వకళ ఎంతగా జన వ్యాప్తిలో ఉండేదో ఊహించుకోవచ్చు

సంగీతం కూడా ఉన్నత స్థితిలోనే ఉన్నట్టు తెలుస్తూ ఉంది. వాద్యాల సహకారంతో రాగతాళ సహితంగా సంగీతాన్ని ఆలపించే వారు. ప్రౌఢ-విలాసినులు కాలక్షేపం కోసం వీణ వాయించేవారు. కిన్నెర. సింబిలి పిల్లన గ్రోవి. దండే. కంబు కాహళాది వాద్యాలు నాటి వాద్యాలలో కొన్ని. చిత్రాలు గీయడం కూడా బాగా వాడుకలో ఉండేది. దేవదాసీలు ఆలయాలలోను విశేష కార్యక్రమాలలోను నాట్యం చేసి అందరిని ఆనందింప చేసేవారు. నాట్యంలో శిక్షణ ఇచ్చేందుకు నాట్యశాలలు కూడా ఉండేవంటే నాట్యకళస్థితి నాడు ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. నాటకాలు వేయడమేగాక నాటకశాలలు నిర్మించినట్టు కూడా వ్యక్తమవుతూ ఉంది.

2. 2. 1. 14 కొన్ని నమ్మకాలు

లోహానికి పరుసము తగిలితే బంగారమవుతుందనే నమ్మకం, భూతాలు వికృతంగా ఉండి వచ్చినెత్తురు తాగుతాయనే భయావహమైన నమ్మకం, దయ్యాలనమ్మకం, మరణానంతరం యమదండన ఉంటుందనే నమ్మకం, మదుటిప్రాతపై నమ్మకం, పక్షులు పారాడే ప్రొద్దులో పసిపిల్లలను బైట బెట్టితే కీడనే నమ్మకం, అంటగాకుండే వారు బాలురనంటితే దోషమనే నమ్మకం ఒట్టు బెట్టుకుని తప్పితే కీడు మూడుతుందనే నమ్మకం శకునాలపైన నమ్మకం మొదలయినవి ఆకాలపు నమ్మకాల్లో కొన్ని. పులుగు దోషం బాలగ్రహదోషం దిష్టిదోషం మొదలయినా దోషాలపట్ల కూడా నమ్మకాలుండేవి.

3. 2. 1. 15 ఇతర విశేషాలు

బ్రహ్మచర్యం గార్హస్థ్యం వానప్రస్థం సన్యాసం అనబడే చతురాశ్రమాలకు చెందినవారు నాటి సంఘంలోను ఉండేవారు. విజ్ఞాన సముపార్జన దేవఋషుల ఋణం తీర్చుకోవడం సగటు మనిషి కనీస కర్తవ్యాలుగా భావించబడేవి.

తన పూర్వం కాలపు విద్యాప్రమాణాలు ఉన్నత స్థితిలో ఉన్నట్టు అన్నమయ్య పేర్కొని ఉండటంతో తమకాలపు విద్యాప్రమాణాల వల్ల ఆ కాలం వారి మనోగతాభిప్రాయాన్ని సూచిస్తుంది. ఆకాలపు వర్ణసమామ్నాయంలో యాభై అక్షరాలుండేవట్టు విదితమవుతూ ఉంది. భారత భాగవత రామాయణాలు బాగా ప్రచారంలో ఉండేవి. శబ్దశాస్త్రం కూడా అభివృద్ధిచెంది ఉన్నతమైన స్థితిలో ఉండినట్టు వెల్లడవుతుంది. మతవశాస్త్రాలు చదివే మక్కువ కూడా నాడు ఎక్కువగానే ఉండేది. కులవిద్యకే ప్రాధాన్యముండేది. పురాణగాథలలోని విషయాలు తీసుకొని తమకు తోచిన, నచ్చిన కొన్ని విషయాలను కూడా చేర్చి స్వకపోలకల్పనలతో పాడుకునే అలవాటు ఉండేది. పదాలల్లి పాడటం నాటి జన సామాన్యానికి సహజమని తెలుస్తూ ఉంది. విద్వత్సభలు కూడా జరిగేవి. పండితులు తమ పాండిత్యంలోను, యుక్తి యుక్త వాదాలతోను, సాటి పండితుల పై గెలుపు సాధించే పైనం కనిపిస్తూ ఉంది. పరకాయ ప్రవేశ విద్య, యక్షిణి విద్య, ఇంద్రజాల విద్య, కనుకట్టు విద్య మొదలయినవి కూడా వ్యాప్తిలో ఉండేవి.

అన్నమయ్యకాలంలో జబ్బులకు మందులు, కషాయం, రసం, తైలం ఇచ్చేవారు. పుండుకు మందు పోస్తూ నిత్యం వేడి నీళ్లతో కడిగేవారు చల్లకూడు పెట్టి కట్టు కట్టేవారు. నాటి చికిత్సా విధానంలో పథ్యం ముఖ్యాంశంగా ఉండేది. వైద్యులేగాక నాటి వైద్యరంగంలో మంత్రసానులు కూడా ప్రధాన పాత్ర వహించేవారు. భూతం పట్టడం, శివమెత్తి ఆడటం, నాటి ఆసక్తికరదృశ్యాలు. మంత్ర తంత్రాలతో అలాంటి దురవస్థలనుండి ప్రజలకు స్వస్థత చేకూర్చే భూత వైద్యులు కూడా ఉండేవారు. మచ్చు చల్లడం, మందులు పెట్టడం ద్వారా ఇతరులను వశీకరించుకొనే ప్రయత్నాలు చేసేవారు.

త్రాసుతో తూచే అలవాటు అన్నమయ్య కాలంలోనూ ఉండేది. నూనె మొదలయిన ద్రవపదార్థాలు కొలిచే కుంచాలు వాడుకలో ఉండేవి. అంగుళాలు, అడుగులు, గజాలు, క్రోసులు నాటి దైర్ఘ్య మానాంశాలుగా ఉండేవి. వీసం

పరక, పాతిక, అర్ధ, ముప్పాతిక మొదలయిన కొలమానాంశాలు వారుకలో ఉండేవి. రాజుల పేర్లతోను, చిహ్నలతోను, నాణాలు ముద్రించే పద్ధతి అమలులో ఉన్నట్టు తెలుస్తుంది. రూకలు, మాడలు చలామణిలో ఉన్నట్టు విదిత మవుతుంది. ఇతరుల పశువులు పైరు మేయకుండా నిరోధించేందుకు బందెలదొడ్ల ఏర్పాటు కూడా ఉండేది. ఆకులలో ఉత్తరాలు రాసుకొనేవారు. ఖరారు చేసుకొనేందుకు పత్రాలు రాసుకునే అలవాటుంది. ఆ కాలం ప్రజలకు రాజుల బెదద, దొంగల బెదద కూడా ఉండేది. రాజులు దౌర్జన్యంతో ప్రజల సంపదలను స్వాధీన పరచుకొనేవారు. అనాచారపు పనులు. బ్రహ్మహత్యలు. శిశుహత్యాలు, గోహత్యలు, సహింపరాని నేరాలుగా పరిగణింపబడేవి. నలుగురి దృష్టిలో ఆచరణ యోగ్యం కాని పనులు చేసేవారిని కులం చెడినవారుగా పరిగణిచడం, అరడి పెట్టడం కూడా అలవాటే.

దైవజ్ఞులు పంచాంగ సహాయంతో పరిశీలించి రాశిఫలం, గ్రహఫలం గుర్తించి భవిష్యత్ఫలితాలను చెప్పేవారు. ఎరుకతల దగ్గర ఎరుక చెప్పించుకొనే అలవాటు కూడా ఉంది. ధనికులు, ధర్మం చేయడం పరిపాటి. సూర్య, చంద్ర గ్రహణ సమయాల్లో పుణ్యతీర్థస్నానం, పవిత్ర కృత్యంగా పరిగణింప బడేది.

కీలుబొమ్మలాట, దొమ్మరి గడి ఎక్కి ఆడటం, ఏలపదాలు పాడు కోవడం సాగుదు కథలు చెప్పుకోవడం, వెన్నెలలో కన్నెపిల్లలు జాజరపాటలు పాడుకోవడం నాటి వినోద కార్యక్రమాలుగా చెప్పుకోవచ్చు. చదరంగ మాడటం, పాచికలాట, పగడాసలాట, దాయాలాట, ఉబుసుపోక కోసం వాళ్లు ఆడుకొనే ఆటలని తెలుస్తూంది. పందేలు వేసుకొని వైనంకూడా కన్పిస్తుంది. అన్నమయ్య కీర్తనలలో అంకెల పాముల వలయం[4] అనే ప్రయోగం పరమ పద ఊహను కలిగిస్తూ ఉంది. ఆ కాలపు వారు పరమపద సోపానాల ఆటకూడా ఆడేవారని విదితమవుతూ వుంది.

## 2.2.2. అన్నమయ్య నాటి రాజకీయ పరిస్థితులు

అన్నమయ్య కాలంనాడు మనదేశంలో అనేక సామ్రాజ్యాలుండేవి. రాజే రాజ్యానికంతటికి సర్వోన్నతాధికారి. అతని అధికారం తిరుగులేంది. పూర్వ రాజుల వారసులే పట్టాభిషిక్తులై సింహాసనాన్ని అధిష్ఠించేవారు. పలువురు వారసులున్నపుడు అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం తమలో తాము పోట్లాడుకునేవారు. ఈ తగాదాల్లో అన్యుల జోక్యంగూడా కొన్ని సందర్భాలలో ఉండేది. అశక్తుల (బలహీనుల) పనమారిచి, బలవంతులే చివరికి రాజ్యాధికారం చేజిక్కించుకొనేవారు. వారసత్వ తగాదాలవల్ల రాజుల బలహీనతవల్ల రాజ్యాల్లో అరాచిక పరిస్థితులు అప్పుడప్పుడు తలెత్తేవి.

రాజ్యానికి సంబంధించిన కార్యకలాపాలన్నిటిని చర్చించే ఉన్నత స్థానాలుగా రాజసభలు ప్రముఖ పాత్ర వహించేవి. రాజు సముచిత సింహాసనాసీనుడై మకుటధరుడై శ్వేతఛత్ర, రాజదండాది రాజ లాంఛనాలతో సేవకులు వింజామరలు వీస్తుండగా హుందాగా రాజ్య వ్యవహారాలు నిర్వహించేవాడు. కైవారం చేసే వందిమాగధులు రాజునంటిపెట్టుకొని ఉండేవారు. రాజు దగ్గర కొందరు మంత్రులుండేవారు. వారందరిలోను ముఖ్యుడు ప్రధానమంత్రి. మంత్రులకేయే శాఖలు కేటాయించేవారో, రాజుకు వాళ్ళిచ్చే తోడ్పాటు సలహాలకు మాత్రమే పరిమితమై ఉండేదో, రాజశాసనాలను అమలు పరచడం, యుద్ధాల నిర్వహణవంటి ఇతరాలకు కూడా విస్తరించి ఉండేదో తెలియడం లేదు. రాజ్య సభలలో సన్మానాలు, బిరుదప్రదానాలు అభియోగాలపై న్యాయవిచారణలు జరిగేవి. చిత్రవధలు, శిరచ్ఛేదనలవంటి అమానుషశిక్షలు కూడా విధింపబడేవి. ఒక్కొక్కప్పుడు నిరపరాధులు కూడా శిక్షలకు గురయ్యేవారు.

రాజ్య ఆదాయమనేక రకాలుగా ఉండేది. సామంతరాజులు సామ్రాట్టులకు కప్పం చెల్లించేవారు. ప్రజల పంటలో రాజు కోరుకొనేవంతు పన్నుగా లభించేది. కొందరు రాజులు నిరంకుశంగా రైతుల పంటలను దోచుకునేవారని

కూడా తెలుస్తూ ఉంది. పుల్లరికూడా వసూలు చేయబడేది. స్వదేశ విదేశ వాణిజ్యాల మీద విధింపబడే సుంకాలను సుంకరులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు పంపేవారు. ఇతర రాజ్యాలపై దాడి జరిపినపుడు అక్కడినుంచి ధనరాసులు తెచ్చేవారు.

రాజుల పేర్లతోను, చిహ్నంతోను నాణాలు ముద్రించే పద్ధతి అమలులో ఉన్నట్లు తెలుస్తూ ఉంది. బాటసారుల విశ్రాంతి కోసం రాజమార్గాలలో ధర్మశాలలు నెలకొల్పబడేవి. రాజశాసనాలను శిలమీదచెక్కించే అలవాటుంది రాజాజ్ఞలను శాసనాలను అమలు పరచేందుకు భృత్య వర్గముండేది. ప్రజలు లంచాలు, కానుకలు తగిన వారికి సమర్పించి రాజుకొలువులో పదవులు పొందడం కనిపిస్తుంది. రాజుకు ప్రజలకు మధ్య అధికారులు అడ్డుపడి ప్రజలు రాజానుగ్రహం పొందటంలో ఇబ్బంది కలిగించే వారని తెలుస్తూ ఉంది.

ఒక రాజు క్రింద కొందరు సామంతులు, ఒక సామంతుని క్రింద కొందరు మండలేశ్వరులు, ఒక మండలేశ్వరుని క్రింద కొందరు గ్రామపెద్దలు ఆయా విభాగాల్లో పరిపాలనావ్యవహారాల్లో పాల్గొనేవారు పట్టణ వ్యవహారాలు చూసుకునేందుకు పట్టణ స్వాములు నియమింపబడేవారు. పట్టణ భద్రతను పర్యవేక్షించేందుకు తలవరులు రాత్రి జాముల్లో గస్తీ తిరిగేవారు. గ్రామ వ్యవహారాలు చర్చించుకునేందుకు గ్రామాధికారి కార్యాలయంగా ఉపయోగపడేందుకు గ్రామచావళ్లు. నిర్మింపబడేవి. నాటి రాజుల్లో సామ్రాజ్య విస్తరణ కాంక్ష బాగా ఉండేది. దీనివల్ల తరచు యుద్ధాలు జరిగేవి. రక్షణ ఏర్పాట్లు కూడా ఘనంగా ఉండేవి. శత్రువులకు చొరవీలుకాని దుర్గాలు నిర్మించుకునేవారు. యథాశక్తి సైన్యాన్ని పోషించేవారు. రథ, గజ, తురగ, పదాతి దళాలిందులో ఉండేవి. దళానికధికారి దళవాయి, సేనాపతి సైన్యమంతటికీ అధికారి కత్తులు, ఈటెలు, విల్లమ్ములు శూలాలు, అస్త్రశస్త్రాలు ఆనాడు యుద్ధాల్లో ఉపయోగించే ఆయుధాలు. యుద్ధాల్లో ఓడిపోయినవారిని గెలిచిన వారు చెరపట్టడం కూడా ఉండేది.

క్రీ. శ. 15వ శతాబ్దంలో మహమ్మదీయుల దండయాత్రల దుష్ఫలితాలు అన్నమయ్య రచనల్లో కవిపిస్తాయి. ఈ దుష్ఫలితాలకు దారితీసిన పరిస్థితులను చరిత్ర ఆధారంగా పరిశీలించి తెలిసికొన్న సంగతులు మీ దృష్టికి తెస్తున్నాను. బహమనీ సుల్తాను మూడవ మహమ్మద్‌షా సైన్యాలు తెలంగాణాను ఆక్ర మించి, ఆ సుల్తానును కంచివరకు తరుముకొని వెళ్లాయి. మార్గ మధ్యంలో హిందూదేవాలయాలను ధ్వంసం చేశాయి. అవి తిరిగి వెళ్తుండగా కందుకూరు దగ్గర సాళువ నరసింహుడు హఠాత్తుగా దాడి జరిపి. వారికి అపార నష్టం కలిగించాడు. ప్రతీకార చర్యగా మూడవ మహమ్మద్ షా ప్రధాని మహమ్మద్ గవాన్ సాళువ నరసింహుని రాజధాని పెనుకొండపై దాడి జరిపాడు. సాళువ నరసింహుడు విజయవంతంగా దాన్ని తిప్పి కొట్టాడు. కానీ తురుష్కులచేత ఆక్రమింపబడిన మచిలీపట్టణాన్ని తిరిగి పొందలేక పోయాడు.

ఈ చారిత్రక సంఘటనలు క్రీ. శ. 1463-1482ల మధ్యకాలంలో జరిగాయి. సాళువ నరసింహుడు అన్నమయ్యకు మిత్రుడు, శిష్యప్రాయుడు. అతని ఆశీర్వాద బలంతో ఔన్నత్యాన్ని పొందాలనుకున్నవాడు. అన్నమయ్య కూడా అతని ఆస్థానంలో కొన్నాళ్లున్నట్టు తాళ్లపాక చిన్నన్న రచించిన అన్న మయ్య చరిత్రవల్ల తెలుస్తూ ఉం౦ది కాబట్టి తురుష్కుల దాడులను, వారి అమానుష కృత్యాలను అన్నమయ్య స్వయంగా కని విని తెలుసుకొనే అవకాశ ముంది. కాబట్టి చలిత హృదయుడై ఆ దృశ్యాలను తన కీర్తనల్లో అభివర్ణించాడు ఈ చారిత్రక సంఘటన తప్ప మరే చారిత్రక సంఘటన అన్నమయ్య రచనలలో నాకింతవరకూ దొరకలేదు.

### 2. 2. 3. అన్నమయ్య నాటి మత పరిస్థితులు

అన్నమయ్య నాటి సంఘంలోనూ ఆస్తిక, నాస్తిక వర్గాలుండేవి. ప్రకృతి వాదం కూడా పేర్కొనదగిన స్థితిలో ఉండేది పాషండమని పేర్కొన బడే మతం కూడా ఉండేది. అన్నమయ్య రచనలో నేనెరిగినంత వరకు

వేదబాహ్య మతాలైన బౌద్ధజైనాదుల ప్రస్తావన కనిపించదు. కాబట్టి ఆయన కాలంలో వాటి పరిస్థితి ఏమిటో బోధపడే అవకాశం లేదు. అప్పటికే దక్షిణాపథంలో మహమ్మదీయ సామ్రాజ్యాలు వెలసినప్పటికి వాటి ఉనికికే పోరాడుకోవలసి వస్తుండటం వల్ల మహమ్మదీయ మతం బాగా నిలదొక్కుకొని జనసామాన్యంలోకి వచ్చినట్టు లేదు. కాబట్టి దాని ప్రభావం అన్నమయ్య మీద గానీ ఆయన రచనలలోగానీ లేదనే చెప్పాలి. మహమ్మదీయ మత ప్రస్తావన కూడ అన్నమయ్య రచనల్లో కనిపించకపోవడానికి పైనుదహరించినవి కారణాలుకావచ్చు. హిందూమతంలో అద్వైత శాఖ చెప్పుకోదగిన స్థితిలో ఉండేది.

శైవ, వైష్ణవ, శాక్తేయ, గాణాపత్య, కౌమార, సౌరాలనేవి షణ్మతాలుగా అప్పటికే స్థిరపడ్డాయి. శైవంలో కాపాలికమనే ఉపశాఖ కూడా ఉండేది. నాస్తికులు దురహంకారులై స్వోత్కర్షతో దేవుని అస్తిత్వాన్ని అంగీకరించేవారు కారు. ప్రకృతి వాదులు ప్రకృతి మినహా దేవుడు లేడనేవారు. సదాచార విరుద్ధ వర్తనమే పాషండుల ముఖ్య విధానం. అద్వైతులు భగవంతుడు నిరాకారుడని, నిరవయవుడని, నిర్గుణుడని వాదించేవారు.

శైవులు జంగాలని కూడా వ్యవహరింపబడేవారు. వీరు లింగధారులు. భస్మాను లేపకులు. లింగాన్నే పూజించేవారు. పరమేశ్వరుడే వీరి దృష్టిలో పరదేవత. అతడు లింగరూపంలో ఉంటూ అర్చనలందుకొని ఆశ్రితులనాదుకుంటాడని శైవుల అచంచల విశ్వాసం.

వైష్ణవము అనాడు సముచిత స్థితిలోనే ఉండేది. భుజాల మీద చక్రాంకితాలు, శరీరం మీద హరినామం ముద్రించుకోవడం వైష్ణవ దీక్షపొందేవారి ఆచారం. ఆచార్యుడు విష్ణుసమానుడని వైష్ణవులు భావించేవారు. నుదుట నామాలు, భుజాల మీద చక్రాంకితముద్రలు, మెడలో వ్రేలాడే తులసి పద్మాక్షికల పెద్ద పేరు, ఊర్ధ్వపుండ్రాలు ధరించి వైష్ణవులు నిరాడంబరులుగా కనిపించేవారు. తిరుమణి, తిరుచూర్ణాలు వాడేవారు.

విష్ణువే సర్వోత్కృష్టుడని వైష్ణవులు భావించేవారు. తక్కిన దేవతలెవ్వరు అతనికి సాటిరారని అంతా హరిసంకల్పానుసారమే జరుగుతుందని వీరి భావన. ఇతర దేవతల ఆలయాలకు వెళ్లడం, దేవతాంతర దర్శన, అర్చన, స్మరణాదులు అనుచితకృత్యాలు. వైష్ణవులకు ఏవీ అడ్డువద జాలవు. శంఖ చక్ర లాంఛనులు అన్నిటా పూజ్యులు. శరణాగతి మహిమ అనంతం. అచ్యుతుని శరణమే అన్నిటికిని గురి. విష్ణుభక్తి లేని ఉన్నత కులజుని కంటె విష్ణుభక్తి గల హీనకులజుడే శ్రేష్ఠుడు. ఇవి నాటి వైష్ణవుల భావాలు, విశ్వాసాలు

వీర వైష్ణవులు వైష్ణవేతర దేవతల పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించేవారు విష్ణువుకు విష్ణుదాసులకు అభేదాన్ని పాటించి విష్ణుదాసుల సేవించడం నిత్యకృత్య ధర్మంగా భావించేవారు, ద్వయము, అష్టాక్షరి మంత్రము, చరమ శ్లోకం వైష్ణవుల కత్యంత పవిత్రాలు. ప్రాచీన తమిళ వైష్ణవుల ప్రభావం వీరిమీద బాగా ఉంది. తిరువాయ్‌మొళి ప్రబంధ పారాయణం నాటి వైష్ణవుల కెంతో ప్రీతిపాత్రం. హరిసేవకులు ప్రపన్నులు శరణాగతులు. ముముక్షువులు అయిన శ్రీవైష్ణవుల పట్ల సంఘంలో దైవభావం ఉండేది.

క్షేత్ర దేవతలను కీర్తిస్తూ అన్నమయ్య గానం చేసిన కీర్తనల వల్ల నాటి వైష్ణవ క్షేత్రాల గురించి తెలుసుకునే వీలుంది. శ్రీరంగం, కంచి, తిరుపతి అహోబలం సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలుగాను మత ప్రచార కేంద్రాలుగాను ఉండేవి. బదరీవనం, గయ, ప్రయాగ, పురుషోత్తమం, ఉత్తర మధుర, అయోధ్య, బృందావనం, పంచవటి, సింహాద్రి, తిరుమల, కలశాపురం, పండరి, ఒంటిమిట్ట, విజయనగరం, వావిలపాడు, కడప, ఉదగిరి- దాసరిపల్లె, గుత్తి, కదిరినృసింహ క్షేత్రం, నల్లబల్లి, మండెం, గండి, ప్రొద్దుటూరు, పంబలూరు, ఓరెంపాడు. చాగలమర్రి, కందవోలు, పులివెందుల, ఊటుకూరు, గండికోట, మాచనవోలు, నందలూరు, వెలియవరం అనేవి నాటి సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలలో మరికొన్ని

అన్నమయ్య కాలంలో మత కలహాలంతగా లేవని చెప్పవచ్చు. అయినా ఆస్తిక నాస్తిక సంఘర్షణ, కాదనే అవుననే వాదాలు, సాకార నిరాకార వాదుల మధ్య సంఘర్షణ, వైష్ణవ ప్రాకృతుల మధ్య నకతవాదాలు ఉండేవని తెలుస్తూ ఉంది. శైవులు, వైష్ణవులు, శాక్తేయులు, కాపాలికులు, స్వీయదేవతలను పొగడడం, అన్యదేవతలను తెగడడం చేసేవారు. తద్వారా స్పర్ధలు తలెత్త డానికి అవకాశమేర్పడేది.

2. 2. 3. 1 కర్మకాండ

అన్నమయ్య కాలంలో మతపరమైన కర్మకాండ ఎలా ఉండేదో ప్రస్తుతం పరిశీలిద్దాం. వారు మూర్తిపూజకే ప్రాధాన్యం ఇవ్వబడినట్టు తెలుస్తూ ఉంది. ఆరాధ్యమూర్తులను చిత్రపటాల్లో రాసి పూజించే పద్ధతి అప్పటికే వాడుకలో ఉన్నట్టు విదిత మవుతూ ఉంది. విగ్రహారాధన కూడా మహోన్నత స్థాయిలో సాగినట్టు తెలుస్తూ ఉంది. ఆ కాలం ప్రజలు ఇండ్లలో కూడా విగ్రహాలనుంచుకొని అర్చించడమే ఇందుకు ప్రబల నిదర్శనం. దారుపాషాణ విగ్రహాలు కూడా అర్చింపబడేవి. దేవాలయాలప్పటికే నెలకొల్పబడి బాగా పరామర్శింపబడుతూ ఉండేవి. ఆలయంలో గోమయంతో శుద్ధి చేయడం, వేద ఘోషతో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడం, హోమాలు చేయడం, మంత్రపూర్వక పుణ్యతీర్థ కలశాభిషేకం, సంప్రోక్షణ ఇత్యాది వైదిక కృత్యాచరణంతో ఆలయ పవిత్రత, మహత్వం, పెంపొందించేందుకు ప్రయత్నించే వారు. కిరీటాలతోను, సొమ్ములతోను విగ్రహాలను చక్కగా అలంకరించేవారు.

పత్రపుష్పాలతో విగ్రహాల నర్చించేవారు. ఆవాహనం ఆసనం, అర్ఘ్య పాద్యస్నానాచమనాలు, వస్త్రభూషణమాల్యాలంకరణలు, నైవేద్యం, తాంబూల నివేదన, ధూపదీపనీరాజన దర్శనాలు, ఆత్మ ప్రదక్షిణ నమస్కారాలు మొదలయిన శాస్త్రోక్త షోడశోపచార పూజలు మంత్రపూర్వకంగా సాగేవి. ఆలయంలో నిత్యపూజలు నిర్వహించేందుకు పూజారులు నియమింపబడ్డారు,

ఆ కాలంలోనూ పలురకాల ఉత్సవాలు వాడుకలో ఉండేవి. ఆలయాల్లో ప్రాణ ప్రతిష్ఠ చేయబడిన విగ్రహాలేగాక ఉత్సవమూర్తులు కూడా ఉండేవి. ఈ ఉత్సవమూర్తులతో ఉత్సవాలు జరిగేవి. ఉత్సవ మూర్తులు తిరువీధుల్లో వేంచేసే ఆచారముంది. ఏటా జరిగే బ్రహ్మోత్సవాలు, వార్షిక తెప్పోత్సవాలు, కల్యాణోత్సవాలు, రథోత్సవాలు, కోడ తిరునాళ్ళ నాటి ఉత్సవాల్లో కొన్ని. వీటిని వేసవి కాలంలో జరిగే ఉత్సవాలని ఊహించుకోవచ్చు.

క్షుద్రదేవతోపాసన కూడా నాడు విరివిగా సాగినట్లు తెలుస్తూ ఉంది. శక్తి పూజలు నిర్వహింపబడేవి. గ్రామదేవతలను కూడా కొలిచేవారు. పలురకాల రూపాలను పూజించేవారు. ఏటా జాతరలు నిర్వహింపబడేవి. మన్మథ పూజలు చేసే ఆచారం కూడా కన్పిస్తుంది. చంద్రకాంతవేదిక మీద మన్మథ రూపాన్ని రచించి పూలతో పూజచేసి పూదేనెలు ఉపాహారమిచ్చి సరససంగీత చతురోక్తులతో కాలం గడిపే వారు.

సంధ్యాది విధులు నిర్వహించడం, గాయత్రీ మంత్రాన్ని జపించడం నాడు కూడా సర్వసాధారణాలు. గురూపదిష్ట మంత్రాన్ని పునశ్చరణ చేసి జపించే పద్ధతి కూడా వాడుకలో ఉంది. పుణ్యఫలోద్దిష్టదానాలు కూడా బాగానే సాగేవి. ఉపవాసాలు చేసే అలవాటుంది. వ్రతాలు చేయడం పరిపాటి. ముక్తిసంపద చేయించుకోవడం కోసం జీవహింసలు చేయడం, భూతబలు లివ్వడం అలవాటే. నాదసహాయంతో భగవంతుని గుణాలను కీర్తించేవారు. ధనుర్మాసంలో తెల్లవారు జామున సంకీర్తనలు పాడే అలవాటు కూడా ఉంది.

శ్రవణమిత వేదపఠనంతో యాజకుల మంత్రోచ్చారణతో ఆచార్యుని అధ్వర్యంలో యూపస్తంభ యజ్ఞపశువులతో, హోమ ద్రవ్యాలతో హోమం చేయడం, ఆహుతి చేయడం, యజ్ఞాంతంలో అవభృథస్నానం చేయడం మొదలయిన యజ్ఞ విధులతో యజ్ఞశాలల్లో యజ్ఞాలు నిర్వహింపబడేవి.

2.2.3.2 కొన్ని నమ్మకాలు

ఇహపరాల నమ్మకం, పునర్జన్మ నమ్మకం, యాగతంత్రాలు ఉత్తరోత్తర సద్గతి ప్రాప్తికి దోహదాలనే నమ్మకం, తీర్థాటనం పుణ్యఫలప్రదమనే గట్టినమ్మకం, స్వర్గ నరకాల నమ్మకం మొదలయినవి నాటి మతపరమైన కొన్ని నమ్మకాలు.

2.3 సామ్యాలు

ఆళ్వారుల కాలంలోను అన్నమయ్య కాలంలోను నెలకొన్న పరిస్థితులు పరికించాం. వాటిలో కనిపించే సామ్యాలు మాత్రము ఇప్పుడు పరిశీలించవలసి ఉంది.

ఆళ్వారుల కాలంలోను అన్నమయ్య కాలంలోను వైదిక విశ్వాసాలు ఒకే లాగే ఉన్నాయి. వర్ణవ్యవస్థలోను, నిమ్నజాతులలోను మార్పులేదు. ఉభయుల కాలంలోను సౌధనిర్మాణం సాగింది. సిమెంటుకు బదులు సున్నం వాడకం ఉభయుల కాలంలోను ఉంది. అభ్యంగనస్నానం ఉభయుల కాలాల వారికీ అలవాటే. పలుచని బట్టలు, పట్టు బట్టలు వాడటం, స్త్రీలు కచ్చుపట్టు ధరించడం ఇరు కాలాలలోను పరిపాటి. ఆళ్వారుల కాలంలో వాడబడిన ఆభరణాలు, వస్తువులు కొన్ని అన్నమయ్య కాలంలో కూడా వాడబడ్డాయి కొన్ని ఆహార పదార్థాల వాడకం రెండు కాలాల్లోను సమానంగానే కన్పిస్తూ ఉంది. కేశాలంకరణ, స్త్రీల ఇతరాలంకరణలు, సుగంధద్రవ్యాల వాడకం, పూలరకాలతో కొన్ని, కొన్ని అలంకరణ పరికరాలు రెండు కాలాల్లోను ఒకే విధంగానే ఉన్నాయి. మంచాల వాడకం, శయ్యలపట్ల అభిరుచులు ఒకేలా ఉన్నాయి. ఉభయుల కాలంలోను ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయమే. వేట, చేపలు పట్టడం దాని తరువాతివిగా చెప్పుకోవచ్చు. వరి ముఖ్యమైన పంట చెరకు, ప్రత్తి, పువ్వులు, కూరలు, ఉభయకాలాల్లోను ఉన్న ఇతర పంటలు. వరిసాగు ఒకేలా ఉంది. పొట్ట కూటికై ఊడిగం చేయడం, యాచకవృత్తి రెండు కాలాల్లోనూ ఉన్నాయి

బంగారు, వెండి, ఇనుము, తుక్కు, కంచు, మొదలయిన లోహాలు రెండు కాలాల్లో వాడబడేవి. స్వదేశ విదేశ వాణిజ్యాలు, వ్యవసాయాభివృద్ధికి నీటి వనరులు సమానంగా కనిపిస్తున్నాయి.

శిశువుకు ఊయల కట్టడం, నామకరణం. ప్రేమికులు కామకలు పంపుకోవడం, వివాహంలో నిశ్చయతాంబూలం, లగ్నినిర్ణయం, కంకణధారణం. అగ్నిప్రదక్షిణం, వధూవరుల ఊరేగింపు వసంతాలాడుకోవడం ఉభయకాలాల్లోను కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. పైతృకాల నిర్వహణ సమానంగానే ఉంది. ఉభయకాలాల్లోను గృహిణుల స్థితి ఇంచుమించు ఒకే విధంగానే ఉంది. పిల్లలు బంతులతో ఆడుకోవటం రెండుకాలాల్లోను సహజమే. పెంపుడు జంతువుల్లో, కొన్ని రెండు కాలాల్లోను ఉన్నాయి. దృష్టి దోషంపై నమ్మకం, నుదుటి వ్రాతపై నమ్మకం. శకునాల నమ్మకాలు, ఒట్టుపెట్టి తప్పితే హాని వాటిల్లుతుందనే నమ్మకం ఉభయులకాలాల్లోను ఉండేవి. ఇంద్రజాలం వంటి విద్యలు ప్రచారంలో ఉండేవి సంపన్నులు దానాలు చేయడం రెండు కాలాల్లోను పరిపాటి. హత్యలు, దొంగతనాలు ముఖ్యమైననేరాలు.

రాచరిక వ్యవస్థ రాజదర్పం, కప్పం చెల్లించడం, యుద్ధాలు, ఆయుధాలలో కొన్ని, సైన్యాల పోషణ. యుద్ధాలలో ఓడిన వారిని గెల్చినవారు చెర పట్టడం ఆళ్వారుల కాలంలోను అన్నమయ్యకాలంలోను ఒకేవిధంగా ఉన్నాయి.

ఆస్తిక నాస్తిక వర్గాలు షణ్మతాలు. స్వీయమతాలను కొనియాడి అన్యమతాలను తెగడడం, మత స్పర్ధలు రెండు కాలాల్లోను ఉన్నాయి విగ్రహార్చన, ఉత్సవాలు, క్షుద్రదేవతోపాసన, భూతబలులు, వ్రతాలు మన్మథపూజలు యజ్ఞాచరణ ఉభయ కాలాల్లోను కన్పిస్తాయి. స్వర్గనరకాల నమ్మకం. పునర్జన్మ సిద్ధాంతం మీది నమ్మకం వంటి మతపరమైన నమ్మకాలు ఆళ్వారుల కాలంలోను అన్నమయ్య కాలంలోను ఉండేవి. ఆళ్వారుల కాలంలోను అన్నమయ్య కాలంలోను నెలకొన్న పరిస్థితుల స్థూలపరిశీలన వల్ల ఉభయ సమకాలీనాంశాలకు సామ్యం స్పష్టంగా కన్పిస్తూవుంది. కాలక్రమంలో జరిగే సహజమైన మార్పులవల్ల కనిపించే వైవిధ్యంలోను మౌలికమైన ఏకత్వం చెక్కుచెదరని స్థితిలో గోచరిస్తుంది. కాబట్టి తమనాటి పరిస్థితుల ప్రభావం ఇంచు మించు ఒకేవిధంగా అన్నమయ్య ఆళ్వారుల మీద పనిచేసి రచనా సాదృశ్యానికి దారితీసి ఉండవచ్చు. ఇందువల్ల కూడా వారి రచనల్లో సామ్యాలు కనిపించే అవకాశం ఉంది.

## సూచికలు

1. కులశేఖరాళ్వార్ - పెరుమాళ్ తిరుమొళి, అరాం తిరుమళి (10 పద్యం) 'కూడర్ కోమాన్ కులశేఖరన్'

2. తాళ్లపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు
సం. 1, పు. 127, రేకు. 31, పాట. 189.

3. తాళ్లపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు
సం. 1 పు. 63 రేకు. 15 పాట. 91.

4. తాళ్లపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు
సం. 1, పు. 57, రేకు. 14, పాట. 83.

5 తాళ్లపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు
సం. 11, రేకు. 373, పాట 133.

# 3. సామాన్య సామ్యాలు

3.0 అన్నమయ్య ఆళ్వార్ల జీవితాల్లోను, వాళ్లు జీవించిన కాలంలో నెలకొన్న పరిస్థితుల్లోను కనిపించే సామ్యాలు మనమింతవరకు పరిశీలించాం. వారి రచనల్లోని సాదృశ్యాలను సమాలోచించటానికి ఉపక్రమిద్దాం. అన్నమయ్య ఆళ్వారుల రచనల్లో వ్యక్తమయ్యే అంశాలలో మూడు ముఖ్యమైనవిగా గోచరిస్తాయి విష్ణుతత్త్వం, మధురభక్తి, అధ్యాత్మతత్త్వం. ఇవేగాక మరెన్నో సామ్యాలు విస్తృతంగా కనిపిస్తాయి. వీటిని సామాన్య సామ్యాలుగా పరిగణించవచ్చును.

అన్నమయ్య ఆళ్వార్ల రచనల్లో గోచరించే సామాన్య సామ్యాలన్నిటిని గూర్చి చర్చించే ప్రయత్నం చేయడం తలకు మించిన పనే అవుతుంది. అసంఖ్యాకంగా ఉన్న వాటన్నిటినీ చర్చించడం ఏ మాత్రం వీలుపడేది కాదు. కాబట్టి ఈ సామాన్య సామ్యాల్లో ప్రధానమైనవిగా తోచేవి మాత్రమే పరిశీలనకు స్వీకరించడం జరిగింది. వీటిని కొన్ని వర్గాలుగా విభజించి ఆయా వర్గానికి చెందిన వాటిని అన్నిటినీ ఒకేచోట పరిశీలించడమయింది. ప్రధానమైనవిగా పరిగణింపబడే ఈ సామాన్య సామ్యాలను పదమూడు వర్గాలుగా విభజించడం జరిగింది. అవి మేలుకొలుపు, మంగళాశాసనం, అలిమేలుమంగ ప్రసక్తి

వేంకటేశ్వర ప్రశంస, ప్రకృతి వర్ణన, శరణాగతి, భక్తజన సంస్మరణ, అణకువ, శ్రీ మహావిష్ణు లీలలు, శ్రీమహావిష్ణు నామ మహిమ, మానసిక ప్రబోధం, నీతి ప్రబోధం నారాయణేతర, విముఖత.

3. 1. మేలుకొలుపు :

దేవుడు సర్వాంతర్యామి. సర్వశక్తిమంతుడు. రాగద్వేషాలు, సుఖ దుఃఖాలు, ఆకలి దప్పులు లేనివాడు. అటువంటి భగవత్తత్వాన్ని ఆరాధించి తల్లగ్నమనస్కులు కావడం అందరికీ సాధ్యమయ్యేపనికాదు. అందుకే మూర్తి ఉపాసన, విగ్రహారాధన వచ్చాయి. తనకు నచ్చిన ఒక మూర్తిని నమ్మి ఆరాధిస్తూ ఆ మూర్తి పట్ల అచంచలమైన భక్తి గలిగి ఉండటం ఆనవాయితీ అయింది ఈ భక్తి వల్ల, ఆరాధనవల్ల మనిషి అభగవన్మూర్తికి చేరువై మానసిక ఏకాగ్రత పొంది తద్వారా ఇంద్రియ నిగ్రహం, ప్రకృతి జయం నిరంతర నిరుపమ బ్రహ్మానందం పొందుతాడు. కాబట్టి మానవుని ఆధ్యాత్మిక, జీవనంలో మూర్తి ఉపాసన మొదటి దశగా చెప్పబడుతూ ఉంది. దేవతలకు విగ్రహాలు లేకపోయినా భగవన్మూర్తులను ఉపాసించే మానవులు వారికి అవి అపాదించారు

తెల్లవారు జాముననే లేచి స్నానాది నిత్యకృత్యాలు పూర్తి చేసికొని ఆరాధ్య మూర్తిని సమీపించి మేలుకొలుపు పాడి నిద్రలేపడం, మంత్రపూర్వకంగా అభిషేకించి, పత్రపుష్పాలతో అర్చించి, నైవేద్య తాంబూలాలు నివేదించి భగవంతుడు తమపట్ల ప్రసన్నుడయ్యాడని భావించి, తృప్తిచెందడం పరిపాటి అయింది. ఆలయాలలో అర్చామూర్తులను ఉద్దేశించి మేలుకొలుపు పాడే పద్ధతి అమలులోకి వచ్చింది. వివిధ దేవతలను ఉద్దేశించి మేలుకొలుపు రచించడం జరిగింది. ఆళ్వార్లు, అన్నమయ్య కూడా ఈ మేలుకొలుపులు రచించారు.

తొండరడిప్పొడి ఆళ్వార్

ఈయన శ్రీరంగ నివాసి. రంగైకానురక్తుడు. శ్రీరంగ పదధ్యానైక చిత్తుడు. శ్రీరంగంలోని రంగశాయిని మేలుకొలుపుతూ ఈయన 'తిరుప్పళ్లి

ఎళుచ్చి' అనే ప్రబంధాన్నొకదాన్ని రచించాడు. పది పద్యాల్లో రంగని మేలుకొలిపాడు. ప్రాత: కాలంలో ప్రకృతి పొందే మార్పులను ఈయన చక్కగా చిత్రించాడు. రంగని ఆధిక్యత వెల్లడయ్యే విధంగా అతవి దర్శనార్థమై బ్రహ్మాది దేవతలు, రాజులు నపరివారంగా వచ్చిన వైనం రమ్యంగా వర్ణించాడు

'కదిరవన్ గణదిశై చ్చగరం వందణైన్దాన్
గనై యిరుళగనదు కాలై యం పొళుదాయ్
మదువిరిన్ దొషుగిన మామలరెల్లాం
వానవ రరశర్గళ్ వందునన్దిణి
ఎదిర్దిశై నిరైన్దన రివరొడు మ్పుగుంద
ఇరుంగళి త్తిరిట్టముయ్‌పిడియొడు మురశ్వియ్
అదిర్దలిలలై కడల్ పోన్ఱుళదెంగుం
అరంగత్తమ్మా పళ్లియెళుందరుళాయే [1]

(కారుచీకట్లు తొలగినవి. తెల్లవారినది. సూర్యుడు తూర్పుకొండ నధిరోహించాడు. పూవులు వికసించి మకరందము స్రవింప జేసినవి. దేవతలు, రాజులు ఇక్కడికి వచ్చి నీయెదుటి దిక్కున నిండి పోయిరి. వారితో వచ్చిన ఆడ, మగ ఏనుగుల ఘీంకారములు, భేరికాది వాద్యధ్వనులు ఎక్కడ చూచిన సాగర ఘోషగా ఉంది. రంగధామా! నిదుర లెమ్ము).

పెరియాళ్వార్

ఈయన ఒకే ఒక పద్యంతో దేవుని నిదుర లేపాడు. తొండరడిప్పొడి ఆళ్వార్ భక్తుడుగా రంగధాముని మేల్కొలిపితే పెరియాళ్వార్ యశోదగా కృష్ణుని నిదుర లేపాడు. మాతృమమత్వం, పుత్రవాత్సల్యం ఈయన పాసురంలో మనోహరంగా అభివ్యక్తమౌతున్నాయి.

'అరవణై యాయరేరే అమ్మముణ్ణత్తుయి తెళాయే
ఇరువు ముణ్ణా దురంగి నీ పోయ్ ఇన్ఱు ముచ్చికొండ దాలో
వరవుంకాణేన్ వయిరశై న్దాయ్ వనములై గళ్ శోర్న్దు
పాయల్
తిరువుడైయ వాయ్ మడుత్తు త్తిశై త్తుడైత్తుప్పరుగిడాయే'[2]

(నాగశయనా! యదువృషభా! రాత్రికూడా పాలుతాగకుండా నిద్రపోయావు. నేడూ మధ్యాహ్నమైంది పాలుత్రాగడానికి నువ్వు రావడంలేదు కడుపు వాడిపోయింది. అందమయిన స నాలు చేపి పాలు స్రవించగా కాలితో తన్నుతూ తన్మయుడై అందమయిన నోటితో పాలు తాగడానికి నిదురలే.

ఆండాళ్

ఈమె మూడు మేలుకొలుపు పద్యాలు రచించింది. గోకులంలోని గోపకన్యలు గోవిందుని పతిగా పొందాలనే కోరికతో కాత్యాయనీ వ్రతం చేశారు. మానసికంగా తానుకూడా వారిలో ఒకరై ఈ వ్రతానికి సంబంధించిన పాటలతో తిరుప్పావై అనే ప్రబంధాన్ని గోదాదేవి రచించింది. అందులో కృష్ణునే గాక అతని ఆత్మీయులను కూడా ఆమె మేలు కొలిపింది. తిరుప్పావై 17వ పద్యంలో నందగోపుణ్ణి, యశోదాదేవిని, కృష్ణుణ్ణి, బలరాముణ్ణి, 20వ పద్యంలో కృష్ణుణ్ణి నప్పిన్నై (నీలాదేవి) ని నిదురలేపింది. 21వ పద్యంలో కృష్ణుణ్ణి మాత్రమే నిదుర లేపింది, ఈమె కృష్ణుణ్ణి నిదుర లేపిన తీరు హృద్యంగా ఉంది.

'ముప్పత్తు మూవరమరర్కు మున్ శెన్ఱు
కప్పం తవిర్కు కలియేతుయిలెళాయ్
శెప్పముడైయాయ్ తిఱలుడైయాయ్ - శెత్తార్కు
వెప్పం కొడుక్కుం విమలాతుయిలెళాయ్'[3]

(ముప్పది మూడుకోట్ల దేవతలకు ఆపద ప్రాపించకపూర్వమే వెళ్ళి వారి జడిమ బాపే మిడుకు గల స్వామీ! నిదురలెమ్ము. ఆర్జవముగలవాడా! సామర్థ్యము గలవాడా! శత్రువులకు వేడిమి గలిగించగల విమలా! నిదురలేమ్ము)

అన్నమయ్య

అన్నమయ్య సంకీర్తనలలోనూ మేలుకొలుపులనేకం కనిపిస్తాయి. పెరియాళ్వార్ లాగా అన్నమయ్య కూడా తనను యశోదగా భావించుకొని పుత్ర వాత్సల్యం చూపుతూ కృష్ణుణ్ణి మేలుకొలిపాడు, ఈ పాటలలో సహజత్వం ఉట్టిపడుతూ ఉంది. తొండరడిప్పొడి ఆళ్వార్ లాగ భక్తుడై భక్తి ప్రపత్తులతో భగవంతుని మేలుకొలిపాడు. కల్లనిద్దుర చాలించి మేలుకోకపోతే ప్రకృతికి సహజ చైతన్యంరాదని పరోక్షంగా హెచ్చరించాడు. ప్రాతఃకాలంలో ప్రకృతి పొందే మార్పులన్నీ వర్ణిస్తూ ఆలస్యం చెయ్యడం భావ్యం కాదని త్వరగా మేలు కొమ్మని శ్రీ వేంకటేశుని ఒత్తిడి చేశాడు.

'హరి కృష్ణ మేలుకొను అది పురుషా
తరువాత నామోము తప్పకిటు చూడు

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులెదె పిలిచేరు జడినాడను
చాలువిక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు
వేళాయ నా తండ్రి వేగ లేవే.

కనుదెరవు నా తండ్రి కమలాప్తు డుదయించె
వనిత యొక మజ్జనము వడి దెచ్చెను
మొనసి మీ తండ్రి యదె ముద్దాడ జెలగీని
దను జాంతకుండ యిక దగ మేలుకోవే.

లేవె నా తండ్రి నీ లీలలటు పొగడేరు
శ్రీ వెంకటాద్రిపతి శ్రీరమణుడా
దేవతలు మునులు జెందిన సారవాదులు
ఆవలను గాదేరు ఆకసమునందు' 4

'భోగిశయనమున బుసకొట్టెదివి
యోగనిద్ర పాయును మేల్కొనవె

కన్నులు దెరవక కమలబాంధవుడు
వెన్నెం రేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయమిదే
మిన్నక నీవిటు మేలుకొనవే

తెల్లని కన్నులు దెరవక విరియగ
నొల్లక జలజములున్న ఏవే
కల్లవిదుర వినుగవియగ నియ్యక
మెల్లనాయ విటు మేలుకొనవే

తెరవగు రెప్పలెదెల్లవారవెలె
తెరవక చీకటి దీరదిదే
తెరగు వేంకటాధిప నీవెలుగుదు
మెలుగులు చల్లుచు మేలుకొనవే 5 '

'వారిధి శయనవో వటపత్ర పరియంక
గారవాన మేలుకొని కన్నులుదెరవవే

ఘనయోగి హృదయపు కమలాలు వికసించె
నొనర విజ్ఞాన సూర్యోదయ మాయ
మును జీవపరమాత్మముల ఐక్యవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే

కలుషముల నేటి చీక టెల్ల బెద బాసె
వలువంక వెదకీరనాదము మ్రోసె
అలరి యితర ధర్మాల నేటి చుక్కలు మాపె
జలజాక్ష మేలుకొని సతిమోము చూడవే.

కపటరాక్షసనేత్ర కలుహారములు మ్రోడ్పె
యిపుడే సుకర్మముల యెండ గాసె
అపురూప శ్రీ వెంకటాద్రీశ మేలుకొని
విపులుడ యిందిరయు నీవు మమ్ముగావవే' 6

తొండరడిప్పొడి ఆళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్, అన్నమయ్యల రచనల్లో మాత్రమే మేలుకొలుపులు కనిపిస్తున్నాయి, తక్కిన ఆళ్వారు లెవరి రచనల్లోనూ అవి గోచరించడం లేదు. తొండరడిప్పొడి ఆళ్వార్ అన్నమయ్య రచనల్లో ప్రాతఃకాల ప్రకృతి వర్ణన చోటుచేసుకొని సొంపు గొలుపుతూ ఉంది.

3. 2 మంగళా శాసనము

సర్వేశ్వరుడు సర్వజీవ సన్మంగళ సందాయకుడు. ఆయనకు సన్మంగళం సమకూరాలని సంకల్పించడం విడ్డూరమేకావచ్చు. భగవంతుని మీద అధిక ప్రీతి అతవి మహత్త్వమును మరిపింప జేసి మంగళాశాసనం చేయడానికి ప్రేరేపించవచ్చు. విష్ణువు విశ్వమయుడు కాబట్టి విష్ణువుకు మంగళాశాసనం చేస్తే విశ్వానికంతా చేసినట్లే అవుతుంది. కాబట్టి మహనీయులు భగవంతుని ద్వారా విశ్వానికి మంగళాశాసనం చేసే అనవాయితి వచ్చి ఉండవచ్చు. ఏది ఏమైనా భగవంతుని ఉద్దేశించి మంగళాశాసనం చేసే అలవాటు మనకెప్పటినుంచో ఉన్నట్టు తెలుస్తూఉంది. శైవులైన నాయన్మారులు శివ క్షేత్రాలను దర్శించి శివునుద్దేశించి మంగళాశాసనం చేస్తూ పాటలు పాడారు. అదే ధోరణిలోనే శ్రీమన్నారాయణుని కీర్తిస్తూ వైష్ణవులైన ఆళ్వార్లుకూడా అనేక పాశురాలు

రచించి గానం చేశారు. అన్నమయ్య కూడా పారినమపరించారు. అన్నమయ్య ఆళ్వార్ల రచనల్లో విష్ణువుకు సన్మంగళం ప్రాప్తించాలనే కోరిక వ్యక్తమయ్యేవి కూడా ఉన్నాయి.

కులశేఖరాళ్వార్

కులశేఖరాళ్వార్ ఒకే శ్లోకంలో విష్ణువుకు మంగళాశాసనం చేశారు.

'జయతు జయతు దేవో దేవకీ నన్దనోయం
జయతు జయతు కృష్ణో వృష్ణివంశ ప్రదీపః
జయతు జయతు మేఘశ్యామలః కోమలాఙ్గో
జయతు జయతు పృథ్వీభారనాశో ముకున్దః [7]

తిరుమంగై ఆళ్వార్ :

అనేక దివ్య క్షేత్రాలను దర్శించి అనేక అర్చా మూర్తులను సేవించి వారి మీద అనేక పద్యాలు చెప్పిన ఈ ఆళ్వారు విష్ణుదేవునికి మంగళాశాసనం చేస్తూ ఒక పద్యం మాత్రమే చెప్పి ఉన్నారు. వెన్నుని మంగళకరమైన రూపాన్ని తిలకించి, పులకించి ఆ రూపంతో కూడిన మహనీయుడు వర్ధిల్లాలని మంగళా శాసనం చేసిన తీరు మనోహరంగా ఉంది.

'కాళియుం కూదలుం కోయిల్ కొండ కోవలరే యొప్పర్
కున్ఱుదురిమన్న
పాళియదోళుమోర్ నాన్గుడైయర్, పండివర్ తమ్మైయుం
కండరియోం, వాళియరో వివర్ [8]

(ఉరైయూరు దక్షిణ మధురలవి ఆలయాలుగా కలిగియున్న గోపాలుడిలా ఉన్నాడు. పర్వతోపమసుందర చతుర్భుజాడైన ఇతన్ని పూర్వమెకప్పుడు మనం చూడలేము. ఇతడు వర్ధిల్లుగాక)

పెరియాళ్వార్

మంగళాశాసనానికి సంబంధించి ఈయన రచించిన పద్యాలు పన్నెండు నరసింహావతారాన్ని ప్రస్తావిస్తూ అతనికి దృష్టిదోషం తొలగేట్టుగా ఈ ఆళ్వార్ 'పల్లాండు' పాడాడు.

'.... .... ... .... ... ...
.... .... .... తిరువోణ త్తిరు విళవిల్
అందియం పోది అరియురువాగి యరియై యళి త్తవనై
పందనై తీరప్పల్లాండు పల్లాయిరత్తాండెన్ఱు పాడుదుమే''

(శ్రావణ సాయంకాలం నరసింహుడై శత్రువగు హిరణ్యకశిపుణ్ణి నశింపజేసిన వాడికి నలుగు తీరేట్టుగా పలువత్సరాలు పలువేలవత్సరాలని, మంగళా శాసనం చేద్దాం).

అండాళ్

ఈమె రెండు పద్యాల్లో మాత్రమే మహావిష్ణువుకు మంగళాశాసనం చేసింది. వామన, రామ, కృష్ణావతారాలలోని భగవల్లీలలు సంస్మరిస్తూ ఈమె మంగళాశాసనం చేసింది.

'అన్ఱివ్వులగ మళందాయ్ అడిపోట్రి
శెన్ఱంగు తెన్నిలంగై శెట్రాయ్ తిరల్ పోట్రి
పొన్ఱచ్చగడ ముదైత్తాయ్ పుగళ్ పోట్రి
కన్ఱుకుణిలా యెఱిందాయ్ కళల్ పోట్రి
కున్ఱుకుడైయా ఎడుత్తాయ్ గుణం పోట్రి
వెన్ఱుపగై కెడుక్కుం నిన్కైయిల్ వేల్ పోట్రి' [10]

(ఆనాడు ఈ ప్రపంచాన్ని కొలిచిన వాడా! నీ పాదాలకు మంగళమగుగాక దక్షిణంలో ఉన్న లంకకు వెళ్లిదానిని నాశనం చేసినవాడా! నీ సామర్థ్యానికి మంగళం అగుగాక! వత్సాసురుని కర్రగా విసిరినవాడా, నీ పాదాలకు మంగళం అగుగాక! పర్వతమును గొడుగుగా పైకెత్తినవాడా; నీ గుణాలకు మంగళం అగుగాక).

అన్నమయ్య

అన్నమాచార్యుడు భగవంతునికి మంగళం సమకూరాలనే తలపుతో పలు కీర్తనలు రచించాడు. విష్ణువు, విష్ణువక్షోవాసిని దంపతులు. దంపతులను ఒకే వ్యక్తిగా పరిగణించే ఆనవాయితీ మన హైందవ సమాజంలో ఉంది. ఈ అంశాన్ని మనసులో ఉంచుకొనేయేమో అన్నమయ్య లక్ష్మీనారాయణు లిద్దరికీ ఒకేసారి మంగళాశాసనం చేశాడు

'మరలి మరలి జయ మంగళము
సొరిది నిచ్చలును శుభ మంగళము

కమలారమణికి కమలాక్షునకును
మమతల జయజయ మంగళము
అమర జననికిని అమర వంద్యునకు
సుముహూర్తముతో శుభ మంగళము

జలధికన్యకును జలధిశాయికిని
మలయుచును శుభ మంగళము
కలిమి కాంతకు కలికి విభునికి
సులభుల యారతి శుభమంగళము.

చిత్తజుతల్లికి శ్రీ వెంకటపతికి
మత్తిల్లిన జయమంగళము
యత్తలనత్తల యిరువుర కాగిటి
జొత్తుల రతులకు శుభ మంగళము' 11

కులశేఖరాళ్వార్, తిరుమంగై ఆళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్ అన్నమయ్యలు మాత్రమే విష్ణువునుద్దేశించి మంగళాశాసనం చేస్తూ రచనలు సాగించారు. తక్కిన ఆళ్వార్లెవరూ దానికుపక్రమించ లేదు.

## 3. 3 అలిమేలు మంగ ప్రసక్తి

వేంకటాద్రివాసుడైన శ్రీనివాసుని ఇల్లాలు అలిమేలుమంగ. అనవరతము అతని వక్షం మీద నివసిస్తూ అందరికీ అనుపమ శుభాలం నందిస్తూ అలరారుతుంది స్వామిని సేవించే ముందు అతని దేవేరిని కూడా ప్రసన్నురాలుగా చేసుకొనే ప్రయత్నం చేయడం భక్తులకు పరిపాటి. లక్ష్మిని కొనియాడితేగానీ అది విష్ణువును సంపూర్ణంగా కొనియాడినట్లనిపించుకోదు. కారణము ఆమె అతని అర్థాంగి మాత్రమే గాక వక్షోవాసిని కూడా. వీరుభయులు ఒకే వ్యక్తిగా పరిగణింపబడటం వల్ల ఆమెను వినుతించక పోతే ఆయన వినుతికి నిండుదనం చేకూరదు. కాబట్టి ఆళ్వార్లు అన్నమయ్య తమ రచనల్లో ఆమెను కూడా ప్రస్తావించి కీర్తించారు.

### పెరియాళ్వార్

ఈయన ఒక పద్యంలో అలిమేలు మంగను ప్రస్తావించారు. మంగై అను శబ్దప్రయోగంతో అలిమేలు మంగను ధ్వనింప జేశారు.

"వడివాయ్ నిన్ వలమార్బినిల్ వాళ్గిన్ఱ
మంగైయుం పల్లాండు" 12

(నీ ఉరంలో కుడిభాగంలో మూర్తిమంతమై నివసించే యౌవనశాలిని శ్రీదేవికి పలువత్సరాలు).

### నమ్మాళ్వార్

ఈయన కూడా ఒక పాశురంలోనే అలిమేలు మంగను సంస్మరించారు. నేను నిన్నెప్పుడూ విడిపోనని అలిమేలు మంగ శ్రీనివాసుని ఉరములో నివసిస్తూ వుందని ఈయన చక్కగా చమత్కరించారు.

'అగల గిల్లేన్ విరై యుం ఎన్ట్రలర్ మేల్మంగై యురై మార్బా' [13]

స్వామీ! నేను విన్నెప్పుడూ విడిపోనవి అలిమేలుమంగ నివసించే ఉరముగలవాడా ఇది శ్రీనివాసుని సంబోధిస్తూ చెప్పిన పద్యం. దీనిలో అలిమేలుమంగ ప్రసక్తి పరోక్షంగా మాత్రమే గోచరిస్తుంది.

ఒకపద్యంలోనే ఆండాళ్ కూడా అలిమేలుమంగను గురించి ప్రస్తావించింది విష్ణుదేవుని ఉరమును సంస్మరిస్తూ అందులో నివసించే ఆమెను కూడా సంస్మరించింది.

"వేంగడత్తుత్తన్నాగత్తిరుమంగై శీర్ మార్బర్క్కు"[14]
(వేంకటగిరి శ్రీనివాసవక్షస్కునికి)

అన్నమయ్య

అన్నమయ్యకు అలిమేలుమంగమీది భక్తి అపారం. తన రచనల్లో అనేకచోట్ల ఆమెను గురించి ప్రస్తావించారు, కీర్తించారు. తల్లిగా కొనియాడి తన్మయుడైనాడు. ఆమెకు సమర్పణంగా వేంకటేశ్వర మకుటంతో ఒక శతకాన్ని కూడా చెప్పారు. వేంకటేశ వక్షోవాసిగా అలిమేలు మంగను అభివర్ణించాడు. అమె ఘనతను అనేక విధాలుగా కొనియాడాడు.

"వురుపై యలమేల్మంగ నురమున నించుకొని
యిరువై శ్రీ వేంకటేశు డెదుట నున్నాడు"[15]

గురుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసగీజూడరో చింతామణి యీపె

పాలజలధి బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీ నరసింహులక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీలీల లోకము లేలే యిందిర యీపె

ఘనసంపద లొసగు కమలాకాంత యీపె
మనసిజుగనిన రమావతి యీపె
అనిశము బాయని మహా హరిప్రియ యీపె
ధనధాన్యరూపపు శ్రీతరుణియీపె

రచ్చల వెలసినట్టి రమావనిత యీపె
మచ్చిక గల యలమేలుమంగ యీపె
ఇచ్చటి వేంకటాద్రి నీ యహోబిలము నందు
విచ్చలుదావుకొనిన విధానమీపె' [16]

పెరియాళ్వార్, నమ్మాళ్వార్, ఆండాళ్, అన్నమయ్యలు మాత్రమే అలిమేలుమంగను గురించి ప్రస్తావించారు. తక్కిన ఆళ్వార్లు అలిమేలుమంగను ప్రత్యక్షంగా కొనియాడినట్లు తోచదు అలిమేలుమంగను గురించి ప్రస్తావించిన వాళ్లు కూడా అలిమేలుమంగకు, లక్ష్మీదేవికి అభేదాన్ని పాటించినట్లు తోస్తున్నది. పైగా లక్ష్మి అలిమేలుమంగ అని అన్నమయ్య విస్పష్టం చేశాడు.

''లక్ష్మీపతివిగాన లాగుల నీవురముపై
లక్ష్మియలమేలు మంగే ... .... ....' [17].

తిరుచానూరులో నెలకొనియున్న పద్మావతీదేవిని గురించిగాని, యిప్పుడు పలువురు భావిస్తున్నట్టు ఆమెయే అలిమేలుమంగ అనే అంశాన్ని గురించిగాని ఆళ్వార్ల అన్నమయ్య రచనల్లో ఎటువంటి ప్రసక్తి లేదు, కారణమింకను పరిశీలించ వలసి ఉంది.

## 3. 4 వేంకటేశ్వర ప్రశంస

వైష్ణవ క్షేత్రాలన్నిటిలోను తిరుమల జగత్ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఆక్షేత్రంలో వెలసిన అర్చామూర్తి శ్రీ వేంకటేశ్వరుడు. కలియుగంలో జనులు ఘోర తపోనిష్ఠనవలంబించి, భగవంతుని దర్శించి అతని దయకు పాత్రులయ్యే దార్ఢ్యము లేనివారు. కాబట్టి, భూలోకవాసుల బాధలు బాపేందుకు, సౌఖ్యాలు,

సంపదలు సమకూర్చేందుకు విష్ణువే వైకుంఠాన్నుంచి స్వయంగా దిగివచ్చి శేషాద్రిమీద నెలకొన్నాడని జనుల విశ్వాసం. అతన్ని ఆశ్రయిస్తే అన్ని రకాల బాధలు తొలగుతాయని, సిరులెన్నో కలుగుతాయని భక్తుల నమ్మకం.

వేంకటేశ్వరుడు, సర్వశక్తి మంతుడని, భక్తసులభుడని కొనియాడటం జరుగుతూ ఉంది. 'వినా వేంకటేశం ననాథోననాథ' అని కలౌ వేంకటనాయకః' అని అతని ఘనత చాటబడుతూ ఉంది.

కవులెందరో ఆ దేవదేవుడు దివినుంచి భువికి దిగివచ్చిన దివ్య కథను తీసుకొని కావ్యాలుగా మలిచారు. వాగ్గేయకారులెన్నో కీర్తనలు రచించి, ఆలపించి ఆనందించారు. గాయకులతని పాటలు పాడి పరవశించారు. అన్నమయ్య, ఆళ్వార్లు కూడా ఈ మహానుభావుని కీర్తించి ఇహపరాలు పొంది ఈడులేనియశము నార్జించారు. క్షేత్రాధీశ్వరుడేగాక క్షేత్రాన్ని కూడా తత్స్వల్యం గానే భావించి కొనియాడారు. 'వెర్పెన్ను వేంగడం పాడినేన్ వీడాక్కి-నిక్కిన్దేన్' [18] అన్నాడు తిరుమళిశై ఆళ్వార్. (కొండ అని వేంకటాద్రిని కొనియాడాను మోక్షం సిద్ధమని నిలచాను). తిరుమలను కొనియాడినా, తిరుమలేశుని వినతించినట్లే అవుతుందని భావించి వీరు రచనలు చేసినట్లు తోస్తుంది. కాబట్టి తిరుమలకు సంబంధించిన పద్యాలను కూడా తిరుమలేశుని పద్యాలుగనే పరిగణించడం సమంజసం.

## పొయ్‌గై ఆళ్వార్

ఈయన తిరుమలను, తిరుమలేశుని కొనియాడుతూ పదిపద్యాలు రచించాడు, వేంంకటేశుడు తన మనసులో నివసిస్తున్నట్లు స్పష్టం చేశాడు.

'వెళ్ళత్తి నుళ్ళానుం వేంగడత్తు మేయానుం
ఉళ్ళత్తి నుళానెన్డోర్', [19]

(పాలకడలిలో ఉండే వాడు, వేంకటాచలవాసుడూ (విష్ణువు) మనను ఉన్నాడని తెలుసుకో.)

పూదత్తాళ్వార్

వేంకటాచలం, వేంకటేశ్వరులకు సంబంధించి భూతయోగి చెప్పిన పద్యాలు తొమ్మిది, తన నోరు వేంకటేశ్వరుని గొప్పతనాలను చెప్పేవిధంలోనే సాహసించినట్టు చెప్పాడు.

> "వేయ్‌పిరంగు సారల్ వేంగడవనై యే
> వాయ్ తిరంగళ్ సొల్లుం వగై"[20]

[ఎదిగిన వెదుళ్లతో కూడిన శిఖరములుగల వేంకటాచలాధీశుని గరిమలు కొనియాడటంలో (నా) నోరు సాహసించింది.)

పేయాళ్వార్

పందొమ్మిది పద్యాల్లో ఈ ఆళ్వార్ శేషగిరిని, శేషగిరీశుని కొనియాడాడు శేషగిరీశుని ఈయన వర్ణించిన తీరు రమణీయంగా ఉంది.

> "..................... నార్పాల
> వేదత్తాన్ వేంగడత్తాన్ విణ్ణోర్‌ముడి తోయుం
> పాదత్తాన్"[21]

(చతుర్వేద ప్రతిపాద్యుడు, వేంకటుడు, దేవతలు శిరసువంచి నమస్కరించే పాదాలు గలవాడు.)

తిరుమళిశై ఆళ్వార్

వేంకటాద్రిని గురించి వేంకటేశ్వరుని గురించి ఈయన రచించిన పద్యాలు పదహైదు. వేంకటేశ్వరుడు తన మనసులో ప్రవేశించినట్టు ఈయన చెప్పాడు.

"వేంగడవా ఎన్నుళ్లంపు గుందాయ్"[22]

(వేంకటేశ్వరా నా మనస్సులో ప్రవేశించావు)

**కులశేఖరాళ్వార్**

ఈయన పదకొండు పద్యాల్లో కొండనూ, కొండలరాయణ్ణీ కొనియాడారు. తిరుమలలో ఆనందనిలయంలో ఆనందదాయకుని సన్నిధిలో ద్వార సోపానంగానైనా ఉంటూ దేవుని సుందరవదనారవిందాన్ని చూస్తుండాలని కులశేఖరుడు కోరారు.

"శెడియాయ వల్వినైగళ్ తీర్క్కుం తిరుమాలే!
నెడియానే! వేంగడవా!నిన్ కోయిలిన్ వాసల్
అడియారుం వానవరుం అరంబైయరుమ్ కిడన్దేంగుం
పడియాయ్క్కిడందువున్ పవళవాయ్ కాణ్బేనే"[23]

(దట్టంగా ఉన్న దుష్కర్మాలను పోగొట్టే శ్రీపతీ! మహోన్నతుడా! వెంకటేశ్వరా! నీ ఆలయద్వారములో భాగవతులు, దేవతలు, అప్సరసలు పడిగాపులుండే) సోపానమై పడి ఉండి నీ పగడపు నోటిని చూస్తూఉందునుగాక

తిరుమంగై ఆళ్వార్

సర్పరాట్ శైలాన్నిగురించి సర్పరాట్‌శాయిని గురించి ఈ ఆళ్వార్ రచించిన పద్యాలు అరవైరెండు. ప్రకృతి సౌందర్యంతో కూడిన తిరుమలలో స్వామి నెలకొని ఉన్నట్లు ఈయన అభిప్రాయపడ్డారు.

"కల్ తేన్‌పాయ్ న్దొళుగుం కమలచ్చునై వేంకడవా"[24]

(రాళ్లనుంచి తేనె ప్రవహించే తామరదొనలతో కూడిన వేంకటాచలేశ్వరా!)

తిరుప్పాణాళ్వార్

రెండు పద్యాల్లో మాత్రమే ఈయన తిరుమలను తిరుమలప్పను సంస్మరించాడు. తిరుమలలోని ఉద్యానవనాలు పరిమళభరితాలని. స్వామి అక్కడ నివసిస్తున్నాడని ఆళ్వార్ చెప్పాడు.

"నిరై యార్ పొళిల్ వేంగడవన్"[25]

(పరిమళ భరితోద్యాన వనాన్విత వేంకటగిరి నివాసి)

పెరియాళ్వార్

ఈ ఆళ్వార్ పదకొండు పద్యాల్లో పన్నగేంద్ర శైలాన్ని, పన్నగేంద్ర శాయిని స్పృశించాడు.

"కడియార్ పొళిలణి వేంకటవా!"[26]

(పరిమళ భరిత సుందర వనాన్విత వేంకటగిరి నిలయా)

నమ్మాళ్వార్

అరవై రెండు పద్యాలలో ఈయన భోగీంద్రశైలాన్ని భోగీంద్ర తల్పుణ్ణి స్మరించాడు. శీతలమయమైన తిరుమలలో స్వామి నెలకొని ఉన్నట్టు పేర్కొన్నాడు.

"తణ్ తిరువేంగడత్తుళ్ నిన్ఱాయ్"[27]

(చల్లని శ్రీ వేంకటాచలంలో నిలిచినవాడా!)

ఆండాళ్

ఈమె పదహారు పద్యాల్లో పాపరేని మలను, పాపధ్వంసిని స్పృశించింది తనను వేంకటేశ్వరునితో కూర్చుమని అనంగ దేవుని అర్థించింది.

"వెయ్యదోర్ తళలుమిళ్ శక్కరక్కై
వేంగడవర్కెన్నై విదిక్కిట్రియే

(విప్పులు కక్కే ఉగ్రగ్రహమైన వేంకటేశ్వరునికి నమ్ము విధింతు)

**అన్నమయ్య**

అన్నమయ్యకు చిన్ననాటి నుండి తిమ్మప్పమీదనే దృష్టి. ఆయన్నే తన పరదైవంగా భావించాడు. తన్మయంతో వినుతించి ఆనందించాడు. చిరుతప్రాయంలోనే తిరుమలకు వచ్చి స్వామిని దర్శించి తరించాననుకున్నాడు. అన్నమయ్య అన్నమాచార్యుడు కావడానికి కూడా హేతుభూతుడైనవాడు తిరుమలయ్యే. అన్నమయ్యకు పదహారేండ్ల ప్రాయంలోనే సాక్షాత్కారమిచ్చి రోజుకొక కీర్తనకు తక్కువకాకుండా తన కీర్తిని గానం చేయమని సంకీర్తనా-యజ్ఞాన్ని ప్రోత్సహించింది కూడా ఏడుకొండలవాడే. అన్నమయ్య యేక్షేత్రాన్ని కొనియాడినా, ఏ వేల్పును వినుతించినా కొండలోను, కొండ లప్పలోనూ పర్యవసించవలసిందే. సంకీర్తన చివరలో శేషాద్రి-పేరుగాని శేషా ద్రీశ్వరుని పేరుగాని తప్పకుండా ఉండి తీరవలసిందే. అన్నమయ్య కీర్తనలన్నీ ఇంచుమించు ఈవిధంగానే కనిపిస్తున్నాయి. సాటిలేని శ్రీ వెంకటేశ్వరుడే దైవ మని అతన్ని సేవిస్తూ బ్రతికేవే బ్రతుకని అన్నమయ్య ఎలుగెత్తిచాటాడు.

> ''యెనలేని తిరువెంకటేశుడే దైవమని
> వినగలిగినది గదా వివేకి
> అనయంబు నతని సేవానందపరులయి
> మనగలిగినది గదా మనుజులకు మనికి''[29]

తొండరడిప్పొడి ఆళ్వార్, మధురకవి ఆళ్వార్ తప్ప తక్కిన ఆళ్వార్లందరూ, అన్నమయ్యా వెంకటాద్రిని, వెంకటేశ్వరుని వినుతించారు తొండరడిప్పొడి ఆళ్వార్, రంగ పదైక సంలగ్నమనస్కుడు. మధుర కవి ఆళ్వార్ గురువునే దైవంగా భావించి అతన్నే కీర్తించిన మహామనీషి కాబట్టే ఈ ఉభయులకు వెంకటేశ్వరుణ్ణి వినుతించే వీలులేకపోయింది.

**3.5. ప్రకృతి వర్ణన**

ప్రకృతిలోనే మానవుడు జీవిస్తున్నాడు. ప్రకృతి వినా అతడు లేడు మానవుని ఉనికికి, ఆనందానికి దోహదం చేసే ప్రకృతి సౌందర్యాన్ని

విస్మరించేందుకు వేల్లేదు. కవులు తమ కావ్యాలలో ప్రకృతిని వర్ణించి పాఠకులను సంతోషపరచి తాముకూడా ప్రమోదభరితులయ్యారు ఆళ్వార్లు, అన్నమయ్య కూడా తమ రచనల్లో పలుచోట్ల ప్రకృతిని అభివర్ణించిచారు. ఆళ్వార్లు పుణ్యక్షేత్రాలను కొనియాడేటప్పుడల్లా ఆ ప్రదేశపు ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించకుండావిడువలేదు. కాబట్టి దాదాపు ప్రతి ఆళ్వార్ రచనలోనూ ప్రకృతి సౌందర్యవర్ణన తప్పనిసరిగా చోటుచేసుకొని ఉంది వాటినన్నిటిని ఇక్కడ పొందుపరచటానికి వీలుపడదు. కాబట్టి హృద్యంగమంగా ఉన్నవాటిని మాత్రమే పరిశీలనకు తీసుకోవడం జరిగింది.

పూదత్తాళ్వార్

ఈయన ప్రకృతి వర్ణనచేస్తూ రచించిన పద్యాలలో హృద్యమైన ఒక చిత్రణ ఉంది, ఏనుగుల జంట అనురాగాన్ని వ్యక్తంచేసే చక్కని దృశ్యాన్ని ఈయన రమణీయంగా చిత్రించాడు.

> ''పెరుగుమద వేళం మాప్పిడిక్కుమున్నిన్ఱు
> ఇరుకణిళమూంగిళ్ వాంగి— అరుగిరుంద
> తేన్కలంద సీట్టుమ్ '30

(స్రవిస్తున్న మద జలంగల ఏనుగు ఆడఏనుగు ముందర నిలబడి రెండు గణుపుల లేత వెదురు తీసుకొని, అక్కడే ఉన్న తేనెలో అద్దుకొని ఆడ ఏనుగుకి అందిస్తుంది)

పేయాళ్వార్

ఈ ఆళ్వార్ చేసిన ప్రకృతి వర్ణనంలో తిరుమలలో ఏనుగుల జంట ప్రణయ కలహాన్ని చిత్రించిన తీరు, పాఠకుల మనసుల్లో చెరిగిపోని ముద్ర వేస్తుంది.

"పురిందుమద వేళం మాప్పిడియోడూడి,
తిరిన్దుశిన త్తాల్ పొరుదు - విరిన్దసర్
వెణ్ గోట్టు ముత్తుదిర్క్కుం వేంగడమే.... ...."31

(మదపుటేనుగు ఆడ ఏనుగుతో సంగమించి ప్రణయ కలహం చేసి, పరుగెత్తుతూ కోపంతో తలపడుతూ తెల్లని కొమ్ములనుంచి ముత్యాలను రాల్చే తిరుమలే,,............)

తొండరడిప్పొడి ఆళ్వార్

ఈయన ప్రకృతిని రమణీయంగా వర్ణిస్తూ నాలుగు పద్యాలు రచించారు. ఈయన చేసిన ప్రాతఃకాల వర్ణన పాఠకుల రసికతను మేలుకొలుపుతూ ఉంది.

"కదిరవన్ గుణదిశై చ్చిగరం వందణైన్ దాన్
గనై విళగ్గ్రసదుకాలై యం బెళుదాయ్
మదువిరిం దొళుగిన మామలరెల్లాం...... "

(కారు చీకటి తొలగింది తెల్లవారింది సూర్యుడు తూర్పుకొండ నధి రోహించాడు పూవులు వికసించి, మకరందం స్రవింపచేసాయి.... ....)

కులశేఖర ఆళ్వార్

ఈయన ప్రకృతి వర్ణనలలో ఒకటి అతి చక్కగా ఉంది. కృష్ణుని శిశువుగా ఎత్తుకునే అదృష్టం తనకు లేకపోయిందికదా అని దేవకి వాపోతున్నట్టు రచించిన పద్యంలో పాలు తాగుతున్న శిశువు దృశ్యం వర్ణింపబడింది.

"ఉళగనే! ఎన్దన్ కోమలప్పిళ్లాయ్! గోవిందా! ఎన్ కుడం
గై యిల్ మన్ని
ఒళగు వేరెళిళంగిబు తళిర్ పోల్ ఒరుకై యాలొరుముళై
ముగంనెరుడా

మళలై మెన్న గైయుత్తై యరుళావాయిలేములై ఇరుక్కవెన్
మగత్తే
ఎళిల్ కొళ్విన్తిరుక్కణ్ణై నోక్కన్ద నైన్నైయు మిళందేనిళందేనే

(అందరితోను కలిసే స్వభావం కలవాడా! కోమలుడైన నా కుమారుడా, గోవిందా! నా చేతులలో ఇమిడి అందమైన కిసలయ సదృశ హస్తంతో ఒక స్తనాగ్రమును నిమురుతూ, ఒక స్తనము నోటిలో ఉండగా, మధ్యమధ్య చిరునవ్వు నవ్వుతు నాముఖాన్ని అవలోకించే నీ చూపులను కోల్పోయానుకదా!

తిరుమంగై ఆళ్వార్

ప్రకృతిని వర్ణిస్తూ ఈయన రచించిన పద్యాల్లో పదమూడు హృద్యంగా ఉన్నాయి. తిరుపిరిది క్షేత్రంలో ఏనుగుల అనురాగాన్ని తెలిపే దృశ్యాన్ని మనోల్లాసంగా ఈ ఆళ్వార్ చిత్రించాడు

'వరై సెయ్మాక్కళిఱెళ వెదిర్ వళర్ ముళై అళైమిగు
తేన్ తోయ్త్తు
ప్రసవారిక్కన్నిళం విడిక్కరుళ్ సెయ్యుమ్ పిరిది......34

(పర్వత సదృశాలైన మగ ఏనుగులు లేత వెదుళ్ల యొక్క బాగా పెరిగిన మొగ్గలను విరుచుకొని తేనెలో అద్ది తమ సహచారిణులగు లేత్రాయపు ఆడ ఏనుగులకు ఇచ్చే పిరిది క్షేత్రం ... ....)

పెరియాళ్వార్

పెరియాళ్వార్ ప్రకృతి వర్ణనలలో మూడు పాశురాలు ముఖ్యమైనవిగా కన్పిస్తున్నాయి. గోవర్ధన పర్వతంలో కోతుల క్రీడను ఈ ఆళ్వార్ చక్కగా వర్ణించాడు.

"మున్నేవళిరుకౌగట్ట మాళుత్తళింగళ్ ముదుగిర్ పైయ్తుమ్కు
కుట్టన్గళై
కొంబేట్రి ఇరున్దు గుదిపయ్రటం..............."[35]

(మాను అనే జాతి కోతుల సమూహాలు తమ పిల్లలను వీపులకు కట్టుకొని కొమ్మపైకి ఎక్కించి మరో కొమ్మమీదికి దూకడంలో శిక్షణ నిచ్చే గోవర్ధనగిరి)

ఆండాళ్

ఈమె ప్రకృతి వర్ణనల్లో రెండు రమణీయంగా ఉన్నాయి. ఆకాశం లోని మేఘాలను ఈమె వర్ణించిన తీరు ఎంతో చక్కగా ఉంది.

"విణ్ణీల మేలాప్పు విరిత్తార్ పోల్ మేగంగాళ్"[36]

(ఆకాశంలోని నీలిరంగు పైపరదా పరిచినట్లున్న మేఘాల్లారా!)

అన్నమయ్య

అన్నమయ్య రచనల్లో కూడాప్రకృతి వర్ణలనేకం కనిపిస్తాయి. వేంకటేశుని మేలుకొలుపు పాట ఒక దానిలో ప్రాతఃకాల ప్రకృతి వర్ణన ఎంతో ఇంపు గొలుపుతూ ఉంది.

"రాతిరెల్ల పతులతో రతుల నలసెనేమో
రీతిగాదు హరి నెచ్చరికె సేయరే
పైపై బొద్దు వొడచీ పంకజములు విరిసె
గోపగోవిందుని మేలుకొలుపవరె
దీపములు దెల్లబారె తిమిరమంతయు జారె
శ్రీపురుషోత్తమునిజేయంటి లెమ్మనరే.

కలువలు ముకుళించీ కలివింక వెలుగించీ
నెలతలు దేవదేవునిద్ర దెల్పరే

జలనిధి పొంగణగె చాయల చుక్కలు మాపె
వలరాచగురు మప్పవడము గమ్మనరే.

జీవుల మేలుకొనిరి చెంగలించెదరువుల
భావించి యమ్మతు నిట్టె పలికించరే
కావిరింతయు విరిసె కరుసంధ్యకు బొద్దాయ
శ్రీ వేంకటేశుని విచ్చేయుమనరే 37

కవులు కూడా ప్రకృతికి అతీతులు కారు. కాబట్టి వారి రచనల్లో ప్రకృతికి సంబంధించిన విషయాలు చోటు చేసుకోవడం సహజమే. అదేవిధంగానే అన్నమయ్య ఆళ్వార్ల రచనల్లో ప్రకృతి వర్ణనలు చోటు చేసుకున్నాయి. అయితే తిరుమళిశై ఆళ్వార్, తిరుప్పాణాళ్వార్; మధురకవి ఆళ్వార్ నమ్మాళ్వార్ల రచనల్లో చెప్పుకోదగినంత ఆహ్లాదకరంగా ప్రకృతి వర్ణనలు కనిపించడం లేదు.

3 8. శరణాగతి

భగవంతుని చేరుకునేందుకు అతని దయకు పాత్రులయ్యేందుకు భక్తులనేక మార్గాల నవలంబిస్తారు. వాటిలో శరణాగతి ఎంతో శ్రేష్ఠమైందని చెప్పబడు తూంది. తమకు భగవంతుడు తప్ప ఇతరమైన ఆధారమేదీ లేదని గ్రహించి విశ్వసించి అతడే దిక్కని అతని పాదాల నాశ్రయించడమే శరణాగతి తత్త్వమని స్థూలంగా చెప్పుకోవచ్చు. ఆ విధంగా శరణుజొచ్చిన వారిని అభయమిచ్చి ఆదుకోవడం భగవంతుని స్వభావమని చెప్పబడుతూఉంది. విభీషణ శరణాగతి సందర్భంగా రాముడన్న మాటలు, భగవద్గీతలో కృష్ణుడన్న మాటలూ ఇక్కడ అనుసంధించుకోవలసి ఉంది.

'సకృదేవ ప్రపన్నాయ తవా స్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యోదదా మ్యేతద్వ్రతంమమ

శ్లో॥ 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ''

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః 40

ఆళ్వార్లు అన్నమయ్యకూడా ఈ శరణాగతి తత్త్వాన్ని మనసారా ఆదరించారు భగవంతుని శరణుజొచ్చారు. ఆ విధంగానే చెయ్యమని అన్యులను కూడా ప్రబోధించారు.

పొయ్‌గై ఆళ్వార్

ఈయన శరణాగతిని బలపరిచే ఒక పద్యాన్ని చెప్పాడు. విష్ణువు శరణు జొచ్చిన శంకరునంతటి వాని దుష్కర్మను కూడా పోగొట్టాడు. కాబట్టి అతన్ని శరణు జొచ్చిన వారికి అన్ని సుఖాలు కరతలమలాకమేనని అభిప్రాయపడ్డాడు.

''పణ్ పుజిందనాన్ మఱైయాన్ నెన్నిదలి ఏఱు
వెణ్‌పురినూల్ మార్పన్ వినై తీర పుణ్‌పురింద
వాగత్తాన్ తాళ్ పణివార్ కండీర్ అమరర్ తం
భోగత్తార్ భూమి యాళ్వార్............ 41

(సుస్వర చతుర్వేది [బ్రహ్మ] తలను బలిగొన్న శ్వేతయజ్ఞోపవీతవక్షుని [శివుని] కర్మనశించేట్లు తన వక్షాన్ని గాయపరచుకొన్నవాని (విష్ణుదేవుని) పాదాలను ఆశ్రయించేవారు సురభోగాలతో భూమిని పాలిస్తారు.

పూదత్తాళ్వార్

ఈయనకూడా ఒకపద్యంలో శరణాగతిని బలపరిచాడు. ఈ ఆళ్వార్ గజేంద్ర మోక్షవృత్తాంతాన్ని ప్రస్తావించి శరణాగతిని పరోక్షంగా బలపరిచాడు

"తుదరెదుత్త మాల్ యానై కూళ్ కయం పుక్కంజి
పదరెదుత్తు పైఙ్ మలమ్ కొండు అన్నిదళరుక్క
అళియాన్ పాదం పణిన్దన్నే వానవర్ కోన్
పాళితానెయ్ దిట్రుప్పందు.......... "[42]

(గొంతుతో తెంచుకొని పరుగెత్తే స్వభావంగల మదపుటేనుగు విశాలమైన తటాకంలో ప్రవేశించి పుష్పించిన అందమైన తామరపూవును తీసుకొని నాటి ఆపద మిక్కిలి బాధింపగా భయపడి చక్రిపాదాలని ఆశ్రయించి, పూర్వం పరమపదసద్గతి పొందింది.)

పేయాళ్వార్

ఈయన అయిదు పద్యాల్లో శరణాగతిని సమర్థించాడు. ఎటువంటి పాపాలు చేసినవారైనా భగవంతుణ్ణి ఆశ్రయిస్తే వాటినుంచి విముక్తి పొందుతారని మహాయోగి భావించాడు.

"ఆరేతుయరుళన్‌వార్ తున్బుట్రారాండైయార్
కారేఴలిందకరుంకడలై - నేరే
కిడైన్‌దానైక్కారణనై నీరణై మేల్ పళ్ళి....
అడైన్ దానై నాళుమడైన్దు.......... "[43]

(మేఘావృతమైన సముద్రాన్ని మథించిన వాణ్ణి కారణభూతుణ్ణి, సాగర శయనుణ్ణి ప్రతిరోజు ఆశ్రయించేవారు దుఃఖాలకు మూలమైన పాపాలను జేసినవారైనా, దుఃఖాలను అనుభవించేవారెవరు? వారెక్కడున్నారు? ఎవరూ లేరని భావం)

తిరుమళిశై ఆళ్వార్

శరణాగతిని బలపరుస్తూ ఈయన చెప్పిన పద్యాలు పది- తానే భగవంతుని శరణు జొచ్చినట్లు తెలుపుతూ తక్కినవాళ్ళకు ఆదర్శప్రాయుడయ్యాడు.

"విడై కులంగ శేళదర్తు వెర్విపేర్ కణ్ మూదరార్
కడిక్కలంద తోళ్పుణరన్ద కాలియాయవేళై నీర్
పడైత్తడైత్త విళ్కిడందుమూన్ కడైన్దు విన్దునుక్కు
అడైక్కలం పుగుంద వెన్నై అంజలెన్న వేండుమే"44

(సముద్రాన్ని సృష్టించి దానిలో సేతువు నిర్మించి, ఆ సముద్రంలోనే శయనించి, పూర్వం దానిని మధించి, సప్తవృషభాలని నిగ్రహించి, జయశీలమైన వేణువంటి కన్నులుగల, నప్పిన్నై (నీలాదేవి) పరిమళభరిత భుజాలను కౌగలించుకొన్న గోపాలా! నిన్ను శరణుజొచ్చిన నన్ను భయపడవలదు అనాలి )

తొండరడిప్పొడి ఆళ్వార్

రెండు పద్యాల్లో శరణాగతిని గూర్చి ప్రస్తావించిన ఈయన భగవంతుని శరణు జొచ్చుమని ప్రబోధించాడు.

"కట్రినం మేయ్త్తవెందై కళలిణై పణిమినీరే"45

(గోపాలుని పదయుగాన్ని శరణు జొచ్చండి )

కులశేఖరాళ్వార్

నాలుగు పద్యాల్లో శరణాగతిని గురించి చెప్పిన ఈయన, తల్లి దూరం చేసినా, ఆమెకోసం తల్లడిల్లే పసికందులా భగవంతుని శరణుజొచ్చిన తీరు చాలా రమణీయంగా ఉంది.

"తరుతుయరం తడాయేల్ ఉన్ శరణల్లాల్ శరణిల్లై
విరై కుళువు మలర్ప్పొళిల్ సూళ్ విత్తువక్కోట్టమ్మానే!
అరిశినత్తాల్ ఈన్తతాయే అగర్రిడినుం, మర్రవళ్ తన్
అరుళ్ నినైన్దే యళుంగు యనువేపోన్రిరున్దేనే 46

(పరిమళాధిక పుష్పభరిత ఆరామోపేతవిత్త్వక్కోడు స్వామీ! నువ్వు ఇచ్చే దుఃఖాన్ని నువ్వు పోగొట్టకున్నా నీ పాదాలు తప్ప అన్యథా శరణం నాస్తి. కన్నతల్లి కడు కోపంతో దూరం చేసినా, ఆమె కారుణ్యాన్నే తలపోస్తూ ఏడుస్తున్న శిశువు లాగా నేను అయ్యాను.)

తిరుమంగై ఆళ్వార్

శరణాగతిని గూర్చి యాభై మూడు పద్యాలు చెప్పిన ఈ ఆళ్వార్ అమృత ప్రాయులైన భగవంతుని శరణుజొచ్చి, అదర్శప్రాయు డయ్యాడు.

"అరుమాకడలముదేయునదడియే శరణాయే"[47]

(దుర్లభమైన, శ్రేష్ఠమైన మహాసముద్ర సుధవంటివాడా! నీ చరణమే శరణం)

పెరియాళ్వార్

మూడు పద్యాల్లో శరణాగతిని బలపరిచిన ఈయన దాని మహిమను గురించి లెస్సగా తెలిపిచ్చాడు.

'మూలమాగియ ఒత్తెళుత్తై మూన్ఱు మాత్తిరై వుళ్ళేకవాంగి
వేలైవణ్ణనై మేవుదిరాగిల్ విణ్ణగత్తిని మేవలుమామే" [48]

(మూలమైన ప్రణవాన్ని సమున్నతంగా ఉచ్చరించి సాగర వర్ణుణ్ణి ఆశ్రయిస్తే దివిలో నివసించవచ్చు.)

నమ్మాళ్వార్

పదకొండు పద్యాల్లో శరణాగతి తత్త్వాన్ని సమర్థించిన ఈయన దాసులకు దైవ శేఖరుడైన విష్ణువే శరణ్యమని ఉద్ఘాటించాడు.

"దిసైదోరమరర్గళ్ నెన్రిరైంజవిన్ఱ
తగైయాన్ చరణం తమర్గట్ కోర్ పత్రే" [49]

(తాను నిలిచిన దిక్కుల వెళ్ళి దేవతలు సేవించే స్వభావంగలవాని (విష్ణుదేవుని) పాదాలే దాసులకు శరణ్యం)

అన్నమయ్య

అన్నమయ్య శరణాగతిని గురించి అనేక విధాలుగా వివరించాడు. తన కీర్తనలెన్నిటిలోనో దాన్ని బలపరిచాడు. శరణాగతి శ్రేష్ఠతను వెల్లడించాడు.

'సర్వేశ్వరుడే పొందేటి వస్తువు శరణాగతియే వుపాయము'[50]

''పంచల పీతాంబరు శరణాగతి
ముంచిన యజ్ఞానమునకు దీపము''[51]

''శరణన్నవారికి విజ్ఞానము దగులు
గరిమ నిందువల్లనే పరమోక్షము దగులు''[52]

''తిరువేంకటగిరి పతియగు దేవశిఖామణిపాదము
శరణని బ్రదుకుట దప్పను సన్మార్గములేదు''[53]

తిరుప్పాణాళ్వార్, మధురకవి ఆళ్వార్, ఆండాళ్ తప్ప తక్కిన ఆళ్వార్లు అన్నమయ్య శరణాగతి తత్త్వాన్ని ఆదరించారు. శరణాగతి నవలంబించుమని ఉద్బోధించారు. దాని మహిమను వెల్లడించారు.

3. 7. భక్తజన సంస్మరణ

ఒకరిని సంస్మరించినపుడు వారి ప్రభావానికి లోనై తాదృశంగానే మారే అవకాశం ఉంది. ఎప్పుడూ మంచివాళ్లను గురించి, వారిలో ఉన్న మంచిని గురించి సంస్మరిస్తే వారి ప్రభావంవల్ల సంస్మరించే వారిలో కూడా మంచితనం పెరిగే అవకాశం ఉంది. ఇదే విధంగానే చెడ్డవారినీ, చెడుగునూ సంస్మరిస్తే దౌష్ట్యం అధికమయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి భక్తులను సంస్మరిస్తే భక్తిభావము పెరిగి భగవంతునికి చేరువయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్లనే భక్తులను మనసారా సంస్మరించి, నోరారా కీర్తించే సంప్రదాయము మన సమాజంలో స్థిరపడి ఉండవచ్చు. వేరెన్నికగన్న భక్తులమీద ఎప్పుడైన

గౌరవంకూడా వారిని సంస్మరించేందుకు కారణం కావచ్చు. ఏది ఏమైనా భక్త జన సంస్మరణ, భాగవత సంప్రదాయంగా నిలిచిపోయింది. ఆళ్వార్లు, అన్నమయ్య కూడా ఈ సంప్రదాయాన్ని ఆదరించారు.

తొండరడిప్పొడి ఆళ్వార్

ఈ ఆళ్వార్ ఒక పద్యంలో క్షత్రబంధు అనే భక్తుని సంస్మరించారు.

"మెయ్‌త్త వల్ విన్నై యుళ్ నిన్టు
మూండ్రెళుత్తు డైయపేరాల్
కత్తిర బందుమన్టే
పరాంగెదికండు కొండాన్" [54]

(దట్టమైన క్రూర కర్మలలో ఉండిన క్షత్రబంధు మూడక్షరములుగల గోవింద నామముచేత శేగదా పరమగతిని పొందాడు.)

తిరుమంగై ఆళ్వార్

ఈయన ఒకేఒక పద్యంలో భక్తులను సంస్మరించాడు. గోవిందస్వామి అనే భక్తుని వృత్తాంతాన్ని ఈయన స్మరించి అతనిపట్ల ప్రసరించిన అను గ్రహాన్ని తనపట్ల కూడా ప్రసరించుమని రంగనాయని ప్రార్థించాడు.

"మాగమానిలం ముళుదుందిరైన్ జుమ్ మఱరదిక్కుండ
మామరై యాళన్
తోగై మామేయలన్నవరిన్నమ్ తూట్రిలామైయలత్త
యుందొరిరదు
భోగంసియెయ్‌దిప్పిన్నుం నమ్మిడై కే పోదువాయెన్రపొన్న
రుళ్ వేనక్కుం
అగవేందుమెన్నణ డియజై యడైన్ దేన్ అణిపొళిల్ తిరు
వరంగత్తమ్మానే [55]

(మహా ఆకాశంలోని వారును పరమపదస్థులు [విశాల భూమండలం లోని వారును] నర్వులు వచ్చి నమస్కరించే నీ పదకమలాలను దర్శించిన మహా వైరికిని [గోవిందస్వామిని] నాయనా, నీవు మయూర. సదృశ మహిశా సంపర్కసౌఖ్యమింత వరకు పొందనందువల్ల ఇక్కడనే ఉండి భోగాలను అనుభవించి పిదప నాచెంత చేరుతావు అని నీ సత్కృప నాకును కావాలని నీ పదయుగాన్ని ఆశ్రయించాను.........)

పెరియాళ్వార్

భక్తులను సంస్మరిస్తూ ఈయన చెప్పిన ఒకేఒక పద్యంలో హనుమంతుని ప్రసక్తి ఉంది. గోవర్ధనగిరి మీది కోతులు హనుమంతుని కీర్తిగానం చేస్తూ తమ పిల్లలను నిద్రపుచ్చుతాయని ఈయన చెప్పాడు.

''అదండచ్చెన్నిలంగైయై యీడళిత్త అనుమాన్ పుగళ్ పాడి
త్తన్గుట్టన్గళై
ఉదంగైంకొండు మందిగళ్ కణ్వళర్రుమ్..........56

(లంకకు వెళ్ళి దాన్ని నాశనం చేసిన హనుమంతుని కీర్తి గానం చేస్తూ ఆడ కోతులు తమ పిల్లలను చేతులమీద పండబెట్టుకొని నిదురపుచ్చే గోవర్ధనగిరి.)

అన్నమయ్య

ఈయన భక్తులు పలువురిని స్మరించాడు. పలురకాలుగా స్మరించాడు ఈయన స్మృతి పథంలో మెదలిన వారిలో ఆళ్వార్లు, హనుమంతుడు కూడా ఉన్నారు.

'వాడె వెంకటేశు డనేవాడె వీడు
వాడిచుట్టు గైదువ వంచేతి వాడు

తిరిదూరమునుండి చక్కని మాటలను చొక్కి
మీరేగా వేదాలగుట్టు చూపినవాడూ
తొలువేదాలతో తిరుమంగయాళ్వారు
అరడిముచ్చిమికూటి కాశపడ్డవాడు.

పెరియాళ్వారి బిడ్డపిటికై పై వేసిన
విరుల దండల మెడవేసిన వాడు
తరుణి చేయి వేసిన దగ్గరి బుజము చాచి
పరవశమై చొక్కిపోయి లేనివాడు

పామరుల దనమీది పాటలెల్లా గాదుమంటా
భూమికెల్ల నోరనూరి పోసినవాడు
మామ కూతురలమేలుమంగ నాచారియుదాను
గీమగానే వేంకటగిరి నుండేవాడు

'స్వామి కార్యపుటంత జానకి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చైత్ర
రామనామజపముతో రతి శ్రీ వేంకటపతి
కామేటి బలటపైతివి హనుమంతరాయ [58]

తొండరడిప్పొడి ఆళ్వార్, తిరుమంగై ఆళ్వార్, పెరియాళ్వార్, అన్నమయ్యలు మాత్రమే ఇతరభక్తులను గూర్చి ప్రస్తావిస్తూ రచనలు చేసారు. భగవంతునితో దాసులన్న సంబంధాన్ని కొనియాడారు. తక్కిన ఆళ్వార్ల రచనల్లో భక్తుల ఉదంతాలను వెల్లడిచేసే అంశాలేవీ కనిపించడంలేదు.

### 3.8 అణకువ

అణకువ మానవుని సుగుణాల్లో అతి ముఖ్యమైనదిగా పేర్కొనబడుతూ ఉంది. మనిషి ఉన్నత స్థాయికి చేరుకునే కొద్దీ అతనిలో అణకువ పెరగాలిగా

పెద్దలు భావిస్తారు. బాగా పండిన పైరు వంగినట్టే పండితులు వినయంతో కూడి ఉంటారని విశ్వసింపబడుతూ ఉంది. వినయంలేని విద్య పరిమళంలేని పువ్వుతో సమానమని అణకువ లేమని అధిక్షేపించడం జరిగింది.

'అడక్కం అమరరుళ్ ఉయ్‌క్కుం అడంగామై
ఆరిరుళ్ ఉయాత్తువిడుం,,[59]

అని తిరువళ్ళువర్ కూడా చెప్పారు. (అణకువ అమరత్వంలోనూ, అణకువలేమి అంధకారం లోనూ చేరుస్తాయి.) కాబట్టి నాటినుంచీ నేటిదాకా కూడా సుగుణాల వరుసలో అణకువకు అగ్రస్థానమే ఉంది.

పండితులు, కవులు, గాయకులు, వేదవేదాంగవేత్తలు, భక్తాగ్రేసరులు, యతులు, మొదలయినవారు తామెంత గొప్ప వారయినా, తమకంటే అల్పులు లేరని చెప్పుకొని తమ అణకువను వెల్లడించుకున్నారు. ఆళ్వార్లు అన్నమయ్య లైనవారికి చేరువలో ఉండినా తమ నికృష్టతను మాత్రమే వెల్లడించుకున్నారు. నిగర్వుల నిపించుకున్నారు. లోకానికి ఆదర్శప్రాయులయ్యారు.

తిరుమళిశై ఆళ్వార్

అణకువను సమర్థిస్తూ ఎనిమిది పద్యాలు చెప్పిన ఈయన తానొక కునక ప్రాయుడనని చెప్పుకున్నారు.

''తన్ తిరత్తోరణ్బిలా అరివిలాదనాయినేన్ .... ....''[60]

(తన విషయంలో దేవుని విషయంలో ప్రేమలేని జ్ఞానంలేని కునకప్రాయుణ్ణి నీచుణ్ణి)

తొండరడిప్పొడి ఆళ్వార్

పదహారు పద్యాల్లో తన అణకువను ప్రకటించుకున్న ఈయన తననొక పాపిగా చెప్పుకున్నాడు.

"పాపియేన్"[61] (పాపినైన నేను)

**కులశేఖరాళ్వార్**

నాలుగు పద్యాల్లో అనుభవము బహిర్గతం చేసిన ఈ ఆళ్వార్ తననొక క్రూరకర్ముడని నిందించుకున్నాడు.

"తిరువరంగత్తర వణైయర్పళ్ళికొళ్ళుమ్
మాలోనైక్కండిన్బక్కల వియెయ్ది
వల్వినైయేనెన్నుకోలో వాళునాళే"[62]

(శ్రీరంగపు శేష తల్పంపై శయనించే వ్యామోహితుణ్ణి దర్శించి సంతోషాన్ని పొంది ఘోర కర్ముడైన నేను ఉజ్జీవించేది ఎన్నడో?

తిరుమంగై ఆళ్వార్

అనుభవము సంబంధించి ఈయన చెప్పిన పద్యాలు ఇరువైతొమ్మిది. అజ్ఞానిగా, ఇంద్రియ పరవర్తిగా కునక ప్రాయుడుగా ఆత్మనింద చేసుకున్నాడు

"కట్రిలేన్ కలైగళ్ ఐమ్బులన్ కరుదుం కరుత్తుళేతిరుత్తినేన్
మనత్తై
వెంద్రిలే లదనాల్ పేదైయేన్ నన్మైపెరువిలత్తారుయిల్ కెల్లాం
సెట్రమే వేందిత్తిరి తరుపేన్........ [63]

(కళలను అభ్యసించలేదు. పంచేంద్రియాలను యిచ్చాను సారంగా, విషయాలమీదికి బుద్ధిపోనిచ్చాను. అందువల్ల అవివేకినైన నేను క్షేమాన్ని పొందలేకపోయాను. విశాల విశ్వంలో ప్రాణులందరికీ కీడునే కోరి తిరుగుతున్నాను

"నాయేన్" [64]

(కునక ప్రాయుణ్ణయిన నేను)

పెరియాళ్వార్

ఈ ఆళ్వారుకూడా మూడు పద్యాల్లో అణకువను ప్రదర్శించాడు:

'శీగొక్కనా క్కొండుప్పున్ కవి సొన్నేన్' 65

(దుష్టజిహ్వతో అల్పమైన కవిత్వాన్ని చెప్పాను)

మధురకవి ఆళ్వార్

ఈయన ఒకే పాశురంలో తన నమ్రతను వెల్లడిస్తున్నాడు.

'పావినిన్ని పై పాడిత్తిరివనే 66

(పాపినైన నేను నీ కీర్తిని గానం చేస్తూ తిరుగుతాను.)

నమ్మాళ్వార్

నమ్రతను వెల్లడిస్తూ నమ్మాళ్వార్ రచించిన పద్యాలు యాభై రెండు. తనదిదుస్థితిగా భావించి భగవద్దర్శనం కోసం ఈయన పరితపించిన తీరు మన మను ద్రవింప చేస్తూ ఉంది.

ఇదగిలేనొ న్ట్రట్ట గిల్లేన్ ఐమ్పులన్ వెల్లగిల్లేన్
కదవనాగిక్కాలన్ దోరుం పూప్పురిత్తేత్తగిల్లేన్
మడవన్నెన్ఆర్ కాదల్ కూరవల్ విన్నైయేనయర్వాయ్
తదవుగిన్ ఱేనెంగు కాణ్బన్ చక్కరత్తణ్ణలైయే 67

(యాచకులకు భిక్షపెట్ట ఎరుగను, దానిమై శిక్ష ఎరుగను; పంచేంద్రియాలను జయించిన వాడినికాను. నీయొకడినై కాలొ చేతిరుగే పుష్పార్చనచేసి స్తుతించి ఎరుగను. మౌర్ఖ్యకాఠిన్యాలతో కూడిన మనసులో ఆశ ఎక్కువ కాగా, అవివేకంతో పాపినయిన నేను చక్రపాణిని సందర్శించటానికి వెదకుతున్నా. ఎక్కడ దర్శించగలను.)

ఆండాళ్

మూడు పద్యాలలో తన అనుభవము ప్రదర్శించిన ఈమె తన్ను నిందించు కోవడమే గాక ఈ బ్రహ్మాండ సృష్టిలో నరజాతి అల్పత్వాన్ని కూడ గుర్తు చేసింది.

"పాపి యేన్" 68 (పాపినైన నేను)

"శిరుమానిదవర్ నామ్ 69 (క్షుద్రమనుజులమైన మనము)

అన్నమయ్య

అన్నమయ్యకూడా తన అనుభవను ఎన్నోసార్లు వెల్లడించాడు. అన్ని దోషాలు తనవేనని తనవంటి అధమాధముడెక్కడా లేడని వాపోయాడు. ఎందుకూ కొరగాని తన్నుకూడా దేవుడేవిధంగా రక్షించాడా అని ఆశ్చర్య పడ్డాడు. ఆ పరమాత్ముని నిర్హేతుక కారుణ్యానికి పొంగిపోయాడు.

'నేను సేయని పాపమేదది నిఖిలలోకములందును
నేను చొరనినరక మేదది నెఱయ దుర్గతుల
నేను పొదమని యోను లేదవి నిఖిలజంతువులందును
పూని హరినిను శరణు చొరగా బుణ్యుగా జేసితివి గాక.

'విరతి నాడని కల్లలేదవి నేను నాలుక తురలయందును
పొరలి నడపవి కర్మ మేదది భువి ననాచారములలో
తిరిగి తిరిగి నీచులిండ్లను తిరియ నర్థము లింక నేదవి
గరిమ హరినే నిన్ను శరణన గాను ఘను జేసితివి గాక.

'తలప, నజ్ఞానములు నపరాధములు నా యెదలేవి వేదవి
యెలమి నన్నిట్లేల దగునా యేలితివి గాక
నిలిచి శ్రీ వేంకటగిరీశ్వర నీకు శరణను మాత్రమింతే
కలపి నా యెద నేమి గంటివి కాచితివి భువనములలోను 70

'జాలే నే నొకపనికి నవుదు నీకును
కూళలల్లో వెంచి చూడ గురి యవుదును

'పసరము వంటి వాడ పాపపు బందెలు దెత్తు
శిశువువంటి వాడ పిగ్గు సిగ్గు నెరగ
వసుధలో ఘోటువంటి వారను దయ దలచ
యెసగనన్నేరీతి నీవేలితివి దైవమా?

''మాకు వంటి వాడ నేమతి లేదు పు్పైన
పోక వంటి పాడ నెప్పరు కొరగాను
రోకలివంటి వాడ రోటిలోని పోట్లకు
యేకటి నన్నెటువలె నేలితివి దైవమా

'పాముపంటి వాడ నేపట్టినవారి గరతు
గామువంటి వాడ లోకము వారి బీడింతు
నేమవు శ్రీ వేంకటేశ నీవు నన్ను బంటంటా
నేమిటికి గృపతోడ నేలితివి దైవమా''71

ఆళ్వార్లు, అన్నమయ్య మహాత్ములు. మహోన్నత స్థితిలో జీవించినవారు. వీరిలో కొందరు మనోనేత్రంతో మాధవుని దర్శించినవారు. మరికొందరు ఆ మహామహావుణ్ణి తమ భౌతిక నేత్రాలతోనే దర్శించి అనిర్వచనీయమైన ఆనందం పొందినవారు. వీరంతా ఇంత మహోన్నత స్థాయిలో ఉండినప్పటికీ 'తమని తక్కువ చేసి చెప్పుకొని అణకువ ప్రదర్శించారు. పోయ్‌గై యాళ్వార్ పూదత్తాళ్వార్, పేయాళ్వార్, తిరుప్పాణాళ్వార్, మినహా తక్కిన ఆళ్వార్ల రచనల్లోనూ, అన్నమయ్య రచనల్లోనూ వారి అణకువకు సంబంధించిన అంశాలు చోటు చేసుకొని ఉన్నాయి

## ౩౦. శ్రీ మహావిష్ణు లీలలు

మహాపురుషులు మాత్రమే చేసే అసాధారణమైన పనులను లీలలని చెప్పుకోవచ్చు. ఈ లీలలు అసహజంగానూ, సృష్టికి అతీతంగానూ, ఉంటాయి. తపస్వులు, సిద్ధ, సాధ్య, కిన్నెర, కింపురుష దేవతాది వియచ్చరలు ఇటువంటి మహిమలను ప్రదర్శించారు. త్రిమూర్తులు కూడా ఎన్నోలీలలు ప్రదర్శించినట్లు వారిలోనూ విష్ణువు అత్యధికంగా ప్రదర్శించినట్లు మనపురాణాలు చెపుతాయి.

విష్ణువు సర్వలోక సంరక్షకుడు. సమస్త శక్తి సంపన్నుడు. ఆయన లీలలు అనంతం. ధర్మ రక్షణార్థం, సమస్తలోక సంరక్షణార్థం, వినోదార్థం ఆయన అనేక లీలలు చేస్తుంటాడు. వాటన్నిటి గురించి చెప్పడం శేషునికి కూడా సాధ్యపడేపనికాదు. ఐతే భగవదనుగ్రహ పాత్రులు, గొప్పమేధా సంపన్నులు అయిన ఆళ్వార్లు, అన్నమయ్య తను శక్తి కొలది విష్ణులీల లనేకం క్లొనియ్యాడారు. వాటన్నిటినీ ఇక్కడ చర్చించడానికి వీలుపడదు. కాబట్టి ఇందు మించు అన్నమయ్య, ఆళ్వారు లందరి రచనల్లోనూ దాదాపు సమానంగా కనిపించే విష్ణు వటపత్రశయన వృత్తాంతం మాత్రం పరిశీలనకు తీసుకోవడం జరిగింది.

ప్రళయం వచ్చింది. సృష్టి అంతా జలమయమయి పోయింది. నీటిమీద ఒక వటపత్రం మాత్రం తేలసాగింది. విష్ణువు దానిమీద శిశురూపంతో శయనించాడు. లోకాలన్నీ సముద్రంలో మునిగి సర్వనాశనం కాకుండా వాటన్నిటిని మ్రింగి తన కుక్షిలో భద్రపరిచాడు. ప్రళయ రాత్రి గడిచాక ఆ లోకాలన్నిటినీ వెలికి కక్కి యథాపూర్వంగా పునస్థితం చేశాడు.

ఇది సామాన్యులు చేసే సాధారణమైన పనికాదు. పదునాలుగు లోకాలను కడుపులో ఉంచుకొని శిశువు మట్టి ఆకు మీద పడుకోవడం, ఆ వట పత్రం ప్రళయార్ణవంలోనూ చెక్కుచెదరకుండా ఉండటం విచిత్రమైన విషయాలే.

ఈ అంశాన్ని తీసికొని కవులు, గాయకులు, విష్ణుకీర్తివి. లీలలను వే విధాలుగా కొనియాడారు.

'కరారవిందేన పదారవిందం
ముఖారవిందే వినివేశయంతం
వటస్య పత్రస్య పుటేశయానం
బాలం ముకుందంమనసా స్మరామి''

అన్న శ్లోకం బహుళ ప్రచారంలో ఉడటం సర్వవిదితమే.

''ఒక పరి జగములు వెలివిడి
యొకపరి లోపలికిగొనుచు మభయముదానై
సకలార్థ సాక్షియగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థి దలంతున్'' 72

పదకొండుగురు ఆళ్వార్లు అన్నమయ్య రచనల్లోనూ ఈ అంశం విస్తృతంగా కనిపిస్తుంది.

పొయ్‌గై ఆళ్వార్

భగవల్లీలకు సంబంధించి ఈయన చెప్పిన పద్యాలు నాలుగు. వటపత్ర శయన వృత్తాంత మందులో చోటు చేసుకుని ఉంది.

''బాలన్ తనదురు వాఏకులగుందు అలిలై యిన్
మేలన్ను నీవళర్న్ద యెయ్‌యెన్పర్'' 73

(నీవానాడు బాలుడవై సప్తలోకాలను మ్రింగి వటపత్రంలో నిద్రించింది. యదార్థమంటారు (సత్యం అంటారు.)

పూదత్తాళ్వార్

ఈ లీలకు సంబంధించి ఐదు పద్యాలు మాత్రమే చెప్పిన ఈయన వటపత్రశయన వృత్తాంతాన్ని నమగ్రంగా చెప్పలేదు.

"కొందువళర్క్కు ఇక్కాళవియాయ్ కణ్వళర్న్నదు
ఉండదులగే ఉముళ్లారుంగ................" 74

(పేరదీయదగ్గ శిశువై విశ్రమించింది వస్తులోకాలు తనలో అణగి ఉండేట్లు మింగించి.)

పేయాళ్వార్

పది పద్యాల్లో ఈ ఆళ్వార్ ఈ విష్ణు లీలను కొనియాడారు.

"అనైత్తులగుముళ్లాడుక్కియాల్ మేల్ గనైత్తులవు
వెళ్లత్తోర్ప్పిళ్ళైయాయ్ మెళ్లత్తుయన్రానై......" 75

(పోషిస్తు సర్వత్ర వ్యాపించిన ప్రళయార్ణవంలో ఒక శిశువై సమస్తలోకాలను తనలో ఉంచుకొని వటపత్రమును మీద నిద్రించినవాణ్ణి...........)

తిరుమళిశై ఆళ్వార్

పదహారు పద్యాల్లో ఈయన భగవల్లీలను కొనియాడారు.

"పందుమిన్ను మేఘమాయోర్ పాలనాగి జ్ఞానమేఘం
ఉండుమందియాలిలైతుయిన్గవాని దేవనే........" 76

(త్రికాలాత్మకుడై నస్తలోకాలను మ్రింగి ఒక బాలుడై, వటపత్రంమీద శయనించిన ఆదిదేవుడా)

తొండరడిప్పొడి ఆళ్వార్

ఈ ఆళ్వార్ ఒక పద్యంలో వటపత్రశాయిని వినుతించారు.

"మూవులగుండు మిళ్న్ ముదల్వా" 77

(లోకత్రయాన్ని మ్రింగి వెలువరించిన సర్వస్వామి)

కులశేఖరాళ్వార్

ఈయనకూడా ఒక పద్యంలోనే వటపత్రశాయిని ప్రశంసించారు.

''ఆలినిలై పాలగనాయ్ అన్రులగముండవనే:....''78

(పూర్వం వటపత్రంలో బాలుడై లోకాన్ని మ్రింగిన వాడా)

తిరుమంగై ఆళ్వార్

భగవల్లీలను కొనియాడుతూ ఈ ఆళ్వార్ అరవై ఏడు పద్యాలు రచించారు

''విలవొడు వెయ్యిల్ నిలవిరుశుడరుం వులగము ముయిర్గళు
మ్ముందొరుకాల్

కలైతరుకుళ వియామరు విన్నైయాయ్ అలై కడలాలిలై
వళరన్దవనే......... 79

(ఒకప్పుడు సూర్యచంద్రులను, లోకాన్ని, అందరి ప్రాణులని మ్రింగి చిన్న శిశువురూపం ధరించి అలలతో కూడిన సముద్రంలో వటపత్రం మీద విద్రించిన వాడా!

తిరుప్పాణాళ్వార్

రెండు పద్యాల్లో ఈయన వటపత్రశయన వృత్తాంతాన్ని స్పృశించారు.

'ఆలమామరత్తి విలై మేలారు పాలగనాయ్
ఞాల మేళు ముందాన్ .... .... 80

(వటవృక్ష పత్రంమీద ఒక బాలుడై శయనించి ఏడులోకాలను మ్రింగినవాడు)

పెరియాళ్వార్

శ్రీ విల్లిపుత్తూరు వటపత్రశాయి సేవకే జీవితాన్ని అంకితం చేసిన ఈయన పన్నెండు పద్యాల్లో అతన్ని కొనియాడారు.

'ఉండిట్టులగినై ఏళుం ఓరాలిలై యిల్ తుయిల్‌కొండాయ్!' 81

సప్త లోకాలని మ్రింగి ఒక మఱ్ఱి ఆకుపైన పిదురించినవాడా!

నమ్మాళ్వార్

ఈ ఆళ్వార్ భగవల్లీలను కొనియాడుతూ దైబ్బై యా తు పాశురాలు రచించాడు.

ఆలి నీశిలై ఏళులగుముందు అన్నునీ కిడందాయ్'' 82

(సప్తలోకాలను మ్రింగి వటపత్రం మీద నాడు నీవు శయనించావు)

ఆండాళ్

నాలుగు పద్యాల్లో యీమె వటపత్రశాయి లీలను స్పృశించింది.

''అన్ఱు పాలగ నాగి ఆలిలై మేల్‌త్తుయిన్‌ఱ వెంమాది
యాయ్ .... ....''83

(ఆనాడు బాలుడై వటపత్రం మీద నిద్రించిన మా ఆది మూలపురుషుడవై ....)

అన్నమయ్య

అన్నమయ్య కూడా వటపత్రశాయిని అనేక సంకీర్తనల్లో కొనియాడి ఉన్నారు.

''ఏకార్ణవమై ఉదకము లేచిన బ్రహ్మాండములో
బైకొని యుండగ నొక వటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొక శిశువై వడిదేలాడిన
శ్రీకాంతుడితడే పో శ్రీవేంకట విభుండు .... ....''84

విష్ణుదేవుని అనంత లీలల్లో వటపత్రశయనం ఒకటి. ఈ అంశాన్ని మధురకవి ఆళ్వార్ మినహా తక్కిన ఆళ్వార్లందరూ, అన్నమయ్య తమ రచనల్లో సమానంగా ప్రస్తావించి ఉన్నారు.

## 3. 10 శ్రీ మహావిష్ణు నామమహిమ

భగవన్నామోచ్చారణ వల్ల భగవంతుని సంస్మరించే అవకాశం కలుగుతుంది. పదేపదే భగవంతుని స్మరించటం వల్ల మానసిక ఏకాగ్రత కుదురుతుంది. మనసు ఏకాగ్రం కావడం వల్ల ఇంద్రియాతీత శక్తులు సిద్ధిస్తాయి. తద్వారా అవాఙ్మానస గోచరమైన ఆనందం సిద్ధిస్తుంది

విష్ణునామం అనంత వరప్రదమని అభిజ్ఞుల అచంచల విశ్వాసం. విష్ణునామ సంకీర్తన ఒకటే భవసాగర తరణోపాయమని పెద్దలు చెబుతారు ఉద్దేశపూర్వకంగా కాకపోయినా తన చివరి దశలో నారాయణ నామోచ్చారణ చేసిన అజామిళునికి మోక్షం సిద్ధించినట్టు భాగవతం చెబుతుంది. ఆంజనేయ నారదాదులంతా ఈ నామమెన్నో అద్భుత శక్తులను ప్రసాదించింది. విష్ణునామ మహిమను కొనియాడుతూ ఎంతోమంది రచనలు చేశారు.

ఆర్తా విషణ్ణా శ్శిథిలాశ్చ భీతా
ఘోరేషుచ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్ద మాత్రం
విముక్త దుఃఖాస్సుఖినోభవన్తు [85]

"ఇతి షోడశకం నామ్నాం కలికల్మష నాశనం.
నాతఃపరతరోపాయ స్సర్వవే దేషు దృశ్యతే"[86]

"హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌనా స్త్యేవ నా స్త్యేవ నా స్త్యేవ గతిరన్యథా"[87]

"హరియను రెండక్షరములు
హరియించును పాతకంబులంబుజనాభా
హరి నీ నామమహత్యము
హరి హరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా" [38]

"క్రూరాత్ముడజామీళుడు
నారాయణ యనుచు నాత్మనందుని బిలువన్
ఏరీతి నేలుకొంటివి
ఏరీ నీసాటి వేల్పులెందును కృష్ణా" 89

మహావిష్ణునామ మహిమను గుర్తించి తద్వారా పలుదివ్యానుభూతులు పొంది, అన్నమయ్య, ఆళ్వార్లు తమ రచనలలో పలుచోట్ల విష్ణునామ మహిమను కొనియాడారు.

పొయ్‌గై ఆళ్వార్

ఒక పద్యంలోనే ఈయన విష్ణునామ మహిమను కొనియాడారు.

"............ వరై నట్టు - నీరళవైచ్
సుటిక్కడైన్‌దాన్ పెయరన్డే తొన్నరగై
ప్పటిక్కడత్తుం పడై ........ 90

(పర్వతం నాటి తీక్ష్ణమైన సర్పాన్ని చుట్టి సాగర మథనం చేసినవాని పేరుకదా ప్రాచీన నరకాన్ని దాటించే సాధనం.)

పూదత్తాళ్వార్

నారాయణ నామ గరిమను రెండుపద్యాల్లో విశదపరచిన ఈయన తన్నామ కీర్తనాపరులకు శాశ్వత మహోన్నత జీవనం సిద్ధిస్తుందన్నారు.

"............ వాళ్‌వరాం మాదో - వళవిన్ని
వారణన్దన్ నా మంగళ్ నన్గుణర్‌న్దు నన్గేత్తుం
కారణంగళ్ తాముడైయార్ తామ్' 91

(నారాయణుని నామాలను లెస్సగా గ్రహించి నిరంతరాయంగా, చక్కగా వినుతించే ఉపకరణాలు గలవారు ఉజ్జీవిస్తారు.

పేయాళ్వార్

ఈయన ఒకేఒక పద్యంలో విష్ణునామ సంకీర్తనోచ్చారణా ఫలితాలను తెలియజేశారు.

'శేఖం తిరళుం తిరువు మురువముం
మాశిల్ కుడిపిరప్పుం మట్రవైయుం-పేశిల్
వలం పురిందవాన్ సంగం కొండాన్ పేరోద
కలంపురిందు సెన్నొర్దైయుం నన్గు...... 92

(శంఖ దక్షిణ హస్తుని నామ కీర్తనం చేసినా నామోచ్చారణ చేసినా, తేజస్సు పరాక్రమం, సంపద, చక్కటి రూపం, నిష్కళంకమైన సత్కుల జన్మం మొదలైనవి శుభకరాలై తామేవచ్చి చేరతాయి.)

తిరుమళిశై ఆళ్వార్

రెండు పద్యాల్లో విష్ణునామ విశిష్టతను వెల్లడించిన ఈ భక్తిసారుడు ఆ నామం వల్లనే తాను భగవంతుని పొందినట్లు ధ్వనింపజేశారు.

''సెవిక్కిన్ఱ ఇమానదువుం సెంగణ్మాల్ నామం
బువిక్కుంబువియదువే కండీర్ - కవిక్కు
నిరైపొరుళాయ్ నిన్ద్రానై నేర్పట్టేన్ పార్కిర్
మరైపొరుళు మత్తనైయేదాన్,,93

(కార్ణామృతమైనదీ, భూలోకవాసులందరికీ (ఉన్నత) స్థానమైనది పుండరీకాక్షుడైన విష్ణునామమే. పరికిస్తే పరికిస్తే వేదంలోని అర్థము అదే. కవిత్వానికి సమగ్రవస్తువై ఉన్నవానిని (విష్ణువును) పొందాను)

తొండరడిప్పొడి ఆళ్వార్

విప్రనారాయణుడు ఒకపద్యలో భగవన్నామాఖ్యాన ఘనతను వివరించారు

'కావలిర్ప్పుళనై పైత్తు
కలిదన్నై కదక్కప్పాయన్ధు
నావలిట్టుళితరుగిన్ద్రోం
నమన్ తమర్ తలైగళ్ మీదే
మూవులగుండు మిళ్న్ద
ముదల్వా! విన్నామంకట్ర
ఆవలిప్పుదైమై కండాయ్
అరంగ మానినగరుళానే 94

(రంగధామా! లోకత్రయాన్ని మ్రింగి వెలువరించిన సర్వస్వామీ! నీ నామం నేర్చిన ఘనత చూసావా? ఇంద్రియాలు విగ్రహించి కలిమాయ గడచి, యమ భటుల తలమీద కాలుపెట్టి జయఘోష చేశాము.)

కులశేఖరాళ్వార్

రెండు పద్యాల్లో విష్ణునామ ప్రశస్తిని వెల్లడించిన ఈయన విష్ణునామాన్ని మంత్రంగానూ సత్ఫలితాల సాధనంగాను పేర్కొన్నారు.

'శత్రుచ్ఛేదైక మంత్రం సకల ముపనిషద్వాక్య సంపూజ్య మంత్రం
సంసారోత్తర మంత్రం సముపచిత తమస్సంఘ నిర్యాణ మంత్రం
సర్వైశ్వర్యైక మంత్రం వ్యసనభుజగ సందష్టసంత్రాణ మంత్రం
జిహ్వే శ్రీకృష్ణ మంత్రం జప జప సతతం జన్మసాఫల్య మంత్రం 95

తిరుమంగై ఆళ్వార్

పదిహేడు పద్యాల్లో భగవన్నామ మహిమను 'కలికన్రి' చాటి చెప్పాడు. శ్రీమన్నారాయణుని చేతనే అష్టాక్షరీ మంత్రోపదేశం పొందినట్టు చెప్పబడే ఈయన నారాయణ నామ వైశిష్ట్యాన్ని చెప్పినతీరు రమణీయంగా ఉంది.

'కులన్ తరుం సెల్వం తందిడుం అడియార్పడు తుయ రాయినవెల్లాం
నిలందరం శెయ్యుం నీళ్విసుంబరుళుం అరుళొడు పెరునిల మళిక్కుం
వలన్దరుం మట్రున్ తందిడుం పెట్రతాయినుం మాయిన శెయ్యుం
నలంతరుం సొల్లైనాన్ కండుకొండేన్ నారాయణవెన్నుం నామం 96

(నారాయణ నామం ఉన్నత కులాన్ని సంపదలన్ని ఇస్తుంది. దాసుల ఇడుము లన్నిటినీ నేలమట్టం చేస్తుంది. పరమపదాన్ని ఇస్తుంది. భగవదనుగ్రహంతో, పాటు విశాల సామ్రాజ్యం ఇస్తుంది. బలాన్ని, మరెన్నిటినో ఇస్తుంది. కన్న తల్లి కన్నామిన్నగా సాధ్యమైన వన్నిటినీ ఇస్తుంది. క్షేమదాయకమైన నారాయణ నామాన్ని పొందాను.)

పెరియాళ్వార్

ఈయన విష్ణునామ మహిమను గూర్చి పది పద్యాల్లో చెప్పారు. విష్ణువు నామాలల్లో ఏ ఒక్క దానినైనా తమ పిల్లలకు పెట్టుకొని పిలుచుకున్నట్లయితే ఆ తల్లిదండ్రులకు నరక బాధలేదని ఈ ఆళ్వార్ స్పష్టం చేశాడు.

''శెంగణ్ణెడుమాల్ సిరీదరా! ఎన్రళైత్తక్కాల్
నంగైగాళ్! నారాయణన్ఱమ్మన్నై నరగమ్పుగాళ్'' 97

(వనితలారా! పుండరీకాక్ష, సర్వేశ్వ, శ్రీధరా, అని పిలిస్తే (ఆ నారాయణ నామధరునితల్లి నరకంలో ప్రవేశించదు.)

నమ్మాళ్వార్

అయిదు పద్యాల్లో విష్ణునామ మహిమను విశ్వానికి చాటుతూ, అది పరమపదప్రదమని ఈ ఆళ్వార్ చెప్పాడు.

''అనంతపురనగర్ మాయన్ నామం
ఒన్రు మోరాయిరమాం ఉళ్లవార్క్కు ఉంబరూరే,, 98

(తిరువనంతపుర నగరపు మాయావి నామ మొక్కొక్కటీ సహస్రాధికం అనుసంధిచేవారికి అదే పరమపదం)

అన్నమయ్య

అన్నమాచార్యుడు విష్ణునామ మహిమను తన రచనల్లో వెల్లడిచేశారు భగవన్నామం దుఃఖాలను పోగొట్టి సౌఖ్యాలను సమకూరుస్తుందని భావించారు

ఇదియే సాధన మిహపరములకును
పదిలము మాపాలి పరమపునామం

కలిదోషహరము కైవల్యకరము
అలరిన మా శ్రీహరి నామం
సులభము సౌఖ్యము శోభనతిలకము.
పలుమారును శ్రీపతి నామం

పాపనాశనము బంధవిమోక్షము
పై పై నిధి భూపతి నామం
స్థాపిత ధనమిది సర్వరక్షకము
దాపి(పు?)రమిదిమాధవనామం

నేమము ధామము నిత్యకర్మమిది
దోమటి గోవిందుని నామం

హేమము శరణము యిన్నిటి మాకును
యేమేర శ్రీ వేంకటేశ్వరునామం 99

తిరుప్పాణాళ్వార్, మధురకవి ఆళ్వార్, ఆండాళ్ వీరు మనహా ఆళ్వార్లు, అన్నమయ్య తమరచనల్లో విష్ణు నామ మహిమను విశదపరిచారు. ఆ నామాన్ని ఉచ్చరించడంవల్ల దురితాలు తొలగి శుభాలు కలుగుతాయని స్పష్టం చేశారు. నామోచ్చరణ, నామసంకీర్తనలకు పూనుకొని మహోన్నత స్థితికి చేరుకొమ్మని మానవజాతిని ఉద్బోధించారు.

3.11 మానసిక ప్రబోధము

'నువ్విలావుండు, ఇదిచెయ్యి' అని మనసు నుద్బోధించడమే మానసిక ప్రబోధమవుతుంది. మహాపురుషులు లోకానికి బోధించవలసిన విషయాలనుకూడా తమ మనస్సుకు బోధిస్తారు. తద్వారా లోకానికి కూడా పరోక్షంగా బోధించినట్టవుతుంది. కొందరు సరాసరి తమ మనసుకే బోధిస్తూ దాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అన్నమయ్య ఆళ్వార్ల రచనల్లోకూడా మానసిక ప్రబోధాలు కనిపిస్తాయి.

పొయ్‌గై ఆళ్వార్

పరోయోగి పది పద్యాల్లో మానసిక ప్రబోధం చేశాడు. ఉత్తముడైన భగవంతుడెప్పుడూ ఆస్తికుల చిత్తాల్లో అధివసిస్తూ ఉంటాడని అభిప్రాయపడ్డాడు.

'ఉళన్‌కండాయ్ నన్నెంజే వుత్తమనెన్నుం
ఉళన్ కండాయ్ ఉళ్లువారుళ్ల-త్తుళన్‌కండాయ్
వెళ్లత్తినుళ్లానుం. వేంగడత్తు మేయానుం
ఉళ్లత్తి నుళ్లానెన్నోర్.................100

(ఓ నామంచి మనసా! ఉత్తముడు (పురుషోత్తముడైన విష్ణువు) ఎప్పుడూ ఆస్తికుల మనసుల్లో అధివసిస్తున్నాడని గ్రహించు. పాలకడలిలో ఉండే వాడూ, తిరుమలలో నివసించేవాడు హృదయవాసియే అని గ్రహించు)

పూదత్తాళ్వార్

భూతయోగి ఏడు పద్యాల్లో తన మనసు నుద్బోధించాడు. విష్ణువునెప్పుడు విస్మరించకూడదని హితవు గరిపాడు.

'మణివణ్ణన్ పాదమే నీ మరవేళ్ నెంజేనినై'101

(మనసా! నీలమణి వర్ణుని పాదాన్ని నీవు మరువక భావించు)

పేయాళ్వార్

పన్నెండు పద్యాల్లో మనసు నుద్బోధించిన మహాయోగి విష్ణుదేవుని అస్తిత్వాన్ని ఉద్ఘాటించాడు.

'ఉళన్ కండాయ్ నన్నె నెంజే యుత్తమ నెన్జుం
ఉళన్ కండాయ్ ఉళ్ళువారుళ్ళత్తుళన్‌కండాయ్
విణ్ణోడుంగస్ కోడుయరుం విం కరువివేంగడత్తాన్
మణ్ణోదుంగత్తానళం దమణ్' 102

(ఓ మంచి మనసా! ఊర్ధ్వలోకాలు ఒదిగేట్లు ఎత్తుగా ఉన్న శిఖరాలు గలది. అధిక సంఖ్యాకాలైన పెలయేళ్లతో కూడినది అయిన తిరుమలలో నివసించేవాడు భూమినంతా (తన పాదం క్రింద) కొలుచుకున్న స్వామీ, ఉత్తముడూ (పురుషోత్తముడు) అయిన విష్ణువు ఎప్పుడూ ఆస్తికుల మనసులో అధివసించి యున్నాడని గ్రహించు.)

తిరుమళిశై ఆళ్వార్

భక్తిసారుడు మనసు నుద్బోధిస్తూ చెప్పిన పద్యాలు అయిదు. ఈయన కూడా ఆస్తికుల మనసులో భగవంతు డుంటాడనే విషయాన్ని దృఢీకరించాడు.

'ఉళన్ కండాయ్ నన్నెంజే యుత్తమనెన్ఱుమ్
ఉళన్‌కండాయ్ ఉళ్లువారుళ్లత్తుళన్ కండాయ్
తన్నొప్పాన్ తానాయుళన్ కాణ్‌తమియేర్కుం
ఎన్నొప్పార్ క్కీశనిమై'[103]

(ఓ మంచి మనసా! ఉత్తముడు (పురుషోత్తముడు) ఎప్పుడూ ఆస్తికుల మనసులో అధివసించి ఉన్నాడని గ్రహించు. నిరుపమానుడైన ఆయన నిరాధారుడైన నాకు నావంటి వారికిని ఈశ్వరుడై ఉన్నాడు. దీన్ని తెలుసుకో )

తొండరడిప్పొడి ఆళ్వార్

ఈ ఆళ్వార్ తన మనసు నుద్దేశించి చెప్పిన పద్యాలు మూడు. భగవంతునికి నమస్కరించడమే శ్రేష్ఠతమ కృత్యమని ఈయన భావించారు.

''మాశట్రార్ మనత్తుళానై వణంగి నామిరుప్పదల్లాల్
పేశాత్తానావదుండో పేదై నెంజే నీశొల్లాయ్,,[104]

(ఓ పేద మనసా! నిష్కల్మషుల మనసులో నివసించేవానికి (విష్ణువుకు) నమస్కరించి ఉండటం తప్ప అతనిని గూర్చి మాట్లాడడం సాధ్యమా నువ్వుచెప్పు)

కులశేఖరాళ్వార్

మనసును ప్రబోధిస్తూ ఈయన కూడా మూడు పద్యాలు చెప్పారు.

'మాభీర్మన్ద మనోచిన్త్య బహుదాయా మీశ్చిరంయాతనా
నామీనప్రభవన్ది పాపరివస్స్వామీననుశ్రీధర
ఆలశ్యం వ్యసనీయ భక్తి సులభం ధ్యాయస్వనారాయణం
లోకస్య వ్యసనాపనోదనకరో దానస్యకిన్నక్షమః'''[105]

తిరుమంగై ఆళ్వార్

నూట ఇరవై రెండు పద్యాల్లో మనసునుద్బోధించిన ఈయన నందిపుర విణ్ణగరంలోని, విష్ణుదేవుని అర్చామూర్తిని చేరి సేవించుమని కోరాడు.

''వందిపుర విణ్ణగరం నణ్ణుమనమే''106

(మనసా! నందిపుర విణ్ణగరాన్ని చేరుము)

నమ్మాళ్వార్

తన మనసునుద్దేశించి నలభై నాలుగు పద్యాలు చెప్పిన ఈ ఆళ్వార్ మహావిష్ణువు నాశ్రయించుమని ప్రబోధించాడు.

'మనమే యున్నై వల్ వినైయేవిరన్దు
కనమే సొల్లినేన్ ఇదుసోరేల్ కండాయ్
పునమేవియపూంతండు లాయలంగల్
ఇనై యేను మిలానై అడై వదుమే' 107

(మనసా! ఘోరకర్మమైన నేను నీకు యాచనా పూర్వకంగా దృఢంగా చెబుతాను దీన్ని వదలక పరిగ్రహించు చల్లని నేలలో పెరిగిన తులసీమాలను ధరించిన వాణ్ణి నిరుపముణ్ణి ఆశ్రయించాలన్నదే అది)

అన్నమయ్య

అన్నమయ్య రచనల్లో కూడా మానసిక ప్రబోధం విరివిగా కనిపిస్తుంది. అన్నమయ్య తనమనసును అప్రమత్తంగా ఉండమని కోరాడు. విష్ణుమహిమను వివరిస్తూ గోవిందుని కొలువుమని బోధించాడు.

'పారకుమీ ఓ మనసా పంతము విడువకుమీ మనసా
పారిన నీవే బడగయ్యెదవు చేరువనాడే చెప్పనె మనసా
చింతించకుమీ శివుని వైరిచే చిక్కవలకుమీ వో మనసా
కంతువారికి మువయసు బ్రాయములు కావటికుండలు వో
మనసా

యెంతే మేలు గిడే కాలము ఎప్పుడు మందదు వో మనసా
సంతరించుకో వానిని మనసున సంతోషముగా ఓ మనసా

యెన్నికలే తల పోయకుమీ యేమరకుండుమి ఓ మనసా
కన్నవిన్నవారిలో నెప్పుడు కాతుపడకుమీ ఓ మనసా
పున్నమ మాసలు పుడమిలో బదుకుతా పోయవచ్చేని వో
మనసా
మిన్నోనేలని మన్నదినములో మీరు చూడకుమీ వో మనసా

కన్నెల సంగాతము సేయకుమీ కళవళించకు మీ వోమనసా
వన్నెల మాటలు చెవులబెట్టక వానిదరుపకుము వో మనసా
మున్నిటి సురలు బ్రహ్మాదులకైనను ముక్తిసాధనము వో
మనసా
వెన్నుని వేంకటగిరి పతి దలచుము వేసారకుమీ వోమనసా 1:8

''భావము లోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవే వో మనసా

హరియవతారములే యఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామములే అన్ని మంత్రములు
హరిహరి హరియని వో మనసా

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని బొగడెడి వేదములు
విష్ణు డొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదక వో మనసా

అచ్యుతుడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే యసురాంతకుడు
అచ్యుత యచ్యుత శరణనవో మనసా 109

తిరుప్పాణాళ్వార్, పెరియాళ్వార్, మధురకవి ఆళ్వార్, ఆండాళ్ మాత్రమే మానసిక ప్రబోధం చేస్తూ రచనలు చేసినట్టు కనిపించదు తక్కిన ఆళ్వార్ల రచనల్లోనూ, అన్నమయ్య రచనల్లోనూ మానసిక ప్రబోధం కనిపిస్తుంది. వీరంతా కూడా భౌతిక పదార్థాల అస్థిరత్వాన్ని గురించి విష్ణువును ఆశ్రయించ వలసిన ఆవశ్యకతను గురించి మనసును ఉద్బోధించారు.

3.12 నీతి ప్రబోధము

మహాపురుషులు తమ అనుభవాలను, పెద్దలవల్ల తెలుసుకున్న విషయాలను లోకులు తెలుసుకోదగిన విషయాలను తమ రచనల ద్వారా అప్పుడప్పుడు లోకానికి తెలియజేస్తుంటారు ఇటువంటివి అన్నమయ్య, ఆళ్వార్ల రచనల్లో బాగా చోటు చేసుకొని ఉన్నాయి.

పొయ్‌గై ఆళ్వార్

రెండు పద్యాల్లో నీతిని ప్రబోధించిన ఈ ఆళ్వార్ ఊర్ధ్వ స్థితికి వెళ్లేందుకు అనేక మార్గాలున్నప్పటికి జనులు, అధోగతికి యెందుకు వెళుతున్నారో అర్థంగాక ఆశ్చర్యపడ్డారు.

'నావాయిలుండే నమో నారాయణా వెన్రు
ఓవాదురైక్కుయురై యుండే మూవాద
మాగ్గదిక్కణ్ శెల్లుం వగైయుండే ఎన్నొరువర్
తీగ్గదిక్కణ్ శెల్లుంతిరం' 110

(నోటిలో నాలుక ఉంచి. 'ఓమ్ నమో నారాయణాయ' అని నిరంతరము ఉచ్చ రించదగిన మంత్రమున్నది. పునరాగమనంలేని ఊర్ధ్వ స్థితికి వెళ్ళే మార్గం ఉంది. కాగా జనులు దుర్గతికి వెళ్ళే విధమేమి?

పూదత్తాళ్వార్

నీతి ప్రబోధానికి సంబంధించిన ఈయన పద్యాలు అయిదు. ఈయన వేదసారాంశాన్ని విశదం చేసిన విధం విశిష్టంగా ఉంది.

'ఓత్తిన్ పొరుళ్ ముడివు మిత్తనైయే వుత్తమన్ పేర్
ఏత్తుమ్ తిరల్ మరిమిన్గ్గళ్ గాళ్-వోత్తదనై
వల్లీరేల్ నన్ఱదనై మాట్టీరేల్, మాదవన్ పేర్
శొల్లువదే యోత్తిన్ శురుక్కు' 111

(అజ్ఞానులారా! వేదాధ్యయన సమర్థులై ఉంటే మంచిది. కాకుంటే మాధవుని నామాలను ఉచ్చరించడమే వేదసారం అవుతుంది. వేదప్రతిపాదితార్థం అంతా ఇదే (కాబట్టి) ఉత్తముని (విష్ణుదేవుని) నామ సంకీర్తనం చేసే విధం తెలుసుకోండి.

పేయాళ్వార్

నీతి ప్రబోధం చేస్తూ పేయాళ్వార్ చెప్పిన పద్యం ఒకటి విష్ణువే పరమ పదాన్ని దర్శింప జేస్తాడని విస్పష్టం చేశాడు.

'అవనే యరువరైయాల్ ఆనిరైగళ్ కాత్తాన్
అవనేయణి మరుదం శాయ్త్తాన్-అవనే
కలంగాప్పెరునగరం కాట్టువాన్ కండీర్
ఇలంగాపుర మెరిత్తానెయ్దు' 112

(అతడే కదల్చ శక్యంగాని పర్వతంతో (గోవర్ధనగిరి వల్ల) పశుగణాన్ని రక్షించాడు. అతడే అందమైన మద్దిమానులని కూల్చాడు. అతడే బాణాలని ప్రయోగించి లంకాపురాన్ని దహింపజేసాడు. అతడే అకళంక పరమపదాన్ని దర్శింప జేస్తాడు సుమండి)

తిరుమళిశై ఆళ్వార్

పది పద్యాల్లో ఈయన నీతి ప్రబోధం చేశారు. భగవత్సేవ శంకితం కమ్మని ప్రజల మద్బోధించారు.

'వాళ్త్తుగ వాయ్ కాణ్గగణ్ కేట్కశెవి మగుదత
తాళ్త్తవణంగు మిన్గళ్ తణ్ మలరాల్-సూడ్డి
తుళాయ్మన్ను నీన్ముడియన్ తొల్లైయ్మాల్ తన్నై
వాళావణ్ కై కూప్పి మదిత్తు 113

(ధరించిన తులసిమాల చక్కగా అమరిన ఉన్నత శిరస్కుడు సనాతనుడు అయిన నా విష్ణువును నిరంతరము చేతులు జోడించి, ధ్యానించి, నతశిరస్కులై నమస్కరించి చల్లని పుష్పములతో అర్చించండి. అతనిని నోరుకీర్తించుగాక! నేత్రాలు దర్శించుగాక! కర్ణాలు వినుగాక!)

తొండరడిప్పొడి ఆళ్వార్

ఎనిమిది పద్యాల్లో ఈయన నీతి ప్రబోధం చేశారు. విష్ణువు తప్ప వేరొక దైవం లేదని విస్పష్టం చేశారు.

'మట్రుమోర్ దెయ్వముండే
మదియిలా మానిడంగాళ్
ఉట్రపోదన్ని నింగళ్
ఒరువనెన్రుణర మాట్టీర్
అట్రమేలొన్ద్రరియీర్
అవనైల్లాల్దయ్వమిల్లై
కట్రినంమేయ్ త వెంద్రై
కళలిణై పణిమినీరే 114

(మతిహీనులైన మానవులారా! మరో దైవం కలదా! ఆపద సంభవించినపుడు గాని అతడొకడే ఆశ్రయింప దగిన దైవమని మీరు (గ్రహించరు) వేదవేదాంగాదుల తాత్పర్యాన్ని ఎరుగరు. అతడు తప్ప (ఆశ్రయింపదగిన) దేవుడు లేడు. గోవత్స సమూహాన్ని మేపిన స్వామి పదయుగాన్నే ఆశ్రయిందండి)

కులశేఖరాళ్వార్

ఈ ఆళ్వార్ నాలుగు పద్యాల్లో లోకులకు నీతిని ప్రబోధించారు. అమూల మైన ఔషధాన్ని లోకానికి పరిచయం చేశారు.

'హే లోకాః శృణుత ప్రసూతి మరణవ్యాధేశ్చికిత్సామి మాం
యోగజ్ఞాః సముదాహరంతి మునయో యాం యాజ్ఞవల్క్యాదయః
అంతర్జ్యోతిరమేయమేక మమృతం కృష్ణాఖ్యమాపీయతాం
తత్పరం పరమౌషధం వితను తేని ర్వాణమాత్యన్తికమ్'116

తిరుమంగై ఆళ్వార్

పంబై తొమ్మిది పద్యాల్లో ఈ ఆళ్వార్ నీతిని ప్రబోధించారు. తిరుక్కుడందైని (కుంభకోణక్షేత్రాన్ని) సేవించుమన్నారు. నారాయణ నామాన్ని గానం చేయుమన్నారు.

'ఇర్ పిరప్పరియారి వరవలెన్నిర్ ఇన్నదోర్ తన్మై
ఎన్ఱుణరీర్
కర్పగంపులవర్ క్కై కన్ఱుంగిల్ కఁదవా తొండరై
ప్పాడుం
సార్పారుళాళీర్ సొల్లు కేన్ వమ్మిన్ సూళ్పునల్
కుడందై యేతొళుమిన్
నర్పారుళ్ కాణ్మిన్ పాడినీరుయ్మిన్ నారాయణా వెన్నుం
నామం,,116

(మీరు ఈ జన్మాన్ని ఎరుగరు. వీరు, వారని అంటారు. వలానా స్థితి అని ఎరుగరు. కల్పతరు సదృశ దాతలుగా వారిని కొనియాడే శబ్దార్థ వేత్తలారా చెబుతా రండి. తీర్థపరివేష్టితమైన. తిరుక్కడంధయనే సేవించడి. సత్ఫలం పొందండి. నారాయణ నామాన్ని గానం చేసి మీరు ఉజ్జీవించండి.)

పెరియాళ్వార్

విష్ణుచిత్తుడు కూడా విశ్వప్రజనుద్దేశించి ఇర్వైరెండు పద్యాల్లో నీతి ప్రబోధం చేశాడు. విష్ణునామోచ్చరణ చేసి అయునకు మంగళశాసనం చేయు మని భాగవత సముదాయాన్ని కోరాడు.

"............ఇరుదేకేశన్నక్క
తొండక్కులత్తిలుళ్ళీర్ వందడి తొళుము ఆయిర నామం సొల్లి
పండైకులత్తై త్తవిర్న్నుపల్లాండు పల్లాయిర త్తాణ్
డెన్మినే"[117]

(భగవద్దాస సమూహం లోని జనులారా! వచ్చి (విష్ణుదేవుని) సహస్రనామాలను చెప్పి పాదాలను సేవించి ప్రాతతనమును పోగొట్టుకొని హృషీకేశునకి పలువత్స రములు, పలువేల వత్సరములు. అని మంగళాశాసనం చేయండి)

నమ్మాళ్వార్

నీతి ప్రబోధానికి సంబంధించి ఈ ఆళ్వార్ రచించిన పద్యాలు అరవై ఎనిమిది నారాయణ పాదాన్ని ఆశ్రయించుమని ఈ ఆళ్వార్ లోకులకు హితబోధ చేశాడు.

'వణ్పుగళ్నారణన్ తిణ్కళల్ శేరే'[118]

(కీర్తి సాంద్రుడైన నారాయణుడి దృఢమైన పాదాన్ని చేరండి)

ఆండాళ్

ఆరు పద్యాల్లో ఈమె లోకానికి హితోపదేశం చేసింది. కాత్యాయనీ దేవి నుద్దేశించి గోకులంలో గోపాంగనలు వ్రతమాచరించినట్లు చెప్పబడింది. ఆ గోపికలలో తమ్మతూడా ఒకతెగా భావించుకున్న ఆండాళ్ వ్రతనియమాలను లోకులకు హృద్యంగా వెల్లడించింది.

"వైయత్తువాళ్ వీర్‌గాళ్ నాముం నమ్‌పావైక్కు
శెయ్యుమ్‌కిరి శైగళ్ కేళీరోపార్కడలుళ్
పైయత్తుయిన్ర పరమనడిపాడి
నెయ్యుణ్ణోంపాలుం ణ్ణోమ్ నాట్కాలే నీరాడి
మైయిట్టుఎళుదోం మలరిట్టు నాముడియోం
శెయ్యాదన శెయ్యోం తీక్కురళై న్ణోదోం
అయ్యముం పిచ్చైయుమాందనైయుంకై కాట్టి
ఉయ్యుమారెణ్ణి వుగం దేలోరెంబావాయ్" ||2||

(విశ్వవాసులారా! మేము బ్రతుకు తెరవు తలపోసి మా నోముకు చేయవలసిన క్రియలను వినండి. క్షీర సముద్రంలో యోగనిద్రలో యందున్న పరమును పాదంపాడి. దానభిక్షలు ఇచ్చి సంతసించి ఘృతక్షీరాలను గ్రహించము. ప్రాతః కాలాన్నే జలకమాడికాటుక ధరించము. పూవులను ముడుచుకోము. అకృత్యాలు ఆచరించము. భగవత్సమీపానికి వెళ్లి దుర్భాషలాడము.)

అన్నమయ్య

లోకులకు నీతిని ప్రబోధిస్తూ అన్నమయ్య కూడా ఎన్నోరచనలు చేశారు. విష్ణు ఘనతను కొనియాడారు. అతడే ఏకైక శరణ్యమన్నారు. దృశ్య ప్రపంచమంతా క్షణికమన్నారు. దృగ్గోచరుడైన విష్ణువే శాశ్వతుడన్నారు. అతన్ని ఆశ్రయించి అనిర్వచనీయమైన ఆనందం పొందుమన్నారు.

"ఉప్ప విచారము లేల వోహో సంసారు లాల
యిన్నిటికితడే రక్షయిదే మీకు మనరో

తక్కక బ్రహ్మలగన్న తండ్రి గొలిచి మీరు
యెక్కువ సంతతి గల్గి యీడేరరో
అక్కన లక్ష్మీనారాయణుల దలచి మీరు
చిక్కి మీమీ దంపతులు సుఖమున నుండరో

భవరోగవైద్యుని పాదములు సేవించి
భువి రోగములబాసి పొదలరో
తవిలి పది దిక్కులు తానైన వాని
గవిసి పొగడి దిక్కు గలిగి బ్రతుకరో

తల్లి దండ్రి నీతడే తగ జుట్టు మీతడే
మెల్లగా బుట్టించి పెంచే యేలికితడే
చల్లగా శ్రీవేంకటేశు శరణంటి మిదే మేము
కొల్లగా మీరెల్లా మమ్ము గుఱిగా వర్ధిల్లరో"[120]

తిరుప్పాణాళ్వార్, మధురకవి ఆళ్వార్ మినహా ఆళ్వార్లందరూ, అన్నమయ్య నీతిని లోకులకు ప్రబోధిస్తూ రచనలు చేశారు. విశ్వమంతా మిథ్య అని విష్ణువే సత్యమని చాటి చెప్పారు. అతన్ని ఆశ్రయించి శాశ్వతానందం పొందుమన్నారు.

### 3. 13 నారాయణేతర విముఖత

ఒక దేవతా మూర్తిని ప్రగాఢంగా ఉపాసించేవారు అన్యదేవతల పట్ల అనాసక్తి కనబరుస్తారు. పైగా విముఖత గూడా కలిగి ఉంటారు. తాము ఉపాసించే దేవతే తమ సర్వస్వమని భావిస్తారు. ఆ దేవతకే సర్వాధిక్యాన్ని ఆపాదిస్తారు. తక్కిన దేవతలను, రాజులను, ఐహిక భోగభాగ్యాలను తృణప్రాయంగా చూసేవారు కూడా కొందరు లేక పోలేదు.

అన్యదేవతలపట్ల విముఖత చూపే వారనేకులు శైవులలోనూ, వైష్ణవులలోనూ ఉండటం సర్వవిదితమే. శైవ నాయన్మార్ల రచనల్లో శివేతర దేవవిముఖత కనిపిస్తుంది. వైష్ణవ ఆళ్వార్ల రచనల్లోను నారాయణేతర దేవ విముఖత గోచరిస్తుంది. వైష్ణవ సంప్రదాయాన్ని సమాదరించిన అన్నమయ్య రచనల్లో కూడా నారాయణేతర విముఖత బాగా చోటు చేసుకుని ఉంది.

పొయ్‌గై ఆళ్వార్

సరోయోగి నారాయణేతర విముఖతను ప్రకటిస్తూ ఎనిమిది పద్యాలు రచించాడు.

"వాయవనై యల్లదు వాళ్ త్తాదు కైయులగం
తాయవనై యల్లదు తాన్ తొళాపేయ్ఘమలై నం
జుడాగవుంతానురుహాదు పేరల్లాల్
కాణాకణ్ కెళాశెవి"[121]

(నానోరు అతని (వెన్నుని) కన్యల కీర్తింప జాలదు. చెలగి వసుధగొలచిన వానికి తప్పనా చేతులితరులకు నమస్కరించవు. పూతనాస్తన్యవిషము నాహార ముగా గొన్నవాని రూపనామాలను తప్ప తక్కిన వాటిని చూడను. వినను)

తిరుమళిశై ఆళ్వార్

భక్తిసారుడు చెప్పిన పదహైదు పద్యాల్లో నారాయణేతర వైముఖ్యం కనిపిస్తుంది

'నాక్కొండు మానిడం పాడేన్'
(నాలుకతో మానవుని పాడను)

తొండరడిప్పొడి ఆళ్వార్

విష్ణుదేవుని అర్చామూర్తులలో శ్రీరంగశాయిని తప్ప అన్యమూర్తులనంగ కూడా ఈ ఆళ్వార్ కొనియాడినట్లు కనిపించదు. రంగని ఉద్దేశించి చెప్పిన పద్యంలో తన అన్యవిముఖతను రమణీయంగా వెల్లడించాడు.

"శేవియే నున్నై యల్లాల్ శిక్కెన సెంగణ్మాలే........
........పావియేన్ వున్నై యల్లాల్ బావియేన్బావియేన్"123

(పుండరీకాక్ష! నిన్ను తప్ప అన్యులను దృఢముగా సేవించను. పాపినైన నేను నిన్ను తప్ప అన్యులను భావించను, భావించను)

కులశేఖరాళ్వార్

నారాయణేతర విముఖత వెల్లడిస్తూ ఈయన చెప్పిన పద్యాలు ఎనిమిది. విష్ణువు తప్ప తనకేదీ తెలియదని ఈ ఆళ్వార్ స్పష్టంచేశాడు.

"హేగోపాలక హే కృపాజలనిధే హే సిన్ధు కన్యాపతే
హే కంసాన్తక హే గజేంద్ర కరుణా పారీణ హే మాధవా
హే రామానుజ హే జగత్రయ గురోహే పుండరీకాక్షమాం
హేగోపీ జననాథ పాలయపరం జానామినత్వాం వినా"124

తిరుమంగై ఆళ్వార్

వాసుదేవతర వైముఖ్యాన్ని వ్యక్తం చేస్తూ ఈఆళ్వార్ రచించిన పద్యాలు ఇరవైతొమ్మిది. తాను నారాయణేతరులను ఎరుగనట్టు స్పష్టం చేశాడు.

"వేంకటమామలై మేయ ఆయనడియల్లదు మట్రరియేనే"125

(వేంకటాద్రిలో నివసించే యాదవుని పాదాలు తప్ప ఇతరాలు ఎరుగను)

తిరుప్పాణాళ్వార్

ఈయన ఒకపద్యంలో శ్రీరంగ నాథేతరాన్ని దర్శించనని అన్యవిముఖతను ప్రకటించాడు.

"........అణి అరంగన్ ఎన్ అముదనై
కండ కణ్గళ్ మట్రొన్ఱినై కాణావే"126

(నాకు అమృతప్రాయుడైన శ్రీరంగని చూచిన కనులు వేరొకదానిని చూడవు)

పెరియాళ్వార్

విష్ణుచిత్తుడు నారాయణేతర విముఖతకు అద్దం పట్టే ఐదు పద్యాలు రచించాడు. విష్ణువును గురించి బాగా తెలిసినవారు అతనికి తప్ప ఇతరులకు దాసులు కాజాలరని అభిప్రాయపడ్డాడు.

"ఎన్నాడైయ తిరువరంగర్క్కన్నియుం, మట్రొరువ
ర్కాళావరే" 127

(నారంగని కన్నుఅన్యులకు దాసులవుతారా)

మధురకవి ఆళ్వార్

ఈయన ఒక పద్యంలో పరవిముఖతను తెలిపాడు. తన గురువైన నమ్మాళ్వార్నే దైవంగా భావించి ఉపాసించాడు. కాబట్టి శఠారి తప్ప అన్య దేవతలు తనకు తెలియదన్నాడు

"దేవుమట్రరియేన్ కురుగూర్ నంబి
పావి నిన్నిసై పాడిత్తిరివనే" 128

(కురుగూర్ స్వామి! పాపి నైన నేను నీ కీర్తిని గానం జేస్తూ తిరుగుతాను. అన్య దేవతల నెవరినీ ఎరుగను.)

నమ్మాళ్వార్

నారాయణేతర విముఖతను వ్యక్తం చేస్తూ ఈయన రచించిన పద్యాలు నలభై ఒకటి. తలపులో కూడా విష్ణువును తప్ప ఇతరులను శరణుజొచ్చే ప్రసక్తే లేదని ఈయన ఉద్ఘాటించాడు

"తెన్తిసైక్కణి కొళ్ తిరుచ్చెంగున్టూరిల్ తిరుచిట్రం
గరై మీపాల్
నిన్ఱ వెంబెరుమాన్ అడియల్లాల్ శరణ్ నినైప్పిలం
పిరిదిల్లై ఎనక్కే" 129

దక్షిణదిశకు ఆభరణ ప్రాయమైన తిరువెంకటన్ తిరుచ్చిట్టూరు క్షేత్రానికి కెగువ భాగంలో వెలసిఉన్న మాస్వామి పాదాలు తప్ప స్మరణామాత్రంగానైనా అన్య శరణ్యం లేదు.)

ఆండాళ్

గోదాదేవి గోవిందేతర విముఖతను తెలుపుతూ రెండు పద్యాలు రచించింది ఈమె మనసారా విష్ణువును వరించింది. అతన్నితప్ప అన్యులను కన్నెత్తి కూడా చూడకూడదనుకొంది. తన అవయవాలు కూడా నారాయణేతరుల పట్ల విముఖతను ప్రదర్శిస్తున్నట్టు విస్పష్టం చేసింది.

'అంగైత్తలత్తిడై యాళికొండానపన్ ముగత్తన్ని విళియే నెన్ను
సెంగచ్చుక్కొండు కణ్ణాడెయ్యార్త్తు చ్చిరుమానిడరై కాణిల్
నాణుం
కొంగైత్తలమివై నోక్కిక్కాణీర్ గోవిందనుక్కల్లాల్
వాయిల్ పోగా' 130

(చక్రహస్తుని కంటె అన్యుల ముఖం చూడను అని కంటిగంతగా కచ్చుపట్టి ధరించి క్షుద్ర మానవులని చూడడానికి బిడియపడుతున్నా యీ స్తనాలను చూడండి గోవిందేతరుల ద్వారాల కైన ఇవి పోవు.)

అన్నమయ్య

పదకవితా పితమహుడు తన పద్మనాభేతర విముఖతను వెల్లడిస్తూ పలు రచనలు చేశాడు. హరిని కొలువకుండడం అన్యాయమన్నాడు. వేంకటేశ్వరునితో తప్ప పరదైవాంతో తనకు పనిలేదన్నాడు. వైష్ణవు లఘనతను కొనియాడుకూ వారి స్వభావాన్ని సమాదరించాడు.

'హరి పుట్టించిన దేహి హరినే కొలువక
పరుల గొలుచుట అన్యాయమయ్య' 131
'విరతి శ్రీ వేంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడి పనిమాకు లేదయ్య' 132

'పరమ వైష్ణవుల భాగ్యం బిదివో
విరతి వారలకె నే మ్రొక్కెదము

'తల చరాకప్పుడు ధరణి భోగములు
తలచరితరమత దైవముల

'తలతురాకటి హరిదాసుల దాస్యము
తలపు మోక్షముల తగులమి(మె?)గాన
కోరరు బ్రహ్మాది గురుతర పదములు
కోరరు మేరవు కొన మతము
కోరుదురు తదియ్యకోట్ల సంగము
కోరిక భక్తితో గూడి గాన

వొల్లరు కర్మము లొల్లరు పుణ్యము
లొల్లరహంకార మొక పరియు
వుల్లము శ్రీ వేంకటోత్తము శరణని
యెల్లరు దుదిపద మెక్కిరి గాన [133]

పూదత్తాళ్వార్, పేయాళ్వార్, మధురకవి ఆళ్వార్ మినహా ఆళ్వార్లందరూ, అన్నమయ్యా, నారాయణేతర విముఖతను వెల్లడించారు. విష్ణువే సర్వాధికుడన్నారు. విష్ణువుతప్ప అన్యమేదీ ఎరుగమని కూడా కొందరు చెప్పారు. నారాయణేతర వైముఖ్యాన్ని కలిగి ఉండటం పరమ ధర్మమని భావించారు. దాన్నే ప్రపంచానికి ప్రబోధించారు. అయితే మధురకవి ఆళ్వారు మాత్రం తన గురువునేదైవంగా భావించి తదన్య విముఖతను ప్రకటించారు.

అన్నమయ్య ఆళ్వార్ల రచనల్లో కనిపించే పదమూడు అంశాలకు సంబంధించిన సామ్యాలింతవరకు తులనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ఇవేగాక ఇంకెన్నో సామ్యాలు వారి రచనల్లో కనిపిస్తున్నాయి. వాటినన్నిటినీ ఇక్కడ చర్చించడం విస్తృతమవుతుంది. వీరి రచనల్లో విష్ణుతత్వానికి సంబంధించిన సామ్యాలను తరువాతి అధ్యాయంలో చర్చిద్దాం.

# పద సూచికలు


1. తొండరడిప్పొడి యాళ్వార్, తిరుపళ్ళియెళుచ్చి పద్యం, 1
2. పెరియాళ్వార్ పెరియాళ్వార్ తిరుమొషి ఇరండాం పత్తు, ఇరండాం తిరు మొషి పద్యం 1
3. ఆండాళ్ తిరుప్పావై, పద్యం 20
4. అన్నమాచార్యులు, తాళ్లపాక, ఆధ్యాత్మసంకీర్తనలు సంపుటి 1 కీర్తనలు 254.
5. అన్నమాచార్యులు, తాళ్లపాక, ఆధ్యాత్మ సంకీర్తనలు, సంపుటి 1-139
6. అన్నమాచార్యులు, తాళ్లపాక, అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం111-170
7. కులశేఖరాళ్వార్, ముకుందమాల, శ్లోకం 2.
8. తిరుమంగై ఆళ్వార్, పెరియతిరుమొళి, వొంబదాంపత్తు, ఇరండాం తిరుమొళి, పద్యం 5.
9. పెరియాళ్వార్-తిరుప్పాలాండు, పద్యం 6.
10. ఆండాళ్, తిరుప్పావై, పద్యం 24.
11. అన్నమాచార్యులు, తాళ్లపాక ఆధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 1-443.
12. పెరియాళ్వార్, తిరుప్పల్లాండు, పద్యం 2.
13. నమ్మాళ్వార్, తిరువాయ్‌మొళి, ఆరాంపత్తు, పత్తాం తిరుమొళి పద్యం 10
14. ఆండాళ్, నాచ్చియార్ తిరుమొళి, ఏట్టాం తిరుమొళి పద్యం 4.
15. అన్నమాచార్యులు, తాళ్లపాక, ఆధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 2-231
16. " " సంపుటం 11 కీర్తన 11-1-227
17. అన్నమాచార్యులు, తాళ్లపాక, ఆధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 2-280
18. తిరుమళిశై ఆళ్వార్-నాన్ముగన్ తిరువందాది, పద్యం 40.
19. పొయ్‌గై ఆళ్వార్, ముదల్ తిరువందాది, పద్యం 99.

20. పూదత్తాళ్వార్-ఇరండాం తిరువందాది- పద్యం. 33.

21. పేయాళ్వార్-మూణ్ఱాం తిరువందాది. పద్యం. 14.

22. తిరుమళిశై ఆళ్వార్, నాన్ముగన్ తిరువందాది, పద్యం 41.

23. కులశేఖరాళ్వార్, పెరుమాళ్ తిరుమొషి-నాన్గాంతిరుమొషి పద్యం 9.

24. తిరుమంగై ఆళ్వార్. పెరియతిరుమొళి, మొదల్‌పత్తు, పొందాం తిరుమొళి పద్యం 9.

25. తిరుప్పాణాళ్వార్, అమలనాదిపిరాన్, పద్యం 1.

26. పెరియాళ్వార్, పెరియాళ్వార్. తిరుమొషి మూణ్ఱాంపత్తు. మూణ్ఱాం తిరుమొషి పద్యం 4.

27. నమ్మాళ్వార్-తిరువాయ్మొళి ఇరండాంపత్తు, ఆరాంతిరువాయ్మొళి, పద్యం 9

28. ఆండాళ్-నాచ్చియార్ తిరుమొషి మొదల్‌తిరుమొషి, పద్యం 1.

29. అన్నమాచార్యులు, తాళ్లపాక, ఆధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 1-181

30. పూదత్తాళ్వార్, ఇరండాం, తిరువందాది, పద్యం 75.

31. పేయాళ్వార్, మూణ్ఱాం తిరువందాది పద్యం 45.

32. తొండరడిప్పొడి ఆళ్వార్. తిరుప్పళ్ళియెషుచ్చి పద్యం 1.

33. కులశేఖరాళ్వార్-పెరుమాళ్ తిరుమొళి, ఏళాం తిరుమొళిపద్యం 7.

34. తిరుమంగై ఆళ్వార్-పెరియతిరుమొళి మొదల్‌పత్తు, ఇరండాం తిరుమొళి పద్యం 5

35. పెరియాళ్వార్-పెరియాళ్వార్ తిరుమొళి, మూణ్ఱాంపత్తు, ఐందాం తిరుమొళి, పద్యం 9.

36. ఆండాళ్, నాచ్చియార్ తిరుమొళి, ఎట్టాం తిరుమొళి, పద్యం 1.

37. అన్నమాచార్యులు, తాళ్లపాక, అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 10-130

38. వాల్మీకి-శ్రీమద్‌రామాయణం, యుద్ధకాండ, 18వ సర్గ, 33వ శ్లోకం

39. శ్రీమద్భగవద్గీత, అధ్యాయం 9. శ్లోకం 22.

40. శ్రీమద్భగవద్గీత, అధ్యాయం 18. ,, 66.

41. పొయ్‌గై ఆళ్వార్-ముదల్ తిరువందాది, పద్యం 46.

42. పూదత్తాళ్వార్-ఇరండాం తిరువందాది, పద్యం 13.

43. పేయాళ్వార్, మూణ్రాం తిరువందాది, పద్యం 27.

44. తిరుమళిశై ఆళ్వార్, తిరుచ్ఛంద విరుత్తం, పద్యం 92.

45. తొండరడిప్పొడి ఆళ్వార్ తిరుమాలై పద్యం 8.

46. కులశేఖరాళ్వార్, పెరుమాళ్ తిరుమొళి, ఐందాం తిరుమొళి, పద్యం

47. తిరుమంగై ఆళ్వార్ పెరియతిరుమొళి, ఏడాం తిరుమొళి పద్యం 8.

48. పెరియాళ్వార్, పెరియాళ్వార్-తిరుమొళి నాన్‌గాంపత్తు, ఐందాం తిరుమొళి పద్యం 4.

49. నమ్మాళ్వార్-తిరువాయ్‌మొళి, పత్తాంపత్తు, నాన్‌గాం తిరువాయ్‌మొళి పద్యం 10.

50. అన్నమాచార్యులు, తాళ్లపాక, అధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 10-80)

51. అన్నమాచార్యులు, తాళ్లపాక, అధ్యాత్మ సంకీర్తనలు. సంపుటం 9-276)

52. ,, ,, సంపుటం 9-77

53. ,, ,, సంపుటం 1-261

54. తొండరడిప్పొడి ఆళ్వార్- తిరుమాలై, పద్యం 4

55. తిరుమంగై ఆళ్వార్, పెరియతిరుమొళి, ఐదాం పత్తు, ఎట్టాంతిరుమొళి పద్యం 6.

56. పెరియాళ్వార్. - పెరియాళ్వార్ తిరుమొళి, మూన్రాంపత్తు, ఐందాం తిరుమొళి పద్యం 7.

57. అన్నమాచార్యులు, తళ్లపాక, అధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 1-121

58 " " సంపుటం 11-1-118

59. తిరువళ్లువర్, తిరుక్కురళ్ అరత్తుపాల్, అడక్కముడైమై కురళ్ 121

60. తిరుమళిశై ఆళ్వార్. తిరుచ్చంద విరుత్తం. పద్యం 84

61. తొండరప్పొడి ఆళ్వార్. తిరుమాలై పద్యం 35

62. కులశేఖరాళ్వార్. పెరుమాళ్ తిరుమొళి. ముదల్ తిరుమొళి పద్యం 8.

63. తిరుమంగై ఆళ్వార్-పెరియ తిరుమొళి_ముదల్‌పత్తు ముదల్ తిరుమొ
పద్యం 8.

64. " " " పొంబదాం
తిరుమొళి పద్యం 1.

65. పెరియాళ్వార్ పెరియాళ్వార్ తిరుమొళి. ఐందాంపత్తు ముదల్ తిరుమొళి
పద్యం 2.

66. మధురకవి ఆళ్వార్. కణ్ణినుణ్‌చ్చిరుతాంబు-పద్యం 2.

67. నమ్మాళ్వార్, తిరువాయ్‌మొళి, నాన్‌గాంపత్తు, ఏళాంతిరువాయ్‌మొళి
పద్యం 9.

68. ఆండాళ్ - నాచ్చియార్ తిరుమొళి - పత్తాం తిరుమొళి, పద్య 3.

69. " " పద్యం 10.

70. అన్నమాచార్యులు. తాళ్లపాక, అధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 9-116

71. " " సంపుటం 10-23

72. పోతన, బమ్మెర - శ్రీమదాంధ్రభాగవతము. స్కంధం 8, పద్యం 74

73. పొయ్‌గైఆళ్వార్, ముదల్ తిరువందాది, పద్యం 69.

74. పూదత్తాళ్వార్, ఇరండాం తిరువందాది, పద్యం 98.

75. పెయాళ్వార్. మూన్రాం తిరువాందాది. పద్యం 93.

76. తిరుమళిశై ఆళ్వార్, తిరుచ్చంద విరుత్తం, పద్యం 22

77. తొండరడిప్పొడి ఆళ్వార్, తిరుమాలై, పద్యం 1.

78. కులశేఖరాళ్వార్- పెరుమాళ్ తిరుమొళి, ఎట్టాంతిరుమొళి, పద్యం 7.

79 తిరుమంగై ఆళ్వార్ - పెరియతిరుమొళి - ఆరాం పత్తు, ముదల్ తిరుమొళి, పద్యం 4.

80. తిరుప్పాణాళ్వార్ - అమలనాదిపిరాన్ పద్యం 9.

81. పెరియాళ్వార్ - పెరియాళ్వార్ తిరుమొళి, ఇరండాంపత్తు, ఏళాం తిరుమొళి, పద్యం 9

82. నమ్మాళ్వార్ - తిరువాయ్మొళి, ఆరం పత్తు, ఇరండాం తిరువాయ్ మొషి, పద్యం 4.

83. ఆండాళ్ - నాచ్చియార్ తిరుమొళి - ఇరండాం తిరుమొళి, పద్యం 2.

84. అన్నమాచార్యులు, తాళ్లపాక - అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 1-80

85. శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రం ఉత్తర పీఠిక.

86. స్తోత్రమంజరి - శ్లోకం 11.

87. " శ్లోకం 12.

88. కృష్ణ శతకము, పద్యం 4

89. " పద్యం 5.

90. పోయ్గై ఆళ్వార్ - ముదల్ తిరువాందాది, పద్యం 81.

పూదత్తా ఆళ్వార్ - ఇరండాం తిరువందాది, పద్యం 28.

పేయాళ్వార్ - మూన్రాం తిరువందాధి, పద్యం 10

తిరుమళిశై ఆళ్వార్ - నాన్ముగన్ తిరువందాది. పద్యం 60.

తొండరడిప్పొడి ఆళ్వార్ - తిరుమాలై, పద్యం 1

కులశేఖరాళ్వార్ — ముకుందమాల, శ్లోకం 23

తిరుమంగై ఆళ్వార్-పెరియతిరుమొళి ముదల్‌పత్తు. ముదల్‌తిరుమొళి పద్యం 9.

పెరియాళ్వార్—పెరియాళ్వార్ తిరుమొళి—నాన్గాం పత్తు. ఆరాం తిరుమొళి. పద్యం 2.

నమ్మాళ్వార్-తిరువాయ్‌మొళి—పత్తాంపత్తు, ఇరండాం తిరువాయ్‌మొళి, పద్యం 2

అన్నమాచార్యులు, అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 11—1—88.

పొయ్‌గై ఆళ్వార్, ముదల్ తిరువందాది, పద్యం 88.

పూదత్తాళ్వార్, ఇరండాం తిరువందాది, పద్యం 41.

పేయాళ్వార్, మూన్రాం తిరువందాది, పద్యం 40.

తిరుమళిశై ఆళ్వార్ - నాన్ముగన్ తిరువందాది, పద్యం 86.

తొండరడిప్పొడి ఆళ్వార్ తిరుమాలై, పద్యం 22.

కులశేఖరాళ్వార్, ముకుందమాల, శ్లోకం 13

తిరుమంగై ఆళ్వార్ పెరియతిరుమొళి, ఐందాం పత్తు, పత్తాంతిరుమొళి పద్యం 1.

107. నమ్మాళ్వార్, తిరువాయ్‌మొళి, నొందదాంపత్తు, మూన్ఱాం తిరువాయ్
మొళి పద్యం 5.

108. అన్నమాచార్యులు, తాళ్లపాక - అధ్యాత్మసంకీర్తనలు, సంపుటం 1-188

109. " " సంపుటం 9-272

110. పొయ్‌గై ఆళ్వార్, ముదల్ తిరువందాది, పద్యం 95.

111. భూతత్తాళ్వార్ ఇరండాం తిరువందాది, పద్యం 39.

112. పేయాళ్వార్ - మూన్ఱాం తిరువందాది. పద్యం 54.

113. తిరుమళిశై ఆళ్వార్ - నాన్ముగన్ తిరువందాది, పద్యం 11

114. తొండరడిప్పొడి ఆళ్వార్ - తిరుమాలై, పద్యం 9.

115. కులశేఖరాళ్వార్, ముకుందమాల శ్లోకం 17.

116. తిరుమంగై ఆళ్వార్. పెరియతిరుమొళి - ముదల్ పత్తు ముదల్ తిరు-
మొళి - పద్యం 7

117. పెరియాళ్వార్ — తిరుప్పల్లాండు - పద్యం 5.

118. నమ్మాళ్వార్ , తిరువాయ్‌మొళి - ముదల్‌పత్తు ఇరండాం తిరుమొళి
పద్యం 10.

119. ఆండాళ్ - తిరుప్పావై - పద్యం 2

120. అన్నమాచార్యులు తాళ్లపాక - అధ్యాత్మ సంకీర్తనలు సంపుటం 1-441

121. పొయ్‌గై ఆళ్వార్ - ముదల్ తిరువందాది పద్యం 11.

122. తిరుమళిశై ఆళ్వార్ - నాన్ ముగన్ తిరువందాది పద్యం 75

123. తొండరడిప్పొడి ఆళ్వార్ - తిరుమాలై పద్యం 35

124. కులశేఖర ఆళ్వార్ ముకుందమాల శ్లోకం 21

125. తిరుమంగై ఆళ్వార్, పెరియ తిరుమొళి, ముదల్‌పత్తు, వత్తాం తిరు మొళి పద్యం 8.

126. తిరుప్పాణాళ్వార్—అమలనాది పిరాన్, పద్యం 10.

127. పెరియాళ్వార్, పెరియాళ్వార్ తిరుమొళి, నాన్గాం పత్తు, వొంబదాం తిరుమొళి, పద్యం 2.

128. మధురకవి ఆళ్వార్, కణ్ణినుణ్ చిఱుత్తాంబు, పద్యం 2.

129. నమ్మాళ్వార్, తిరువాయ్‌మొళి, ఎట్టాం పత్తు, నాన్గాం తిరువాయ్ మొళి, పద్యం 3.

130. ఆండాళ్, నాచ్చియార్ తిరుమొళి, పన్నిరెండాం తిరుమొళి పద్యం 4.

131. అన్నమాచార్యుల తాళ్లపాక ఆధ్యాత్మ సంకీర్తనలు 8–67.

132. ,, ,, సంపుటం 10-36.

133. ,, ,, ,, 10-186.

వద

# రచయిత పరిచయం

జననం : 13-1-1948.

తల్లిదండ్రులు : శ్రీమతి జక్కంపూడి నరసమ్మ.
శ్రీ జక్కంపూడి మునస్వామి నాయుడు.

జన్మస్థలం : చంగల్పట్టు జిల్లా, తిరుత్తణి తాలూకా,
కావేరిరాజపురం.

విద్యాభ్యాసం : బి. ఏ., శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల తిరుప
ఎం. ఏ., శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశ

పరిశోధన : పిహెచ్.డి., తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

పరిశోధనాంశం : అన్నమయ్య - ఆళ్వార్లు తులనాత్మక పరిశీలన.

వృత్తి : ఉపన్యాసకులు, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రవృత్తి వ్రాయడం, చదవడం.

ముద్రితాలు : శ్రీ వేంకటేశ్వర స్తుతి కదంబకం 1965
చంద్రమౌళి శతకం 1972
ఉళవర్ పత్తు (తమిళగేయాలు) 1980
సోమన, ఎఱ్ఱన హరివంశములు 1989
నాటక వ్యాసాలు 1989